భారతి

14565

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

జనవరి 1960

సంపుటము 37 : : సంచిక 1

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జనవరి 1960

ఫిబ్రవరి సంచికలో

వార్తలు

ఐసెన్‌హోవర్ భారతపర్యటన

అమెరికా అధ్యక్షుడు శ్రీ ఐసెన్‌హోవర్ సకుటుంబంగా పదకొండు దేశాలలో పర్యటిస్తు డిశంబర్ 9 వ తేదీన భారత దేశానికి వచ్చారు. ఆయన ఆనాటి సాయంకాలం ప్రత్యేకవిమానంలో భారతరాజధాని చేరారు. విమానాశ్రయంలో రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్, ప్రధాని నెహ్రూ, ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ మొదలయినవారు స్వాగతమిచ్చారు. పదిలక్షల మందికి పైగా జనం ఆయనను చూడడానికి వచ్చారు. మహాపర్వదినంవలె ఢిల్లీనగరం అలంకరించబడింది. 10 వ తేదిని ఐసెన్‌హోవర్ ఇండియాపార్లమెంటులో ప్రసంగించారు. భారతదేశం సాధించినకృషిని ప్రశంసించారు. ఉదయం ప్రధానితో 90 నిముషాలపాటు ప్రపంచసమస్యలపై చర్చలు జరిపారు. 10 తేదీరాత్రి రాష్ట్రపతి ఆయనకు విందుచేశారు. విందు ఆహ్వానం భూర్జపత్రంపై వ్రాసిపంపారు. 11 వ తేదీన ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆయనను 'డాక్టర్ ఆఫ్ లాస్' బిరుదంతో గౌరవించింది. 12 వ తేదీన ఐసెన్ హోవర్ ప్రధాని నెహ్రూ గౌరవార్థం అమెరికా రాయబారి శ్రీ ఎల్స్వర్త్ బంకర్ బసలో విందుచేశారు. ఆయన సపరివారంగా తాజ్ మహల్ దర్శించారు. 13 వ తేదీ రాత్రి ప్రధాని నెహ్రూ, శ్రీ ఐసెన్‌హోవర్ అన్ని సమస్యలకు శాంతియుత పద్ధతులలో పరిష్కారం తమ అభిమతమని సంయుక్త ప్రకటన చేశారు. పిమ్మట, ఐసెన్‌హోవర్ 14 వ తేదీ ఉదయం విమానంలో టెహరాన్‌కు బయలుదేరారు. రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ మొదలయినవారు ఆయనకు విమానాశ్రయంలో వీడ్కోలిచ్చారు.

డాక్టర్ పట్టాభి అస్తమయం

కాంగ్రెస్ కురువృద్ధుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు డిశంబర్ 17 వ తేదీ ఉదయం 9-15 గంటలకు హైదరాబాద్‌లో స్వగృహంలో అస్తమించారు. ఆయన వయస్సు 80 సంవత్సరాలు. ఆయన అస్తమయానికి దేశమంతా దురపిల్లింది. హిమాయత్ నగర్ శ్మశానంలో ఆయన భౌతిక కాయానికి అంత్యక్రియాలు జరిగాయి.

చైనాకు నెహ్రూ సమాధానం

చైనా, భారత దేశాల సరిహద్దు వివాదాల పరిష్కారానికి దోహదంకాగల సూత్రాలపై ఏకాభిప్రాయం పొందడానికి చైనాలోనో, రంగూనులోనో చైనా ప్రధానులు సమావేశంకావాలని చైనా ప్రధాని చౌ-ఎన్-లై భారతప్రధానికొక లేఖ వ్రాశాడు. ఇలాంటి సమావేశం ప్రస్తుతం సాధ్యంకాదని, ప్రధాన విషయాలపై ఏకీభావంలేనపుడు, ఒడంబడిక అసంభవమని తను సమాధానంవ్రాసినట్లు ప్రధానినెహ్రూ డిసెంబర్ 21 వ తేదీన లోక్ సభలో తెలిపారు.

దుర్గాపూర్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం

దుర్గాపూర్ ఉక్కు కర్మాగారంలోని మొదటి పెద్దకొలిమికి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ డిసెంబర్ 29 వ తేదీన ప్రారంభోత్సవం జరిపారు. ఈ కర్మాగారంలో 10 లక్షల టన్నుల ఇనుము, ఉక్కు ఉత్పత్తి అవుతాయి. ఈకర్మాగారం నిర్మాణం 1961 కి పూర్తవుతుంది.

అగ్రరాజ్యాధినేతల సమావేశం

ప్రాక్పశ్చిమాగ్ర రాజ్యాధినేతల సమావేశం మే 16 వ తేదీనుంచి పారిస్‌లో ప్రారంభించబడాలని సోవియట్ యూనియన్‌ను పాశ్చాత్యరాజ్యాలు కోరాయి. కృశ్చేవ్ ఈ సమావేశంలో పాల్గొనడానికి అంగీకరిస్తూ, మే 4 వ తేదీన జరపాలనీ కోరారు. ఆ మీదట 16 వ తేదీ జరుపడం భావ్యమని పాశ్చాత్యరాజ్యాలు కోరాయి.

ఇండియా క్రికెట్ జట్టు విజయం

ఇండియా క్రికెట్ జట్టుకు ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుతో డిసెంబర్ మూడవవారంలో కాన్పూర్ లో జరిగిన టెస్ట్‌మ్యాచిలో ఇండియాజట్టు గెలుపొందింది. ఇండియా ఆస్ట్రేలియాతో టెస్ట్‌మ్యాచిలో గెలుపొందడం ఇదే తొలిసారి.

కేంద్ర వేతనసంఘం సిఫార్సులకు ప్రభుత్వం ఆమోదం

కేంద్రప్రభుత్వోద్యోగుల జీతభత్యాలుగురించి వేతననిర్ణాయకసంఘం చేసిన సిఫార్సులలో ముఖ్యమైనవాటికి కేంద్రప్రభుత్వం ఆమోదించింది. దీనివల్ల కేంద్రప్రభుత్వానికి అదనంగా ఏడాదికి, దాదాపు 16 కోట్ల రూపాయలు వ్యయమవుతుంది. ఈ సిఫార్సులు 1959 నవంబరు 1 వ తేదీనుండి అమలులోకి వచ్చాయి.

స్వవిషయము

ఒక హేమంతం గడచి మరొక హేమంతం మన చెంతకు వచ్చింది. కారాకులు డుల్లి మారాకులు తొడగడానికి అనువైన ఋతురాజ మిది. ఇది ప్రకృతి పరిపాటి. కాని సాహిత్య ప్రకృతి తీరే వేరు. దానికి ఈ ఋతు పరివర్తనం వర్తించదు. దానిలో, కారాకులన్నవే లేవు; అన్నీ మారాకులే; అవి తొడగడంలోనే కొంత ముందూ వెనుకలు.

తెనుగుతోట తన తోబుట్టువులతోపాటు, రెమ్మ వేసి కొమ్మసాచి సౌగంధికాలు-సుస్వాదు ఫలాలు అందజేస్తూనే ఉంది. అయినా, ఏమి దైవోపహతో ఇటీవల సృజనశీలమైన సాహిత్య శాఖ చిగిర్చడం లేదు; స్తబ్ధత ఏర్పడింది. పరిశోధన శాఖలలో కొంత చైతన్యం కానవస్తున్నది నిజమే. జానపద వాఙ్మయం, భరత శాస్త్రం, అలంకార శాస్త్రం మున్నగు శాఖలలో మధురఫలాలు పుట్టినమాటా కాదనలేము. కేంద్ర ప్రభుత్వం ఒకభాషలోని ఉత్తమ గ్రంథాలను రాజ్యాంగం ఆమోదించిన పధ్నాలుగు భాషలలోను అనువదింప జేయడానికి ఉద్యమించి కొంత ముందుకు సాగడం కూడా వాస్తవమే. ఆంధ్రసాహిత్య అకాడెమీ ప్రోత్సాహంతో పదబంధ పారిజాతం పరీమళించడం, సామెతలు ఆమెతలు కావడం, నన్నయ పదకోశం తిన్నగా సాగిపోవడం సత్యమే. శబ్దరత్నాకరం మరికొంత శబ్దజాలం సంతరించుకొని సాక్షాత్కరించడం, వైజయంతీ నిఘంటువు జిజ్ఞాసువులకు వైజయంతి కావడం ఎవరు కాదంటారు?

దక్షిణభారత భాషాసంస్థ దక్షిణాపథ భాషలకు సామరస్యం కలిగిస్తూ ఉండడం అందరికీ కనులగడుతున్న కృషే. లిపి సంస్కరణకై పరిశోధకులు పరిపరివిధాల పదకాలు వేయనుండడం వినుతింపదగిందే. తెలుగువారి నాట్య వైశారద్యం పెరవారికి విశదీకరించడానికి కూచిపూడి నాట్యబృందం అన్యరాష్ట్రాలలో పర్యటించడం ప్రశంసార్హమే. తెలుగుసాహిత్య అకాడెమీ ఉత్తమగ్రంథాలను బహూకరించడంకూడా బహుమాన్యమే.

కాని, జీవితంలాగే సాహిత్యమూ అవిభాజ్యం, అఖండం. ఎన్నో బిందువుల సందోహమే ప్రవాహమైనట్లు, కొన్ని రేకులు కూడితేనే కుశేశయమైనట్లు ఒక్కొక్క పాయ, ఒక్కొక్క రేకు విడిగి విప్పారితేనే సంపూర్ణ వికాసం. కనుకనే సృజనశీలమైన శాఖ చిగిరించనందుకు చింతిస్తున్నాము; విమర్శశాఖ కొత్తరెమ్మలు వేయనందుకు చాల విచారిస్తున్నాము.

విమర్శన మంటే గుణదోషాల సాకల్యసమీక్షే కాని దుమ్ముకొట్టడం కాదు. అప్పుడే అది ఉత్తమ విమర్శన మౌతుంది. కాని మన విమర్శదృష్టి గతాన్ని చొచ్చుకుపోయినంత తీవ్రంగా వర్తమానంలో చొరడ్డంలేదు. సమకాలిక విమర్శములో ఏవో జంకుగొంకులూ, దాక్షిణ్యదూషితబుద్ధులూ పొడసూపుతాయి. వాటిని తొలగదోసుకుని సత్యదృష్టితో సాహిత్యయాత్ర సాగించడం విమర్శకుని గుండెదిటవుకు తార్కాణ.

"దేశం పరతంత్రమైంది గనుక అన్ని రంగాలలోను అభివృద్ధి మోడుబారింది. స్వాతంత్ర్యం సిద్ధించలేదు. మూడు పూవు లారు కాయలు! నవనవోషస్సు!"-అనేవారు అధికోత్సాహులు కొందరు పూర్వం. స్వాతంత్ర్యం సిద్ధించి పుష్కరమైంది. తలఎత్తి ఓహో అనగల నవలగాని, కండ్లు పెద్దవిచేసి ఆహా అనగల కావ్యంగాని పుట్టలేదంటే అతిశయోక్తికాదు. కొన్ని కథలు-ప్రపంచ కథలతో సాటిరాగలవి వచ్చాయనడం నిజం. తెనుగుజీవితం తీర్చిచూపిన కావ్యం, నవల ఏవి? నిష్పాక్షికదృష్టితో, హృదయపుష్టితో వెరపులేక విలువలుకట్టే విమర్శ ఏదీ? ఈ నీడలే చలనచిత్ర రంగంలోను పడ్డాయి.

దీనికి కారణం మనలో సహజవికాసం కొరవడి, కృత్రిమత, అనుకరణ శీలత హెచ్చు పెరగడమే నేమో! స్వతంత్రభావన సమసిపోవడమే నేమో! ఏజాతిఅయినా స్వతంత్రంగా ఆలోచించడానికి, భావనకు చేవ చేకూర్చుకోడానికి మూలబంధం స్వసంస్కృతి, స్వకీయ సంస్కృతికి దూరులమైనప్పుడు స్వతంత్ర భావన కలుగదు; స్వతంత్రమైన, సుందరమైన సాహిత్యం సృష్టికాదు.

ఈ సంస్కృతికి ఆలవాలం ,తెలుగు చదువు. అది లేక విదేశభాషా సంస్కృతులతో వచ్చే రచనలు అసహజాలు, ఆపాత రమణీయాలు. మన సంస్కృతిలో వేళ్ళు తన్నినప్పుడే, మన భావన, కల్పన వేయివిధాలుగా విస్తరించ గలవుగాని, పరసంస్కృతిలో నిలచినవి విప్రవినోదుల మాయామండపంవలె, మాయారసాల వృక్షంవలె క్షణసుందరమౌతాయి.

ఈ స్వతంత్రభావనకు ప్రోదిచేయవలసింది చిన్ననాడే. దానికి విద్యావిధానంలో మార్పు అవసరం; పాఠ్యగ్రంథాలలో కొత్త తీర్పు అవసరం. పాఠ్యగ్రంథాల పరమార్థం విద్యార్థుల లేలేతఎడదలలో నీతికి నారులుపోసి, భాషాభివృద్ధితో భావనకు బలం చేకూర్చడమేకదా! మరి ప్రాచీన సంస్కృతిపైన, సాహిత్యంపైన అభిరుచి కలిగించి, వారిని అభివృద్ధి చేయడమేకదా! కనుక పాఠ్యగ్రంథాలు విద్యార్థులకు వెగటు, వైరస్యం కలిగించి, విద్యార్థుల మనసులను మోడుపరుచరాదు. నేటి ఈ పరిస్థితి పరికిస్తే పందొమ్మిదోశతాబ్ది పూర్వార్థంలో తెనుగునాడును ఊపివదలిన చైతన్యంవంటిది ఏదో మరొక్కమారు తల ఎత్తితే, మహోద్యమరూపంతో సాహిత్యారాధన కొనసాగితే, తెనుగునాడు, తెనుగువాడు పునరుజ్జీవితులు కాగలరేమో అని తోస్తుంది.

ఈ పునరుజ్జీవన పరాయణతతో, సాహిత్యంలో సహృదయసుందరమైన స్థితిని, సహానబంధురమైన గతిని కల్పించడానికి, తద్వారా సంఘంలో ఉన్నతిని సృష్టించడానికి దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారు ముప్పైఆరేండ్లనాడు స్థాపించిన భారతి ముప్పైఏడవ సంవత్సరంలో అడుగు పెడుతున్నది; వారి ఆదర్శాలకు అనుగుణంగానే కృషిచేస్తున్నది. నిరుడుకూడా రాయలగయశాసనంవంటి అపూర్వ విషయాలను ఆంధ్రావళికి అందజేసింది; సమీక్షుల స్థాయి పెంచి శారదారాధన చేసింది. ఈ ఆరాధనలో పండితులు, పరిశోధకులు, కవులు, కథకులు ఎప్పటిలాగే ఇకముందూ సహకరించాలని సాదరంగా అభ్యర్థిస్తున్నాము.

ఆశాస్యము


శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి

తెలుఁగు మాగాణికి వెలుఁగు తేఁగలిగిన
నవ్యసాహితికిఁ గాణాచి వగుచు,
తెలుఁగుసీమకు దీప్తి కలిగింపనేర్చిన
కవికుమారుల కలంకార మగుచు
తెలుఁగునేలకుఁ గీర్తి తేఁజాలువ్యక్తుల
పేరుపెంపులు దాఁచు పేటి యగుచు,
తెలుఁగు భూమికి నింపు పొలయించు లాలిత్య
లక్ష్మికిఁ గ్రీడ విలాస మగుచు,

భారతీ! ఆణిముత్తెముభాతి నస్మ
దాంధ్రదేశాన నభ్యుదయంబుతోడ
వెలయుమా! కలకాలము పొలుపు వలపు
కులుకు నొలికించు కొంగ్రొత్త విలువకలిగి.

కీర్తిశేషులు డాక్టర్ పట్టాభిగారు

రాజకీయ విద్యార్థి



మహాపురుషుల తీరే వేరు ; అది అనితరసుసాధ్యం, అనితర సుబోధం. పెరుగుతున్నకొద్దీ వట వృక్షంలాగ వ్యాపించి విస్మయం కలిగించడమే కాదు; అణురూపంలో అణగి మణగి ఉన్ననాడే మన్నన లందుకొనే విలక్షణత దానిది. పూవు పుట్టగనే పరిమళిస్తుందంటారు కదా మరి! అలాంటి సురభిల సౌగంధిక సుమమే డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు.

పదింతుల మందిలోనైనా వదలక పట్టియిచ్చే సమున్నత సింహాసంహననం, మాటలలో చేతలలో వ్రాతలలో అంచులువార పెల్లుబికే ఆంధ్రత్వం, అనర్గళమైన వాగ్ధాటి, అపారమైన విజ్ఞానం, అపూర్వ ప్రతిభా ప్రాభవం, అంకెల సంకలనంలో అనిదంపూర్వమైన చాతుర్యం, తిరుగులేని తర్కం, పాఠకుని ప్రగాఢభక్తిపరవశుని చేసే రచనాశక్తి - జుట్టుకట్టినవారు ఆయన అంటే, ఆయన స్వరూపాన్ని కొంత సమీపించగలమేమో!

పట్టాభిగారి జననం 1880 నవంబరు 24 వ తేదీన పశ్చిమ గోదావరిజిల్లా గుండుగొలను గ్రామంలో. తలిదండ్రులు కలవారు కానందున ఆయన బాల్యంలో కష్టపడి చదువు సాగించవలసి వచ్చింది. ఈ పరిశ్రమ వల్లనే కాబోలు ఆయన తెలివి తేటదేరి, బుద్ధి పదును దేరి, జ్ఞాపకశక్తి గడిదేరింది. ఆయన ఏకసంథ గ్రాహి; ఒక్కమారు కన్నదీ, విన్నది మనసులో ముద్రపడిపోవలసినదే. కనుకనే అన్ని పరీక్షలలోను కన్నాకై సాటి విద్యార్థుల మనసులనే కాక ఉపాధ్యాయుల ప్రేమాదరాలను చూరగొన్నారు. విద్యార్థి వేతనాలతోనే చదువు కొనసాగింది. ఆయన 1897 లో బందరు నోబెల్ కళాశాలలో చేరి ఎఫ్. ఎ. పరీక్ష ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై, మద్రాసులో బి. ఏ.; ఎం. బి. సి. ఎం. పరీక్షలలో పారంగతులై, బందరులో స్థిరపడి వైద్యవృత్తి ప్రారంభించారు; పెద్దపేరు పొందారు.

ఈ స్వయంకృషి సత్ఫలంవల్లనే ఆయనలోని పెక్కుశక్తులు సంపూర్ణంగా వికసించాయి. దానిలో ఒక్కటి జంకుగొంకులు ఎరుగనాడి సత్యాన్ని చెప్పే సాహసం, స్వభావం. ఈ సాహసానికి ఆలవాలమైనది జలపాతంలాంటి వాగ్ధార. "ఆవేగంలో మాటలకంటె ముందు భావం, భావంకంటే ముందు యుక్తి, యుక్తికంటే ముందు సిద్ధాంతం నడుస్తూఉంటవి. ఆ ఉపన్యాసంమధ్య ఎవరైనా కొంటిమాటో, కుంటి ప్రశ్నో విసిరారా ఇక అణగారిపోయా రన్నమాటే. తోటాను త్రిప్పి కొట్టుతాడు ఫెడేలుమని తగిలేటట్లు! అందుకని ఆయనకు అడ్డుతగులడానికి జంకుస్తారు. ప్రతివాద భయంకరుడని ఊరికే వచ్చిందా బిరుదాయనకు?" ఈ సాహసమే ఆయనను వాదకోవిదునిగా తీర్చిదిద్దింది; 'పార్లమెంటరీ' వ్యవహారాల పండితునిగా షండించింది

విద్యార్థిదశలోనే ఆయన వాదచణత్వం గురించి నిదర్శనాలు చెబుతారు. బందరులో ఒకమారు ఒక సభ జరిగిందట. దానికి జిల్లాకలెక్టర్ తెల్లదొర అధ్యక్షుడు. అతడు సభను నడపడంలో తప్పు ప్రొసీజరు అనుసరిం

చాడు. అది సభాస్తారులలోను పెక్కుమందికి తెలీలేదు. వెనుక బెంచీలలో కూర్చున్న పట్టాభిగారది చూచి సహించలేకపోయారు. ఉడుకు రక్తం. 'ప్రెసిడెంట్ నీ ప్రొసీజరు తప్పు' అని కేక వేశారట. అది తెల్లదొరల సామ్రాజ్యం, అందులోను కలెక్టరు. కోపంతో మండిపడ్డాడట. పట్టాభిగారు లేచి పార్లమెంటరీ ప్రొసీజరును తన సహజ వాగ్ధాటిలో వివరించి పెట్టారట. ఆ స్వభావం ఆయనకు రాజకీయ రంగంలో వైయక్తికంగా కొంతనష్టం కలిగించినా, కాంగ్రెస్ తీర్మానాలు, కార్యక్రమం చక్కదిద్దడంలో మార్గదర్శకమైంది.

ఆయన వైద్యుడుగానే ఉండిఉంటే ధన్వంతరిని మించేవారని పెద్దలంటారు. వైద్యంలోను ఆయనది మంచి చేయివాసి. వైద్యునికి కావలసింది నిదానం. అది పూర్తిగా ఆయనలో ఉండేది. ఆయన వైద్యవృత్తి ప్రారంభంలో పడినపాట్లను గురించి ఒకమారు ఉపన్యసించారు. దానిలో కొన్ని అంశాలు పేర్కొంటాను.

"నేను 1906 లో బందరు ప్రాక్టీసు చేయుటానికి వచ్చినపుడు మందులు ఇంకా పట్నమునుంచి నాకు చేరలేదు. అప్పటిలో నన్ను వైద్యానికి పిల్చేవాళ్ళు ఎవరున్నారు గనుక! నా అదృష్టవశాత్తు మా మాస్టరుగారు దొరికారు – నాకు వైద్యానికి. సంస్కృత పండితులు. చూచేవా రెవరున్నారు? బంక విరేచనాలు పట్టుకుంటే నన్ను పిలిచారు, మొక్కపాటి సూర్యనారాయణ శాస్త్రులుగారు. నా దగ్గర మందులు లేవాయె –పోనీ ఏ ఓపియం రెజిని యో అని చెప్పి మభ్యపెట్టడానికి. ఏమి చేస్తాను? వట్టి ఆముదం రెండేసిగంటల కొకసారి రెండు చెంచాలు యివ్వమన్నాను. మొదటి డోసు పడేటప్పటికల్లా చప్పున కడుపులో మెలెయ్యడం కట్టింది. మూడురోజు లిట్లా వట్టి ఆముదమే యిచ్చాను. రోగం కుదిరింది. అప్పుడే వూళ్ళో టాక్ పడింది. కొత్త డాక్టర్ వచ్చాడని, ఆముదంతో రోగం కుదిర్చాడనీ.

"మరునాడు ఇంకో కేసు వచ్చింది. ఒక బండి తోలేవాడి అన్న, ఇల్లు నేసేవాడికి ప్రాణంమీదికి వచ్చింది. కాళ్లు చేతులు చల్లబడ్డాయి, కింద పెట్టారు. నన్ను పిలిచారు. భలే అదృష్టవంతుడినిరా—అనుకున్నా. ఏముంది? తేలికైన కేసు; నిమోనియా—ఏడు రోజులు—తర్వాత క్రైసిస్. జ్వరం జారి కొలాప్సు వచ్చింది. చప్పున గొంగళి కప్పించాను. కాస్త బ్రాంది యిప్పించాను. మంచంమీద పండుకో బెట్టించాను. కాసేపటికల్లా కేసు రికవరీ అయింది. ఊళ్ళో రెండు వందలనుంచి బళ్ళవాళ్ళకు పేరు పాకిపోయింది: కొత్త డాక్టర్ వచ్చాడని, చచ్చేవాళ్ళని బ్రతికిస్తున్నాడని, డబ్బు అడగడని కూడా!...ఏడు సంవత్సరముల తర్వాత ఆ బండివాడు ఒక కుర్చీ చేయించి తీసుకు వచ్చి యిచ్చాడు. ఇప్పటికీ వుంది మా యింట్లో."

నిజం చెప్పడమనేది కొత్త వైద్యునికీ, పాత వైద్యునికీ అందరికీ అవసరమైనన్నది ఆయన వైద్యవృత్తిలో విజయానికి కీలకం. వైద్యుడు రోగి కుటుంబంలో ఒక్కడుగా తనను భావించుకోవాలనీ, కేసు అయిపోగానే తనదోవన తాను దులుపుకొని పోరాదని, ఎప్పటికప్పుడు వైద్య గ్రంథాల పఠన మననాలు కొనసాగిస్తూ ఉండాలని, చదువు ఎప్పుడూ మనను చెరచదని ఆయన సూత్రాలు. ఇవే రాజకీయ జీవితంలోను పట్టుగొమ్మలుగా ఉండినవనడంలో సందేహం లేదు.

బందరులో వైద్యవృత్తి ప్రారంభించినప్పుడే 1906 లోనే—ఆయన మనస్సు దేశసేవవైపు, కాంగ్రెస్ వైపు మొగ్గింది. అప్పుడే ఆ సంస్థలో చేరారు. వైద్యవృత్తీ, దేశసేవాసక్తీ రెండుపాయలై ప్రవహించడానికి వీలు లేదని గ్రహించి, వృత్తి మానివేసి పూర్తిగా దేశసేవకే జీవితం అంకితం చేయడానికి నిశ్చయించారు. ఇంతలో వంగదేశంలో 'వందేమాతరం' ఉద్యమం తలయెత్తింది. దేశం అంతటా జాతీయభావాలు తీవ్రతరంగా అల్లుకున్నాయి. దేశంలో వివిధప్రాంతాలలో జాతీయ విద్యాలయాలు నెలకొనసాగాయి. ఆంధ్రదేశంలోను కొందరికీ భావాలు పుట్టాయి. పట్టాభిగారు శ్రీ కోపల్లె హనుమంతరావు, కృష్ణరావుగారు మున్నగు వారితో కలిసి ఆంధ్రజాతీయకళాశాలను నెలకొల్పారు; 'ఆంధ్ర భాషాభివృద్ధి మండలి' అనేపేర సాహిత్య సంఘాన్ని స్థాపించారు.

అప్పుడే ఆయనే రచనాపాటవానికీ, పత్రికానిర్వహణకు గీటురాయిగా ఒక సంఘటన జరిగింది. కృష్ణాపత్రిక "తెల్లవారిని తుపాకులతో కాల్చుట" అన్న వ్యాసాన్ని ప్రకటించినందుకు రాజాగ్రహానికి గురిఅయింది. అప్పటి జిల్లాకలెక్టర్ స్కాట్. అతను చాల దురుసుగా ప్రవర్తించేవాడు. అతడు తోకతొక్కిన త్రాచుపాములాగ మండిపడుతూ కృష్ణాపత్రికపై చర్య తీసుకొనడానికి ప్రయత్నించాడు. పత్రిక యజమానులను

పిలిపించి అలాటి వ్యాసం ప్రకటించడానికి కారణమైన వారిని తొలగించవలసిందని, అలాచేస్తే పత్రికను ప్రాసిక్యూషన్ చేయనని మధ్యేమార్గంగా సలహాయిచ్చాడు. పత్రిక మూసివేయడమే ఉచితమని పెద్దలు పలువురు సలహాయిచ్చారట. కాని, పట్టాభిగారు, స్కాట్ సలహా ప్రకారం ఆ వ్యాసం ప్రచురణకు బాధ్యులైన సంపాదకులు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారికి పత్రికతో సంబంధం తాత్కాలికంగా తప్పించి, మూడేళ్లపాటు పత్రికను మరొకరిపేర నడిపి, మరల దానిని కృష్ణారావుగారికి అప్పగించారట.

ఇంతలో రాజకీయరంగంలో పెద్దమార్పు వచ్చింది. బాలగంగాధరతిలక్ నాయకత్వం క్రమంగా సన్నగిలసాగింది. 1920 లో గాంధీజీ రాజకీయాలలో అడుగిడినారు. దీనితో పట్టాభిగారి ప్రజ్ఞ పారమిత. అపారమిత అయింది. గాంధీజీ నాయకత్వంలో నడచిన ప్రతిఉద్యమంలోను పట్టాభి ముందు నిలిచారు. 'జన్మభూమి' అనే ఆంగ్ల వారపత్రికను నడిపారు. గాంధీజీకి భాష్యకారులుగా ఆయన అప్పటినుంచే విఖ్యాతిపొందారు. తర్వాత ఆయన వ్రాసిన "గాంధిజం-సోషలిజం" అనే గ్రంథమే ఆయన భాష్యకర్తృత్వానికి తార్కాణం. దానిలో ఆయన తన విమర్శన పటిమతో గాంధీజీ ఆశయం, ధర్మప్రయోజనం, కర్మాచరణ మొదలయినవి కూలంకషంగా చర్చించి, మేధావులను మెప్పించి, సామాన్యులకు కనువిప్పు కలిగించారు.

భాషా రాష్ట్రోద్యమం, ఆంధ్రరాష్ట్రోద్యమం, 1913 లోనే పుట్టినా, 1927 వరకూ కాంగ్రెస్ కూడా దానికి అధికారముద్ర వేయలేదు. పట్టాభిగారు ఈ ఉద్యమంలో ప్రధానపాత్ర వహించారు. స్వరాష్ట్రభావన స్వరాజ్యభావనలో అంగమేనని, దానికి పూరకమే కాని మారకం కాదని ఆయన ప్రచారం చేశారు. "ఇండియన్ నేషనలిజం" అనే గ్రంథంలో ఆయన జాతీయభావనకు చక్కని వ్యాఖ్యానం చేశారు. "ఆంధ్రరాష్ట్రం-అనుకూల ప్రతికూలవాదాలు" అనే మహాగ్రంథంలో భాషా ప్రయుక్తరాష్ట్రాలు భారతజాతి సమైక్యానికి చక్రంలో ఆకులులా, పూవులో రేకులులా ఎలా పరస్పర ప్రవర్తకాలో స్పష్టపరిచారు. 1927 లో కాంగ్రెసు మహాసభ లక్నోలో జరిగింది. ఆసభలో ఆయన భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణం తీర్మానాన్ని ప్రతిపాదించి, ఆమోదింపజేశారు. దానిని లోకమాన్యుడుకూడా బలపరచడం గొప్పవిషయం. అప్పుడే భాషారాష్ట్ర నిర్మాణ సిద్ధాంతానికి ప్రతీకగా ఆంధ్ర కాంగ్రెసు కమిటీ నెలకొల్పబడింది.

ఆయన 1936 లో ఆంధ్ర కాంగ్రెసుకమిటీఅధ్యక్షులై దానిని 1940 వరకు నిర్వహించారు. అప్పుడే ఆయన రాష్ట్రమంతటా పర్యటించి ఆంధ్రరాష్ట్రవాదం అందరికీ ఒప్పించారు. ముఖ్యంగా "ఆంధ్ర రాష్ట్రం మాకు వద్దు" అని భీష్మించుకొని కూచున్న రాయలసీమవారినీ ఒప్పించి ఒక త్రాటికి తెచ్చారు. కరుడుకట్టుకున్న ఆంధ్రరాష్ట్ర ప్రతికూలవాదుల అపోహలను తమ తర్కజటిలమైన వాదప్రావీణ్యంతో తెగటార్చి, తెలుగువారంతా ఒక్కటేఅనే సద్భావానికి నాందులు పోశారు.

జాతీయతాభావనావాహిని ఒక్క బ్రిటిషు భారతంలోనే పశ్చిమవాహినిగా ప్రవహించడంవల్ల కలిగే ప్రమాదాలను ఆయన ఏనాడో గుర్తించారు. స్వదేశీ సంస్థానాలలోని ప్రజలూ స్వతంత్రులు కావాలని, బానిసలకు బానిసలని, వారికి రాజకీయచైతన్యం కలిగించాలని, ఆయన దానికి పూనుకున్నారు. 1936 లో కరాచీలో అఖిలభారత సంస్థాన ప్రజామండల్ కాంగ్రెస్ జరిగింది. దానికి ఆయన అధ్యక్షుడు. ఆయనసారథ్యాన సంస్థానప్రజోద్యమం ముమ్మరంగా ముందుకుసాగింది. అప్పటినుంచి కాంగ్రెసుకు సంస్థాన ప్రజలతోను సన్నిహితత్వం ఏర్పడింది. ఈ ఉద్యమంలో ఆయన కార్యదక్షత మమూర్తీభవించింది. ఆయన తన ప్రసంగంలో సంస్థానాల పరిపాలనలోని అవకతవకలు, రాజుల రాసక్రీడలు, ప్రజలఅష్టకష్టాలు, అంకెల పొంకంతో, కాశీమజిలీ కథలలాగ చెప్పుకుపోతూంటే శ్రోతలు నోరుతెరచి, కన్నులు చెవులు అప్పగించి వినవలసిందే; దానితో వారి రాజులు జనక మహారాజులు, రామచంద్రులు కారని నమ్మకం కుదరవలసిందే; వారు తమ రక్తం తాగే తోడేళ్ళనే ఆవేశంతో మైమరచి పోవలసిందే.

ఇంతటి మేధావి కాంగ్రెసు అధ్యక్షుడుగావుండి ఉద్యమానికి సారథ్యం వహించడం ఉచితమని గాంధీజీ మొదలయిన నాయకులు భావించి 1938 లో త్రిపురలో జరిగిన కాంగ్రెస్ మహాసభకు ఆయనను అధ్యక్షుడుగా ఎన్నుకోవలసిందని కాంగ్రెసు సభ్యులనుకోరారు. కాని సుభాష్‌చంద్రబోస్ పోటీపడడంవల్ల ఆయనకు ఆ పదవి దక్కలేదు. 'పట్టాభి పరాజయం నా పరాజ

కీర్తిశేషులు డాక్టర్ పట్టాభిగారు

యం' అని గాంధీజీ ఆవేదన వెలిబుచ్చారు. పట్టాభిగారికి ఈ వాంఛితం స్వాతంత్ర్యానంతరం 1949 లో ఈడేరింది.

అవి 1941 గడ్డుదినాలు. ద్వితీయ ప్రపంచ సంగ్రామం ముమ్మరంగా మారణ హోమం జరుపుతున్న భయంకర కాలం. భారతరాజకీయ రంగంలోను విచిత్ర పరిణామం ఏర్పడింది. గాంధీజీ వైయక్తిక సత్యాగ్రహం ప్రారంభించారు. ఆయన భాష్యకారుడు పట్టాభిగారుకూడ 1941 మార్చి 21 న అరెస్టుచేయబడ్డారు. మరల ఎనిమిది నెలలకు విడుదలయ్యారు. యుద్ధంలో ఎవరు జయించినా భారతదేశం స్వశక్తి మీద స్వాతంత్ర్యం సంపాదించవలసి వుందనే సత్యం నాయకు లందరూ గుర్తించారు. ఏ తెల్లవానినీ దేశంలో అడుగు పెటనీరాదనే నిర్ణయం చేసుకొన్నారు. గాంధీజీ ఈ నిర్ణయంతోనే "క్విట్ ఇండియా" ఉద్యమం ప్రారంభించాలని ఆలోచనలు సాగించారు. పట్టాభిగారు గాంధీజీని బలపరిచారు. 1942 ఆగస్టులో అఖిలభారత కాంగ్రెస్ సమావేశం బొంబాయిలో జరిగింది. క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆ సమావేశం ఆమోదించింది. సమావేశం అనంతరం బొంబాయి నుండి తిరిగి బందరుకు వస్తున్న పట్టాభిగారిని ప్రభుత్వం అరెస్టుచేసి, అహమదానగర్ కోటలో నిర్బంధించింది. ఈ "క్విట్ ఇండియా" ఉద్యమంలో పట్టాభిగారి పాత్ర అతి ముఖ్యం. ఈ ఉద్యమం ఎలా నడవాలో ఇదివరకే క్షుణ్ణంగా ఆలోచించి 'ఆంధ్ర సర్క్యులర్' అన్న పేరుతో పథకం సిద్ధపరచారు. దానిని చూచిన మీదట ప్రభుత్వం దిగ్భ్రాంతమయింది. ఆ ఉద్యమానికి 'ఆంధ్ర సర్క్యులర్' జీవగర్ర అని టాటన్‌హాం కూడా గాంధీజీకి వ్రాసిన లేఖలలో తెలియజేశారు.

అహమద్‌నగర్ కోట కారాగారంలో ఆయన ఉన్న మూడు సంవత్సరాలలోను వ్రాసిన గ్రంథాలలో ముఖ్యమైంది "ఫెదర్స్ అండ్ స్టోన్స్". ఆ కారాగారం మహానాయకుల కందరికీ ఆవాసమై విజ్ఞాన నిలయమా అన్నట్టు ఉండేది. నాయకు లందరు తీరిక వేళల్లో తమ చిత్తవృత్తికి అనుగుణమైన వినోదంతో ఆనందించేవారు. పట్టాభిగారికి పక్షిఈకె లేరడం వినోదం. వాటితో ఆయన ఒక్క తలగడా తయారు చేశారుట. ఆయన సాధారణంగానే చాల పొదుపరి అని పేరుపొందారు. కవర్లనుచింపి వాటి వెనుక వ్రాయడం, భోజనం అయి చేతులు గడుక్కున్న పిదప చేతిని చిత్తుకాగితానికి తుడిచివేసి, ఆ కాగితాన్ని పొయ్యి రాజవేయడానికి వాడడం లాంటివి ఎన్నో ఉన్నాయి ఆయన సరదాలు. పక్షి ఈకలనుకూడా ఆయన ఇలాగే ఏరి తలదిండు తయారు చేశారు. ఈ ఈకల సేకరణమే తమ గ్రంథానికి "ఫెదర్స్ అండ్ స్టోన్స్" అని పేరుపెట్టడానికి కారణమయి ఉంటుందేమో !

ప్రపంచ యుద్ధానంతరం బ్రిటిషు ప్రభుత్వం భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడానికి అంగీకరించింది. అప్పుడు జరిగిన రాయబారాలలో పటాభిగారు కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులుగా ప్రధానపాత్ర నిర్వహించారు. స్వాతంత్ర్యోత్తూర్యం తొలిసారిగా ఏర్పడిన రాజ్యాంగ పరిషత్తులో ఆయనకూడా సభ్యుడుగా ఉన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆయన ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి చాల కృషిచేశారు. కాంగ్రెస్ కార్యవర్గం ఆంధ్రరాష్ట్ర నిర్మాణంలోని సాధకబాధకాలను పరిశీలించడానికి ప్రత్యేక సంఘం నియమించింది. దానిలో జవాహర్ లాల్ నెహ్రూ, వల్లభాయి పటేల్, డాక్టరు పట్టాభిగార్లు సభ్యులు. ఈముగ్గురూ రాష్ట్రనిర్మాణంపై తమ అభిప్రాయాలను సూచిస్తూ అందజేసిన నివేదిక 'జె. వి. పి. రిపోర్టు' అని ఖ్యాతి పొందింది.

ఆయన మధ్యప్రదేశ్ గవర్నర్ గా నియమింపబడ్డారు. దానితో ఆయన తెలుగువారికి అన్య రాష్ట్రాలలో గొప్పకీర్తి తెచ్చారు. ఆయన ఒకమారు నాగపూర్ న్యాయకళాశాల వార్షికోత్సవంలో ప్రసంగించి, తన అత్యద్భుత ప్రసంగవైదగ్ధ్యంతో, న్యాయశాస్త్ర పాండిత్యంతో న్యాయవాదులను, న్యాయాధీశులను చకితులను చేశారు. ఆ ప్రసంగాన్ని, న్యాయశాస్త్రంపై ఆయనఇచ్చిన ఉపన్యాసాలు మరికొన్నిటిని మధ్యప్రదేశ్ ప్రభుత్వం పుస్తకరూపంలో ప్రచురించింది. గవర్నర్ పదవినుండి విరమించినపిదప ఆయన హైదరాబాద్ లో స్థిరపడ్డారు. కొంతకాలం అస్వస్థులుగా వుండి 1959 డిసెంబర్ 17-వ తేదీన అస్తంగతు లయ్యారు.

సహస్రమాస జీవి అయిన ఆయన దేశభక్తుడుగాను, మేధావిగానే కాక మహేతిహాసకుడుగానూ శాశ్వతత్వం సంపాదించుకున్నారు. కాంగ్రెస్ చరిత్ర ఆయన మహోద్గ్రంథం. ఉమన్ ఇన్ హిందూ సొసైటీ, బ్రిటిష్ ఎంపైర్ అండ్ లిమిటెడ్, స్వదేశసంస్థానాలు మొదలయినవి ఆయన పేరుపొందిన రచనలలో కొన్ని. ఇవన్నీ చాలవరకు కారాగారంలో వ్రాసినవే.

ఆయన ధన్యజీవి; తను నడిపిన ప్రతి ఉద్యమం ఫలితాలు కలగానే కాక ఇలలో నిక్కలగా చూచిన సిద్ధసంకల్పులు. స్వాతంత్ర్య సంపాదన చూచి సంతసించారు. తాము ప్రతిపాదించిన భాషారాష్ట్రోద్యమం పెరిగి ఫలించి, ఆంధ్రరాష్ట్రం ఏర్పడడం, తక్కిన భాషారాష్ట్రాలు వెలకొనడం, బొంబాయి విడిపోయి మహారాష్ట్ర గుజరాత్ రాష్ట్రాలు వెలకొల్పాలనే నిర్ణయం కావడం చూచారు. సంస్థానాలవిలీనీకరణం కన్నులారా కాంచారు. జమీందారీ రద్దు ఉద్యమానికి పునాది వేసి, ఫలితాలు పరికించారు ఆయన కన్నుమూయడంతో "నో చేంజర్స్"-పాతతరంవారు పూర్తిగా కనుమరుగై పోయారు.

ఆయన కట్టె మాటలలో మేటి మాత్రమే కారు; క్రియాదక్షుడు కూడా. సామాన్యంగా మేధావులు మేఘ వీధులలో విహరిస్తూ, మేదినిమీద కాళ్ళుంటనీరు. పట్టాభిగారు మేధతోపాటు మేదినిని అంటిపెట్టుకోవాలన్నవారే. ఆంధ్ర జాతీయ కళాశాల, ఆంధ్ర బ్యాంకి, ఆంధ్ర ఇన్షూరెన్సు కంపెనీ, కృష్ణా కోఆపరేటివ్ బ్యాంకి, భారత లక్ష్మి బ్యాంకి, హిందూస్తాన్ ఇన్షూరెన్స్ ఇంకా ఎన్నో ఆయన క్రియాదక్షతకు స్వరూపాలు. ఆయన ఒకమారు, శ్రీ ప్రకాశం జన్మదినోత్సవసభలో తమకూ ఆయనకూగల వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రసంగించారు దానితో ఆయన ఎంతటి వ్యవహార్తో, క్రియానిపుణుడో స్పష్టమవుతుంది.

"ప్రకాశంగారు కేవలం నేలపైనే నలుగురికీ అందుబాటులో కనిపిస్తూ నడుస్తారు. నేను నీటిపైన కూడా పయనంచేయగలను. కనిపించకుండా నీటి అట్టడుగున సాగిపోగలను. ప్రకాశంగారు నేటి సంగతే ఆలోచింపరు. నేను ఎల్లుండి సంగతి కూడా ఇవాళే ఆలోచిస్తాను ఆయనకు ఆయనను గూర్చిన ఆలోచనే ఉండదు. నాకు నన్నుగూర్చిన ఆలోచనే-పరాయి వారిని గురించికూడా నావిషయం కోసమో ఆలోచిస్తాను." పట్టాభిగారి ఈవచనాలు ఆయన స్వరూప స్వభావాలకు నిర్వచనాలవుతూ, "మనస్వీ కార్యార్థీ న గణయతి దుఃఖం నచ సుఖం" అన్న భర్తృహరి మాటలను తలపింపవూ?

కాని, ఆయన అంత్యకాల జీవితం చూస్తే ఒక సందేహం పొటమరిస్తుంది. ప్రతిభలో వయసులో పండువారిన ఆయన ప్రాభవం స్వాతంత్ర్యోద్యమంలో ఉన్నంతగా, స్వాతంత్ర్య సంసిద్ధికి తర్వాత కనిపించదేమి? అని. ఐదు దశాబ్దాలపాటు ఏకైక ధ్యేయంతో జాతీయోద్యమంలో నిర్విరామ కృషిచేసిన ఆయన పలుకుబడి నేడు కనిపించదేమి? అని. దానికి కారణం ఆయన లోపాలేవీ కావు. స్వాతంత్ర్యం సిద్ధించనంతగానే, జవాహర్ లాల్ నెహ్రూ ప్రాబల్యం పాదుకోసాగింది; గాంధీజీమతం మటుమాయమై పోసాగింది. ఇది నెహ్రూ యుగం, పట్టాభిగారు గాంధీ భాష్యకారులు; గాంధీధర్మమే లోక కల్యాణ కారకమని నమ్మినవారు. కనుక నెహ్రూ సోషలిస్టిక్ పద్ధతి భావనలో ఆయనకు స్థానం లేకపోయింది. ఆయన అప్పటికీ ఎప్పటికీ నోచేంజరు! మరి గాంధీమతం వీడి మరొక మతం చేపట్టడం ఎలా? ఇదే ఆయన తుదినాళ్లలో వెనుకబడడానికి కారణమనుకుంటాను. ఇదే ఆయన గాంధీ మతనిష్ఠకు, ఆత్మ బల పటిష్ఠతకు నిదర్శనం.

రావణ వనం

శ్రీ దాశరథి

రావణుని ఉద్యానవనం నందనవనాన్ని మించుంది;
నందనంలోనైనా ముళ్ళుంటే వుండవొచ్చు గానీ
ఇక్కడ రోజామొక్క సైతం ముళ్ళులేకుండా మొలిచింది.

ముళ్లు మొలిస్తే రావణుడు చంపేస్తాడని మహాభయం;
అలాగే పూలు పూయకున్నా చంపేశేస్తాడు;
ఎప్పుడూ పూలు పూస్తుండడమే రావణుడి ఆశయం.

అతనికి ఉద్యానంలో అన్ని నెలలూ వసంతమే ఉండాలి;
వర్షకాలంలోనైనా సరే మామిడిచెట్లూ వేపలూ
ఎప్పటిలాగే చక్కగా పూలు పూయాలి; పండ్లు పండాలి.

అవసరంలేని జిల్లేళ్లు నాగజముళ్లు లంకలో మొలవ్వు;
పచ్చని ఆకుల్లోసైతం పసందైన పరిమళాలుంటాయి;
మొగిలివనంలో నాగసర్పాలు జనాన్ని కరవ్వు.

సాయంత్రంపూట వాహ్యాళికి రావణుడు వస్తాడు;
పొద్దుతిరుగుడుపువ్వు సూర్యుణ్ణి వదిలేసి అతనివైపు చూస్తుంది;
రావణుడు మరి సాయంత్రంపూట తూర్పువైపు నడుస్తాడు.

అసలు సూర్యుడే రావణుణ్ని చూచి భయంతో ఆగిపోడూ!
ప్రకృతి సమస్తం అతనికి ఏనాడో దాసోహం అంది;
రావణుడు బ్రహ్మాండం అంతా పట్టేసిన సైంటిస్టు ఆనాడు.

అయితే ఇదంతా జరుగుతోంది భయంతోనేకాని భక్తితో కాదు;
ఎందువల్ల ప్రకృతికి రావణునిమీద భక్తి లేదంటారు?
దానికి కారణం ఒక్కటే. రావణునిలో హృదయం లేదు.

అదనుచూచి దెబ్బ కొట్టా లనుకుంటోంది ప్రకృతి,
ఇంతలో వచ్చింది సీతామహాదేవి బందీగా.
తీవెల్లో పూవుల్లో తావుల్లో అన్నిట్లో కలిగింది వికృతి.

తిరుగబడింది రావణునిమీద ప్రకృతి ఆనాడు;
వసంతుడు వెళిపోయాడు, శాశ్వత శిశిరం ఆవరించింది;
ఇప్పుడు మామిడుల్ని పూయమని రావణుడు శాసించ లేడు.

సీతతోకూడా అన్ని చెట్లూ
మంచుకన్నీళ్లు కార్చాయి;
ఆమెలాగే అలంకారరహితంగా
దుఃఖంగా వున్నాయి;
ఆమెకోసం మెత్తని ఆకుల్తో
చల్లని శయ్యా పరిచాయి.

విశ్వేశ్వరుని చమత్కార ప్రస్థానము

శ్రీమతి డి. సి. సరస్వతి

సంస్కృతసాహిత్యశాస్త్ర పరిచయములేని వారి కలంకారమన్న కేవలము యమకానుప్రాసాద్యలంకార విచారణయే యను నభిప్రాయమును కలిగించును. కాని సంస్కృతాలంకారశాస్త్ర గ్రంథములయందు సహృదయగాహన మొనరించినవారికి, ఇవి కేవలము కావ్యశరీరమునకు బాహ్యములయిన యలంకారములను (Figures of speech) మాత్రమే చర్చించుటలేదు; కావ్యముయొక్క యంతస్తత్త్వముగూడ నిందు ముఖ్యవిచారణీయాంశ మని విదితమగును.

ఇట్టి యభిప్రాయమునకంతయు "అలంకారము" అనుపదమే కారణముగా కన్పట్టుచున్నది. ఈపదమునకు రెండర్థము లున్నవి—"సౌందర్య మలంకారః" అను వామననిర్వచనము ననుసరించి, అలంకారమనగా సౌందర్యమనియు, "కావ్యం గ్రాహ్య మలంకారాత్" (కావ్యాలంకారసూత్రము - 1-1-1) అని యనుటచే సౌందర్యమున్న కావ్యమే కావ్యముగా పరిగణితమగు ననియు తెలియుచున్నది. అందుచే నలంకారశాస్త్రము కావ్యమునకు సౌందర్యాపాదకములైన ధర్మములను నిర్దేశించు శాస్త్రమని స్పష్టమగుచున్నది. ఈయలంకారపదమునకే కావ్యశరీరమయిన శబ్దార్థములకు మెఱుగు పెట్టు నలంకారములని రెండవ యర్థము. (అలంకరోతీతి అలంకారః) వీనినే కావ్య మలంకరింపబడుచున్నందున వీని నలంకారము లనుచున్నారు. ఈరెండవ యర్థమే పై యపోహకు దారితీసినది.

ఇందు సౌందర్యము లేక శోభయే కావ్యమునకు ముఖ్యాంశమను నుద్దేశముతో నీశాస్త్రమునకు కొందఱు సౌందర్య శాస్త్రమని పేరిడిరి. సాధారణముగా నీ సౌందర్యశాస్త్రమను పదమును ఆంగ్ల భాషయందలి 'Aesthetics' అనుపదమునకు బర్యాయముగా వాడుచున్నారు. కాని యీసౌందర్యశాస్త్రమును, మఱియు Aesthetics అను పాశ్చాత్యపదమును సర్వకళలకు సంబంధించినవి. కనుక నన్నికళలను పై పదములచే సమన్వయింపవచ్చును. అందుచే కేవల మలంకారశాస్త్రమునకు మాత్రమే వీనితో సంకేత మొనర్చుటచే నతివ్యాప్తిదోషమున కవకాశ మొసంగును. ఈ శాస్త్రమునే యాంగ్లభాషలో 'Literary Criticism' అను పేరుతో వ్యవహరింతురు. దీనిని డాక్టరు శంకరన్ గారు వారి 'Some Aspects of Literary Criticism in Sanskrit' లో నిట్లు వివరించియున్నారు:

"Literary Criticism is a true perception of the beautiful in poetry, the proper understanding of the poetic made of expression of ideas, the descovery of the laws of the poetic truth and the enumeration of the principles that enable us to judge the degree of the success of the poet in his representation of the beautiful which is the permanent source of the responsive minds."

ఈ యలంకారశాస్త్రమునకే సాహిత్యశాస్త్రమనియు మఱియొక పేరుగలదు. దీనినే రాజశేఖరుడు సాహిత్యమీమాంసయందు 'శబ్దార్థయో ర్యథావత్ సహభావేన విద్యా సాహిత్యవిద్యా' అని నిర్వచించెను. భామహుడును 'శబ్దార్థౌ సహితౌ కావ్యమ్' (కావ్యాలంకారము—1-16) అని కావ్యనిర్వచనమును చేసెను. దీనిబట్టి శబ్దార్థసహితకావ్యము యొక్క చర్చయే సాహిత్యశాస్త్రమని చెప్పవచ్చును. మమ్మటుడు కావ్యప్రకాశమును, విశ్వనాథుడు సాహిత్యదర్పణమును వ్రాయుటంబట్టియు సాహిత్యపదమును కావ్యపద పర్యాయముగా వాడినట్లు తెలియుచున్నది. శబ్దార్థముల సహితత్వము (సామ్యమునే) సాహిత్యమందురు. అనగా శబ్దార్థముల చక్కని పొందికయు, తత్ఫలితమైన యొక సుభగత్వవిశేషమును, దానిచే గలుగు నొక యానందానుభవమును-సాహిత్యమనెదరు. కళలవిషయమును చర్చించు నపుడు సంగీతముతో సాహిత్యమును జోడించి చెప్పవాడుక నేటికిని యున్నది. సాహిత్యశాస్త్ర చరిత్రయందొక సంప్రదాయమును నలంకారముతో శాస్త్రము నంతకును పేరిడినందువలన నిది సాహిత్య చరిత్రయందొక సర్వోత్కృష్టస్థితిని మాత్రమే జ్ఞప్తికి తెచ్చుచున్నది.

ఈయలంకార మనునది భామహాద్యాలంకారికుల కాలముననే ప్రాముఖ్యము గడించినది. ఇట్టి యలంకార సంప్రదాయమువలె నిక నేడింటిని సాహిత్యశాస్త్రమునందు జూడనగును. వీనిలో కొన్ని రసౌచిత్యాది సంప్రదాయము లలంకారము నడుగునకుద్రొక్కినవియు గలవు. కాన నీ యెనిమిది సంప్రదాయములలో నొక యప్రధానమైన యలంకారమును గ్రహించి, దాని నామముతో సర్వశాస్త్రమునకు సంకేత మొనర్చుట యాశ్చర్యకరము. కాని యిట్టి సంకేతమున కొక యుపపత్తి కన్పట్టుచున్నది. ఆలంకారికులలో ప్రప్రథముడైన భామహుని స్మరింపజేయుటకును, అలంకారములే కావ్యమునకు ప్రధానకారణమను నతని యుద్దేశమును పురస్కరించుకొని, యతని తరువాతవారీశాస్త్రమునకంతకు నలంకారశాస్త్రమని పేరిడియుండవచ్చును. భామహాదులు వారిగ్రంథములకు సహితము కావ్యాలంకారము, కావ్యాలంకార సారసంగ్రహము, కావ్యాలంకార సూత్రవృత్తి యని సంకేత మొనర్చియున్నారు. ఇందు వీ రలంకారములకే ప్రాధాన్య మిచ్చినందున వీరి గ్రంథములకీ నామములు సార్థకములైయున్నవి. ఇట్లలంకారముల ప్రాధాన్యము కారణమున ఈశాస్త్రమున కలంకారశాస్త్రమనియు, తత్కర్తల కాలంకారికులనియు వ్యవహారము గలిగినది.

లౌకిక విజ్ఞానమునందు సాహిత్యమునకు సర్వోత్కృష్టపదవి నిచ్చియున్నారు. ఇట్టి సాహిత్యమును సమ్యగర్థముచేసికొని విచారించునది యలంకారశాస్త్రమే. 'Treatise on Rhetorics' అను తన గ్రంథములో, అరిస్టాటిలు మహాశయుడు దైనందిన జీవితములో తర్కశాస్త్రపరిచయ మత్యవసరమయినందున దానిని వేరుగా నభ్యసించకయే యలవడుననియు, అటులనే కావ్యప్రపంచమునం దలంకారశాస్త్రమును దాని యావశ్యకతనుబట్టి దానిని వేరుగా నేర్చుకొన నవసరము లేదనియు వ్రాసియున్నాడు.

నేడు మన మలంకారశాస్త్రమనియు, సాహిత్యశాస్త్రమనియు రెండు నామములతో వ్యవహరించుచున్న యీశాస్త్రమున కంతకు పూర్వమున్న సంకేతమేమి? ఏ నామముతో దీనిని ప్రాచీనులు పేర్కొనిరి? అను ప్రశ్నలు సహజముగ గలుగును. వాత్స్యాయనుడు పేర్కొన్న కళలలో క్రియాకల్ప మనున దొకటి యున్నది. "...ఛందోజ్ఞానం క్రియాకల్పః ఛలితకయోగః..." (వాత్స్యాయన కామసూత్రములు-1-3-16) రామాయణమున నుత్తరకాండయందు శ్రీరాముని సభామంటపమునందున్న విద్వాంసులను వివరించుపట్టున

"కళామాత్రావిభాగజ్ఞాన్
జ్యోతిషే చ పరంగతాన్,
క్రియాకల్పవిదశ్చైవ
తథా కావ్యవిదో జనాన్" (94.7)

అను నొకశ్లోకము గలదు. కాని వీనివలన క్రియాకల్పమన నేమో స్పష్టమగుటలేదు. జయమంగళుడు వాత్స్యాయనుని కామసూత్రములకు వ్రాసిన వ్యాఖ్యానమువలన క్రియాకల్పమనిన యలంకారశాస్త్రమన్న విషయము తెలియుచున్నది. ("క్రియాకల్ప ఇతి కావ్యకరణ విధిః, కావ్యాలంకార ఇత్యర్థః")

ఈ సాహిత్యశాస్త్ర రచన యెప్పుడు ప్రారంభమయినదో స్పష్టముగ తెలియుటలేదు. కాని మనకు లభ్యమయిన ప్రథమాలంకారగ్రంథము భరతుని నాట్యశాస్త్రము. అప్పటినుండియు నేటివరకు, రూపకరస భావాలంకార ధ్వనిపాకశయ్యాదులను గూర్చి రచించిన గ్రంథములు సుమారు వేయి యుండునని సాహిత్యదర్పణ పీఠికయందు మహామహోపాధ్యాయ శ్రీ పి. వి. కాణే గారు తెలిపియున్నారు.

కావ్యలక్షణములు, వాని నియమములు, వాని విధులు, అలంకారములు మొదలగువాని నన్నిటి నొక క్రమముగా వ్రాసి శాస్త్రము నొకదాని నేర్పాటు చేయుటకు పూర్వమే పురాణేతిహాసాదులలో నీయంశములు కొన్ని కన్పించుచున్నవి. రామాయణము బాలకాండలో,

"కావ్యం రామాయణం కృత్స్నం
సీతాయా శ్చరితం మహత్,
రసైః శృంగారకారుణ్య
హాస్య వీర భయానకైః.
రౌద్రాదిభిశ్చ సంయుక్తం
కావ్యమేత దగాయతామ్." (4-9)

అని యిందు రామాయణ కావ్యము సర్వరసపోషణమున కాస్పదమయి యున్నదని చెప్పబడినది. యాస్కుడును తన నిరుక్తమునం దుపమాలంకారమున కిట్లు లక్షణమును చెప్పియున్నాడు. (అధ్యాయము 3; ఖండము-13) "అథాత ఉపమా. యదతత్ తత్సదృశమితి గార్గ్యః. తదాసాం కర్మ జ్యాయసా వా గుణేన ప్రఖ్యాతతమేన వా కనీయాంసం వా ప్రఖ్యాతం వా ఉపమీయతే అథాపి కనీయాంసం వా జ్యాయాంసమ్."

అను నీవివరణము కావ్యప్రకాశకారుడు చెప్పిన "సాధర్మ్య ముపమా భేదే" (సూత్రము—125) అను లక్షణముతో సరిపోవుచున్నది. యాస్కుడు "జ్యాయసా కనీయాంసమ్" అనుటలో నుపమానము సాధారణముగా సుప్రసిద్ధమయినదిగాను, ఉపమేయ ముపమానముకన్న తక్కువగాను నుండవలెనని తెలిపెను. పాణినికూడ "ఉపమితం వ్యాఘ్రాదిభి స్సామాన్యాప్రయోగే" (2-1-56) అను సూత్రమునందును, "ఉపమానాని సామాన్య వచనైః" (2-1-57) అను సూత్రమునందును ఉపమానోపమేయములకు సామ్యమున్నట్లు తెల్పెను. కఠోపనిషత్తునందు 'ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ చ' (3-3) అను వాక్యమునందు నాత్మను రథికుని గాను, శరీరమును రథమును గాను, బుద్ధిని సారథిగాను, మనస్సును పగ్గములుగను నిరూపించు రూపకమొక్కటి చెప్పబడినది. ఇట్లు సాహిత్యశాస్త్ర మేర్పడకపూర్వమే యందలి యంశములు సంస్కృతవాఙ్మయమునం దచ్చటచ్చట కన్పించుచున్నవి.

ఈ శాస్త్రమునకు సంబంధించిన గ్రంథనామములే యలంకారశాస్త్రచరిత్రమందలి ముఖ్యఘట్టములను తెలుపును. ప్రప్రథమమున నీ శాస్త్రమున వ్రాయబడిన గ్రంథములకలంకార సంకేతము నిచ్చిరి. భామహుని కావ్యాలంకారము, ఉద్భటుని కావ్యాలంకారసారసంగ్రహము, వామనుని కావ్యాలంకారసూత్రవృత్తి, రుద్రటుని కావ్యాలంకారము మొదలగునవి యిందు కుదాహరణములు. తరువాతివారీ యలంకారములు కేవలము కావ్యముయొక్క బాహ్యశరీరమునకు సంబంధించినవే యని తెలిసికొని, కావ్యాత్మ లేనిదే యవి యన్నియు శవశరీరోద్వర్తనముగు ననియు తెలుసుకొనిరి. కావ్యమునకు ధ్వని యాత్మయను ఆనందవర్ధనాచార్యులు ధ్వన్యాలోకమును, వక్రోక్తియే కావ్యజీవితమను కుంతకుడు వక్రోక్తి జీవితమును, అన్నింటిలోను ఔచిత్యాంశమే ప్రధానమను క్షేమేంద్రుడు ఔచిత్యవిచారచర్చను వ్రాసిరి. ఆవెనుక, చమత్కారదాయకత్వమే కావ్యలక్షణ మని మన యాలంకారికులు గమనింపగలిగిరి. ఈ మతమునందు విదితమైనంతలో మొట్టమొదట వ్రాయబడిన గ్రంథము చమత్కారచంద్రిక. ఇది యింకను ముద్రితము. ఈ గ్రంథకర్తయగు విశ్వేశ్వరకవిచంద్రుడు ఆంధ్రదేశీయుడు. ఇట్లలంకారశాస్త్రగ్రంథనామములే మనకందున్న సంప్రదాయములను జ్ఞప్తికి దెచ్చుచున్నవి.

ఈ సంప్రదాయములను వానికాలక్రమరీతిగా సంగ్రహముగా నీ క్రింద వివరించుచున్నాను.

రస సంప్రదాయము

ఈ సంప్రదాయ స్థాపకుడు భరతముని. అన్నిటిలోను, ఈ రససంప్రదాయము కాలప్రవాహము నెదురీదగల్గినది. ఈ రససంప్రదాయము ఆదికవి వాల్మీకిముని కాలముననే యంకురించినదని జెప్పవచ్చును. ఒకదినమున వాల్మీకి సమిత్తులను సేకరించుటకు నరణ్యస్థలములందు సంచరించుచుండగా నదేసమయమున నానందసముద్రమునం దోలలాడుచున్న నొక క్రౌంచమిథునము నొక చెట్టుపై గాంచెను. మరుక్షణముననే వానిలో మగపక్షి యొక కిరాతుని బాణమున కాహుతియై క్రిందబడి మృతిచెందెను. అట్టి సమయమున రక్తమునందు పొరలు యొకపక్షిని, దాని సమీపముననే విరహాగ్నిచే దహింపబడి యార్తస్వరముతో నేడ్చుచున్న మఱియొక పక్షిని, జూచి వాల్మీకి హృదయము కరుణాపూరితమైనది. తత్ఫలితముగా నతడు శ్లోకరూపమున కిరాతుని శపించెను. ఇచట ప్రత్యక్షముగా జూచి యనుభవించిన శోకము శ్లోకరూపమున బరిణమించినది. ధ్వనికారుడును (ఆనందవర్ధనుడు) వాల్మీకిమునియే యీ సంప్రదాయమునకు మొదటి పునాదివేసెనని యిటుల వ్రాసెను.

'కావ్యస్యాత్మా స ఏవార్థః
తథా చాదికవేః పురా,
క్రౌంచద్వంద్వ వియోగోత్థః
శోకః శ్లోకత్వ మాగతః.

(ధ్వన్యాలోకము 1—5)

రామాయణాదికావ్యములయందు రసపోషణాది విషయము లెన్నియో గమనింపబడియున్నను, భరతమునియొక్క నాట్యశాస్త్రమునందు మొట్టమొదట సమ్యగ్విచారణ చేసి సిద్ధాంతీకరింపబడినవి. ఇతడు రసములను నాట్యపరములుగా నన్వయించెను. వానికి నాట్యరసములని నామమిడెను. 'విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రసనిష్పత్తిః' అనునతని సూత్రము రససిద్ధాంతమునకు పునాది. ఈ సూత్రము చాల చిన్నదయినను యనేక భిన్నమతములకు దారితీసినది. భరతుడు నాట్యశాస్త్రమునందు ప్రధానముగా రూపకాది చర్చనే జేసినను, ఈ చర్చ నంతయు రసమునందే కేంద్రీకరింపజేసెను. అనగా కావ్యనాట్యములయందు రసమే ప్రధానమయిన ట్లితని ముఖ్యోద్దేశము. ఈ ప్రాధాన్యమును పురస్కరించుకొనియే రసము కావ్యమునకు

జీవితమనియు లేక యాత్మ యనియు చెప్పుటకితని కాను కటి యాలంకారికుల కవకాశము దొరికినది. భరతముని కావ్యాలంకార గుణదోషాదులను గూడ ప్రస్తావవశమున జర్చించినను, వానికి ప్రాధాన్య మిచ్చినట్లు తోపదు.

భరతు డష్టరసములను మాత్రమే యంగీకరించెను. తరువాతి యాలంకారికులు కొందరు శాంతరసమును నంగీకరించిరి. అయినను ప్రధానముగా సుప్రసిద్ధములయిన తొమ్మిది మాత్రమే కావ్య ప్రపంచమున రసత్వమును బొంది యానందమును గలిగించునని యేకగ్రీవముగా నంగీకృతమైన విషయము.

అలంకార సంప్రదాయము

ఈ సంప్రదాయ స్థాపకుడు భామహుడు. రసమాత్ర మితనికి విదితమై యున్నను, దృశ్యకావ్యమునకు మాత్రమే యది ప్రధానమైనదని యూహించి, శ్రవ్యకావ్యమున కలంకారములే ముఖ్యములని నిరూపించెను. ఈ మతమువా రలంకారములనే యాహ్లాదదాయకములుగా గ్రహించి యింతకు పూర్వము కావ్యమున కాత్మగా పరిగణింపబడిన రసమును సహితము, నొక యలంకారముక్రిందనే పరిగణించిరి. "కావ్యశోభా కరాన్ ధర్మాన్ అలంకారాన్ ప్రచక్షతే" (కావ్యాదర్శ—2-1) అని దండి నిర్వచించినరీతి గావ్యమునకు శోభను గలిగించు స్వభావము రసమునకును నున్నందున దానినిగూడ నలంకారమనిరి. అప్పయ్య దీక్షితులును "సర్వోపి వ్యంగ్యాలంకారః కవిసమయ ప్రసిద్ధ్యనురోధేన హృద్యతయా కావ్యశోభాకర ఏవ అలంకారతాం భజతే" అని వ్రాసిరి. భామహుడు "న కాంతమపి నిర్భూషం విభాతి వనితాముఖమ్" (కావ్యాలంకారము 1 13.) అని యలంకారరహితమయిన కావ్యము శోభించదని యుద్దేశించెను. అలంకారములే కావ్యమునకు ప్రాణములని వీరి ముఖ్య ప్రతిపాదన. దండియు కావ్యాదర్శ ప్రథమపరిచ్ఛేదమందు గుణములయొక్క నధికశోభమానమును చూపించినను గ్రంథమునం దెక్కువగా నలంకారచర్చనే జేసెను. రుద్రటుడుగూడ నలంకారచర్చనే ప్రధానముగా నొనర్చెను. ధ్వనికారుడు సహిత మలంకార ప్రాధాన్యమును గమనించినందుననే, కావ్యాత్మగా గ్రహించబడిన ధ్వనిలో నొక ప్రధానభాగముగా (అలంకారధ్వని) స్వీకరించెను. మమ్మటుడు, విశ్వనాథుడుగూడ ప్రత్యేకముగా నలంకార నిరూపణమును గావించియున్నారు. ఇంచుమించుగా నాలంకారికు లందరును యీ యలంకారచర్చను జేసిరనియే దృఢముగా జెప్పవచ్చును. ఈ యలంకారమున కింత ప్రాముఖ్యము గన్పించుచున్నందుననే యీ శాస్త్రమున కంతకు నలంకారశాస్త్రమని పేరు గలిగినది. (ప్రాధాన్యేన వ్యపదేశాః భవన్తి.) "యద్యపి రసాలంకారాద్యనేకవిషయ మిదం శాస్త్రం తథాపి ఛత్రిన్యాయేన అలంకారశాస్త్ర ముచ్యతే." రత్నాపణివ్యాఖ్యానం—ప్రతాపరుద్రీయము.)

గుణ సంప్రదాయము

ఈ సంప్రదాయ స్థాపకుడు దండి. భామహ దృష్ట్యా, అలంకారములు కావ్యజీవితభూతము లయినట్లు, దండి మతమున గుణములు కావ్యమునకు సర్వముఖ్యములు. గుణములే కావ్యమున కంత సౌందర్యదాయకములనియు, నలంకారములు కేవలము పై సౌందర్యమునే యతిశయింపజేయుననియు వీరి యుద్దేశము. "కావ్యశోభాయాః కర్తారో గుణాః. తదతిశయహేతవ స్త్వలంకారాః" (కావ్యాదర్శ 3-1-12). కావ్యాదర్శమునందు దండి దశగుణములను వివరించి వీనిని వైదర్భ్యాదిరీతులకు వరుస నన్వయించెను. భరతుడును దశగుణాలనే యంగీకరించెను. భామహుడు మూడింటినిమాత్రమే గ్రహించెను. వామనుడు దశగుణములను శబ్దార్థభేదములతో వ్రాసెను. ఆనందవర్ధనాచార్యులును ఈ గుణములను కావ్యాత్మయైన రసధర్మములనుగా గ్రహించెను. భోజుడుమాత్రము యిరువదినాలుగు గుణములను వివరించి వానినే శబ్దార్థభేదములతో నలుబదియెనిమిదింటినిగా విభజించెను.

రీతి సంప్రదాయము

ఈ సంప్రదాయస్థాపకుడు వామనుడు. ఇతనికి పూర్వము వారెవ్వరును 'కావ్యాత్మ'యను సంకేతమును వాడలేదు. "రీతి రాత్మా కావ్యస్య" (కావ్యాలంకార సూత్రములు-1-2-6) అని కావ్యమునకు 'రీతియే యాత్మ' అనునది యితనిమూల సిద్ధాంతము. ఈ రీతిని "విశిష్టా పదరచనా రీతిః" (1-2-7) అని నిర్వచించి, "విశేషో గుణాత్మా" (1-2-8) అని యీ విశేషము కావ్యగుణములచే గలిగింపబడునని వ్రాసెను. ఈ రీతులకు నాయా దేశముల ననుసరించి వైదర్భ్యాది నామము లివ్వబడినవి. ఇతడు రసముయొక్క ప్రాధాన్యముగూడ గమనించక దానిని 'కాంతి' యను గుణమునందే యంతర్భావింపజేసెను. "దీప్తరసత్వం కాన్తిః" (కావ్యాలంకార సూత్రము 3-2-15). వామనుడు సమ్మతించినవి మూడురీతులే మాత్రమే. వీటితో రుద్రటుడు లాటీయా, మాగధి, అవంతులను జేర్చెను. శారదాతనయుడు మొత్తము 105 రీతులను పేర్కొనెను. కాని వామనునిరీతిత్రయమతమే బహుసమ్మతము.

విశ్వేశ్వరుని చమత్కార ప్రస్థానము

ధ్వని సంప్రదాయము

ఈ మతస్థాపకు డానందవర్ధనాచార్యులు. ఇంత వరకు రసములు నాట్యరసములుగనే యుండినవి. వీని నితడే మొట్టమొదట కావ్యరసములుగా మార్చగలిగెను. ఇతనికి మునుపే యచ్చటచ్చట నలంకారగ్రంథములలో ధ్వని విచారము గన్పించుచున్నను దానిని కూలంకషముగా సిద్ధాంతీకరించి ప్రప్రథమమున స్థాపించినవా డీతడే. కావ్యమునకు ధ్వనియే ప్రధానాంశమని ఇతని ముఖ్యోద్దేశము. ఇతని ననుసరించి శబ్దమునకు మూడు శక్తు లున్నవి. అభిధాశక్తి, లక్షణాశక్తి, వ్యంజనాశక్తి. అందు మొదటిది వాచ్యార్థమును బోధించును. ఈ వాచ్యార్థము కుదరక దానితో సంబంధించిన వేఱొక యర్థమును బోధించునది లక్షణాశక్తి. వాచ్యార్థము పొసగినను, యర్థాంతరమును స్ఫురింపజేయునది మూడవ శక్తియగు వ్యంజనాశక్తి. ఈ యర్థాంతరమునే ధ్వని యనిరి. దీని నిట్లు ధ్వనికారుడు నిర్వచించెను.

"యత్రార్థశ్శబ్దో వా
తమర్థ ముపసర్జనీకృతస్వార్థౌ,
వ్యంక్తః కావ్యవిశేష
స్స ధ్వని రితి సూరిభిః కథితః."

(ధ్వన్యాలోకము—1-13)

ఎందు శబ్దముగాని యర్థముగాని యప్రధానముగా జేయబడిన స్వార్థముగలదై, మఱియొక్క ప్రతీయమానార్థము నభివ్యక్తము జేయునో, ఆ కావ్యవిశేషము ధ్వని యగును.

ఈ ధ్వని వస్తుధ్వని, యలంకారధ్వని, రసధ్వని యని మూడువిధములు. వీనిలో రసధ్వనియే ప్రధానమని యుద్దేశించుటచేత, ఆనందవర్ధనుడు కేవలధ్వని స్వరూపమును నిర్ణయించుటయే గాక మూలపడిన రససిద్ధాంతమున కూపిరిపోసెను. 'శృంగార వీరకరుణ రౌద్రహాస్యభయానకాః' అని కేవల రసనామోచ్చారణ మాత్రముననే రసోత్పత్తి గలుగబోదనియు, రసము వాచ్యరూపమున గాక వ్యంగ్యరూపముననే యుండవలయుననియు ఇతడు ప్రతిపాదించిన విశేషములలో నొకటి. అలంకారమును రసమునుగూడ నితడు ధ్వనిభేదముగనే గ్రహించెనుగాని, యితని పూర్వుల ననుసరించి వానిని కావ్యాత్మగా నంగీకరించి ప్రాధాన్యము నిచ్చుట కిచ్చగింపలేదు.

వక్రోక్తి సంప్రదాయము

ఈ సంప్రదాయస్థాపకుడు కుంతకుడు. ఇతడు వక్రోక్తినే (a twist in the expression) కావ్యజీవితమునుగా బ్రతిపాదించినట్లితని గ్రంథనామమే స్పష్టపఱచుచున్నది. వక్రోక్తి యన సర్వసాధారణమైన ఉక్తికన్న భిన్నమని యర్థము.

"శబ్దార్థౌ సహితౌ వక్ర
కవివ్యాపార శాలిని,
బన్ధే వ్యవస్థితౌ కావ్యం
తద్విదాహ్లాదకారిణి"

(వక్రోక్తి జీవితము 1-7)

అని, యిచట వక్రోక్తియే, యాహ్లాదదాయకమను భావమును వ్యక్తపఱచెను.

"వక్రోక్తిరేవ వైదగ్ధ్య
భంగీభణితి రుచ్యతే" (వక్రోక్తి జీవితము 1-10)

అని వక్రోక్తియందే వాక్చాతుర్య ముండుననియు వ్రాసెను. ఇట్టి వక్రోక్తి నారువిధముల విభజించి ధ్వనిని రసమును యలంకారముల నన్నింటినిగూడ నీ యారింటియందే నిమిడ్చెను. 1. వర్ణ విన్యాస వక్రత 2. పదపూర్వార్ధ వక్రత 3. ప్రత్యయవక్రత 4. వాక్య వక్రత 5. ప్రకరణ వక్రత 6. ప్రబంధ వక్రత.

భామహుడు నీ వక్రోక్తిని గమనించలేక పోలేదు. భామహుని కావ్యాలంకారమున

"సైషా సర్వైవ వక్రోక్తి
రనయార్థో విభావ్యతే,
యత్నోఽస్యాం కవినా కార్యః
కోఽలంకారోఽనయా వినా."

(కావ్యాలంకారము 1-85)

అని వక్రోక్తి సర్వాలంకారములయందున్నదనియు, తద్రహిత మలంకారమే కానేరదనియు వ్రాసియున్నాడు. కాని దీనిని సమ్యగ్విచారణ జేసిన ప్రథముడు కుంతకుడు. స్వభావోక్తియందు వక్రోక్తి లేదని దాని నితడు తిరస్కరించెను. భామహునకును యీ వక్రోక్తి సర్వాలంకార జీవితభూతమయినందున తద్రహితములయిన హేతు సూక్ష్మ లేశ వార్తాద్యలంకారముల నంగీకరించలేదు. కాని స్వభావోక్తియందు వక్రోక్తిధర్మము లుండునని భామహు డుద్దేశించెను. దండి స్వభావోక్తిని వక్రోక్తినుండి విడదీసి వాఙ్మ

యమునంతయు రెండు విధములని విభజించెను. ఇతని వెనుక భోజు డీ వక్రోక్తినుండి రసోక్తిని స్వభావోక్తిని వేఱుజేసి, వాఙ్మయ మంతయు త్రివిధమని వ్రాసెను, "వక్రోక్తిశ్చ రసోక్తిశ్చ స్వభావోక్తిశ్చ వాఙ్మయమ్." కాని వామనుడు వక్రోక్తియొక్క ప్రాధాన్యము నంగీకరింపక దానినొక యలంకారముగనే స్వీకరించెను. "సాదృశ్యా ల్లక్షణా వక్రోక్తిః" (కావ్యాలంకార సూత్రములు 4-3-8) కనుక వీరందరిలోను కుంతకు డొక్కడే వక్రోక్తియొక్క సర్వప్రాధాన్యమును గమనించి దానిని కావ్యాత్మనుగా ప్రతిపాదించెను.

ఈ వక్రోక్తి కావ్యముయొక్క ప్రధానాంశముగా నంగీకరింపబడినను, దీనినే కావ్యజీవిత మనుట కందరు నంగీకరింపనందున ఈ సంప్రదాయము కనుయాయులులేక కుంతకుని యనంతర మిది కేవల మలంకారముగనే నిలచినది.

అనుమితి సంప్రదాయము

ఈ మతస్థాపకుడు మహిమభట్టు. రసమును కావ్యాత్మగా నొప్పుకొన్నను ధ్వనికి మాత్ర మితడు విరోధి. అందుచేతనే తన గ్రంథమునకు గూడ ధ్వని విధ్వంసక కావ్యమని పేరిడెను. ఇతడు అన్ని ధ్వని భేదముల ననుమానములం దంతర్భవింప జేసెను. అభిధాది మూడు శక్తులలోను లక్ష్యమాణ ప్రతీయమానములనబడెడి యర్థాంతరము లన్నియు నభిధాశక్తి మూలముననే యనుమానింపబడుననియు, అర్థముగాని, శబ్దముగాని యెన్నటికిని వ్యంజకములు గావనియు, నందుచే వ్యంజనాశక్తియొక్క కల్పన యనవసరమనియు నితని యభిప్రాయము. అనుమానింపబడిన యర్థ మనుమేయ మగును. ధ్వనివలె దీనిని గూడా త్రివిధములుగా విభజించెను. కాని యీ సంప్రదాయమునకు గూడ ననుయాయులు లేని కారణమున వృద్ధి నొందలేక పోయినది.


ఔచిత్య సంప్రదాయము

ఈ మతస్థాపకుడు క్షేమేంద్రుడు. దేని కేది తగునో యది యుచితమనియు, ఈ యుచితముయొక్క భావమునే ఔచిత్యమనియు, ఇంతవరకు కావ్య జీవితముగ నెన్నబడిన ('రస జీవిత భూతస్య') రసమునకు సహితము, ఔచిత్యమే ముఖ్యాంశమనియు నితడు ప్రతిపాదించెను. ధ్వన్యాలోకాది గ్రంథములలో "అనౌచిత్యా దృతే నాన్య ద్రసభంగస్య కారణం" అని ఔచిత్యముయొక్క ప్రాధాన్యము గమనింపబడినను ఈ యౌచిత్యతత్వమును సుస్పష్టముగా ప్రదర్శించిన ఖ్యాతి క్షేమేంద్రునకే చెల్లును.

సర్వసాహిత్య సంప్రదాయములును ఈ యౌచిత్యమునకే లోబడియున్నవని మహామహోపాధ్యాయ శ్రీ కుప్పుస్వామి శాస్త్రిగారు తమ "High-ways and By-ways of Literary Criticism in Sanskrit" లో నొక చిన్న కారిక యందు వివరించి యున్నారు.

"ఔచిత్య మనుధావంతి
సర్వే ధ్వని రసోన్నయాః,
గుణాలంకృతి రీతీనాం
నయా శ్చానృజు వాఙ్మయాః."

ధ్వని, రసము, అనుమితి (ఉన్నయ), గుణము, అలంకృతి, రీతి మఱియు వక్రోక్తి ఇవన్నియు ఔచిత్యము ననుసరించియే యుండును. ఈ యర్థమునే సులభగ్రాహ్యముగా చేయుటకు, తన్నిరూపక మగు పటమును గూడ వ్రాసిరి.



ఇందలి పెద్ద వృత్తము క్షేమేంద్రుని యౌచిత్యము. అందున్న పెద్ద త్రిభుజము యొక్క మూడు కోణములును, మూడు సంప్రదాయములను తెలుపును. ఈ త్రిభుజమునందలి శీర్ష కోణము రససంప్రదాయము. క్రింది రెండు కోణములు పరస్పర విరుద్ధములయిన ధ్వన్యనుమానమతములు. ఈ రెండును పరస్పరము

విరోధించినను, పైకోణ సూచితమగు రసమును మాత్రము కావ్యాత్మనుగా నంగీకరించిన మతము లే. ఈ పెద్ద త్రిభుజము లోపలనున్న వృత్తము కుంతకుని వక్రోక్తి. దీనియందున్న త్రిభుజమునందలి శీర్ష కోణము రీతి సంప్రదాయమును సూచించును. క్రింది రెండు కోణములును గుణాలంకారములు. ఈ గుణాలంకారరీతి పద్ధతులు వాగ్విన్యాసమునకు సంబంధించినవియై, వక్రోక్తిపై నాధారపడియున్నవి. ఇవన్నియు కావ్యమునకు బాహ్యాంగములు మాత్రమే. కాని పెద్ద త్రిభుజముచే సూచింపబడిన మూడును కావ్యాంతస్తత్త్వమునకు సంబంధించినవి. ఈ మూడును, ఔచిత్యము నాశ్రయించుకొని యున్నవి. కనుక యీ పైపటము వలన, ఔచిత్యము నన్ని సంప్రదాయములు ననుసరించియుండునని స్పష్టమగును.

చమత్కార సంప్రదాయము

ఇంతవరకు ముద్రితములైయున్న సంస్కృత వాఙ్మయచరిత్రలో నీ యెనిమిదింటి నే చర్చించి వానిలో నౌచిత్యమే సర్వోత్కృష్టమయినదని అన్ని విమర్శగ్రంథములును వివరించియున్నవి. క్షేమేంద్రుని తరువాత, కావ్యమునందు చమత్కారమే ప్రధానాంశమను సంప్రదాయ మొకటి బయలుదేరినది. చమత్కార రహితకావ్యము కావ్యమే గాదనియు, గుణాలంకారాదులయందును, రసధ్వనులయందును, చివర కౌచిత్యమునందు సైతము చమత్కార ముండవలెననియు, అప్పుడే కావ్యము సహృదయ హృదయాహ్లాదనీయ మగుననియు నీ మతము వా రుద్దేశించిరి.

ఈ యుద్దేశమును భరతముని మొదలుకొని క్షేమేంద్రుని వరకు వ్రాయబడిన యలంకారగ్రంథములలో నచ్చటచ్చట వెలిబరచబడినను, దీని నే ప్రధానాంశముగా గైకొని, దీనియందే దృష్టి నంతయు కేంద్రీకరించి, గ్రంథము నొక్కరయినను రచియించినవారులేరు. కాని క్రీ. శ. 14 వ శతాబ్దమునందు విశ్వేశ్వర కవిచంద్రు డను కవి మాత్రము, తన చమత్కార చంద్రికయం దీ సిద్ధాంతమును స్పష్టముగా ప్రకటించెను. ఈ గ్రంథ మింకను ముద్రితము గాలేదు.

"చమత్కారస్తు విదుషా
మానన్ద పరివాహకృత్,
గుణం రీతిం రసం వృత్తిం
పాకం శయ్యా మలంకృతిమ్.
సప్తైతాని చమత్కార
కారణం బ్రువతే బుధాః."

(చమత్కార చంద్రిక)

అని యిచట కావ్య చమత్కృతికి గుణాదిసప్తాంగము లున్నవని వ్రాసెను.

విశ్వేశ్వరునకు పూర్వపు ఆలంకారికు లీ చమత్కార ప్రాముఖ్యమును గమనింపలేక పోయిరని చెప్పుటకును సాహసింపను. అభినవగుప్తుడు ధ్వన్యాలోక లోచనమునందు "యచ్చోక్తమ్—'చారుత్వ ప్రతీతి స్తర్హి కావ్య స్యాత్మా స్యాత్' ఇతి తదంగీకుర్మ ఏవ" అని చర్చించెను. ఇందు పై యుద్దేశమే సూచింపబడినది. ఈ చారుత్వమునకే, చమత్కారమనియు, వైచిత్ర్యమనియు, విచ్ఛిత్తియనియు, రమణీయత యనియు, వక్రోక్తియనియు నాలంకారికు లుపయోగించి యున్నారు. కుంతకుడును వక్రోక్తి జీవితమునందు కావ్యామృతరసాస్వాదముచే చమత్కృతియే సిద్ధించునని వ్రాసెను.

"చతుర్వర్గఫలాస్వాద
మ ప్యతిక్రమ్య తద్విదామ్,
కావ్యామృతరసే నాన్త
శ్చమత్కారో వితన్యతే."

(వక్రోక్తి జీవితము. 1-5)

క్షేమేంద్రుడు గూడ తన కవికంఠాభరణమునందు (సంధి-3, చమత్కార కథనము) ఇట్లు వ్రాసెను.

"ఏకేన కేనచి దనర్ఘ మణిప్రభేణ
కావ్యం చమత్కృతిపదేన వినా సువర్ణమ్,
నిర్దోష లేశ మపి రోహతి కస్య చిత్తే
లావణ్యహీన మివ యౌవన మంగనానామ్."

అనర్ఘమయిన మణిని పొదగనిదే సువర్ణము సహితము రాణించదు. లావణ్యహీనయయిన యువతియు పరచిత్తము నాకర్షింపలేదు. అదే విధమున చమత్కారశూన్యమయిన కావ్య మానందదాయక మెన్నటికిని గానేరదు. కవికంఠాభరణమునందే మఱియొకశ్లోక మిట్లున్నది.

సుకవి రతిశయార్థీ వాక్చమత్కారలోభాత్
అభిసరతి మనోజ్ఞే వస్తుశబ్దార్థ శోభే,
భ్రమర ఇవ వసన్తే పుష్పకాన్తే వనాన్తే
నవకుసుమవిశేషామోద మాస్వాదలోలః.

ప్రతి పుష్పమునుండి భృంగములు మధుబిందువులను సేకరించి ఒకచోట గూర్చినట్లు, కవియు నన్ని కావ్యాంగములనుండి (అలంకార రసగుణాది) చమత్కారమునుగూర్చి, దాని నాస్వాదించి యానందింప బ్రయత్నించును.

డాక్టరు రాఘవన్ గారు వారి 'Some Concepts of Alamkara Sastra'లో నీ చమత్కారమును పదమును, రసపదమువలె పాకశాస్త్రమునుండి, యనుకరణ రీత్యా నేర్పడినదని వ్యక్తపరిచిరి. ఈ సందర్భమున చమత్కార పదమున కతి చమత్కృతిదాయకమగు వ్యుత్పత్తి నిచ్చియున్నారు. ఆ వాక్యము ననువదించి, యందున్న భావసౌందర్యమును జెరుప నిచ్చగింపక మూలమునే యీ క్రింద వ్రాయుచున్నాను.

"It appears to me that originally the word Camatkara was an onomato-poetic word referring to the clicking sound we make with our tongue when we taste some thing snappy, and in the course of semantic enlargements, Camatkara came to mean a sudden mental fillip to any feeling of pleasurable type."

మానవున కతిరుచికరమయిన పదార్థమును జ్ఞాపకమునకు దెచ్చినంత మాత్రముననే, తన ప్రీతిని దెలియపరుచు 'చమత్ చమత్' అని నోటితో శబ్దమును జేయు లౌకికభావమునే గ్రహించి చమత్కార శబ్దమున కిందు వ్యుత్పత్తి యివ్వబడినది.

ఇట్టి చమత్కార సంప్రదాయము సర్వమతములను సఖ్యపఱిచి సర్వోత్కృష్టతను సంపాదించ గలిగినది.

మన భారతదేశ మాధ్యాత్మిక విజ్ఞానమునందే గాక సాహిత్యశాస్త్ర సమీక్షయందును ముందడుగు వేయ గలిగిన దనవచ్చును. ఇంతస్పష్టముగా భావములను వ్యక్తపఱచి, వానిని సంప్రదాయములనుగా నేర్పరచి పాఠకలోకమున కలంకారశాస్త్రము నందించినట్లు పాశ్చాత్యవాఙ్మయములో నెచ్చటను గన్పింపదు. చివరకు, రసపదమునకు సరియైన పర్యాయముగూడ వారి వాఙ్మయములలో గాన్పించదు. Flavour, relish, gustation, taste యిత్యాదిగా కొన్ని పదములువాడినను, రసపదముయొక్క అర్థగాంభీర్యము నందుకొనలేకున్నారు. అందువలననే సంస్కృతసాహిత్యము సర్వసాహిత్యాతిశాయిత్వమును బొందగలిగినది.

కొమ్మ కొమ్మకో సన్నాయి!

శ్రీ కందుకూరి లింగరాజు

ఎర్రగా, పొడుగ్గా, నాజూకుతనం ఓడిపోతుంటే, ఎక్కువదూరం రైలు ప్రయాణంలో నలిగిపోయిన చిహ్నాలు పైకి కనబడుతూనే, వీధిలో టాంగా ఆపి, లోపలికివచ్చింది.

సావిట్లో కూర్చున్న యాజులు చదువుతున్న 'రేండమ్ హార్వెస్టు' పుస్తకం వంపి, కంగారుగా లేచేడు. ఈ జబరదస్తీగా వచ్చిన ఆవిడనిచూచి కళవళపడి, కళ్ళప్పగించేడు.

"ఇదేనా సోమయాజులుగారి ఇల్లు?" అంది.

తలూపేడు.

"ఏయ్. బండి అబ్బాయ్! సామాను లోపల పెట్టు" అని ఆదేశించి ఓసారి కిటికీవూచల్లోంచి సామాను దింపడం చూచి, లెఖ్ఖపెట్టుకుని సరిగ్గా వచ్చేయి, అని తలూపుతూనే, డబ్బులు ఇచ్చేసింది.

ఉస్సురంటూ మొఖం తుడుచుకుంది.

"కూర్చోండి" అన్నాడు యాజులు, ఇంత వరకూ పట్టాపుచ్చుకున్న మర్యాదలు మంటకలిసిపోతే, నాలిక కరచుకుంటూ తన తప్పిదం తెలుసుకుని.

"కాసిన్ని కాఫీనీళ్ళు దొరుకుతాయా ఈ యింట్లో? రాత్రల్లా కంటిమీద కునుకే లేదు. స్టేషన్లో వాకబుచేస్తే 'టీ' కాని కాఫీ దొరకదన్నారు ఈ దేశంలో."

నవ్వేడు. ఈవిడకి ఇదే ప్రథమప్రయాణం ఈ మహమ్మదీయ సామ్రాజ్యంలోకి అని. లోపల్కి వెళుతూ, ఫ్లాస్కూ, ఒకప్పు సాసరు తెచ్చి, పోసి చేతి కిచ్చాడు.

"థాంక్సు" అంది. అతి ఆప్యాయంగా తాగుతూ, అలవాటు అయిన ప్రాణంలా తేరుకుంది.

"చాలా బాగా వుంది. మీరే తయారుచేసేరా? ఏ హోటలుదైనానా?"

గతుక్కుమన్నాడు యాజులు. తను ఇంట్లో కుంపటి అంటించలేక, దాన్ని విసరి నీళ్ళు దింపినప్పుడు చేతులు కాల్చుకుంటూ తయారుచేసిందని ఈవిడకు ఎల్లా తెలిసిందని? వీధిగదిచూస్తే, ఆ సోఫాలు గోడకు తగిలించిన క్యాలెండర్లు, గుమ్మాలకు వేసిన పర్దాలు కూడా, ఓ ఆఫీసరు ఫాయిదాలో వుండివున్నాయి. అల్లాంటప్పుడు పైకి పటారం లోపల లొటారం అనుకో టానికి ఆస్కారం కూడా లేదు.

"మా కుర్రాడు తయారుచేసేడు." అనేసేడు, గొప్ప తరిగిపోతుందేమో, ఆవిడ కళ్ళల్లో చాలా చిన్న వాడిగా అపాదింపబడిపోతానేమో అనిన్నీ.

"వక్క పలుకు లేమైనా ఉన్నాయా?"

ఒళ్ళు మండింది ఈ జులుంకు. ఆవిడ యెవరో తనకి తెలియదు. పోనీ వచ్చినా, ఆవిడ తన ప్రవర; చుట్టమో, పక్కమో చెప్పాల్సింది. అది చెప్పలేదు. పైగా ఆవిడ ఏదో స్వంత ఇంటిలా తనమీద అధికారం చెలాయించడం అపసవ్యంగా కన్పించింది. చికాకు కలిగించింది. అయినా వచ్చిన అతిథి మహిళ కావడం వల్ల మర్యాదకు లోపం అనుకుంటూనే లేచి వక్కపొడి డబ్బా తెచ్చి, చేతికి ఇచ్చేడు.

నోట్లో వేసుకుని "అయితే మీకు ఇక్కడ అలవాట్లు కాలేదన్నమాట." అంటూనే పూర్ణంగా నవ్వింది.

ఆ నవ్వు చూస్తుంటే, బుగ్గలు సొట్టపడి కాటిక కళ్ళు చికిలించి ఉండడం, విచ్చిన కలవపువ్వుల్ని జ్ఞప్తికి తెస్తే, క్షణం మనస్సు 'ఎంత అందంగా నవ్వింది.' అన్న సౌందర్య ఉపాసనలో ములిగి, కితా కాలం అనుకుంటూ తేరుకుంది.

ఇంతకీ తనెవ్వరో చెప్పలేదు. ఏం పనిమీద వచ్చిందో కూడా తెలియపరచలేదు. ఈ సామాను వాటం చూస్తే, కనీసం పదిరోజులు ఇక్కడ మకాం వేసేట్టు తేటతెల్లంగానే వుంది. మూలమూలలనుండి, కోశకోశాలనుబడి తనవైపు బంధువుల్లో వెతుక్కున్నా; ఈ వ్యక్తి స్థలం కన్పించటంలేదు. ఆత్మీయులు మిత్రుల కోవల్లో అతకటంలేదు. 'మరెవ్వరూ?' ఇదే ప్రశ్న తలమానికం అయితే; సతమతమయ్యేడు యాజులు.

పైగా ఈ పూట భోజనానికి ఉండేట్టువుంది. ఇంట్లో వేసిన అర్థపావు బియ్యం అత్తెసరు, వేయించిన

అర అరటికాయ ముక్కలు, పచ్చిచారు తప్ప లేవు. ఇక్కడ భోజనం చేస్తానంటే తన పునాదులు లేచి పోతాయి. కొద్దికాలం క్రితం అన్న తన్రాడు మాట మిథ్యగా పరిణమించి, తలవొంపు కల్గచేస్తుందికూడాను.

"కాస్త స్నానం చేసి బట్టలు మార్చుకోవాలి" అంది యథాలాపంగా.

"దానికేం...రాండి..."అంటూనే లోపలికి దారితీసేడు. స్నానాలగది చూపిస్తూ, సబ్బుబిళ్ళ గూట్లో పెడుతూనే "నాకు వేడినీళ్ళ అలవాటులేదు" అనేసేడు.

"ఫర్వాలేదు. నాకూ మా ఇంటిదగ్గర ఎంత చలి కాలం అయినా చన్నీళ్లే అలవాటు" అంటూనే సమాధానం చెప్పింది. పెట్టి తీసినపుడు, పక్కబుట్టలోంచి చక్రకేళీ అరటిపళ్ళు, బత్తాయికాయలు, నారింజ కాయలు పైనపెట్టి, "లోపల పెట్టండి."అనీ అనేసింది.

ఐదువత్సరాలనుండి ఎండిపోయిన ఈ వుద్యోగ ఫాయిదాలో ఎవరూ, ఇంతటి ఆపేక్ష తనమీద చూపించలేదు. మడికట్టుకున్నానని ఎవరేనా ఏ పళ్ళో తీసుకువస్తే, దుయ్యపట్టేసేవాడు. ఇప్పుడు ఈ తెలియనివ్యక్తి, అవి తీసుకువస్తే తన నోరు పెగలలేదు. పైగా ఎన్నాళ్ళనుండో ఈ గొడ్డుదేశంలో దొరకని పళ్ళు, ఎదురుగా ఆవిడ తనకోసం అనడం, వాట్లకోసం తను కలవరించినరోజులు జ్ఞప్తికి రావడం, ఒవిసంగా తన్నే తాను సంబాళించుకోలేకపోయేడు.

"అదేమిటి! మీరు ఇంట్లో చెయ్యికాల్చుకుంటున్నారా? వారిని పుట్టింటికి పంపేరా? లేక ఏ మిఠాయి తినే సందర్భంకోసమో ఎదురుచూస్తున్నారా?" అంది వంటింట్లోంచి ఆవిడ పర్యవేక్షణ అంతంలో.

'చచ్చేంరా శివా!' అనుకున్నాడు. ప్రశ్నలు యథాలాపంగా వున్నా, ఎందుకో కడుపుదేవేసి నట్లయింది. ఇంతవరకూ తను సంసార సుఖం ఎరగనే ఎరగడు. హోటలుకూడు తినలేక తనగాత అనుక్షుంటూనే, చెయ్యికాల్చుకుంటుకు పరీక్షా రుసుం చెల్లించేడు. ఈ ఉప్పుకారాల తక్కువ ఎక్కువల్లో తన నలభీమపాకాన్ని ఆ హోటలు సాంబారుతో పోల్చుకుని, తృప్తిపడేవాడు. ఆ రహస్యం చిదంబర రహస్యం వలె ఇప్పుడు కావడం, అందులోనూ ఆయువతివల్ల అన్న విషయం తబ్బిబ్బు చేసింది. మనస్సు కించపడింది. ఆ వేసిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వనే లేదు.

"కుంపటీ అవి ఎక్కడున్నాయో చెప్పండి. రెండునిమిషాల్లో చేసేస్తాను." అని ఆదేశించింది; జడ అల్లుకుని, పౌడరు బులబులాగ్గా వేసుకుంటూ.

తెల్లబోయేడు. ఈవిడ ఎవరు? తన కులమేనా? ఏమిటీ చొరవ? అర్థం కాలేదు.

"ఎందుకూ శ్రమ. హోటలుకు వెళదాం."

"చంపేసేరు. గత మూడు సంవత్సరాలనుండి హోటలు మెతుకులు తిని నాలిక బెరడ కట్టుకుపోయిందండి. వంటచెయ్యడం వచ్చుగా. ఫర్వాలేదు." అంటూనే కుంపటి సవరించింది. తప్పదన్నట్టే లేచి, బియ్యం, మిగిలిన అర అరటికాయ ముందరపెట్టేడు యాజులు.

ఆవిడ అన్నముక్కల్లో ఒక్కటే భావం స్ఫురించింది. ఏ కాలేజీలోనో చదువుకుంటూ, ఏ తను మర్చిపోయిన స్నేహితుని దగ్గరనుండో తనకి ఉత్తరం తెచ్చి మార్కులవేటకు బయల్దేరిన విద్యార్థిని అన్నది నిరుకు చేసుకున్నాడు. ఒక్కసారి తనవిద్యార్థిదశ, అందులో సహపాఠీలుగా ముగ్గురు అమ్మాయిలు, ఇవన్నీ స్ఫురణకువచ్చేయి. వెనువెంటనే ఈ ఒంటరి జీవితంలో ఆ లిల్లీ పంతులమ్మతో గడుపుతున్న రోజులూ గుర్తుకు వచ్చేయి.

వ్యక్తావ్యక్తంలో లిల్లీ ఈ అమ్మాయికంటే నికృష్టురాలు అనే అనుకున్నాడు. ఈవిడ అందంలో, హొయల్లో, బింకంలో, మాటల్లో ఓవిధమైన ప్రత్యేకతవుందీ అని నిర్ణయం చేసుకున్నాడు. తీగలు సారించనూ సారించేడు మిథ్యలో.

టూకాయించినట్లుగా 'యాజులూ! నీ భావన గోడలు దాటుతున్నాయి. నువ్వూ రోడ్ సైడ్ రోమియోవి అవుతావా?' అని మనస్సు ఎత్తి వదేస్తే, కూర్చున్న కుర్చీలో ఇంకొక ఇద్దరు కూర్చోవచ్చు అన్నంతస్థలం వుందన్నట్లే ముడుచుకుపోయేడు. దాంతో యాజులు యాజులే అయ్యాడు.

అటు ఆఫీసుటైం అయి పోతోందన్న తొందర్లో, తను చేదోడుగా వుంటానని తయారైతే 'ససేమిరా' వద్దంటూనే ఆవిడ త్రోసివెయ్యడం జరిగింది. పదీ కొట్టకుండానే "రండి! భోజనం చేద్దాం" అన్న పిలుపూ వచ్చింది. తను అనుకున్న వ్యంజనాల కన్న అదనంగా కంచం చుట్టురా వుండడం చూచి నోరు తెరచేడు యాజులు.

"మీరు కూర్చోండి."

"పర్వాలేదు. ముందు మీరు."

కొమ్మ కొమ్మకో సన్నాయి!

"అల్లా పనికిరాదు." అంటూనే పెట్లోంచి కంచం తీసి, పెట్టుకునే వరకూ వదిలేదు కాదు. పరసనే ఆవిడ భోజనం చేస్తూవుండడం, ఈ యౌవ్వనంచేతి మారులతో, అంతా విచిత్రంగా తట్టింది. వద్దువద్దు అనుకుంటూనే రెండుముద్దలు ఎక్కువగానే తిన్నాడు యాజులు.

ఉండుండి "ఇంతకీ మీ రెవరో చెప్పేరు కాదు. ఇల్లా అతిథిగా వచ్చిన మీ చేతనే ఇంటిల్ల చాకిరీ చేయించుకోవడం నాకు..." ఆగేడు.

"ఏమిటి?"

"చచ్చినంత చావుగా వుంది."

గట్టిగా నవ్వేసింది. తను ఉదయం నృసింహస్వామికి పెట్టిన మందారపు పువ్వు శివలింగం మీద పడింది గాలికి.

"నేను నేనే" అంది నవ్వుతూ.

"అది కాదనటం లేదు. కాని నాకు గుర్తుకు రావటం లేదు."

"అల్లాగే వుండండి. ఇప్పుడు పోయిం దేముంది? నే నెవరో, ఎందుకు వచ్చేనో, ఎవరి అమ్మాయినో, ఏం చదివేనో ఒక్కసారి చెప్పేస్తే రేపు మాట్లాడు కుందుకు ఏమీ వుండవు. అందుకే తెలిసిన తెలియని దాన్ని అనుకోండి."

వెలక్కాయ పడింది గొంతులో యాజుల్కి. రేపు ఉండడం నిరుకన్న మాట. అయితే ఇంత ఇల్లూ ఈవిడ చేతుల్లో పెట్టి వెళ్ళడం ఎల్లా? ఇల్లాగే వంక పెట్టి ఉన్నవన్నీ దోచుకుపోతె! ఆలోచనల్లో భృకుటీకృతం అయింది ముఖం.

"మీరు బట్టలు వేసుకొనేసరికి నేను ఇల్లు సర్దేస్తా. ఒక్క సావిడిగది నాకు చాలు. తక్కిన ఇంటికి తాళం వేసుకోండి" పసికట్టినట్టే అంది.

త్రుళ్ళిపడ్డాడు యాజులు.

తాళం వెయ్యకుండానే "ఏడుకొండల వెంకట రమణా నీదే భారం" అంటూనె గుమ్మం దాటేడు. బస్సులోంచి చెయ్యి వూపిన లిల్లీని చూడకుండానే రోడ్డుమీద నడిచేడు.

*   *   *   *

పంఖాక్రింద కూర్చుని తనపని తను చేసేసుకునే బయటపడుదా మనుకున్న యాజులుకు, అవాళ పని తెమలనే లేదు. మనస్సు అన్యథా ఆలోచనలను ముందు ముందుకు త్రోయ్యడంతో, అసలుపని చెయ్యబుద్ధి వెయ్యలేదు. ఇంటిదగ్గర ఏమైపోతోందో అన్నదృష్టే.

'అక్కడ ఉన్నవన్నీ సవరించి, మూటకట్టుకుని ఆవిడ మధ్యాహ్నం రైలు ఎక్కేసిందేమో! తను పత్తివాజమ్మ కాకపోతే నిలబెట్టి 'ఎందుకు వచ్చేవు? ఏంపని?' అని అడగవద్దూ? ఎంత ఆడదైతే మాత్రం అల్లా, క్షణం పూర్వం చూచిన క్రొత్తమొఖానికి ఇల్లు వదిలెయ్యడమా? పోనీ పోతే పోయేయి, తను దాచుకున్న ఆమూడువందలైనా దగ్గర వుంచుకుంటే బుద్ధిలో మెల్ల కాదూ? ఈ విధంగా ఒకటి తర్వాత ఒకటి సవాళ్ళు ఎదురీదేయి.

ఇక వుండలేక నే, ఓగంట ముందుగానే బయులు దేరేడు. వేసుకున్న ప్రోగ్రాం ప్రకారం లిల్లీ తనూ సినీమాకి వెళదాం అనుకోవడం, ఇప్పుడు ఈ మారిన వాతావరణంలో, ఆ లిల్లీ తన ఇంటికి తనకంటె ముందుగానే వెళ్ళితే, తను ఎంతపతనమై పోయిన వాడులా ఆవిడకళ్ళల్లో తడతాడో అని భయపడ్డాడు. త్వరగానే అడుగులు వేసుకుంటూ లిల్లీ ఇంటికి చేరి, లేకపోవడంతో 'చుట్టాలు వచ్చేరు' అని ఉత్తరం వ్రాసి పెట్టి, ఊపిరి విడిచేడు.

గుమ్మంమెట్లు ఎక్కుతుంటేనే ఎదురుగావచ్చి "రండి! రండి! మీ కోసం ఎదురు చూస్తూ వున్నా" అంది నవ్వుతూను.

మనస్సు కుదుటపడింది, నిలువుదోపిడీ అవనందుకు.

ఓప్లేటులోనే ఓకారం, రెండుతీపి, కాఫీ కప్పు తోటి ఎదుటపడింది. ఇవన్నీ ఎక్కడనుండి వచ్చేయి అన్న ఆశ్చర్యం కనపరిస్తే "బజారుకు వెళ్ళేను" అంది. యథాలోకపు కబుర్లు చెపుతూనే "నేను వచ్చిన పనేమిటో చెప్పమన్నావా?" అంది చిలిపిగా.

"మీ ఇష్టం" అనేసేడు, తీరా అపనే ఘంటల్లో అయిపోతే వెళ్ళిపోతుందేమో అన్న ఆరాటంతో.

"మొన్న మార్చి పరీక్షకు కూర్చొన్నాను. ఇంగ్లీషులో లొంగసానుగా వుంది. వెంకట్రామయ్యగారు మీ దగ్గరకి వెళ్ళమన్నారు."

ఒకందుకు తన భావన అబద్ధం కాలేదన్న సంతోషం కల్గినా, ఆ వెంకట్రామయ్యగా రెవరో అర్థం కాలేదు. ఏకోశాన్నీ అందకపోతే అడుగుదా మనుకున్నా, తీరా అడిగేస్తే బాపోదని వూరుకున్నాడు.

"ఫస్టు, సెకెండు పేపర్లు బాగానే వ్రాసేను. మూడోది అనుకోనివన్నీ వచ్చెయ్యడం మూలాన్ని లాటరీ తప్పిపోయింది."

"ఈ కాలేజీ ఇంగ్లీషు లెక్చరర్ దగ్గరకు వచ్చేయా?"

తలూపింది, కొంత ప్రాధేయంగానే. "మీరు కూడా సహాయం చెయ్యాలి. వచ్చేసంవత్సరం యం. బి. కి వెళ్ళాలనుకుంటున్నా. ఈ ఏడాదిపోతే.." దిగులు, నిరుత్సాహం బాగా ప్రసరించింది.

"నా చెయ్యతగ్గ సహాయం చేస్తాను," అనేసేడు ఓవిధంగా అందలం ఎక్కేస్తూ.

ఎంతో సంబరపడిపోయింది. "వెంకట్రామయ్యగారు ఎంతో ఎక్కువగా చెప్పేరు మిమ్మల్ని గురించి. తప్పకుండా సహాయం చేస్తారు. వెళ్ళు అని ముందరికి తోస్తేనే వచ్చేసేను. మీలాంటివాళ్ళు..."ఆగి చిలిపిగా కళ్ళంలోంచి చూచింది.

మైసూరు గంధపుపొడి పొగ వేసినట్లే అయింది యాజులుకు.

"అ! మర్చిపోయే!మధ్యాహ్నం ఉసుపోక ఇంట్లో ఏమేమి సరుకులున్నాయో చూచేను. ఎందుకైనా మంచిదని, తగుమాత్రంగా కొని తెచ్చేను. బిల్లు అట్టే అవలేదు. పదిహేను రూపాయిలు.అందులో సగం నాది. సగం మీది" అంటూనే పుల్లారి సర్వస్య బిల్లు చేతిలో పెట్టింది. ఓసారి క్రిందా పైనా చదివేడు. ఆవాలు, మెంతులు, మిరపకాయలు వగైరా వంటింటి మహారాజులు ప్రవరఅంతా వుంది; వార్షికంగా ఇచ్చే బిరుదాలు అంతస్థుల్లా తూకాలు ప్రక్కగా వుంటే.

కోపం వచ్చింది. చుట్టమైవచ్చి దెయ్యమై పట్టుకున్నట్లుగా వుందే ఈ అనవసరహాయాం. తన్ని ఏదో రొంపిలోకి దింపుతున్నట్లూ అనిపించింది. పైకి క్రక్కలేక, ఎంత త్వరగా ఆ మాగ్కాలు పరిహారంచేస్తే అంత మంచిది అని అనుకునే "అయితే అల్లా వెళ్ళవస్తా కాలేజీ వేంపు" అన్నాడు లేస్తూ.

"ఇప్పుడే!"

తలూపేడు.

"పోనీ రేపు వెళ్ళుదురుగాని" అంటూ గారాబం కుడిచినట్లు వళ్ళు త్రిప్పింది. "ఇవ్వాళ ఎంచక్కా సినీమాకి వెళదామనుకున్నాను.వంట అప్పుడే చేసేసేను కూడాను" అనీ ఆఖరు చేసింది.

గుండెలు గొలపెట్టేసేయి. అటు లిల్లీతో రానని, ఈవిడతో సినీమాకి వెళితే, తప్పి దారి అదిచూస్తే, అంతా బెంకాయి పిచ్చికొండలా వుంది. ఏదో రెండు పూటలు నోటిరుచి విజృంభిస్తోంది అన్న సంతోషం ఓప్రక్కగా వున్నా, ఇల్లా ఒంటిరిగావున్న జీవితంలో, ఈవిడతో వుండడం, సినీమాలకు షికార్లకు వెళ్ళడంవల్ల, తనస్థితి ఎంతవరకు పతనం చెందుతుందో అన్న బెంగా కల్గింది. లిల్లీతో సహవాసం ఎంతో గోప్యంగా వుంచే రెండు సంవత్సరాలనుండి గడుపుకు వచ్చేడు. ఈ ప్రస్తుతానికి ముసుగువెయ్యడం అసాధ్యం కూడాను.

దొడ్లోకి వెళ్ళి ముఖ ప్రక్షాళనం చేసేడు. పెట్టె తీసినప్పుడు, ఏదో మామూలు బట్టలుకాక శిల్కు చొక్కా, లినెన్ ప్యాంటుమీదికే వెళ్ళేయి చేతులు. ఆవిడా సన్నటి ఔరంగాబాదు ఆరుద్ర పురుగురంగు చీర, నేవీబ్లూ చోళీ, ఆకుపచ్చటి జోళ్ళు వేసుకుంది. వేనిటీ బ్యాగ్‌లోంచి అత్తరువు పూసుకుంది.

"ఏం! అల్లా చూస్తున్నారు?" అంది చిలిపిగా.

తల గోక్కున్నాడు. ఓసారి ఎగాదిగా చూస్తే సిగ్గున్నూ పడ్డాడు. అందులోంచి తేరుకోలేక, ఆదరాబాదరాగానే బయటపడ్డారు.

ఒకరిప్రక్కగా ఒకరు కూర్చుని సినీమా చూస్తుంటే, యాజులుకు ఏదో క్రొత్త అనురాగం అనుభూతి కలిగాయి. లిల్లీతో రహస్యంగా బాల్కనీలో కూర్చున్నవతుకంటే, ఇప్పుడు ఈ మొరాయించి అందరిలోనూ కూర్చోపెటిన ఆవిడ పట్టుదల దానికి వన్నెలు పెట్టింది. మొదలు పెట్టేసరకూ అటూ ఇటూ చూచేడు ఎవరైనా పసికట్టేరా అని. ఆ దంపతులు వాళ్ళవాళ్ళ గొడవల్లో వుండిపోవడంతో తృప్తి పొందేడు; ధైర్యం తెచ్చుకొన్నాడు.

అచేతనంగా తగిలినట్లుగా, అప్పుడప్పుడు, ఆ భుజాలు తనకి తగలడం జరుగుతూనే వుంది. మధుర ప్రశాంత యామినిలో మత్తు కల్గచేసినట్లువున్నా, సిగ్గుపడిపోయి కుంచుకుని పోయేడు. చెవుల చివుళ్ళ మీదుగా వచ్చిన అత్తరు వాసనలు మత్తు కల్గించేయి.

ఇంటర్వెల్ అయేసరికి- చీరకుచ్చెళ్ళు సర్దుకుంటూనే మూర్తీభవించిన మర్యాదా చూపించింది. చీకట్లోంచి వెల్తురన్నట్లుగా కళ్ళు సరిచేసుకునేటప్పటికి, ముంగువరుసలో చివరగా లిల్లీ, తల్లి కన్పించేసరికి, యాజులుకు పుశ్శాగులు లేచిపోయాయి. కంగారుపడ్డాడు. ఏది అవకూడదో అదే రూపొందింది.

కళ్ళమ్మట నిప్పులు రాలుతుంటే, దిగమ్రింగుకుంటూనే "హల్లో మిస్టర్ యాజులూ"అంటూ లిల్లీ వచ్చింది.

"హల్లో మిస్ లిల్లీ! మాకు దగ్గర బంధువులు ఇవ్వాళ ఉదయం వచ్చేరు. ఇంటర్మీడియట్ పరీక్షకు వెళ్లేరు." పరిచయంలో తలదాచుకున్నాడు. అందులో కంగారు తడబాటూ బాగా వుండిపోయాయి.

కరచాలనం అయ్యింతర్వాతనే "కూర్చోండి" అంది ఆవిడ సరసనేవున్న కుర్చీ చూపిస్తూ.

ఏవో ఏవో మాట్లాడుకున్నారు. ఆ కాలేజీలోనే లిల్లీ చదివిందన్న ప్రాతవిద్యార్థినీదశలోనే మునిగి పోయేరు. ఇది ఓవిధంగా యాజులుకి తెరిపి నిచ్చింది కొరుమొయిలు విచ్చినట్లుగా.

"నన్నా పిలిస్తే నేను రానన్నానా?" అంది లిల్లీ.

"మేం అనుకోలేదు. ఇవ్వాళ ఇల్లా ప్రోగ్రాం పడుతుందని."

"ఒట్టి అబద్ధం" అంది ప్రణయకోపంతో.

"నిజంగా నా మీద ఒట్టు" చిన్నపిల్లాడిలా యాజులు తడబడ్డాడు. అచేతనంగా చెయ్యి చాచేడు.

ఫక్కున నవ్వేసింది ఆవిడ. ఇద్దరు తెల్ల బోయేరు. మళ్ళీ పేచీలు పడనేలేదు సినీమా అయ్యే వరకూ. వంచినతల ఎత్తుకోలేకపోయేడు యాజులు.

"ఓసారి మా ఇంటికి రండి" అంది లిల్లీతో శెలవు తీసుకుంటూనే. యాజులు గుండె దడ ఎక్కువే అయ్యింది. ఏమేమి ప్రశ్నలు వస్తాయో అని.

ఆ భోజనాలదగ్గర కూర్చునేవరకూ ఆమె మాట్లా డనే లేదు. ఇది మరింతగా క్రుంగతీసింది యాజుల్ని.

"మీకు పెళ్ళయ్యిందా?"

తెల్లబోతూనే తలూపేడు.

"పొద్దుట అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పేరే కాదు. ఆవిడ ఎక్కడవుంది? పిల్లలా? ఎంతమంది? అత్తారి వూరు?"

తెప్పరిల్లడానికి అవకాశంలేదు. దొడ్లోవున్న సన్నజాజుల పందిరి జీమూతంగా కన్పిస్తే, దాన్ని చూస్తూనే, ఏవో ఆలోకాల్లోని బాధ అనుభవిస్తున్న కంఠంతో "అప్పుడు, బొడ్డూడని రోజుల్లోనే, శారదా బిల్లు అంటూ పెళ్ళిచేసేడు మా నాన్న. తర్వాత తర్వాత మాట పట్టింపులు పెరిగేయి. అవి బద్ధవైరంలోకివచ్చి, గుమ్మాలు త్రొక్కకుండా వుండిపోయేయి. ఆ మను గుడుపుల్లో చూచిన లేతమొఖం తప్ప మళ్ళీ చూడనే లేదు. ఇప్పటికి మా నాన్న నాకు పెళ్ళి అవలేదని, సంబంధాలు వెతుకుతూవున్నాడు. ఇదంతా తలచు కోవడం నాకు..."

"వ్యక్తిత్వం వచ్చింతర్వాత మీరు ఏం చేసేరు?" అతని మౌనం అర్థం చెప్పినట్లయితే "లిల్లీని పెళ్ళిచేసు కుందా మనుకుంటున్నారా?" అంది.

కుంపటిమీద సత్తుగిన్నె కరగిపోయినట్లయ్యింది.

"నేను ఉండటం ఈ పరిస్థితిలో మంచిది కాదేమో! ఏదైనా హోటలు మంచిది వుంటే చెప్పండి. రేపువెళ్ళి అందులో వుంటాను" అని అనేసింది.

ఎక్కడ తగలాలో అక్కడే చురక తగిలింది.

"అంత పశువుని కానేమో! మీరు ఆ భావం పెటుకోవద్దు. ఉన్న రెండు రోజులూ వుండండి ఇక్కడే. కావలిస్తే నేనే ఏ స్నేహితుడింట్లో అయినా పడుకుంటా, అంతనమ్మకం లేకపోతే" అని తడబడి పోతూ చెప్పేడు.

"చూచేరా! వివాహసంస్థ అన్నదే మానసికమైన కట్టుబడులు, నిజాయితీ మీద ఆధారపడింది. ఇప్పుడు మీరు గుండెలమీద చేతులు వేసుకుని చెప్పండి. ఆవిడ మీకు ఏం అన్యాయం చేసింది? ఏ ద్రోహం తలపెట్టింది! మీమీ మూర్ఖపు పట్టుదలల్లోకి వెళ్ళి ఆవిడను బలిపెట్టే సేరు! ఉరి బిగించి ఆజన్మాంతం ఏడవమన్నారే.

"విజ్ఞానం, చదువు పట్టాలతో పుచ్చుకున్న మానసిక సహృదయత్వం పెంపొందందే కానీ ఏమనిషీ మనిషి అనిపించుకోడు. మీరూ విశ్వవిద్యాలయంనుండి పట్టాలు పుచ్చుకున్నారు. అయినా మీరు ఇల్లా చేసే రంటే ఎంతో ఇదిగా వుంది.

"ఔను. స్త్రీ అంటే మగాళ్ళదృష్టిలో అంత చులకన. అక్కడ ఆవిడ ఈదురోగోడ్లో అంటూ ఏడు స్తుంటే, ఇక్కడ మీరు మీ మమకారం, అభిమానం, కోర్కెలు లిల్లీతో తీర్చుకుని పెద్దమనుష్యులైపో యేరు. ఇది న్యాయమేనా అని ఆలోచించే విచక్షణ కూడా పోగొట్టుకున్నారు!

"కాదంటారా?"

కాలేజీ వక్తృత్వపు పోటీల్లో నిలబడి, బల్లగుద్ది నట్లే మాట్లాడింది.

"మీకు సంగతి సందర్భాలు తెలియవు, కనుక అల్లా నమ్మ దుయ్యపట్టుతున్నారు."

ఏవూరు, మామగారి పేరు, ఎడ్రస్ మాటల్లో లాగేసింది. పడుకోబోయేటప్పుడే పీఠగదితలుపు వేస్తుంటే "అక్కర్లేదు. ఆ నమ్మకం నాకు వుంది." అనీ అనేస్తే ఈ వ్యక్తిలో ఇంకా ఇంద్రధనుస్సులు ఎన్నివున్నాయో అన్న ఆలోచన కలిగింది.

ఆ రాత్రి మసక పాడికళ్ళల్లో, ఎంత గుర్తుకు తెచ్చుకుందామనుకున్నా, భార్య కస్తూరిరూపం కట్టనే లేదు యాజుల్కి.

*　　*　　*　　*

ఆఫీసుకు వెళ్ళదామని మెట్లు దిగుతుంటూనే యాజులు చేతుల్లో మూడు కవర్లు పెట్టి "కాస్త దయయుంచి పోస్టాఫీసులో పడేయించండి" అని ప్రాధేయపడింది. ఆ సుతారంగా అడుగులకు మడుగులొత్తినట్లు అనడంకు ముగ్ధుడే అయిపోయేడు.

"మర్చిపోయే. ఇవ్వాళ కాస్త ఆ లెక్చరరుగార్ని కలుసుకుని అమీ తూమీ తేల్చెయ్యండి" అని సాగనంపింది.

వీధిమొగ తిరుగుతుండేవరకూ నిలబడి, తనవైపు చిరునవ్వు నవ్వి, లోపల్కి వెళ్ళింది. పొంగిపోయాడు యాజులు.

మూడుకవర్లూ ఓసారితీసి, ఎడ్రస్‌లు చదివేడు. ఒకటి వెంకట్రామయ్యగార్కి, రెండోది ఎవరో స్నేహితురాలు, మూడవది తన మామగారికి. మొదటి రెండూ ఎల్లావున్నా, మూడవ వుత్తరం, ఈ అపరిచిత వ్యక్తికి తన్ని గురించి, తన లీలల్ని గురించి వ్రాయడం కోపం తెప్పించింది. తగుదునమ్మా అంటూ, ఈవిడకు ఎవరు పసుపూ కుంకుమా పెట్టి అధ్యక్షపీఠం అందించేరు ఈ వ్రాయడానికి? అన్న వెర్రికోపం వళ్ళంతా క్రమ్మితే, కవరు చింపేసేడు; ఏం వ్రాసిందో తెలుసుకోవాలన్న కుతూహలంలో.

చక్కటి బ్యాంకుపేపరు. పైన రోజాపువ్వు. కాస్త వాసనవేస్తున్న సెంటు. ఒక్తి కాగితం వుంది; కనీసం చెవ్రాలేనా లేకుండా. తెల్లబోయాడు. వెనువెంటనే 'ఈ కాలపు ఆడపిల్లలు ఎంతకేనా తగుదురు. ఏ రహస్యపు సిరాతోనో వ్రాసివుంటుంది' అన్న తలంపుతో దారిలోవున్న రామారావు ఇంటికి వెళ్ళేడు.

"ఒరే! రామం. కొన్ని నిప్పులు గరిట్లో పట్టుకురారా!" అని ఆదేశించేడు. ఏ చెయ్యనెప్పినా పట్టిందేమో అనుకుని రామారావు కంగారుపడ్డాడు.

కాగితం మడతలిప్పడం విప్పడం, నిప్పుల సెగని వేడిచెయ్యడం చూస్తే రామారావుకి అర్థం అయ్యింది. ఒక్కమారుగా నవ్వేస్తూనే "ఇదా సంగతి. ఈ ప్రణయకలాపం ఎప్పటినుండిరా! నాన్నా?" అన్నాడు.

ఎంత వేడిచేసినా ఏమీ కన్పడనేలేదు. విసిగిపోయి పళ్లెంలో నీళ్ళుపట్టుకురా అనడం, ఆ కాగితం నానడంవరకే జీవితసమాప్తి చేసుకోవడంతో, మొఖం తెల్ల వేసేడు యాజులు.

"ఎవర్రా ఆ పిండం! మా గడుగ్గాయిలా వుందే."

"చచ్చింది గొడ్డు!" అని "ఒరే రామం! నీకు బెజవాడ, నరసారావుపేటల్లో ఎవరేనా తెలిసినవారున్నారు రా?" అని అడిగేడు, మిగిలిన రెండుకవర్ల ఎడ్రస్‌లూ జ్ఞాపకం తెచ్చుకుంటూ.

యాజులువరస అర్థంకాలేదు రామారావుకు. బెజవాడలో ఇద్దరు ముగ్గురు పేర్లు చెప్పేడు. నరసారావుపేట విషయంలో, ఆఫీసులోవున్న చింతామణి మామగారివూరు అనీ అన్నాడు.

వాళ్ళిద్దరికి ఉత్తరాలు, అందులో పుట్టుపూర్వోత్తరాలు కావాలని నిర్ణీతాల్లో రామారావుతో వ్రాయించి, పోస్టాఫీసులో పడేసే ఆఫీసుకువెళ్ళేడు. చింతామణిగార్ని రప్పించి, ప్రాధేయంలేని ఆదేశాలతో ఉత్తరం పోస్టుచేయించేడు.

ఆసాయంత్రం అయ్యేసరికి ఆఫీసంతా గుప్పుమనిపోయింది. 'యాజులుగారు మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నారు. బెజవాడ వెంకట్రామయ్య వకీలుగారి పిల్ల' అని. దాంతో మూడురూపాయలు చెల్లించి 'టీ' ఇచ్చేవరకూ వాళ్లు వదల్లేదు యాజుల్ని.

ఇంటిమలుపు తిరిగేసరికి, ఇంటి ముసలావిడ ఎదురుపడుతూనే "అమ్మగార్ని తీసుకువచ్చినట్లున్నారు?" అంది నిలబెడుతూ. ఆశలుపెట్టుకున్న కళ్ళ కిరాణందుకాణం ఆవిడ, కట్టెలమ్ముకునేది, శరీరాన్ని పట్టపు ఏనుగులా పెంచిన గుమాస్తాపెళ్లామున్నూ పొంచి పొంచి, పొడిచినట్లే చూచేరు.

అమ్మగారు కాదు. స్నేహితులన్నా, చుట్టాలన్నా రేపటినుండి ఆవీధిని నడవడానికి హక్కుపోతుంది నీలివార్తల్లో. అదే భయపెడితే, మాట్లాడకుండానే ఓ చిరునవ్వు నవ్వి ముందడుగు వేసేడు.

వెనకనుండి నిట్టూర్పులు విన్నానా, లేదా అన్న సంశయంతో గుమ్మంలోకి రానేవచ్చేడు. లోపల ఏదో రాద్ధాంతం అయిపోతోంది అన్నవార్త చెవులకు అందితే కట్రాటే అయ్యేడు.

"పెళ్ళిచేసుకుందామనుకుంటున్నావా?"

"అవును."

"ఎన్నాళ్ళనుండి ఎరుగుదువు ఆయన్ని?"

"గడచిన ఎలక్షన్‌లో ఒకే పోలింగుస్టేషన్లో పని చేసేం. అప్పటినుండి."

కొమ్మ కొమ్మకో సన్నాయి!

"ఆయనకు పెళ్ళి అయింది తెలుసా?"

"పెళ్లా!"

"చిన్నప్పుడే!"

"మరి కాలేదన్నారే!"

"అంతకంటె అవసరానికి మరేం చెపుతారు మగాళ్ళు. నీవనుకుంటా ఏ బుట్టలో పడింది ఆమాత్రం తెలుసుకోలేనందుకు?"

"రానివ్వండి. నిలబెట్టి కడిగేస్తాను."

"ఏమని?"

"చేసిన పనే."

"నువ్వూ చెయ్యలేదు తప్పు? ఆయన్ని ఏమని నిలబెట్టి అడుగుదామనుకుంటున్నావ్?"

శ్రుతిమించి రాగాన్నిపడి, ఏ శిగపట్లగోత్రం వరకూ వెళ్ళుతుందేమో అని భయపడ్డాడు యాజులు. ఏదో జరుగుతున్నది జరగనివ్వకుండా లిల్లీ ఇక్కడకు వచ్చి, ఈ రాద్ధాంతా లేమిటి? ఆవిడమాత్రం ఇవన్నీ కూడా కెలికి బట్టబయలు చెయ్యడంలో అర్థం? పాలు పోలేదు. ఇంట్లోకి వెళ్ళితే ఇద్దరూ చెరో పెడా రెక్కలూళ్ళు విరిచేస్తారేమో అన్నభయం, చెప్పుల్లో కాళ్ళెట్టుకుని తనుమాత్రం ఎంతసేపు నుంచోగలను అన్న అభిజాత్యం పీకేయి.

"ఇంతకీ మీ రెవరు?" అంది లిల్లీ తాపీగా.

"నేనా?" అంటూ ఆవిడ ఆగిపోయింది.

"చెప్పరేం? నన్ను తూట్లుపొడుస్తూ మాట్లాడుతున్నారు. ఈ ఇంట్లో మీ హక్కేమిటి?"

గుండెలు దడదడలాడేయి యాజుల్కి. చెవులోర బెట్టే విన్నాడు.

"ఆగాన మా బావ! తెలిసిందా?"

'ఆ' బహుళః నో రెంటేపోయి ఉంటుందనుకున్నాడు లిల్లీకి. ఒక్కటి ఆవిడ తన్ని 'బావ' అని అనడం మధురత కల్గించింది. వళ్ళంతా కితకితలు పెట్టినట్లయ్యింది. వెనువెంటనే ఆవిడలో పూసుకున్న మలుపులు, బిగువులు, కళ్ళల్లో కురిసే హొయలు, ఒకొక్కటే ఎదుట తిరిగేయి. లిల్లీకన్న వెయ్యిరెట్లు అందమైంది అన్నే నిర్ణయంతో బాటు, తన్ని బావ అని పిల్చినశబ్దాన్ని రామనామస్మరణలా తలచుకుంటూనే బజారునపడ్డాడు; ఈసమయంలో లోపలికి వెళ్ళడం మంచిదికాదనుకుంటూ.

కాఫీ త్రాగేడు హోటల్లో. ప్రొద్దువతాగినట్లుగా లేకపోతే సగం వదిలేసేడు. ఆవిడజ్ఞాపకం ఎక్కువై పోవడంతో, ఆ మార్కుల వేట ఇప్పుడప్పుడే చెయ్యకుండా 'వాళ్ళోళ్ళేడు లెక్చరరు' అని వంక చెబితేనో; ఈవూరికి దగ్గరగా రామప్పదేవాలయం, పాకాల చెరువు వరంగల్ కోట చూడవలసినవంటేనో; రాజధాని ముఖ్యపట్టణం హైదరాబాదు చూడవలసింది వెళ్దామూఅని ప్రోత్సహిస్తేనో; ఎన్నో ఒకటితర్వాత ఒకటి మార్గదర్శికలు అయ్యేయి. దాంతో ఉత్సాహం పొంగింది; హుషారు వచ్చింది. ఎప్పుడు కాల్చనివాడు సిగరెట్టుకొని వెలిగించేడు.

మొదటిపేల్పు సరిగ్గానే పైకి వచ్చింది. ఉత్తేజం కల్గింది. వెనువెంటనే రెండోదమ్ము పీల్చేసరికి ఉక్కిరిబిక్కిరి అయి కళ్ళమ్మట నీళ్ళు, దగ్గు వచ్చేయి. దాంతోటే లిల్లీకూడా తలంపుల్లోకి వచ్చేసింది.

ఈముందే నాకు యాభైరూపాయలు పుచ్చుకుంటున్నా, ఇవ్వాళజరిగిన విశేషంతో తన్నిగుమ్మెత్తిపోసి, సాయంకాలం ససైన్యంగా తల్లిని, తమ్ముడిని ఇటూఅటూవాళ్ళని తీసుకుని దండయాత్ర చెయ్యకుండా వుంటుందా? అన్నభయం చెమటలు పోయించింది. వణికిన్నిపోయేడు. భగవంతుడే జ్ఞాపకం వచ్చేడు.

దాంతో ఉడుతూ మడుతూనే లిల్లీ ఇంటికి వెళ్ళేడు. మంచంమీద పడుకుని ఏడుస్తున్నదాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఒక్కసారి గాలివాన విసరేసింది. నెమ్మదిగా అన్నీ చెప్పేడు. ఆవిడ ఎవరో తెలియదు అన్నాడు. తనకి పెళ్ళికాలేదని వాగ్దానమూ చేసేడు. ఏమడిగితే అన్నీ చేప్పలుడిగిన బొమ్మలా విని, 'ఊ' కొట్టేడు.

"అయితే అది ఏదో బాగా చేతులుతిరిగినదానిలాగే కన్పిస్తోంది. నిన్ను తిరుపతి పంపిస్తుంది" అంది లిల్లీ.

"అల్లా ఊరుకుంటే ఎల్లాగా? పోలీసులకు రిపోర్టు ఇయ్యవద్దూ" అంది లిల్లీతల్లి.

"అవును. ఆపని చేస్తే సరి" అంటూనే కాగితం, కలం తెచ్చి వ్రాయించి మావాడిచేత పంపిస్తా" అని పుచ్చుకుంది లిల్లీ.

వెళ్ళేటప్పుడే "ఎంత మంచివారు" అంటూ పక్కనలో పదిరూపాయలు ఆ పోలీసులకు మామూళ్ళ క్రింద తీసుకుని, ఒక్కసారి గట్టిగా ఒత్తుకుని, ముద్దుకున్న పెదిములు కాచింది.

కొష్ఠంమీద పెట్టినట్లయ్యింది యాజుల్కి. గబ గబా అడుగులు వేసుకుంటూనే ఇంటికి వచ్చేడు.

విడిగి, విరజిమ్మే వాసనల్తో మల్లెపూలు గాలికి ఇటూ అటూ సిగలోంచి ఆడుతుంటే, కథలపుస్తకంలో మర్చిపోయివుంది ఆవిడ.

"మీకోసం నిన్న సినీమాలో కలుసుకున్నావిడ వచ్చి, చాలాసేపు కూర్చుని వెళ్ళింది" అంది తల ఎత్తుతునూ, అతి అమాయికంగానూ.

"అల్లాగా!" అన్నాడు కొంచెందీర్ఘంతో. పనికట్టినట్టే "మీరు మళ్ళావెళ్లాలేమో! అన్నం వడ్డించనా?" అనేసింది.

టోపీరం ఎగిరిపోయింది యాజులుకి.

"శివరాత్రి పూజారాలో నా స్నేహితురాలు వస్తోంది. ఆవిడని రిసీవ్ చేసుకోవాలి మనం" అంది మళ్ళీ కంఠం మారుస్తూనూ.

ఒక్క ఈవిడే చాలు ఈ ఖాందవదహనానికి. ఇంకొకత్తి వస్తే పూర్తి లంకాదహనమే అనుకుని జెపరి పోయేడు. జరిగింది చెప్పకుండా, వెర్రిగా మనసులో నీ భరతంపట్టడం అట్టేకాలం లేదు అనీ అనుకున్నాడు.

*   *   *

అటు ఇంట్లోకి ఈవిడంత ఎత్తు, పొడుగు, రంగు మొఖం, కవల్లావున్న శ్యామల రావటం. ఇటు మర్నాడు బెజవాడ, నర్సారావుపేటలనుండి ఉత్తరాలు రావటం జరిగేయి.

ఎంతో తొందర ఆతురత చూపిస్తూనే ఉత్తరాలు చింపేడు. బెజవాడ ఉత్తరంలో "వెంకట్రామయ్యగారు ఈ వూళ్ళోకల్లా పేరుమోసిన క్రిమినల్ వకీలు. రెండు అంతస్తుల మేడలు నాల్గు. మంగళగిరి ప్రాంతములో సుక్షేత్రం ఏభైఎకరాల మాగాణి, పైగా వడ్డీ వ్యాపారాలమీద ఓ లకారం తిరుగుతూనే వుందన్న వాడుక.

"ఈయనికి కొందరు ఇద్దరుభార్యలని, వాళ్ళు ఇద్దరూ చెరో కూతుర్నీయిచ్చి జరిగిపోయేరని చెపుతారు. ఇప్పుడు కవలల్లావుండే వాళ్ళిద్దరూకూడా కాలేజీ చదువులు చదువుతున్నారు.

"ఇద్దరికీకూడా పెళ్ళికాలేదు. ఆస్తి ఆయన తదనంతరం వీళ్ళిద్దరికి వ్రాస్తాడన్న నిరుకు. పైగా వాళ్ళిద్దర్నీ కూడా పెద్దచదువులు చెప్పించాలని, ఇప్పట్లో పెండ్లి చెయ్యకూడదన్న వార్తకూడా అమల్లోవుంది.

"ఏది ఎల్లావున్నా, ఈ గారాబం, పెంపకంవల్ల వాళ్ళిద్దరూకూడా రణపెంకి, రాలుగాయిలుగానూ తయారయ్యేరన్నది, ఏ సంబంధం వచ్చినా, "పెండ్లి కొడుకును చిత్రవధచేసి పంపుతారన్నది వాడుకపడం అయ్యింది.

"అందుకే ఇద్దరికీ పెండ్లి కాకుండా ఉండిపోయింది" అని ఉంది.

ఇక రెండో ఉత్తరంలో "ఆ అమ్మాయి యీ వూళ్ళో ఓవర్సీరుగారి అమ్మాయి. కాలేజీలో చదువుతోంది. పెండ్లిచిన్నప్పుడే అయ్యింది.

"మొన్న సెలవులకు శుభంకానిచ్చి అత్తవారింటికి పంపేరు" అనీవుంది.

మొదటి ఉత్తరం చదివేసరికి యాజులుకు శరీరం పులకరించింది. అయితే వీళ్ళిద్దరూ వాళ్ళేనన్న మాట. తనమీద ఎందుకు యీ దండయాత్ర చేసేరో అన్నది అర్థంకాలేదు. ఈ మార్కులవంకని మొగుళ్ళను వెతుక్కుంటున్నారా అన్న సంశయమూ కల్గింది. ఒక్క ఈఉత్తరం ఆధారంగా తను ఉద్దేశించుకుంటున్నాడు వాళ్ళు వీళ్ళే అని. అంతకన్న ఇంకో సాక్ష్యమేమీ లేదు.

పైగా వెంకట్రామయ్యగారు చెప్పేరు. మీ దగ్గరకు వెళ్ళమని అని అనడం. తను జ్ఞానం వచ్చినతర్వాత ఆయన్ని కలుసుకున్నట్లుగాని, చూచి మాట్లాడినట్లుగాని గుర్తులేదు. ఓవేళ తనతండ్రి లావాదేవీలు చూస్తున్న వకీలు అనుకుందామనుకున్నా, తనకు తెలిసినంతవరకూ ఇల్లాంటి పేరున్నాయన వున్నట్లు తెలియదు. పోనీ అంతపొడుగు చరిత్రలు వ్రాసినవాడు పేర్లయినా వ్రాయకూడదూ. అని తిట్టుకున్నాడు; వాటవల్లేనా కొంతదారి దొరికివుండును అనుకుంటూ.

ఇక రెండోవుత్తరంవల్ల అమీతుమీ తెలియలేదు. ఆ వెర్రిమొఖం, ఆ అమ్మాయి విషయం, స్నేహితులు, వగైరాలన్నీ వ్రాయకుండా, కార్యం చేసుకుని మొగుడితో కులుకుతోంది, అన్న ముక్తసరి జవాబు, మొట్టికాయ మొట్టాలనిపించింది. ఏ భావన ఎల్లావున్నా, నరసారావుపేటవైపు ఓ పెద్ద రాతిగోడ కట్టుకోవలసివచ్చింది.

మెరుపుకొట్టినట్లుగా వీళ్ళిద్దరూ 'ఏ ఇంటిదగ్గరా చెప్పకుండా పారిపోయివచ్చిన ఘటాలు కావు కదా?' అన్న తలంపు వచ్చింది. దాంతో ఇల్లాంటి ప్రకటనలు చేసే పత్రికలేవైనా వున్నాయా అని ఆలోచించేడు. హిందూ, ఆంధ్రపత్రిక, ప్రభ, గుర్తుకువస్తే, వెంటనే

పేపర్లు అమ్మేకొట్టుకు వెళ్ళి ఆరోజువి కొంటూనే, ప్రతిరోజూ కూడా కావాలి అని ఎడ్వాన్సు చెల్లించేడు.

గజిబిజగా చూసేడు. ఒక్కటీ నా కన్పించక పోయేసరికి మనస్సు చివుక్కుమంది. చంపుకోలేని ఆశ, వెనుక పత్రికల్ని వెతికించి సగం ఖరీదుకు కొన్నాడు. అవ్వీ అల్లాగే వుండడంతో, గాడిదబరువునూ చంక నెట్టుకుని చౌరస్తాలోకి వచ్చేడు.

ఎక్కడ చూసేడో రామారావు పరిగెత్తూ కుంటూ వచ్చి "ఏమిటిరా పాత పేపర న్నీకొన్నావు. ఏమైనా మేట్రిమోనియల్ కాలమ్స్ చూస్తున్నావా?" అన్నాడు జబ్బతట్టుతూ.

"నీకు తెలియదు లే!" అనేసేడు ముఖంత్రిప్పుతూ.

"అయితే మళ్ళీ బ్లాంక్ చెక్కు ఏమైనా వచ్చేయా?"

వాడు వదిలిపెట్టేటట్లు కన్పించలేదు. జరిగింది చెపితే 'ఎంత వెర్రివాజమ్మవురా' అనేస్తాడేమో అన్న పిరికితనం. పైగా 'ఇల్లా వచ్చేగురా' అంటే వెటకారంతో 'వరి ఆ శ్రీనుకుంటే అయితే నీపని హుళక్కి' అంటాడు అన్న నిజం.

"వెంకట్రామయ్యనిగురించి ఏమని వచ్చిందిరా?"

"ఏముంటుంది? ఆయనో ప్లీడరుట. డబ్బున్న వాడుట. అంతే."

"అయితే పెళ్ళి అవవలసిన పిల్లలు లేరా ఆయనకు?"

తెలూపేడు. వీడు ఎల్లవదులుతాడా అన్న ఆలోచనలో నే "రా! రా! ఓ కూల్ డ్రింక్ త్రాగి వద్దాం" అనేసి దారి తీసేడు.

కిటకిటలాడే సమయం. ఖాళీకోసం వెతుక్కుంటున్నప్పుడే "ఒరే యాజులూ ఇల్లా రారా!" అన్నాడు శ్రీపతి.

"వచ్చేం" అనుకుంటూనే నడిచేడు యాజులు. ఉన్న స్నేహితుల్లోకల్లా వదురుబోతు ఈ శ్రీపతి. కళ్ళమ్మట నీళ్ళు తిరిగేవరకు వదలడు వేళాకోళాల్లో.

"అరే! అబ్బి! చెప్పేవు కావు. భాభిని ఎప్పుడు తీసుకువచ్చేవురా? ఇందాక నువ్వు వున్నావో లేవో అని మీఇంటిమీదుగా వచ్చి పిలిస్తే, ఒకళ్ళు కారు ఇద్దరువచ్చి 'ఇంకా ఆఫీసునుండి రాలేద'న్నారు. మరి చెప్పేవు కావు ఎంచేతనురా?" అనేసేడు శ్రీపతి.

రామారావుకు గూబ గుయ్యిమన్నట్లు నోట మాట రానేలేదు.

యాజులు నుంచున్నపళంగా కుర్చీలో కూల పడ్డాడు. గబగబా బల్లమీద గ్లాసు నీళ్ళున్నవుంటే గ్లాసున్నర త్రాగేవరకూ తేరుకోలేకపోయేడు. ఒకటి అనుకుంటే ఇంకొకటి ఎదురవుతోంది. తన జాతకం ఏమిటో కాని అన్న నిరాశ కల్గింది.

"ఏమిటిరా దెయ్యంకొట్టినట్లు మాట్లాడవు. ఓరే! శ్రీపతీ వీడేం గత మూడు రోజులనుండి నన్ను పెళ్ళి సంగతి అడుగు, వాళ్ళసంగతి తెలుసుకో అని చంపేస్తున్నాడు. ఏవేవో ఉత్తరాలు..."

రామారావుకు అడ్డంవచ్చినట్లై "నోర్మూసుకోరా!" అన్నాడు యాజులు.

రామారావు అన్నమాటలు, యాజులు అడ్డం, శ్రీపతిని మరింతగా పురెక్కించేయి. "ఏంరా యాజులూ! ఏ డిన్నరైనా ఇవ్వవలసి వస్తోందనా దాస్తుంట. ఒకళ్ళు భాభి. మరి రెండోవారు మరదలా, చెల్లెలా, మేనకోడలా, మరి ఎవ్వరా?"

"ఆఫీసులో ఇచ్చేదురా టీపార్టీ."

"అయితే నన్ను పిలవలే దెందుకురా! ఓరే! సెర్వరూ, స్వీటు మూడు ప్లేట్లు. మసాలాదోసెలు బాగా రోస్టుచేసి మూడు చెప్పు......"

అప్రయత్నంగా జేబులు తడుముకున్నాడు యాజులు. రామారావుకు నవ్వొచ్చింది. ఈసమయములో రోజా భార్యఅంటున్న ప్రశ్న చెపుదామా వద్దా అన్న సమస్యలో పడ్డాడు. తెగా తెంపూ కానే లేదు.

"యాజులూ! ఏమీ అనుకోపోతే ఒక్కటి చెపుతాను. ఆ ఇదరిలోనూ కొంచెం ఛాయ తక్కువ అమ్మాయి నా పెళ్ళికి వచ్చినట్లు జ్ఞాపకంరా! మంగళ హారతిపట్టి కట్నంకు పోట్లాడిందికూడాను." అన్నాడు చుట్టరికాలు కల్పుకున్నట్టుగా శ్రీపతి.

"నిజంగా!" ఎగిరిపడ్డాడు యాజులు.

"మన జ్ఞాపకశక్తి సత్యాగ్రహం ఇంకా ప్రారంభించలేదు. కావలిస్తే రేపు ఓసారి మా ఇంటావిడను పంపమన్నావేమిటి?"

అంధకారంలో పేదరాసి పెద్దమ్మ ఆముదపు దీపంలాగే తడితే "పంపరా!" అనేసేడు.

"ఓరే శ్రీపతీ! దారేకా! మా ఆవిడా ఎన్నాళ్ళ నుండో చూడాలనుకుంటోంది. పిలిస్తే ఇద్దరూ వెళ్ళ వచ్చు".

"ఓ. దానికేం? మరి విందుమాట?"

"మన కెందుకురా! వాళ్ళే నిర్ణయం చేసుకుని వస్తారు" అని నవ్వేసేడు రామారావు.

రెండుంపావులా బిల్లు, పైన కిళ్ళీలకు సిగరెట్లకు వదిలించుకుని, సందులో పడ్డాడు యాజులు.

గుండెల్లో రైళ్ళు పరిగెత్తేయి. మాటవరసకు వాళ్ళని రమ్మన్నాడే కాని, తీరా వచ్చి, ఈ ముక్కూ మొహం తెలియని వాళ్ళను నిలబెట్టి "మీలో యాజులు పెళ్ళాం ఎవరు?" అని అడిగేస్తే, ఇంక ఆ ఇంటిగుమ్మం త్రొక్కే అవకాశం, మొహం చూపించే ధైర్యం మంటకలిసిపోతాయి.

పండిపోయిన ఎండురావాకులా అల్లాడిపోయేడు. వాళ్ళు రాకుండా వుంచడం ఎల్లాగో తనకి తెలియనే తెలియదు.

* * *

ఆవిడ, శ్యామల, ఇరువురిరూపం ఇంచుమించు ఒకటే అయినా, ప్రవృత్తుల్లో ఇద్దరిది తలో దారి. మృదుభావంగా, ముక్తసరిగా, ఓవిధమైన అంతస్థులో నిలబడి తను పనులు చేయించుకోవడం, చేయడంలో ఆవిడకు ప్రత్యేకత వుంది. ఇక శ్యామల కొంటె కోణంగి. ప్రశ్నలు వెయ్యడం, అతిగా వాగడం, అర్థంపర్థం లేకుండా నవ్వడం, ఎదుటివాడిని పది అని తాను ఇరవై పడ్డం, ఇంకా చిన్నపిల్లలతత్వం ఒదులుకోలేనట్లు వుంటుంది.

ఈ తరం చదివినప్పటినుండి, ఓ విధంగా ధనిక కుటుంబంలో పుట్టి పెరిగిన అలవాట్లు వీళ్ళిద్దరిలోనూ వున్నాయా లేవా అనే విమర్శన మొదలుపెట్టేడు. అవే తన పరీక్షలవల్ల ఉన్నట్లు తేలితే తప్పకుండా 'వీళ్ళిద్దరూ వెంకట్రామయ్యగారి కూతుళ్ళే అయివుంటారు' అని నిర్ణయం చేసుకోవచ్చు. దాంతర్వాత 'ఎదుటబడి రహస్యాల్ని బట్టబయలు చేస్తే' తనచెయ్యి పై చెయ్యి అయిపోతుందన్న భావనా కల్గింది.

బజారుకు కూరలు పట్టుకొస్తానని వెళ్ళి, తేవాలనే, ఉల్లికోళ్ళు, చేమకూర కాడలు తెచ్చేడు. ఆవిడ తెల్లబోయింది మొదట్లో. రోజూ ఏ క్యాబేజీ, వంకాయ, అరటికాయ, నూల్‌కోల్ తెచ్చే ఈ మనిషి ఉండుండి ఒక్కసారి ఇల్లా మారిపోయాడే అని. వెనువెంటే ఏసింగరాజు లింగరాజులా తయారవుతున్నాడేమో అన్న వూహ, నెలాఖరురోజులు వచ్చేయి కదూ డబ్బులకు ఇరకాటంగా వుందేమో అన్న అనుమయింపుల్లో మాట్లాడలేదు. చిన్నగా నవ్వి వూరుకుంది.

శ్యామలా పొంచివున్నట్లుగానే "యాజులుగారు, ఉల్లికోళ్ళ పులుసు, చామకూర బజ్జీలు అంటే చెవి కోసుకుంటారు కాబోలు?" అంది.

ఎర్రచీమ కుట్టినట్లయ్యింది: తనమీదకే ఎదురుదెబ్బ.

"అవి అల్లాగే వండమన్నారా?" ఆవిడ.

"ఇంకా అడుగుతావేమిటే?" మనసుపడి ఆయన తెమ్మంటుంటే, పతనసామ్రాజ్యాల పరోటాల్లోకి అవి వ్యంజనాలే. మధ్యాహ్నం చెప్పిందిగా ఇంటి ముసలావిడ; అల్లాగే వండు."

తెల్లబోయేడు ఇంటావిడ దండయాత్ర సాగించిందంటే. "ఎందుకు వచ్చింది?"

"కబురు చెప్పడానికి." ఇంకేమనిపోతుందో అని శ్యామలని కళ్ళతోనే వారించింది ఆవిడ. అది చూడనట్లే "వచ్చినప్పటినుండీ, మా ఇద్దరిలోనూ ఇంటావిడ ఎవరూ అనే అపరాధపరిశోధనే. క్షణం ఆవిడను, క్షణం నన్నూ అనుకుని దిష్టి తీసేసింది. మిమ్మల్ని ఇంద్రుడూ, చంద్రుడూ అంటూ పొగడేసింది. ఆఖరున చెయ్యికూడా చూచి, ఎంత అన్యోన్యదాంపత్యం, ఇద్దరు పిల్లలు కూడా పుడతారట అంది." ఇద్దరూ నవ్వడం మొదలుపెట్టేరు. ఇరుకున పడిపోయి గుంజుకున్నాడు యాజులు. క్రమ్ముకుంటూనే

"ఆఖరుకు ఏమైంది?"

"ఏమవుతుంది. తల్లో ఎన్నివెంట్రుకలున్నాయో లెఖ్ఖపెట్టించి, కళ్ళమ్మట నీళ్ళు తిరిగేవరకూ శ్యామల వదిలిపెట్టలేదు"

"మంచిపని చేసింది. లేకపోతే..."

"ఇంతకీ మీ పెళ్ళాం ఎవరో తెలియకుండానే వెళ్ళింది గొణుక్కుంటూ" శ్యామల అడ్డంగా అంది.

ఓసారి ఇద్దరివైపూ చూచేడు. రగులుకుంటున్న నిప్పుల్లా ఎగిరిపోతారేమో అనుకున్నాడు. ఆ ఛాయలు లేకుండా నవ్వుతూ, కళ్ళల్లో ఓవిధమైన సంతోషం పెల్లుబుకుతుంటే, మనస్సు తేలిక పడింది. ఈ భావన తనకే వెలక్కాయ అవుతోంది. వీళ్ళ ప్రవృత్తి ఏమిటి? లోపల్లోపల ఈ విపరీత సన్నివేశాలను ఎల్లా తట్టుకుంటున్నారు? ఏది ఎల్లావున్నా తనమీద ఏర్పడ్డ భావమేమిటి? ఏమైనా మనస్సు వగులుకుని తన్ని ఉచ్చుల్లో దింపుదామనుకుంటున్నారా? ఇదే నిజమైతే తను విచారించవలసిన విషయం లేనట్లు తట్టింది. ఎందుకంటే, ఆవిడ, శ్యామలల్లో తన్ని ఎంచుకోమంటే ఆవిడలోని గొప్పతనంకు మొదటినుండీ మనస్సు అర్పింపడిపోయి వ్యాకులపడిపోతోంది. గత్యంతర్వా ఇద్దరూ కూడా తనమీదనే ఆశపెట్టుకుంటే, ఎవర్ని అన్న విషమ సంధి రానేరాదు అన్న ధైర్యం వుంది.

తనకి పెళ్ళయిందని, ఆవిడను ఒదిలిపెట్టేసేడని, లిల్లీతో సంబంధం పెట్టుకుని దిగజారేడని తెలిస్తే, ఆవిడ తనమీద గౌరవం, మనస్సు నిలుపుకుంటుంద అన్న ఆశపెట్టుకోవడం వృధా ఏమో అనిపించింది. దాంతో హృదయం శూన్యం అయిపోయింది. తన కర్మ ఇట్లా వుంది కాబోలు. ఆఖరుకు ఇద్దరూ మొఖంమీద ఉమ్మేసి వెళ్ళిపోతారేమో అన్న బెంగా కల్గింది.

కొమ్మ కొమ్మకో సన్నాయి!

వాళ్లెవరు? తనెవ్వరు? ఈ కాలప్రవాహంలో అయాచితంగా కలుసుకున్నారు. కొన్ని రోజులు ఉంటారు. మళ్లీ విడిపోతారు. అన్న మంచిమనస్సు నిర్దేశించినా, దాన్ని ఒప్పుకోడానికి ఇష్టం కల్గలేదు. తలచుకోడానికే ఒప్పుకోలేదు.

"అయితే యాజులుగారూ! మా యిద్దరిలో ఎవర్ని భార్యగా వ్యవహరించ మంటారు?" శ్యామల నవ్వుతూనే అడిగింది.

పమిట చాటు వేసుకుని ఆవిడ సిగ్గుపడింది. సగం నవ్వుతోనే "నోర్మూసుకో" అనీ అంది.

ప్రశ్న తువ్వున తగిలింది. మొఖంమీద నెత్తురుచుక్క లేనేలేదు యాజుల్కి. జవాబు చెప్పడం చేతకాలేదు. దీనికన్న సోలెడు ఆముదం అల్లపురసం లేకుండా, ముక్కు మూసుకోకుండా త్రాగవచ్చేమో అని అనిపించింది. అయినా పురుషలక్షణం వదులుకోలేక నే, ఓసారి పర్యవేక్షించి నవ్వేసేడు.

ఇద్దరి గుండెలూ ఆ నవ్వుతో ఆనకట్టే అయిపోయేయి.

"కొంపతీసి ఇద్దర్నీ చేసుకుందామనుకుంటున్నారా ఏమిటి? రాజుగారికి చిన్నభార్య పెద్దభార్య అన్నట్లు" ఈసారి శ్యామల వేళాకోళం జాస్తిగానే చూపించింది.

తట్టుకోలేకనే "అక్కడ పట్టమహిషి అడవుల్లో వుంది" అంటూనే యాజులు సావిట్లోకి వచ్చేసేడు.

ఎగిరి గంతేసినట్లుగా శ్యామల వంటింట్లోకి వెళ్ళి గోడకు జార్లాబడ్డ ఆవిడని గట్టిగా కౌగలించుకుని. ముద్దు పెట్టేసుకుంది. కిలకిలా నవ్వు నవ్వింది. కళ్లు చెమ్మగిల్లితే తుడవనూ తుడిచింది, ఒక్కసారి ఆవేదన తెలిసిపోతే.

కాలు పెట్టినప్పుడే కనిపెట్టింది శ్యామల ఆవిడకు యాజులంటే హృదయంలో ఓ స్థానం ఏర్పడిందని. ఈనాటి యాజులు మాటలు మొదట్లో అర్థం కాకపోయినా, 'ఆ పట్టమహిషి' అన్నది తోచింది. అయినా అతను దారిలోకి వస్తే, విచారించనక్కర్లేదు అనీ అనుకుంది.

చిన్నప్పటినుండి ఒకే ఇంట్లో పెరిగేరు. ఒక్కచోటనే చదివేరు. ఇప్పుడూ చదువుతూనే వున్నారు. ఆ జ్ఞానంలో తనకి అక్కయ్య అని మాత్రం తెలుసు. ఆవిడ నిజంగా తనతో బుట్టువేనా అనే సంశయం కల్గలేదు ఇన్నాళ్లల్లోనూ. ఇప్పుడు అక్కయ్యకు పెళ్ళి అయితే, తనకి తర్వాత అన్నే భావన గగుర్పాటు కల్గించింది. ఈ వెర్రి వేషకాడు బావగార్ని మరదలు స్థానంలో బాగా లేవుడీలు కొట్ట వచ్చన్న ఆశా వుసులుకుంది. చిన్నప్పుడు తలి పదే పదే "ఎప్పుడూ అక్కయ్య మనస్సు కష్టపెట్టకే" అని చెప్పిన మాటలు అర్థం కానేకాలేదు. అంతులోని అంతరం ఇప్పటికీ తికమక పెడుతూనే వుంది.

పైగా అక్కయ్య ఇంటిదగ్గర మద్రాస్ వెళ్ళి వస్తా, స్నేహితుల దగ్గరకు అని చెప్పి, చేసింది ఇల్లా ఎందుకో అన్న దానికి సమాధానం దొరకలేదు. అమ్మ మాటలు మీదుగా దాన్ని నిలబెట్టి అడగలేకపోయింది. ఏదో కారణం వుండితీరాలి అని అనుకోవడమే కాని, అదేమిటో పొలిమేరల్లోనైనా వాసన తగలటంలేదు.

'అవన్నీ తనకెందుకూ' అనుకునే ఈ విచిత్ర వాతావరణంలో, తానూ ఇంట్లోవారిక్రింద చేరిపోయింది శ్యామల.

అప్పుడే వచ్చిన పేపర్లు కంగారుగా తిరగవేస్తూనే యాజులు మునిగిపోయేడు; శ్యామల వచ్చి చిలిపిగా అల్లరికళ్ళతో పొడిచి చూస్తోంది అన్న భావనైనా లేకుండా. ఉలిక్కిపడ్డట్టు ఎగిరేడు యాజులు ఒక్కసారి. ఓ మూలగా పేపర్లో అంతా ఆవిడ వర్ణనతో, ఇంటి దగ్గరనుండి చెప్పకుండా పరారీ అయ్యింది. దగ్గర రెండువేలు వరకూ డబ్బువుంది. ఆమాకీ ఇచ్చినవాళ్ళకు మంచిగా బహుమానం ఇస్తాం అన్న వాక్యాల మీదుగా "చిన్నీ! అమ్మ నీకోసం బెంగ పెట్టుకుంది. నీకు ఆ అక్కర్లేని సంబంధం చేయం. ఇంటికి రా! మా కళ్ళు కాయలు కాసిపోయేయి" అని వుంది. ఎడ్రస్ కేర్ ఆఫ్ పత్రికల్తో అంతమూ అయ్యింది.

కంగారుగా లేస్తూనే, ఉత్తరం వ్రాసేసి, కవర్లో పెట్టి అంటించేసేడు హుషారులో.

శ్యామలకు అర్థంకాలేదు. ఏం వ్రాస్తున్నాడో అని తొంగిచూసేంత చనవూ రాలేదు. ఏమైనాసరే అనుకుంటూ "వధువు కావాలని ఉత్తరాలు వ్రాస్తున్నారా? అల్లా అయితే వరుడు కావాలని ఉంటే నా పేరకూడా ఒకటి వ్రాసి పడేద్దురూ. మీకు పుణ్యం వుంటుంది." అనేసింది.

నవ్వుతూనే "ఇంకా నేను నిర్ణయం చేసుకోలేదుగా మరి. అప్పుడే ఏం తొందర" అన్నాడు యాజులు గుండెలు కొట్టుకున్నా.

"ఇల్లా అన్నవాళ్ళందరూ ఆఖరుకు ఆ అడవుల్లో వున్న పట్టమహిషి దగ్గరకే వెళుతారు."

కంచీ పుచ్చుకుని. వీపుమీద ఛెళ్ళుమనిపించి నవ్వింది. బాగ గుండెలు దూసుకుపోనేపోయేయి. తల గోక్కున్నాడు.

భోజనాలదగ్గర, ఏదో పెద్ద పత్తేదారులా తను కూరలు తెచ్చి పరీక్షలు చేద్దాం అనుకున్నది, తన మొఖం బొప్పికట్టినట్టే అయితే, ఆ ఉప్పుకారం వేసిన

చామకులు, బెల్లంవెయ్యని ఉల్లికోళ్ళపులుసు, ఉగ్గూపాలతో తెమడేటట్లు వున్నా. కటుకరోహిణి కషాయం త్రాగినట్లుగానే తిన్నాడు అభిజాత్యంతో. వాళ్ళిద్దరూ విరగబడినవ్వడంతో పౌరుషం వచ్చేసింది; ఎంత బాగా బుద్ధిచెప్పేరన్న విచక్షణజ్ఞానంపోయి రుసరుసలతోనే.

"మధ్యాహ్నం మంచి ఫలహారాలు చెయ్యవే పాపం. అన్నం తినలేకుండా వున్నారు." అంది శ్యామల.

ఆవిడ నవ్వుతో గాలంతా నిండిపోతే కంగారుగానే బయటపడి, గాలిపీల్చుకున్నాడు కుమిలింపులో. సగందూరం వెళ్ళేటప్పుడు రామారావు శ్రీపతుల భాగ్యలు సంసారం చూడ్డానికి వస్తారన్న వార్త బెంబేలు చేసింది. చెప్పనైనా చెప్పనుకొను అనుకున్నాడు. వెనువెంటనే "రెండురెండే! ఉద్దండపిండాలు. నుసిపూసి మారేడు కాయ చేస్తారు" అన్న ధైర్యంతో నడిచేడు ఆఫీసుకు.

చింతామణిని పిలిపించి. ఉత్తరం వ్రాయవలసిన పంథాలో నరసారావుపేటకు వ్రాయించేడు. నీవర్ని ఆ పిలవసుయంలో ఏవిధమైన రహస్యాలుకూడా బట్టబయలు చేయబడవు అని కూడా హరికింపించేడు.

ఈ విచిత్ర పరిణామాలు, మనుష్యులు, చర్యలు ఇవన్నీ వింతగా, క్రొత్తనీరు వచ్చినట్లైతే. మనస్సు ఏదో సుఖంగా, హాయిగా వున్నట్లనిపిస్తే, మళ్ళీ మళ్ళీ తలచుకుంటూనే, నవ్వుకుంటూ ఆఫీసుపని చేసేసేడు. రెండుమూడుసార్లు తాబేదార్లను నవ్వించేడు.

'పెండ్లి కళవస్తోంది' అన్న ముసిముసినవ్వుల్లోనే వాళ్లు వుంటే ఇంటికే వచ్చేసేడు. అడుగుపెట్టేటప్పటికే గుమ్మంగుమ్మన్నట్లుగా, పెట్టెలు, బెడ్డింగులు, ఫ్లాస్కూ సావిట్లో వున్నాయి. ఎక్కడెక్కడో సద్దుతున్నట్లు శబ్దమూ వినిపించింది. ఊపిరి ఆడనే లేదు యాజులుక్కు.

శ్యామల రివ్వున వస్తూనే "ఏమండి? అంత నీతి జాతి లేనివాళ్ళ మనుకున్నారా? దొంగలం అనుకున్నారా? లేకపోతే పోలీసు రిపోర్టు ఇస్తారా? ఆ అడ్డమైనవాళ్ళు వచ్చి మమ్మల్ని నానా ప్రశ్నలు వేస్తారా?" ఉరిమింది.

ఆవిడా అందుకున్నట్లే "ఆ మాట మొట్టమొదటే చెపితే ఏం పోయింది? పెద్దమనుషుల్లా, ఉండ నవడం ఎందుకు? వెనుకనుంచి ఇల్లాంటి అనుమానాల్తో, మానాభిమానాలు లేకనుకుంటూ కత్తిపోటు పొడవడం ఏమిటి?" తాళంగుత్తి మొఖాన్ని విసరినట్లుగా విసరి "అవిగో మా పెట్టెలు. విప్పి పరీక్ష చేయించుకోండి, మీ సామానులు ఎన్ని దొంగతనం చేసి పరారీ అయిపోతున్నామో!" అన్నది.

"మేమీ రాత్రికే వెళ్ళిపోతున్నాము. ఏదో మహాగౌరవనీయులు అనుకున్నాం. ఎప్పుడూ ఈ మగాళ్లు ఇంతే!" అని ఈసడించేసింది శ్యామల.

"జన్మలో మర్చిపోం మహానుభావా" అంది ఆవిడ.

ఏ ప్రాతివత్యమహిమో వుంటే, కాళ్ళక్రింద భూమి బ్రద్దలై తనని భూమాత ఎందుకు మింగెయ్యలేదు, అన్నంత ఆక్రోశం వచ్చేసింది యాజులుక్కు. గత నాలుగురోజులనుండి పచ్చగావున్న ఇంటిని, తన చేతుల్తో తనే అగ్గి ముట్టించి, ఆహుతి అవుతుంటే చూస్తున్న వాడిలాగే కూలబడ్డాడు.

"శ్యామూ! ఆ తాళాలు తీసి చూపించవే!" అన్న ఆవేశంతో, గుత్తి తీసుకుని పెట్టెమూతలు తెరిచింది శ్యామల. చీరలు, లంగాలు, జాకెట్లు వగైరాలన్నీ చిందర వందరగా బయటకు లాగేసింది 'చూడవయ్యా' అన్నట్లు కొరకంచు చూపుల్తో.

అతి నెమ్మదిగానే "ఏమండీ! ఒక్కమాట వింటారా?" అన్నాడు. అందులో శాంతం మూర్తీభవించింది.

అదిరి పడ్డారు ఇద్దరూ ఆ శబ్దభేదానికి.

"ఒక్కొక్కసారి, ఎంత తెలివైనవాడైనా అడుగు తప్పబడి జారడం తటస్థిస్తుంది. దానికి ఆక్షణానుగుండే వాతావరణం, మనుష్యుల ప్రభావం చాలామటుకు కారణం కావడం సహజం. అలాంటప్పుడు తప్పు, ఒప్పు విచక్షణాజ్ఞానం పోయి మానవ పతనం జరగడం నిజం కూడాను."

ఏమిటి తత్వబోధని అని విస్తుపోయేరు ఇద్దరూ.

"అల్లాగే అయ్యింది నాపని" ఆగిపోయేడు.

ఆవిడకు మెరుపు కొట్టినట్లయ్యింది. "అయితే ఆ లిల్లీ వ్రాయించిందన్నమాట" అంది.

తలూపుతూనే "అప్పుడు వ్యాకులంలో ఏమి వ్రాసేనో కూడా తెలియనే లేదు. ఆ బుద్ధిహీనతకు నేను క్షంతవ్యుణ్ణో" అనీ అనేసేడు. మనస్సు కుమిలింపుల్లో ఆఖరుమాటలు తడబడ్డాయి.

ఆవిడ అదిరిపోయి అవ్యక్తంలో బాధపడిపోయింది. లిల్లీ ఎవరో తెలియక శ్యామల అక్కవైపు, యాజులువైపు కళ్ళు త్రిప్పుకుంటూనే కూలబడింది. గిరుక్కున తిరిగి లోపలకు వెళ్ళిన అక్కయ్య, తిరిగి వస్తూనే కాఫీ ఫలహారాలు ఆయన చేతుల్లో పెట్టి ముసిముసిగా నవ్వెయ్యడం. ఈ అనుకోని అనునయానికి కంగారుగా అతను పళ్ళెంబగులు ఆమె చెయ్యినే పట్టుకుని. తప్పుకు వేడుకుంటూనే. తలవంచుకోడం, చూస్తే, శ్యామలకు, 'వీళ్ళిద్దరూ కలిసి నన్ను ఒక్క వెర్రిదాన్ని చేసేసేరు' అన్న పౌరుషం పొడిస్తే, రుసరుసమంటూ చూచింది; పెట్టెల్లోంచి తీసినబట్టలు మళ్ళీ పెట్టాలా అక్కర్లేదా అన్న జిజ్ఞాసలో ఊగిసిపోయింది.

[సశేషం]

గొల్లకలాపము భరతుని భాణికయే!

శ్రీ సాళ్వకృష్ణమూర్తి, శ్రీ ముట్నూరి సంగమేశము

తెలుగు నాటినుండి కూచిపూడి నాట్యప్రదర్శనములు నిర్వహించుచు నొక సంఘము కేరళ దేశమున సంచారము చేయబోవుచున్న వార్త యొకటి యీమధ్య వచ్చినది. వల్లత్తోల్ మహాకవి ప్రయత్నము వలన 'కథాకళి' కెంతయో ప్రచారము, గౌరవము వచ్చినవి. కూచిపూడి నాట్యమునకఖిలభారతస్థాయిలో ప్రస్థావాప్తత రాలేదన్న కించ మనలో నవేకులకు కొంచెమో గొప్పయో యున్నది. ఆ నాట్యప్రచారమునకై ఈ ప్రయత్నము ఇప్పటికైన జరుగుట, నాటివారిలో, నెంతయో మేలు.

ప్రస్థావాప్తత ఒకరిచ్చు పట్టము గాదు. దానిలోని వైశిష్ట్యమే దానిని ప్రత్యేకముగా చూపును. కనుక ఇతరులెవరో దానిని ప్రత్యేక ప్రస్థానముగ నొప్పుకొనలేదని యేడ్వక యనుకొనుటకంటె దాని వైశిష్ట్యమును గూర్చి విచారించుకొని తరువాత నితరులకు ప్రదర్శించినచో బాగుండును. అటువంటికృషి ఇంతవరకు నంతగా జరిగిన ట్లగపింపదు. కూచిపూడి నాట్యమును గురించి కొద్దియో గొప్పయో తెలిసిన వారే చాల కొద్దిమంది. శాస్త్రదృష్టితో దానిని పరిశీలించిన వారిని బహుశః వ్రేళ్ల మీద లెక్కపెట్టవచ్చును. దేశమున దానిస్థితి ఇట్లున్నది. ఇంతకును కూచిపూడి నాట్యమునకు గల విశిష్టత ఏమి?

కూచిపూడినాట్యము తెలుగు సంస్కృతి జిలుగుకొమ్మ, ప్రాచీనమైనది. విశిష్టమైనది. కూచిపూడి వారి నాట్యప్రదర్శనములు చాల యున్నవి. వానిన్నింటిని కలాపములని, భాగవత నాటకములని రెండు రకములుగ వింగడింపవచ్చును. వీనిలో కలాపములు మూడు: సత్యభామాకలాపము, గొల్ల (భామా) కలాపము, చోడిగాని కలాపము. భాగవతనాటకములలో ప్రహ్లాదచరిత్ర, రుక్మాంగదచరిత్ర, ఉషాపరిణయము, సారంగధరచరిత్ర మొదలగునవి ప్రసిద్ధములు. దక్షిణదేశమున భరత మందరకు నొకటే యైనను కేరళీయుల కథాకళి, తమిళుల కచేరి భరతనాట్యము వేరువేరుగా నున్నవి. 'కథాకళి'లో నాట్యశాస్త్రములోని కొన్ని హస్తముద్రలు వేరుగానుండును. కేరళీయుల 'కథాకళి'లోను, కన్నడిగుల 'బయలాట'లోను తాండవమునకు ప్రాధాన్యమెక్కువ. నేడు భరతనాట్యమని వ్యవహరింపబడుచున్న తమిళుల కచేరినాట్యమున లాస్యతాండవములు రెండును గలవు. ఇంక మనది అచ్చముగా లాస్యకళ. ఈ విషయమున మన కలాపనాట్యము విశిష్టమైనది. తమిళదేశమువందలి మేలట్టూరి భాగవత మేళములలో గాని, మనవారి వీధినాటకము లనబడు ప్రహ్లాదచరిత్ర, రుక్మాంగదచరిత్ర, ఉషాపరిణయ, సారంగధరచరిత్రలలో గాని లాస్యప్రధానమైనవి లేవు. ఈ కలాపములలోని విశేషమేమనగా: కథ గాని కథ యొకటి యుండును. అనగా పేరునకు మాత్రము. వీనిలో భామవేషము వేసెడి పాత్రయొక్కటే ప్రధానము. సూత్రధారుడో అథవా విదూషకుడో నట్టువనారై నాట్యము నడిపించును. పదాభినయ మిందలి ప్రధాన కళాభాగము. ఆడుటకనువుగా పేరున కద్దము తెచ్చి పెట్టుకొన్న కథ ఆధారము గాగల ఈ కలాపములు ఉపరూపకముల కోవకు వచ్చును. అస్సాం రాష్ట్రములోని 'మణిపూరి'లో గాని, ఒరిస్సా రాష్ట్రములోని ఒఝాపాళి'లో గాని, గుజరాత్ లోని గర్భ, భావై నాట్యములలో గాని ఈ ఉపరూపక లక్షణములు కాన్పింపవు. అవి యన్నియు మనపగటివేషగాండ్ర లీలానృత్యముల వలె నుండును. రాత్రి యంతేయు — ఒకరాత్రియేమి, కావలెనన్నచో మూడు రాత్రులైన సరియే—అది అటు ప్రఖ్యాతమగు ఒక ఇతివృత్తము ననుసరించుచు ఇటు నాట్యాంగములన్నిటిని ప్రదర్శించుచు రసమును పోషించి నాటక మనిపించుకొను నాట్యము మన కలాపమొక్కటే.

ఇక్క కేరళీయుల 'కథాకళి', తమిళుల కచేరీ భరత నాట్యములందుకంటె కూచిపూడివారి నాట్యసంప్రదాయమున నెక్కువగా కూడుకవచ్చిన విశేషము లేమైన నున్నవా యన్నచో చాల యున్నవని చెప్పవచ్చును. ఆ మాటకు వచ్చినచో కూచిపూడి నాట్యసంప్రదాయ మొక్కటే భరతశాస్త్రమును సంపూర్ణ

ముగా ననుసరించునది. మొదటివిశేష మేమనగా భరతోక్తమగు పూర్వరంగవిధాన మంతయు కూచిపూడి సంప్రదాయముననే సాంగోపాంగముగ నిలచియుండుట. రెండవది కూచిపూడి వారిది లాస్యకళ. సత్యభామాకలాపమున దశవిధలాస్యాంగములలో తొమ్మిది ప్రదర్శింపబడును. ఆ యొక్కటి గూడ అలంకార శాస్త్ర విరోధముచే విడువబడినది. మూడవది భరతోక్తమగు ధ్రువాగాన మెత్తుబడక నిలచియుండుట. నాల్గవది తమిళ కేరళ దేశముల నాట్యములందువలె గాక కలాపములందలి నాట్యకర్త తాను స్వయముగా పాడుచు నభినయించుట. ఐదవది నాట్యకర్త నటువనార్లిద్దరే రంగస్థలాన నున్నంతగా పాత్రనైరళ్యముండుట. ఇది స్థూలముగా గనుపించు విశేషములు. సూక్ష్మముగా జూచినచో తమిళదేశపు తంజావూరి నాట్యపద్ధతికిని తెలుగునాటి కూచిపూడి నాట్యపద్ధతికిని శాస్త్రము విషయమున పెద్దభేదము గాన్పింపకపోయినను సంప్రదాయముననేమి, వేషరచనలోనేమి భేదమున్నది. ఈ గొల్లభామాకలాపమున్యమున వచ్చు మోహినీ నృత్యములో నృత్త మెక్కువగా నుండుటయే గాక ఇందు వేసెడి 'అడుగులు' కూచిపూడివారి ప్రత్యేక సాధనకును, శక్తికిని నిదర్శనములు.

గొల్లభామా కలాప మంటిమి. దీనిని సాధారణముగా గొల్లకలాప మందురు. భామాకలాప మనుటగూడ కద్దు. దీనికంటె పేరువచ్చిన సత్యభామాకలాపమునుగూడ భామాకలాపమనియే వ్యవహరింతురు. కాగా సత్యభామాకలాపము, గొల్లభామాకలాపమును నీ రెండును భామాకలాపము రెండుభాగములను అపోహ యొకటి యున్నది. కాని అది వేరు, ఇది వేరు. సత్యభామాకలాపము శ్రీగదితమను ఉపరూపకము. కూచిపూడి వారి నాట్యమునగల భరతోక్త పూర్వరంగ విధానమును, లాస్యాంగప్రదర్శనమును విపులముగా వివరించుచు సత్యభామాకలాపము శ్రీగదితమను ఉపరూపకమని మేము వేఱొకచోట నిరూపించితిమి. ఇంక ఈ గొల్లకలాపముమాట యేమనగా నిది 'భాణిక'యను మరియొక యుపరూపకము. ఈ సందర్భమున దానికి సంబంధించిన ఆలంకారిక లక్షణమును, చారిత్రక విషయములను పరిశీలించుటకు ముందు గొల్లకలాపములోని కథను గద్యవ్యాఖ్యా సహితముగ కించుక చిత్రింపుదు.

గొల్లకలాపకథ మూడు ప్రధాన భాగములుగా ప్రవర్తిల్లును. గొల్లభామ తెర బయలుదేరి రంగమున గొల్లకులము వారినిగురించి యుపన్యసించి తన చుట్టును ఊర్లవాభికల పౌరాణిక గాథలు అల్లుకొని పదాభినయము చేయుట మొదటిభాగము. సుంకరి కొండాయ ప్రవేశము, గొల్లభామతోడి వాదులాట రెండవభాగము. గొల్లభామ అత్త రంగమున ప్రవేశించి సుంకరి కొండాయను తరుమగొట్టుట మూడవది. భామవేషము తెరబయలు దేరుట ఒక పెద్ద 'సాంగ్య'మని అందరికి తెలిసిన సంగతే. భరతోక్తమైన పూర్వరంగము సంపూర్ణముగ నడచిన పిమ్మట గొల్లభామ తెర బయలుదేరును. ఆమె తెరలో నుండగను, తెరబయలుదేరిన తరువాతను హాస్యగాడామెతో ప్రసంగించుచు ప్రశ్నలు వేసి సందర్భానుసారముగ కథాంశములు రాబట్టుచుండును. గొల్లభామ తాను తెరలోనుండగనే ప్రసంగవశమున తాము 'గొల్లవార'మనును. హాస్యగాడు 'అదేమి వారము'ని ప్రశ్నించును. దానికామె

'వారములు గావు వినవయ్య, వసుధలోన
క్షీర దధి తక్ర ఘృతములు జిన్న వెన్న
లమ్ముచుండంగ మమ్ముల నార్యులెల్ల
గొల్లవారని బిల్చిరో కోమలాంగ!'

అని సమాధానము చెప్పును. తన కులగోత్రము లిట్లు చెప్పి భామవేషము 'భామ వచ్చెను, గొల్లభామ వచ్చెను' అను ప్రావేశికీధ్రువతో తెర బయలుదేరును. తెరవెడలిన తర్వాతనే ఈ కులగోత్రముల ప్రశంస ఎక్కువగా నడచును. సంభాషణవశమున భామ సప్రత్యయముగా తన కులములోని పలు తెగల వారినిగురించి చెప్పి తన్నుగురించి యిట్లు చెప్పుకొనును :

'మందల గొల్లకులంబున
నందుని వంశమ్మునందు నాడెముతో నిం
పొంద జనించినదానను
అందముగా గొల్లచిన్న దందురు నన్నున్.'

తాము చల్లగొల్లలమని, ఆలగొల్లలమని, ఎఱ్ఱగొల్లలమని- మూడు తెగలవారమని పాటపాడి అభినయించును. (ఉపన్యాసము.) అటుతరువాత నీ గొల్లకలాపమున కంతటికి ముఖ్యమైన పదాభినయపూరితమగు నాట్యఘట్టములు వచ్చును. తాము బ్రహ్మాదులకు గూడ చల్ల లమ్ముట. క్షీరసాగర మథనకథ, లక్ష్మీదేవి గొల్లభామగను కామధేనువు కపిలగోవుగను అవతరించుట అను కథలు పూర్వపూర్వక్రమముగా నభినయించును. గొల్లభామ భూలోకమున చల్లలమ్ముటగూడ అభినయింప

బడి కథ వర్తమానముతో లంకెకు వచ్చును. (విన్యాసము.) అటుపిమ్మట తనతోపాటు చల్లలమ్ముచున్న మరికొందఱు గొల్లపడుచుల బిలుచుచున్నట్లుగ, సుంకరి కొండని బారిని బడుదునన్న భయముతోచి (విబోధము)

"అక్కలార ప్రొద్దెక్కెను రారే
సుంకరికొండడు చూడకమునుపే"

అని ప్రొద్దెక్కెనదని అబద్ధమాడుచు (సాధ్వసము) నిష్క్రామికీధ్రువతో నిష్క్రమించును. ఈ సమయమున రంగస్థలముమీది హాస్యగాడు, పారిపార్శ్వకులైన తాళగాండ్రు భామకు తోడిపడుచులుగా నిలుతురు.

ప్రధాన ఘట్టములలో రెండవది కొండాయ ప్రవేశము, వీడు సుంకము వసూలు చేయువాడు. అందుకే వానికి సుంకరికొండడని పేరు. కొండాయ తన ప్రావేశికీధ్రువ పాడి ముగింపగనే భామ తాను మరల ప్రవేశించును. రసాభాసతోగూడిన ఈఘట్టముత్కటహాస్యముతో పండితపామరుల రంజించును. కొండాయ గొల్లభామనడ్డుకొని 'నిండు సుంకమివ్వకపోతే నిన్ను విడువనే' అని ఆమె వెంటబడును. మొదట బింకము చూపును. పిదప బేరమునకు వచ్చును. ఆపైని సరసము సాగించును. ఈసంవాదములోని 'డైలాగులు' సత్యభామా కలాపములోని 'సవతుల కయ్యము'(ఉక్తప్రత్యుక్తము)వంటివో, చోడిగాని కలాపములోని సింగి సింగళ్ళ సంవాదము వంటివో అగును. పద్యాలు పాటలు కూడ చేరియొక చరణము పాడి యభినయింతురు. భామ

'అత్తచాటుదాన - తత్తరపడబోకు
అత్తియున్నాడు మా - బిత్తిరి మరిది
మామచాటుదాన - మర్యాదగాదు పో
రోరి సుంకరికొండ, పోర కొండ.'

అని కొండాయను బెదరగొట్టజూచును. వాడేమి తక్కువ తిన్నవాడా మరి! 'గుత్తి లోగడను, మీయత్త మాకు' అని బీరాలాడును. ఆమె నెట్లయినా వశపరచుకొనజూచును. భామ చిల్లరమల్లర పిల్లగాదు, క్రొత్తడి పడుచు. కొండాయకు సందియ్యక

'పోర పోరోరి నాకింక ప్రొద్దులేదు
గొల్లచల్లకు సుంకంబు కోపరరాదు
పంచ నున్నది మాయత్త పొంచులాడి
మించరాకుర నిన్బట్టి దంచగలదు'

అని బెదరించి తప్పించుకొనజూచును. (రసాభాసగానిది సమర్పణకు) ఇంతలో నా 'పంచనున్న అత్త' అక్కడకు ప్రవేశించును. కొండాయ ఆమె 'దంచుట'కు భయపడి పారిపోవును. (నిర్వృత్తి) పిదప మంగళము (సంహారము).

గొల్లకలాపములోని కథ గాని కథ యిది. ఇది కేవలమొక సన్నివేశము. చల్లలమ్మకొనవచ్చిన గొల్లపిల్లను సుంకరికొండడడ్డగించి సరసము చూపుట, అది విరసమై ఆమెయత్త విరుచుకపడుట అను నీసన్నివేశము చుట్టును అందమైన ఆటపాటల వల అల్లబడినది.

గ్రంథము

ఈ కలాపమునందలి జాతివార్తికమైన హాస్యము మాట అటుండనిచ్చి ఈ గ్రంథము సంగతి ఇంచుక చూతము. సత్యభామాకలాపగ్రంథమువలెనే ఇది గూడ పలువురు రచయితల చేతులలోబడి నలిగినది. ఇందలి పాటలలో కొందఱు రచయితల పేర్లుగూడ ముద్రలరూపమున పాడుకొనియున్నవి.

'వారీ, శ్రీ గోడవర్తివారీ
నాము నేలు మాయామురారీ
శ్రీ జగన్నాథుని గోరీ
ఒరీ ఓ గొల్లచిన్నతాతా...' అని ఒకచోటను
'వరలోను వేంకటదాసుని కవిశము
సిరులిచ్చి ప్రోచేటి హరిని దలంచుము...' అని

వేరొక చోటను పాట లున్నవి. ఎందరో మేళములు కట్టి ఆడగా ఆ సందున ఈ కలాపమున చేయిజొనిపిన వారిలో గోడవర్తి జగన్నాథము, తెన్నేటి వేంకటదాసు, చేవూరి ఎఱుకయ్యదాసు, సరస్వతుల సుబ్బయ్య అనువారిని పేర్కొనవలసియున్నది.

'కథ'కు సంబంధించినంతవరకు చాల మార్పులు గానవచ్చును. శ్రీనివాసదాసుగారి 'రంగపురి పారిజాతము'లోను లాలా కన్నయ్యగారి కలాపములోను శ్రీకృష్ణుడే కొండాయ వేషమున వచ్చినట్లు ఒకకల్పన యున్నది. అనూచానముగ వచ్చుచున్న అభిప్రాయము గూడ నదియే. ఇంకకొన్నిచోట్ల ఈ గొల్లభామ సుంకరి కొండాయల కలయికగూడ వి పాటలోనో సూచింపబడి కథకు సంహారాంగ మగుటగూడ గలదు.

భాణిక

సత్యభామాకలాపము శ్రీగదితమను ఉపరూపకమని మనవి చేసితిమి. విప్రలంభశృంగారమందు ముఖ్యమై లాస్యాంగములు ప్రదర్శింపబడును. ఇంక

గొల్లభామాకలాపమున నన్నచో భామకొండాయల రసాభాస శృంగారము ముఖ్యము. అనగా హాస్యమన్న మాట. దీనికితోడు హాస్యగాని జాతివార్తికముకు నుత్తిట హాస్యమున్నది. సముద్రమథనము, మోహిని అవతరణము మొదలగునవి, ప్రసంగమున వచ్చెడు పురాణకథలు గనుక కథాదృష్టితో సందీరస మున్నదని చెప్ప వీలులేదు. కాగా గొల్లభామాకలాపము 'భాణిక' అను ఉపరూపకమని చెప్పవలెను. 'భాణికా' లక్షణమునుగూర్చి 'భావప్రకాశ' మిట్లు చెప్పుచున్నది.

'భాణికా శ్లక్ష్ణ నేపథ్యా
ముఖ నిర్వహణాన్వితా,
కైశికీ భారతీ రీతి
యుక్తైకాంక వినిర్మితా,
ఉదాత్త నాయికా, మంద
పురుషా ప్రాంగసప్తకం.
ఉపన్యాసోఽథ విన్యాసో
విబోధ స్సాధ్వసం తథా,
సమర్పణం నివృత్తిశ్చ
సంహార ఇతి కథ్యతే.'

సాహిత్యదర్పణమున[1] నీ 'భాణికా' లక్షణము విపులముగా నిట్లు చెప్పబడినది: 'భాణికయందు వేషము రుచిరము. ముఖనిర్వహణములు కలవు. కైశికీ భారతీ యుక్తమగు నేకాంకముతో రచింపబడును. నాయిక యుదాత్తురాలు. నాయకుడు హీనుడు. ఏడంగములు, ఉపన్యాసము, విన్యాసము, విబోధము, సాధ్వసము, సమర్పణము, నివృత్తి, సంహారము అనునవి. ఉపన్యాసమనగా ప్రసంగవశమున కార్యమును కీర్తించుట; నిర్వేదవాక్యములను విస్తరించుట విన్యాసమనబడును; భ్రాంతి తొలగుట విబోధము; అనృతము చెప్పుట సాధ్వసము; కోపపీడచేత నిందతోడివాక్యము సమర్పణము; నిదర్శనము నుపన్యసించుట నివృత్తి యనబడును; కార్యమున సమాప్తి నొందించుట సంహారమనబడును.'

గొల్లభామ నీతివిషయమున ఉదాత్తనాయిక. కొండడు మంచిపురుషుడనియు, హీనుడనియు వేరుగా చెప్పనక్కరలేదు. వేషము రుచిరమనుట అందరెరిగినదే. ఇందలి ఆయా భాణికాంగము లన్నియు కథాకథనమున నాయాచోట్ల కుండలీకంణములలో సూచింపబడినవి. సాహిత్యదర్పణములోని వివరణ వాక్యములతో వానిని సమన్వయించుకొనవచ్చును. కాగా నీగొల్లకలాపము 'భాణిక' యను ఉపరూపకమనుటకు సందేహములేదు. దీని కితరలక్షణములు మాట యేమోకాని మన గొల్లకలాప భాణికయందు మరొక లక్షణ విశేషముకూడ నున్నది. అదేమనగా 'అభినవ భారతి'లో నుట్టంకింపబడిన—

'బాలక్రీడా చ యుద్ధాది
తథా సూకర సింహజా,
ధ్వజాదినా కృతా క్రీడా
యత్ర సా భాణికా మతా'

అని లక్షణమును కూచిపూడివారు అవతారికలోని పదాభినయ క్రీడలలో నిర్వహింతురు.

గేయ రూపకములు

గొల్లభామా కలాపము గేయరూపకము. ఆచార్య హేమచంద్రుడు పదార్థాభినయప్రధానముగా నున్న వానిని గేయరూపకములని నిర్వచించి వానిని పేర్కొన్నాడు. 'పదార్థాభినయ ప్రధానాని స్వభావాని డోంబికాదిని గేయానిరూపకాణి చిరంతనైర్యుక్తాని,' 'డోంబికా, భాణ, ప్రస్థాన, భాణికా, శింగక, రామాక్రీడ, హల్లీసక, శ్రీగదిత, రాసక, గోష్ఠీ ప్రభృతీని గేయాని'. ఇవన్నియు మూలమున రాసకములు. ఆభీరుల నాట్యములు. 'ఎఱ్ఱ'గొల్ల పదములోని 'ఎఱ్ఱ' శబ్దమీ ఆభీరశబ్ద వికృతి యేమోయని మా యూహ. (ఆభిర ఆహీర ఆఈర ఏర ఎఱ్ఱ.) ఈ గేయ రూపకములు రాసక్రీడకు ప్రతికృతులు; విస్తరములు. ఆభీరుల భాషగాకూడ నిర్వచింపబడిన 'అపభ్రంశ' భాషలో అనేక 'రాసక', 'రాస' కావ్యాలున్నవి. 'బయాలీస్ ధద్మలీల' అనునది కృష్ణకథకు సంబంధించిన అనేక లీలలు గేయరూపకములుగా నభినయింప వీలైన రచన. ఇందులో తెలుగువారి 'కూరాకుల వేషము', 'రంగరాజు వేషము' వంటి పగటివేషకలాపములకు మాతృక లనదగిన వేషము లెన్నో కలవు. 'గయసుకుమార రాస', 'గోష్ఠీ ధద్మలీల', 'శ్యామసగాయీ రాస' మొదలైన వానిలో మన సత్యభామా కలాపములోని మాధవి దౌత్యము, ఈ గొల్లకలాపములోని సుంకరి తగవువంటి ఘట్టములున్నవి. ఇవన్నియు శ్రీ చైతన్యుల కాలమున ఎక్కువగా వ్యాప్తికి వచ్చినవి.

---

1 వేదమువారి అనువాదము.

గొల్ల కలాపము భరతుని భాణికయే!

కూచిపూడివారికి సత్యభామా కలాపమువలెనే గొల్ల భామాకలాపముగూడ సిద్ధేంద్రయోగివలన లభ్యమైనట్లు తెలియుచున్నది. క్రీ. శ. 1600 ప్రాంతము నాటి సిద్ధేంద్రయోగి శ్రీ చైతన్యుల శిష్య పరంపరలో నొకరు కావచ్చునని మా యనుమానము. కూచిపూడి వారి ప్రతిభావిశేషముల నెఱిగి వారికీ 'కలాపముల నిచ్చి కృష్ణలీలల" నాడించి యుండవచ్చును. ఏమనగా కూచిపూడివారు సిద్ధేంద్రయోగికంటె చాల మునుపే ప్రసిద్ధనర్తకులుగా నున్నవారు. క్రీ. శ. 1434–'66 వరకు కటకమును పాలించిన కపిలేంద్ర గజపతి యాస్థానమున కూచిపూడి నర్తకులు గీత గోవిందము నభినయించినట్లును కానుక లందినట్లును శాసనాధారము లున్నవి. ఆ తర్వాత కూచిపూడివారు క్రీ. శ. 1502 లో విజయనగరమున వీర నరసింహ రాయల ఆస్థానమును దర్శించినట్లు 'మాచిపల్లి కైఫీయతు'లో నున్నది. ఆ కాలమున సిద్ధవటసీమ నేలుచుండిన సంబెట గురవరాజనువాడు ప్రజలను బాధించుచుండగా ఆ విషయమును కూచిపూడివారు మహారాజున కెరుకపరుప దలచిరి. జట్టులోని నర్తకుడొకడు గురవరాజు వేషముకట్టి స్త్రీపాత్రధారి రొమ్ములకు చిరుతలు పట్టించున ట్లభినయించెను. రాజది చూచి నర్తకునడిగి వివరములు తెలిసికొని గురవరాజును పరిమార్చి సిద్ధవటసీమ ప్రజల కష్టముల బాపెను. ఈ కథ పై జెప్పిన కైఫీయతులోనిది. కాగా కూచిపూడి వారు సిద్ధేంద్రయోగికంటె చాలముందు, అనగా రెండు శతబ్దులుముందే, ప్రఖ్యాత నర్తకులు—వారి ఈ నాట్యకళాభినివేశమే సిద్ధేంద్రయోగి వారికీ కలాపముల నిచ్చి శిక్షణ గరపి యాడించి యుండుటకు కారణమై యుండుననుటలో విప్రతిపత్తి గాన్పింపదు.

గొల్లకలాపకథ ఉత్తరాది రాసగేయకావ్యములలో బీజప్రాయముగా నున్నది. 'దండిగ నే గోల్కొండ సుంకరిని' అనే ప్రస్తావన ఈ కలాపములోని పాటలో కాన్పించినను తానీషా కూచిపూడి అగ్రహారమును వారికి దానమిచ్చినమాట జ్ఞప్తిలో నున్నచో నది తాత్కాలికముగ కల్పించి యున్నమాటయని తెలియగలదు. ఇంక గొల్లకలాపమునందలి లక్ష్మి గొల్లపడుచుగా నవతరించుట, కామధేనువు కపిల గోవగుట, బ్రహ్మాదులకు చల్లలమ్ముట మొదలగు ఘట్టములన్నియు మన వేంకటేశ్వరమాహాత్మ్యము, గరుడాచల మాహాత్మ్యము మొదలగు క్షేత్ర మాహాత్మ్య కథలలో వర్ణింపబడినవే.

మరియొక విశేషమేమనగా బేలూరు దేవాలయ కుడ్యముపై నొకచోట చల్లలమ్మపడుచు సుంకరి బొమ్మలు చిత్రింపబడియున్నవి. కాగా ఈ కథ పదమూడవ శతాబ్ది కాలమునకే జనరంజకమై యుండినదని యూహింపవచ్చును.

తంజావూరు సరస్వతీ మహాల్ పుస్తక భాండాగారమునన్న ప్రతిలో రాధవేషము, కృష్ణవేషము, భామవేషము, గొల్ల వేషము మొదలగు వేషముల కలాపములు వ్రాసియున్నదాని పైయాకుమీద 'పారిజాతాలు' అని వ్రాయబడియున్నట్లు అచటి 'డిస్క్రిప్టివ్ కేటలాగు' లో వ్రాసినారు. అనగా ఈ రీతి కలాపములన్నియు 'పారిజాతము'లని యనబడేవని తెలియుచున్నది. మైథిలీభాషలో (18 శతాబ్ది) ఇట్టి పారిజాతములు (లీలా నాటకములు) చాల వ్రాయబడినవి. ఉమాపతి మిశ్ర వ్రాసిన 'పారిజాతహరణనాటకము' గూడ నిటువంటి పారిజాతమే. అంతేగాని వీనిలో పారిజాతమును దశరూపకములకు సంబంధించిన లక్షణము లేవియు కాన్పింపవు. ముఖ్యముగా మన కలాపములకీ పారిజాతములన్న పే రెట్లు కలిగినదో విచారించదగిన విషయమే. అంతేకాక ఈ మన మూడు కలాపముల గ్రంథములను గూడ చక్కగా నాలంకారిక దృష్టితో పరిష్కరించి ప్రకటించుకొనుట తెలుగువారి ప్రథమ కర్తవ్యము.

సవరణ : ఈ వ్యాసం శీర్షికను 'గొల్లకలాపము భాణికయే' అని చదువుకోవాలని మనవి.

సం. భా.

శిల్పసుందరి

శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రి

క్రాలఁడు గా వత్సదేశాధికారి, లలిత
నవ్యమన్మథాకార సౌందర్యశాలి,
సరస సంగీతసాహిత్య సంపదాతి
శాయి, యుదయన నృపతి కౌశాంబినగరి.

అతఁడు సద్గుణోపేత విఖ్యాత యశుఁడు మంత్రి యౌగంధరాయణ మతివిశేష
గరిమ, మనుహిత ధర్మమార్గమ్మునందు రాజ్యపాలన కార్యభారమ్ము దీర్చు.

అంతట నొక్కనాఁడు వసుధాధిపముఖ్యుఁ డమాత్యవర్య సా
మంతులు గొల్వఁ గొల్వును సమంజస రీతిని దీర్చియుండ, భూ
కాంతునిఁ జేరి యా నగరి కావలివాఁడు నమస్కరించి తా
నెంతయు వేడ్క నిట్లు వచియించె నపారపు రాజభక్తితోన్.

"ఇన్నిదినంబు లాయె నొకయించుక ధర్మవిహీన వర్తనుం
డెన్నఁడుఁ గానరాఁడు గద, యేలిక రాజ్యము నెల్ల నేలుచున్
మన్ననతోడ నెల్లరఁ గుమారులరీతిగఁ జూచుచుండఁగన్
నిన్నటి రేయిఁ దోఁచె నవినీతుఁ డొకండు మదీయ దృష్టికిన్.

దేవ, సౌందర్యమున రతిం దెగడు రాజకన్యకారత్నమును ననుగమ్యమాన
మైన చేటితోఁ దిరిగెడు వీని వేకువందుఁ బట్టితి నే చోరుఁడంచు నెంచి."

అనుచుఁ బామరు నొక్కనిఁ గొనుచు వచ్చి రాజు ముందట నిల్పి తలారి పల్కె
"కన్య సంరక్షణార్థ మొక్కని నియుక్తుఁ జేసి, వచ్చితిఁ దమ యాజ్ఞ శిరము దాల్చి."

అనుచుఁ జేటితోఁ గన్యను గొనుచు రాఁగ శీఘ్రగతి ఱేఁడు శాసించి, చేయవలయు
కృత్యము దలంచి, ధర్మచికీర్షబుద్ధి ననియె నిట్టుల పాపభయమ్ము వ్రేఁప.

"సంశయించిన మాత్రాన జనుని నెపుడు శిక్షితుం జేయఁగా ధరఁ జెల్లదెందు
నిశ్చయింపఁగాఁదగుఁ జూపె నిజము, బలము గల్గుహేతువు లవియెన్నో కలుగు పైని.

దోషిఁ గొట్టనట్టి దోషమ్ము కంటె, నిర్దోషిఁ గొట్ట నధిక దోష మగును;
త్యక్త దండ్యు యముఁడు దండించు, ననఘుని దండ్యు సేయ రాజె దండ్యుఁ డగును.

కాన నిరుపకుముల సమాధాన మరసి, వారి సాక్ష్యవిచారణ పలువురందు
చేసి, దోషనిర్ణయమును జేయవలయు”ననుచు నా నృపతి పలుకునంతలోన.

మేలి పసిఁడి నునుమేని నిగ్గుల జిగి శంపాలతా భ్రాంతి నింపఁజేయ,
కాటుకఁదీర్చిన కనుగవ చూపులు కువలయ హారముల్ గూర్చిపెట్ట,
కెమ్మోవిఁ దొలకించు కమ్మని లేఁనవ్వుతీరు పకాల చంద్రికల నీన,
చదురైన నుదురుపైఁ గదలెడు ముంగురుల్ భ్రమర తతిభ్రమ వరలఁజేయ,
నందముగ వేణి కటిసీమఁ జిందులాడ తలను దురిమిన పూలు నెత్తావు లీన,
కులుకు నడతోడ సొబగైన కలికిమిన్న చేటి వెంటరా ప్రభు దరిఁజేరవచ్చె.

ఇట్లు ననుదెంచు ముగుదఁ గన్నెత్తి చూచి యామె రూపరేఖావిలాసాతిశయము
మనము నాశ్చర్యసాగరమ్మునను దేల్చ తనదు మదిలోనఁ దలపోసె ధరణిపుఁ డిటు.

వేలుపుచాన యేమొ, కనిపించు నిమేషము నేత్రమందు, భూ
పాలకుమారి యేమొ, యిటువంటి మిటారులు నుందురే భువిన్,
బాలయె సృష్టిసేయు సుమబాణునిఁ కీమె సృజించు టెవ్వరో,
మేలగు చొక్కపుం బసిఁడిమేను దనంతనె పుట్టె నిచ్చటన్.”

అనుచు ననురాగమానసుఁ డగుచుఁ దలఁచి హృదయ మొకయింత చెదరినఁ బదిలపఱచి,
పురుషుఁ జూచి యా వసువతీవరుఁడు పలికె గౌరవాదరభావముల్ గ్రాల నిట్లు.

“ఎవ్వఁడవీవు, నీవు వసియించెడు గ్రామము నామమేదియో,
యెవ్వతె యీ తలోదరి, యిఁకెక్కడ కేగుచునుంటి వీరితో
నివ్విధి జేయి నీవు చరియింపఁగఁ గారణమేమి, యెంతయున్
నివ్వెఱగయ్యెడిం దలఁప, నీచరితం బఖిలంబు దెల్పుమీ.”

దానికిన్ వాఁడిటుల సమాధాన మిడియె నంజలి ఘటించి కడు వినయమ్ముగదుర,
సభ్యు లందఱు గౌతుకస్వాంతు లగుచు వీనుగవను నిక్కఁగఁబెట్టి వినుచునుండ.

“సజ్జన నివాస యోగ్యం బిజ్జగమందున, వినోద మిచ్చెడుఁ గనఁగా,
నుజ్జయిని పేర నొప్పెడు నజ్జనపదము గద మామకాశ్రయపదమా.

జనకుఁడ నాదు నీతళుకుఁజక్కెరబొమ్మకు నేను, నెందునే
ధనమును, సత్కులమ్ము, యువధర్మము, విద్యయు, మేనిచెల్వపుం
దనమును గల్గు నొక్కనికి దానము సేయఁగ దీని, తత్ఫల
మ్మును బొడగాంచ నేను పురముల్ గనఁ జేరితి నీపురంబునున్.

పెక్కగు నాపదలకు నేఁ జిక్కియు నాదగు కుమారిఁ జేత నెటులనో
దక్కించుకొంటి, నీమెయె దిక్కగు ముందుగల నా యదృష్టము కెల్లన్.”

అనిన నబ్బురంపడి సభ్యు లందఱు నగి "నమ్మఁగా రాదు వీని వాక్యమ్ములను, వి
కారరూపుఁడో యితఁ డేడ, కాంచనాంగి యేడ" యంచును గుసగుసలాడుకొనిరి.

అంత జనపతి సభ్యుల యాననములఁ జక్కఁజూచి, పరేంగితజ్ఞాని గాన,
వారి తలఁపుతోఁ దనదు భావమ్ము గలియ ననియె నిట్టుల మృదురీతి నతనితోడ.

"లోకము నెల్లమించును తలోదరి రూపమునందు, నీవు స్వ
ర్లోకనివాసి వౌదువె? గురుండ వదెట్టుల నీమె కౌదువో,
కాక హరించుదానిని జగంబున దొంగ భయాభిమానముల్
లేకయె స్వీయవస్తువుగ లెక్కఁడకుండునె యెక్కఁడేనియున్."

అనుఁడు నృపుతోడ నతఁ డిట్టు లనియె, "దేవ యెవ్వఁడు విరూపపు తీరుగా సృష్టిసేయఁ
గర్తగాఁ జేసె నట్టి విశ్వభర్త, యా విధాత యే యిటఁ బ్రశ్నింపఁదగినవాఁడు.

చోరుఁడఁగాను, సత్యమును జూపె వచించితి నేను, నమ్మఁగా
నేరని చో సరోజముఖి నే సకలం బడుగన్ యథార్థ ని
ర్ధారణ మాను గాదె, వసుధాధిప, నా యెడ మీర లిట్లు ని
ష్కారణ దోష మెన్నక విచారణచేసిన మీకు మేలగున్."

నా విని నృపతి పల్కు కన్యకను జూచి "యితఁడు నీతండ్రి యని చెప్ప నిట్లు ముగుద,
మాదు సంశయంబుల నెల్ల మాన్పి, వేగ న్యాయనిర్ణయమందు సహాయపడుము."

అంత నా తన్వి వినియు ననాదరమున వినని రీతి కదల్పదు పెదవులైన
చేయునది లేక యింక నా చేటివైపు చూచి యిట్లనె నా ఱేఁడు చోద్యమంది.

"ఘనమగు లజ్జ యడ్డుపడఁ గానఁ గులాంగన నోటినుండి ప
ల్కను నమృతంపు బిందు విసుమంతయు రాలదు కాక, చేటివై
నను లలితాంగి ముగ్ధవచనంపు సుధారసబిందు సంతతిం
దనియఁగఁ జేసి మాదు శ్రవణద్వయికిన్ సుఖ మిచ్చుగావుతన్.

చేటి, దయతోడ సుంతవచించి మాకు సాయ మొనరింపుమమ్మ సౌజన్యగరిమ,
ఎవతె యీతన్వి, యీ జనుఁ డీమెకేమి కావలయు, వీరు నీవారె కానఁ దెలుపు."

అంత నామె యాపురవాసినైన చేటి ననుచు, "నాతన్వి చెలికత్తె యాట కితఁడు
బత్తె మిచ్చి నన్నిటు కొనివచ్చెఁగాని యన్యమేమి నాకుఁ దెలియ" దనుచుఁ బలికె.

దాన కర్తవ్యతా శూన్యమానసుఁడయి సంకటంపడి సౌధసంచార యోగ్య
మైన దాసిని బిలిపించి యామెతోడ నృపతి పలుకాడె మృదురీతి నెలఁతఁ జూపి.

"అన్యదేశమ్మునందుండి యరుగుదెంచె సూవె యీ నవ్య సుకుమార సుందరాంగి,
ముగ్ధభావమ్మునో భయమ్మునో తెలుపఁ జాలదయ్యె మాతోఁ దన చరితమెల్ల.

తాన నంతిపురమును వేగంబ చేర్చి సేద దీరిచి, యీయమ నేమ మరసి,
యతిథి సత్కార కార్యమ్ము లాచరించి, సంతసింపఁగఁ జేసి విశ్వాసగరిమ.

గౌరవభావమూని కలకంఠి భయమ్మును బాపుచున్ సదా
చారముతోడ నీమెను విచారణ చేసి గ్రహింపుమీ సమా
చారము సర్వమంచు" పరిచారిక నంతిపురంబులోనికిన్
భూరమణుండు పంపె, పువుబోడియుఁ జేటియు వెంబడింపగన్.

అచిరకాలమ్ములో విస్మయావలోకనమ్ములం జిమ్ముకొనుచును సమ్మదమ్ము
గొలుపఁగ మరలివచ్చి "యాకోమలాంగి చిత్రపుఁ బ్రతిమ సూ"యని చెప్పె దాసి.

"సకలశరీరముం దడవి చక్కఁగఁ జూచితిమయ్య, భూమిపా
లక, కపటంబు లేదు నుశులం దిసుమంతయు" నన్న, విస్మయా
చకిత మనంబుతో సకలసభ్యులు గాంచిరి చిత్రసత్కరుం
బకపక నవ్వి పల్కిరిటు "మంచికుమార్తెను గంటి వెక్కడో".

అంత నృపుఁ డా పురుషుఁ జూచి యనియె నిట్లు నిజము చెప్పు మెవండవు నీ"వనంగఁ
దాను శిల్పి ననియు, శిల్పతత్త్వ మొప్ప నట్లొనర్చితి క్షమియింపుఁ డనుచుఁ బలికె.

తస్కరుఁడు గాఁడు సూవె యీతఁడని పంపి వేసి తలవరి, నాఱేఁడు విస్మయాద
రంబు లలముకొనంగ మనంబునందు, ననియె నాశిల్పిఁ జూచి ప్రియమ్ము గదుర.

"ఇట్టి సర్వాంగసౌందర్య మెనయురూప మీవు మనసునందున సృజియించినావొ,
కాక, యెవ్వారినైనను గాంచితొక్కొ, యామె ప్రకృతియే యిది" యనుననంగ.

శిల్పి యంత నిట్లనె, "మహాసేను తనయ గలదు వాసవదత్తాఖ్య, గాంచి యామె
చిత్రలేఖనాకృతిని సృజించినాఁడ ప్రతిమ నిటు రక్తి నాదరింపంగ ప్రభులు."

పూర్ణ బహుమాన మిచ్చి తృప్తునిగఁ జేసి ఱేఁడు వీడ్కొల్పి శిల్పిని వేడుకమెయి
శిల్పసుందరిఁ జూచి విశేషగరిమ నిట్లు దలపోసె ననురాగహృదయుఁ డగుచు.
ప్రతిమలో నామె ప్రద్యోతను తనయ యటె, చూడ మాటాడ దవ్వాట సుంత కాదు,
తన్మనతికి నేఁడుఁ గాఁ దగుఁ గాని, యామె యెవని మనసున నిల్పునో యెఱుఁగు టెట్లు.
ఆమెరూప మెంతయు ననన్యసదృశమ్ము నిష్కలంక మటంచును నేఁ దలంతు,
నామె యధరపానమ్ము సేయంగలాడె ధన్యుఁ డగుఁ గుతూహలమాత్రు లన్యజనులు.

అట్టి సుకృతపుఁగర్మల నాచరింతు
నేని తొలిజన్మమందున నెవ్వడైన
లోకవిఖ్యాత కీర్తి సుశ్లోక నా సు
గుణవతిఁ ధాతయే నాకుఁ గూర్చఁగలఁడు.

జాతీయవాదం: దుర్ఖీమ్

శ్రీ జాస్తి జగన్నాథం

జీవితం పూలబాటకాదు; లోకం పూర్తిగా కంటకావృతమూ కాదు. మానవజీవితంలో కష్టసుఖాలు ఉంటూనే ఉంటవి. కాని మానవునికృషి ఎంతసేపటికి కష్టాలను తప్పించుకోవాలనే! ఆ తప్పించుకోవటానికి మార్గం వెతకటమే మేధావులపని. అది కాదని ఇది, ఇది కాదని మరొకటి ఇలా ప్రతిమేధావి ఒక కొత్త బాటను చూపించటానికి యత్నంచేస్తూనే ఉన్నాడు. ఈ ప్రయత్నంలో అనేక వాదాలు పుట్టుకొని వచ్చినవి. ప్రస్తుతాంశం అయిన జాతీయవాదం వాటిలో ఒకటి. దీని విలువ ఎంత? అవసరమెంత? ప్రయోజనం ఎంత? అనే ప్రశ్నలు, పరిశీలనలు ప్రతివాదంమీద తప్పవు. ఈ ప్రశ్నలకు సరైన సమాధానం తెలిసికోవాలంటే ఆ వాదాల వాస్తవ స్వరూపస్వభావాలను ముందు గమనించాలి. పేరులు చూచి భ్రమించటమో త్యజించటమో విజ్ఞత కాజాలదు.

జాతీయవాదం ఈ శతాబ్దిలో ప్రబలప్రచారం గాంచింది. అంతకుముందు ఈ అభిప్రాయాలు లేవా అంటే; ఉన్నవి. కాని వాటికి ఒక తాత్వికమైన పునాది వేసి సంపూర్ణతత్వంగా, సిద్ధాంతంగా తయారు చేసినది ఈ రెండు శతాబ్దులలోనే. ఈకృషిలో దుర్ఖీమ్‌పాత్ర చాల ప్రధానమైనది. సాంఘికశాస్త్రసూత్రాధారంతో జాతీయవాదాన్ని తాత్వికంగా స్థాపించటానికి ఇతడు చేసినకృషి మహత్తరమైనది. మానవత్వంపై, మానవజాతిపై ఇతనికున్న అభిమానం, విశ్వాసం కొనియాడదగినవి. అతని నిర్ణయాలు ఈనాడు అనుసరణీయాలు కాకపోవచ్చు; కాని అతని చిత్తశుద్ధి, కార్యదీక్ష, పరిశీలన తృష్ణ, ఏనాటికైనా ఆదర్శప్రాయమైనవే.

ఎమిలీ దుర్ఖీమ్ ప్రధానంగా సాంఘిక శాస్త్రజ్ఞుడు; కామ్టి, స్పెన్సర్‌ల వాదాలకు వారసుడు. తన సాంఘిక పరిశోధనపై ఆధారపడే జాతీయవాదానికి ఒక తాత్వికరూపం కల్పించిన ప్రముఖుడు. మార్సెల్ మాస్, సెలెస్టిన్, బాగ్లె, జార్జెస్ డేవీ, పాల్ ఫాకానెట్ ఇతని అడుగుజాడలనే ఆశ్రయించి అత్యంత ప్రతిభావంతమైన పరిశోధనలు కావించి ఆయా రంగాలలో విశేషశ్రద్ధతో పనిచేశారు. దుర్ఖీమ్ మరణానంతరం వీరు విద్యా సాంఘిక రంగాలకు సంబంధించిన అతని గ్రంథాలను సేకరించి ప్రచురించి ఆలోచనా జగత్తులో దుర్ఖీమ్ పేరు చిరకాలం వెలుగొందటానికి సహాయపడ్డారు. అలాగే అమెరికాలో ఛార్లెస్ గెల్ఖ్, హారీ ఎల్మర్ బార్నెస్‌లు దుర్ఖీమ్‌ని గురించిన విమర్శనాత్మక వ్యాసాలు ప్రచురించి అతని భావప్రచారానికి పాటుపడ్డారు.

దుర్ఖీమ్ భావాలలో ధ్వనించిన జాతీయవాదానికి అతని తరువాత వచ్చిన ప్రపంచ పరిణామం కేవలం ప్రతిధ్వని మాత్రమే నేమో అనిపించే సందర్భాలు చాల ఉన్నవి. దుర్ఖీమ్ వ్యక్తివిలువను, ప్రాధాన్యాన్ని కుంచించి సంఘానికి ప్రాధాన్యం ఇచ్చి జాతీయవాదాన్ని భావించాడు. అసలు మరొకవిధంగా జాతీయవాదాన్ని భావించడం అసంభవమని ఇటీవలి తాత్వికులు నిర్ణయించారు. ఆ తరువాత ఇటలీ జర్మనీలలో వచ్చిన ఫాసిజానికి, రష్యాలో బోల్షివిజానికి ఈభావంలోనే బాటలు పున్నట్లు కనపడుచున్నవి.

ఎమిలీ దుర్ఖీమ్ 1858లో ఫ్రాన్సులోని అల్సేషియన్ రాష్ట్రంలో 'ఎపినాల్'లో జన్మించాడు. ఇతని పూర్వులు న్యాయమతాచార్యస్థానాలలో ఉండి అధికారం చెలాయించేవారట! అప్పట్లో ఫ్రాన్సులో ప్రధానమైన విద్యాలయాలలో చేరి విద్య గడించి తరువాత ఇతడు జర్మనీదేశంలో పర్యటించాడు. జర్మనీలో ఉండగా జాతీయ ఆర్థికవ్యవస్థనుగురించి, మనస్తత్వశాస్త్రంగురించి, మానవ సంస్కృతి, శరీర నిర్మాణాది శాస్త్రాలనుగురించి ప్రత్యేకపరిశీలనతో పఠించాడు. అంతేకాక సాంఘికశాస్త్రంలోను, బోధనశాస్త్రంలోను విపులపరిశోధనలు కావించాడు. జర్మనీలో ఉండగానే తన మొదటి థీసిస్ 'డి ల డివిజన్ డు ట్రవెయిల్ సోషల్'ని రచించాడు. అతనికృషిని గమనించి 1887 లో బోర్డయాల్స్‌లో అతనికి సాంఘిక శాస్త్రాచార్యపదవి ఇచ్చారు. ఆ తరువాత 1893 లో సాంఘికశాస్త్రం, బోధనశాస్త్రం బోధించవలసినదిగా

పారిస్‌కి ఆహ్వానించబడ్డాడు. పారిస్ వచ్చిన తరువాత 1893 లో 'అనిసోషియాలజిక్' అన్న పేరుతో ఒక సాంవత్సరికపత్రికను స్థాపించి సంపాదకత్వం వహించి నిర్వహించాడు. దానిలో ఆనాటి మేధావుల నెందరినో తనవైపు ఆకర్షించుకోగలిగాడు.

ఇతడు ప్రధానంగా పరిశోధన కొనసాగించినది సాంఘికశాస్త్రంలో. సాంఘికశాస్త్ర పరిశోధనలో నిర్ణయించుకున్న సూత్రాలతో న్యాయశాస్త్రాన్ని, తత్వశాస్త్రాన్ని అవలోడనచేశాడు; జాతీయవాద స్వరూపస్వభావాలకు తాత్త్వికమైన పునాదివేశాడు; రాజకీయంగా సంఘాన్ని ఎలా పునర్నిర్మించుకోవలసి ఉన్నదో సూచించాడు. ఇతని మార్గాలు అభిప్రాయాలు అనుసరణీయాలు అవునా, కాదా అన్న ప్రశ్నకు పాఠకులే ఆలోచించి సమాధానానికి రావటం మంచిది. సాంఘికశాస్త్రజ్ఞులలో ఇతనికి పేరు ఎత్తుకోనివారు, ఇతని అభిప్రాయాలు ఉల్లంఘించి తర్జనభర్జనలు చేయనివారు చాల అరుదుగా కనిపిస్తారు.

సాంఘికశాస్త్ర సూత్రాలు

దుర్ఖీమ్ ప్రబోధించిన జాతీయవాదానికి, రాజకీయతత్త్వానికి అతని సాంఘికశాస్త్రసూత్రాలు, పరిశోధనలు ఆధారం. అతడు ప్రధానంగా సాంఘిక శాస్త్రజ్ఞుడు కావటంవల్ల ఇది సంభవించింది. కనుక ముందుగా అతని సాంఘికశాస్త్రాన్ని జాగ్రత్తగా గమనించవలసిఉన్నది.

సెయింట్ సైమన్, కామ్టి, స్పెన్సర్ లవలె దుర్ఖీమ్‌కూడ సాంఘిక విషయాలను ఒక నిర్మాణాత్మక శాస్త్రంగా రూపొందించటానికి ప్రయత్నించాడు. కాని వారికి ఇతనికి ఒక భేదం ఉన్నది. వాస్తవికాధారంలేని సాధారణ విషయ చర్చతో వారు ప్రారంభించారు. సంఘప్రవృత్తి ఎటువంటిది? ప్రధానమైన పరిణామసూత్ర నిర్వచనం, అభివృద్ధి విధానం ఎలాంటివి? ఈ మొదలైన చర్చలతో వారు తమ పరిశీలన ప్రారంభించారు. కాని సాంఘికశాస్త్రం అప్పటికింక ఒక ప్రత్యేకశాస్త్రంగా రూపొంది పెంపొందలేదు. సాంఘికశాస్త్రం బాల్యదశలో ఉండగానే ఇలాంటి చర్చలు ప్రారంభించినందువల్ల ప్రయోజనం ఉండదని దుర్ఖీమ్ ఆ చర్చను త్రోసిపుచ్చాడు. సాంఘికశాస్త్రాన్ని తత్త్వశాస్త్రానికి లోబరచటంలో సంతృప్తిచెందక కామ్టి, స్పెన్సర్ల సంప్రదాయంలోనివారు మనస్తత్వశాస్త్రానికి, జీవశాస్త్రానికికూడ బానిసను చేశారు. వ్యక్తికి వాస్తవస్థితిగతులను మించిన ప్రాముఖ్యం ఇవ్వనో లేక సంఘం అనే యంత్రం కూడ భౌతిక జగత్సూత్రాలకు లోబడే ఉంటుందని భావించో వీరు పరిశీలన ప్రారంభించారు. వీరు సాంఘికశాస్త్రాన్ని మనస్తత్వశాస్త్రానికి జీవశాస్త్రానికి అనుబంధం చేయటం అందుచేతనే జరిగింది.

కాని దుర్ఖీమ్ వీరి భావాలను అంగీకరించడు. అతడు ఈ విషయాన్ని మొత్తం వాస్తవికవాదంగా దర్శించాడు. సాంఘికశాస్త్రం స్వతంత్ర ప్రతిపత్తిగల శాస్త్రమని, దీనిని తత్త్వశాస్త్రానికి, మనస్తత్వశాస్త్రానికి, జీవశాస్త్రానికి లోబరచవలసిన పనిలేదని భావించాడు. సాంఘికశాస్త్ర స్వాతంత్ర్యాన్ని ఎలుగెత్తి చాటాడు. ఎలాంటి సాధారణ న్యాయాలను నిష్పన్నం చేయాలనుకొన్నప్పటికి ఈ శాస్త్రాన్ని ప్రత్యేకంగా భావించి ఆయా విషయాలపై ప్రత్యేక కృషి చేయటం ప్రథమకర్తవ్యమని ఇతని వాదం. సాంఘిక శాస్త్రజ్ఞుల మనుకొనేవారు సాధారణ విషయాలపై అభిలాషపడి లాభంలేదని ఇతడంటాడు. ప్రతిసాంఘికశాస్త్రజ్ఞుడు సూక్ష్మపరిశీలనతో, పరస్పరం పోల్చి చూచుకొనే విధానం అవలంబించి సాంఘికశాస్త్రాన్ని గురించి విపులమైన ప్రత్యేకపరిశోధనలు వెలువరించాలని ఇతని అభిమతం.

సాంఘిక విషయాలను వాస్తవవస్తువులుగా గ్రహించితీరాలని ఇతని భావం. కాని ఈ సాంఘిక విషయాలు అనంతవైవిధ్యంతో, విస్తరణతో ఉంటవి. కనుక వీటిని ఆ విస్తరణతోనే వివరించవలసిఉంటుంది. అంతేకాని వాటి వైయక్తికవికాసాలదృష్ట్యా వివరించబూనటం కూడనిపని. ఈ సాంఘిక విషయాలు వాస్తవికాలు అని చెప్పినాడుగదా! వాస్తవికాలైన ఈ సాంఘిక విషయాలు వీటి సొంత న్యాయాలనుబట్టే ఉంటవి. ఈ సొంత న్యాయాలు వాస్తవమైనవా? వీటికి వ్యక్తిత్వం ఉన్నదా? అని శంకించటం అతడు అంగీకరించడు. భౌతిక జగత్సూత్రాలెంత వాస్తవాలో ఇవికూడ అంతటి వాస్తవాలని ఘంటాపథంగా చెపుతాడు. విద్యుత్ప్రవాహవేగాన్ని, శక్తిని కొలవగలిగినట్లుగానే వీటినికూడ కొలవవచ్చునని, పోల్చవచ్చునని చెప్పాడు.

మానవుని అవగతం చేసికోవాలంటె ముందుగా అతనిచుట్టుఉన్న సాంఘిక స్థితిగతులను తెలిసికొనవలసి ఉన్నది. ఈ సూత్రమే దుర్ఖీమ్ సాంఘికశాస్త్రానికి మొట్టమొదటి పునాది. ఈ సూత్రంవల్లనే వైయక్తిక సభ్యులకంటె సామూహిక జీవితం వాస్తవమని భావించాడు. ఈ సామూహిక జీవితం వ్యక్తులకంటె భిన్నమైనదని, ఉన్నతమైనదని అతని వాదం. ఉదజని ప్రాణవాయువుల సంయోగంచేత వీటి రెండు లక్షణాలకు భిన్నమైన నీరు తయారవుతున్నట్లుగానే ఒక

వర్గంగా కొందరు వ్యక్తులు కలియటంచేత ఒక నూతనమైన 'జీవి' ఏర్పడుతున్నది. ఇలా నూతనంగా ఏర్పడే 'జీవు'లను దుర్ఖ్హీమ్ సంఘాలు అని అంటాడు. సంఘం అంటె ప్రపంచమంతా ఏకసంఘం అని అతని అభిప్రాయం కాదు. ప్రపంచం అనేకసంఘాల, వర్గాల కూడలి అని చెపుతాడు. వర్గం, తెగ, నగరరాజ్యం (నేటి పురపాలక సంఘంగా మనం చెప్పుకొనవచ్చు) జాతి మొదలైనవాటి నేకాక మతవిషయకమైనశాఖ, పాఠశాల, సాహితీసమితి, వృత్తిసంఘం ఈ మొదలైన వాటినికూడ అతడు ఇలాంటి సంఘాలుగా చెపుతాడు.

ఈ సంఘాలు భౌతిక నైతికశక్తుల సమ్మేళనంలో ఏర్పడిన కూడలులని, ప్రకృతిలో మనకు గోచరించే అత్యంతశక్తిమంతమైన సమ్మేళనాలని అతడంటాడు. ఇలాంటి సంఘాలకు ప్రతిదానికి ఒక వ్యక్తిత్వం ఆత్మ ఉన్నాయని, ప్రతిదీ తన జీవిత వ్యాయామాలను నిర్మాణశాసనాలను, నైతికశాస్త్రాన్ని, ఆలోచనావిధానాన్ని, అనుభూతిమార్గాలను కలిగి ఉంటుందని కూడ చెపుతాడు. ఎన్నో తరాలనుంచి శతాబ్దాలనుంచివస్తున్న నాగరికతకు, ఆలోచనలకు, జ్ఞానానికి, అనుభవానికి ఇలాటి సంఘాలు రక్షకాలుగా, ఆధారాలుగా వుంటున్నవి. అందుచేత వాటిలో ఒక స్థిరత్వం ఉంటే అవి ఎడతెగకుండా ఉంటవి. వ్యక్తుల జీవితాలు కొద్దికాలం సాగి అంతమవుతు ఉంటవి. కనుక ఈ లక్షణాలు వ్యక్తులలో గోచరించవని అతనివాదం.

ఇలాంటి సంఘానికి పెద్ద నైతికశక్తి ఉంటుంది. అందుచేత వ్యక్తులమీద బలవంతంగా పని చేస్తుంటుంది. మామూలు పరిస్థితులలో చాల సాధువులుగా మెత్తగా ఉండే మనుష్యులచేత కూడ బహిరంగసభలలోను, జనసమూహాలలోను ఉన్నప్పుడు ఎన్నో ఘోరకృత్యాలను చేయించవచ్చు. మూఢమైన ధైర్యసాహసాలను ప్రదర్శింప చేయవచ్చు. ఆ ఉద్వేగం, ఉద్రేకం అణగిపోయిన తరువాత ఈ మనుష్యులే తాము చేసిన ఘోరకృత్యాలనుగురించి భయభ్రాంతులు కావటం కూడ సహజమె. సర్వసాంఘికోత్సాహ ప్రవాహాలలోను, కరుణ కోపం ఇత్యాది గుణాలలోను ఈ నిర్బంధశక్తి ఇదేవిధంగా ఉంటుంది. వ్యక్తి వీటిని జయిస్తూ వీటికి అతీతంగా ఉండటం సాధ్యపడే విషయంగాదు. ఒకవేళ అలా ఉండాలనుకొన్నప్పటికి సంఘశక్తివల్ల స్థితిగతులవల్ల అనేకబాధలకు గురికావలసివస్తుంది.

జనసమూహం ఉద్రేకాలు తాత్కాలికాలు మాత్రమే. అలాగే తనదేశంయొక్క పిలుపు నందుకొని కార్యోత్సాహం పొందే దేశభక్తుని భావతీక్ష్ణత కూడ శాశ్వతం కాదు. కాని దుర్ఖ్హీమ్ ఈ తాత్కాలికాలను కాక ఇంచుమించు స్థిరత్వం పొందిన కొన్ని సాంఘికవిషయాలను పేర్కొన్నాడు. ఒకవర్గంయొక్క 'సామూహికాత్మ'ను నిర్ణయించే న్యాయాలు, సూత్రాలు – నిబంధనలు కొన్ని ఉన్నవి. 'మరొక ప్రాణినీ చంపరాదు' 'మరొకరి వస్తువులను దొంగిలించరాదు.' ఈ మొదలైన సంప్రదాయక సూత్రాలు సామూహికాభిప్రాయోత్పత్తులే. ఈ సామూహికాభిప్రాయం వ్యక్తిమీద నిర్బంధంగా పనిచేస్తుంటుంది.

కాలక్రమాన సంప్రదాయాలుగా, సంస్థలుగా మారిన కొన్ని సామూహికాచారాలను ఈతడు పేర్కొన్నాడు. ప్రస్తుతం ఉన్న న్యాయస్థానాలు, ప్రభుత్వాలు, ఋణవిధానాలు, మతసంప్రదాయాలు ఈ మొదలైనవన్ని కొన్ని అలవాట్లచేతనే సంస్థలుగా మారినవి. ఈ సంస్థలను సంప్రదాయాలను ఉన్నవాటిని ఉన్నట్లుగా అంగీకరిస్తాడే తప్ప వ్యక్తి వీటిని సృష్టించడని దుర్ఖ్హీమ్ అంటాడు. ఇలాగే మరికొన్ని వాస్తవ సమూహాలు కూడ ఉన్నవి. జాతీయత, వివాహం, విడాకులు, ఆత్మహత్య అనేవి ఆయా సంఘాలలో క్రమవిధానంతో ఎల్లప్పుడు ఉంటున్నవే. కనుక ఇవి సంఘానికి సహజలక్షణాలు, వ్యక్తుల ప్రభావానికి అందని లొంగని విశేషాలు.

ఈ సాంఘిక విషయాల వాస్తవత్వాన్ని, నిర్బంధ ప్రవృత్తిని రుజువుచేయాలంటె దుర్ఖ్హీమ్ అనేక ఉదాహరణాలు ఇస్తాడు. భౌతిక మానసిక రంగాలవెంటనుంచికూడ అతడు ఉదాహరణలు చూపగలడు. మానవునిలో అంతరాత్మ ఉన్నదని, వ్యక్తి కోపోద్రేకాలకు లోనై అనుచిత కార్యాచరణ కాయత్తమైనపుడు 'నీవు చేస్తున్నది తప్పు' అని అంతరాత్మ గుచ్చిగుచ్చి బాధిస్తుంటుందని మనం అనుకొంటుంటాం గదా! ఈ అంతరాత్మ హెచ్చరిక అనేది ఇతని దృష్టిలో సంఘంయొక్క గొంతే. అంటె మన అంతరాత్మ సంఘానికి ప్రతిబింబం అన్నమాట. ఉదాహరణకు భవన నిర్మాణశిల్పం ఉన్నది. ఇది చాల ప్రాచీనమైనది కూడ కదా! ఇలాంటి పురాతన శిల్పాలను భవనాలను చూస్తూ, వాటితో పరిచయం ఏర్పరచుకోటంచేతనే పిల్లలు తమలో జాతీయాభిరుచులను రూపొందించుకొనటం జరుగుతుంది. మన రోడ్లు ఉన్నవనుకోండి, రోడ్లను ఈ దిశనుంచి ఈ దిశకు వేయాలి; ఇక్కడ ప్రారంభించి ఇక్కడితో అంతం చేయాలని మనకు కొన్ని నియమాలు ఉంటవి ఈ నియమాలు సంఘంలో ప్రబలంగాఉన్న ఆచారాదుల

జాతీయవాదం : దుర్ఖీహిమ్

వలన అభిప్రాయాలవలన ఏర్పడతవి. అందుచేత రోజ్ల దిశలు కూడా సంఘం ఒత్తిడికి లొంగే నిర్ణయింపబడుతవి.

సంఘం అనేది వ్యక్తిలో అంతరంగికంగా, అతనికి బాహిరంగానుకూడ ఉన్నదని దుర్ఖీహిమ్ విశ్వాసం. మానవుని వ్యక్తిత్వంలో ద్వైతం ఉన్నది. మనం చూస్తున్న వ్యక్తి రెండు వ్యక్తిత్వాల కూడలి అన్నమాట. ఈ రెండు వ్యక్తిత్వాలలో వైయక్తికమైన ఉనికి ఒకటి; రెండవది సాంఘికమైన ఉనికి. వ్యక్తిలో ఉండే ఈ సాంఘిక వ్యక్తిత్వమే అతనిలోని రెండు వ్యక్తిత్వాలలో శ్రేష్ఠమైనదని ఇతడంటాడు. ప్రతివర్గానికి కొన్ని విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆశయాలు ఉంటవి గదా! అసలు ఇలాంటివాటి సమాహారమే సంఘం అని కదా అతడు చెప్పినది. వ్యక్తియొక్క మనస్సులో ఇటువంటివాటికి స్థానం లేకుండ నెట్టివేయటం జరిగినప్పుడు సంఘమే చచ్చిపోతుందంటాడు. కాబట్టి సంఘాన్ని చంపివేయదలచుకొన్నవారికి ఇదే చక్కని మార్గం! అందుచేతనే ప్రతి సంస్కర్త కొన్ని సంప్రదాయాలమీద, విశ్వాసాలమీద దాడిచేసి వాటికి స్థానం లేకుండా చేయటానికి ప్రయత్నించాడు. ఇక్కడ ఒక్కవిషయం మాత్రం చెప్పక తప్పదు. వ్యక్తిలో రెండు వ్యక్తిత్వాలు ఉన్నవని, వాటిలో వైయక్తికమైన ఉనికి ఒకటని దుర్ఖీహిమ్ చెప్పినప్పటికి, ఇతని మొత్తం వాదంలో వ్యక్తికి విలువ పోయింది. సాంఘికాశయాలకు, సంప్రదాయాలకు కూడలిగా ఉండి వాటిని భద్రంచేయటంతప్ప వ్యక్తికి మరొక ప్రాధాన్యం లేకుండా పోయింది.

మతాన్ని దుర్ఖీహిమ్ సాంఘిక దృక్పథంతో వివరించి వ్యాఖ్యానించాడు. ఇతని వివరణ, వ్యాఖ్యానం చాల కొత్తవి; బహుశా అంతకుముందు ఎవరూ ఇలాంటి వ్యాఖ్యానం చేయలేదేమో. అతని మౌలిక పరిశీలనకు ఈ వ్యాఖ్యానం చక్కని ఉదాహరణ. పైగా అతని సాంఘిక రాజకీయాదిభావాలను గమనించటానికి ఈ వ్యాఖ్యానం మనకెంతో అవసరం. మతం విశ్వవ్యాప్తమై ప్రబల ప్రచారాన్ని పొందిఉన్నదని మనకందరకు తెలిసిన విషయమే. ఈ మతప్రాబల్యం మనలో అత్యధిక సంఖ్యాకుల జీవితంలో ప్రతిరంగంలోను ద్యోతకం అవుతూనే ఉన్నది. మన నడవడులు, కట్టుబాటులు, సంప్రదాయాలు అనేకం మతప్రాబల్యంవల్లనే నిర్ణయింపబడుతున్నవి. అంటే మతం మన దైనందిన జీవితంలో వాస్తవరూపం పొందుతున్నది. ఇంతగా విశ్వవ్యాప్తమై ప్రాబల్యం పొంది వాస్తవ జీవితాన్ని రూపుదిద్దుతున్న మతం—ఒక్క మతమే కాదు ఏదైనప్పటికి—నిరాధారమైన గాలిపోగు చేయటంవల్ల ఏర్పడదని, కేవలం నీటి బుడగవంటి క్షణికభావన కాదని అతని వాదం. ఈ మతం యొక్క ప్రేళ్ళు దైనందిన భౌతిక జీవితానుభూతులలో ఉండిఉండాలని అతడు తీర్మానించాడు. వాస్తవానుభూతుల ఆధారం లేనిదానికి అంతటి ప్రాబల్యం, విశ్వవ్యాప్తి లభించదని అతని గాఢవిశ్వాసం.

ఈ భావాన్ని రుజువు చేయటానికి దుర్ఖీహిమ్ కొన్ని పరిశీలనలు కావించాడు. ప్రాచీనసంప్రదాయబద్ధమైన ఆస్ట్రేలియన్ తెగల మతవిశ్వాసాలను గురించి ప్రత్యేక పరిశోధనలు కావించాడు. వారి విశ్వాసాలకు ఉన్న యథార్థానుభూతుల ఆధారాన్ని కనుగొని, వారి విశ్వాసాలలో పైపైన గోచరిస్తున్న చిహ్నాలనుండి విడదీసి మనకు చూపించటమే ఈ పరిశోధనల ఆశయం. ఈ పరిశోధన ఫలితంగా అతడిచ్చిన నిర్ణయం ఏమంటే మతం అనేది ఉద్వేగోద్రేకపూరితమైన సాంఘిక వాతావరణంనుంచి పుట్టినదని. దైనందిన జీవితంలోని విసుగుదలను పోగొట్టుకోవటం కోసం సాంప్రదాయికమైన ఆస్ట్రేలియన్ తెగలవారు తోడివారితో కలిసి ఆటలపాటలను ఏర్పరచుకొని, పాల్గొని, ఉత్సాహం, ఉద్రేకం పొందటం జరుగుతుండేది. ఆ వ్యక్తులు ఇలా కూడినప్పుడు ఆ ఉద్వేగ వాతావరణంలో వ్యక్తి తనను తాను మరచి విచిత్రపరిణామం పొందుతాడు. ఆ సందర్భంలో అతడు ఒక అనిర్వచనీయశక్తివల్ల మానసికంగా ఎక్కడికో కొనిపోబడతాడు. ఈ అనిర్వచనీయశక్తి వ్యక్తిలో పుట్టేదికాదు. కాని ఇది వ్యక్తిలో భాగమే. ఈ శక్తి అతనిలో ఒక పూజ్యభావాన్ని కలుగచేస్తుంది. కాని మానవుడు ఇలాంటి అనిర్వచనీయశక్తితో సంతృప్తిపడలేడు. దానికొక వాస్తవరూపం కల్పించుకొని సంతృప్తిపడటం అతనిలక్షణం. తన భావోద్వేగానికి పూజ్యభావానికి ఆధారంగా ఉండే ఆ అనిర్వచనీయశక్తికి రూపకల్పన చేయటం అవసరంగా భావించి అలా చేస్తాడు. అందుచేతనే ప్రతి మతం తన విశ్వాసాలకాధారభూతంగా ఒక వ్యక్తిత్వం, రూపం కలిగిన దేవుని సృజించుకొన్నది. నేటి మన జాతీయవాదానికి ప్రతిబింబంగా జాతికంతకు ఒక పతాకం ఏర్పరచుకోవటంకూడ ఇందుచేతనే. ఆనాటి కూడలులు అంతరించినప్పటికి ఆ ప్రాచీనదశలలో ఏర్పడిన రూపాలుమాత్రం ఉంటూనే ఉంటవి. రానురాను ఈ రూపాలే దేవుళ్ళై జాతిచిహ్నాలుగా తయారవుతవి. (సశేషం)

సంస్కారం!

శ్రీ ధనిష్ఠ

వేణుకి మనశ్శాంతి లేకపోయింది. అదేపనిగా గోపాలంమాటల జ్ఞాపకాలు కొస్తున్నాయి. ఆ పశుప్రాయుడు అన్నది పార్వతినిగురించే.

ఎంతో ఆనందంగా గడపాలని ఆశించిన సెలవు రోజున సగంలోనే దెబ్బలాట ఎదురైంది. ఆలోచనలు ఉక్కిరి బిక్కిరిచేస్తున్నాయి. ఈ పార్వతిని గురించి కాకపోతే ఆ హాస్యాన్ని తానూ 'ఎంజాయ్' చేసేవాడేమో...మాటలసందర్భంలో ఎప్పుడో తానా కుటుంబాన్ని గురించి స్నేహితులతో అన్నాడు. అది పట్టుకుని గోపాలం అలా అనేసరికి తనకి వెర్రెత్తిపోయింది.

మూడు నెలల్రితం తనీ యింట్లో రూంలో ప్రవేశించాడు. గతసంవత్సరం పిఠాపురం హాస్టల్లో రూముకి పదిమందివంతున ఉండి చదువు సాగక నానా తంటాలుపడి పరీక్ష తప్పుతుందేమో అనేస్థితికి వచ్చింది. అందుకే యీ యేడు హాస్టలికి స్వస్తిచెప్పి చినవాల్తేరులో యూనివర్సిటీకి దగ్గర అని చెప్పి అట్టే సదుపాయాలు లేకపోయినా యిరవై రూపాయలకి యీగది తీసుకున్నాడు. ఇక్కడ తనకి బాగానే ఉంటోంది. ఇంటాయన పేరు జగన్నాథంగారు. ఎక్కడో గుమాస్తాగిరీ వెలగబెడుతున్నాడు. ఇల్లు చిన్నదైనా జీతం సరిపోక తనకోగది యిచ్చాడు. ఈమూడు నెల్లలోను వాళ్ళ మాటలవల్ల తనకి తేటపడినది: పార్వతి జగన్నాథంగారి మేనగోడలనీ, తలిదండ్రులు లేరనీ, దానికి తోడు వైధవ్యం ప్రాప్తించి అటు అత్తారికీ ఏమీ లేకపోవడం వల్ల చాకిరీ చేస్తూ యిక్కడ పడిఉందని. సుభద్రమ్మగారి గొంతుక ఎంత మృదువైనదంటే—పిల్లల్ని గాని పార్వతినిగాని ఆమె తిట్టు లేకుండా సంబోధించదు. జగన్నాథంగారే ఆమెనోటికి దడుస్తారు. ఆమెకు పార్వతి తమయింట ఉండడం ఒకలా యిష్టమూ ఒకలా అయిష్టమూను. ఆమె చేసే చాకిరీ ఆమెకు యిష్టమే. అయితే ఆమెకు తిండీ బట్టా తామివ్వవలసి రావడంమాత్రం అయిష్టం. తమపాలిట శనిలా దాపురించిందని తరుచు అంటుంది. పార్వతి పెదవి కదపదు. ఈమూడు నెల్లలోను తను పెరటిలోకి రోజూ వెడుతూనే ఉన్నా ఏ నాలుగైదుసార్లో మాత్రం పార్వతి లీలగా కనబడింది. నిండా పద్దెనిమిదేళ్ళుండవామెకు. నిశ్చింతగా ఎక్కడో సంసారం గడుపుతూండవలసిన ఆమెగతి యిల్లా అయింది. ఇంకా జగన్నాథంగారు మంచివాడనే చెప్పాలి - యీ మాత్రం పోషించడమే ఘనత యీకాలంలో. ఇదీ పార్వతి కథ. రోజూ తనకి ఆమె తియ్యనికంఠం మాత్రం వినబడుతుంటుంది. ఆమె అంటే తనకి తగని జాలి. అయితేమాత్రం చెయ్యగలిగినదేముంది? ఇంకా దేశంలో యిల్లాంటి వారెందరున్నారో!

తనంటే జగన్నాథంగారికి గురి. ఎందుకంటె తానలరిచిల్లరి వేషాలు వెయ్యడు. రెండోది: తాను నెల తిరక్కుండానే అద్దె యిచ్చెయ్యడమే కాకుండా అవసరాలకు బదుళ్ళుకూడా యిస్తాడు. తనకు ఆయనకు ఎటువంటి పేచీ రాలేదు.

ఈ ఆలోచనలతో అటు దొర్లి యిటుదొర్లి ఎప్పుడో నిద్రపోయాడు వేణు.

నాలుగున్నరకు మెలకువ వచ్చింది. బద్ధకంగా కళ్లు తెరచి యిటు ఒత్తిగిలితే ఒళ్ళంతా నొప్పిగా అనిపించింది. లేచి ముఖం కడుక్కుని రూముకి తాళం వేసి యివతలపడ్డాడు. కాళ్ళు నెప్పిపెట్టాయి. క్రిష్ణా కేఫ్‌కివెళ్ళి ఆకలిలేకపోయినా అలవాటుగా దోసెతిని కాఫీ తాగాడు. హాస్టలు వేపు వెడదామనుకుని గోపాలంగాడి ముఖం ఎదురౌతుందేమోనని ఆ కోరికను ఉద్వాసన చెప్పాడు. అందుచేత చల్లగాలికోసమని బీచ్‌కి బయలుదేరాడు.

పోలీసు స్టేషన్ పక్కనించి సీవ్యూ హోటల్ ముందున్న తారోడ్డమ్మట B N R రెస్ట్‌హౌస్ దాటి కాలిబాటలోపడి "పామ్ బీచ్" బంగళా పక్కనున్న తాటితోపుల మధ్యనించి సముద్రపుటొడ్డు చేరుకున్నాడు.

ఇసకలో చతికిలపడ్డాడు. ఎదురుగా నురుగులు కక్కుకుంటూ విరిగిపడే కెరటాలతోను, హోరు పెడుతూను ఉండే నీలికడలి. చూపానినంతమేర కంటికింపు గూర్చే నీలిరంగు. ఆకాశంతో సముద్రం ఎక్కడో చేతులు కలుపుతున్నట్టే ఉంటుంది. కుడిపక్కకి దూరంగా వంపుతిరిగినఒడ్డు. ఎరాడకొండ, డాల్ఫిన్స్‌నోస్ కనబడుతున్నాయి. ఎడం పక్క

'లాపన్స్ షో'ని కనబడకుండా చేస్తూ నీటి అంచుకు చొచ్చుకుపోయిన శాంత్య్రశయంకోంప.

చూసి తనివితీరని ఆనందంతో గోజా పరవశమై పోయే వేణుకి యివాళ యివన్నీ శూన్యంగా కనబడుతున్నాయి. అతని మనస్సు ఆ దృశ్యంమీద లగ్నం కాలేకపోయింది. అతని మనస్సు అదేపనిగా ఆలోచిస్తోంది. అదివరకెన్నడూ ఆలోచించని పార్వతి అతని ఊహలను నింపింది. గోపాలం నోటిమీదుగా ఆమె పేరు రావటమే అందుకు కారణం.

నిర్గంధ కుసుమంలా ఆమె జీవితం వెళ్ళమారిపోవాలి. జీవితంలోని ఏ ఆనందం అనుభవించకుండానే ఆమె బ్రతుకు అంతం పొందుతుంది. మానవులలోని సహజమైన కోరికలకు ఆమె ఏనాడైనా లొంగిపోతే వేశ్యావాటికే ఆమెకు ఆశ్రయం కావలసిరావచ్చు. అదీ కాకపోతే బండచాకిరీతో మొద్దుబారిపోయి నడివయస్సులోనే వార్ధక్యానికో, దీర్ఘరోగానికో ఎర కావచ్చు. ఆమెను పునర్వివాహం చెయ్యడానికెవరు పూనుకుంటారు? కట్నకానుకలు లేకుండా ఆమెను చేపట్టేదెవరు? ఆమె ధనహీనురాలు, మాతాపితృ విహీనురాలు. ఆమెను ఆదరించేవారు లేరు. సానుభూతి చూపించేవారు లేరు. అనునయించేవారు లేరు. సుభద్రమ్మగారు ఆమె మీద అధికారం చెలాయించడంమాత్రమే చేస్తుంది. జగన్నాథంగారి మనస్సులో ఏమున్నా భార్యనోటికి దడిసి ఊరుకుంటాడు. ఆమె జీవితానికి నిష్కృతి ఎల్లా?

తానామెను ఉద్ధరిస్తే? గోపాలం అన్నదాన్ని నిజంచేస్తే?

తనతండ్రి వంశశాసనుడు. సనాతన ధర్మాల్ని జీర్ణించుకుని దానికే మురిసిపోతాడు. మొండిపట్టుదలవాడు. ఇటువంటిది కలలోకూడా అంగీకరించడు.

ఆలోచనలతో కాలం తెలియలేదు వేణుకి.

చీకటి పడింది. నల్లటి చీరమీద మెరుపు కోసం అద్దిన అభ్రకపు నలుసులులా మెరుస్తున్నాయి నక్షత్రాలు. కడలి హోరుతప్ప అంతా నల్లగా కనబడుతూంది. కంటికి ఇంపు కూర్చిన నీలిరంగు నలుపుగా మారిపోయింది.

ఉలిక్కిపడి లేచి నిలుచున్నాడు వేణు.

కాళ్ళు తడబడ్డాయి. కళ్ళు మంటలు. తల తిరుగుతున్నట్లనిపించింది. నడుద్దామంటే అడుగుపడటంలేదు. అతికష్టంమీద చీకట్లో దారి తడుముకుంటూ రోడ్డెక్కాడు. గది చేరుకోగలనా అనిపించిందతనికి. ఎల్లాగో రూంకి వచ్చి పడ్డాడు.

మంచంమీద పడుకున్నాడే గాని ఎప్పుడు వాంతి అవుతుందో అనిపించింది. అన్నం ఏమాత్రమూ అరగలేదు. వికారం, జ్వరం వచ్చేశాయి. దుప్పటి ముసుగు పెట్టుకుని పడుకున్నాడు. ఏదో తెలియని బాధ. మగతగా కళ్ళు మూశాడు.

ఎక్కడనించో నూతిలోంచి వస్తున్నట్టు "వేణుగారూ" అన్న తియ్యని కంఠం వినిపించింది. బలవంతంగా కళ్ళు తెరిచాడు. వీధి దీపంకాంతివల్ల కిటికీలోనించి వీధిలో వస్తువులు మసగ్గా కనిపిస్తున్నాయి. గదంతా చీకటే; కలగాబోలు ననుకున్నాడు గాని పైన పార్వతికంఠం తన్ను మళ్ళా పిలుస్తూ వినిపించింది. ఎక్కడా యింకా అలికిడి లేదు; టిక్కు టిక్కుమనే బిగిబెన్ తప్ప. రేడియం పెయింట్ వేసిన ముళ్ళు పన్నెండుగంటలని తెలియజేస్తూ ఒక దానిమీద ఒకటి ఉన్నాయి అబ్బ! పన్నెండే! అనుకున్నాడు. ముక్కులోంచి జ్వరతీవ్రతవల్ల వేడిగాలి వస్తోంది.

పైన మళ్ళీ పార్వతికంఠం. తూలిపోతూ వెళ్ళి తలుపుతీశాడు. తలుపుతోసుకుని పార్వతి లోపల అడుగుపెట్టింది. తలుపులు దగ్గరగా వేసింది. వేణు అతి కష్టంమీద మంచం చేరుకున్నాడు.

"జ్వరం వచ్చిందా?" అని నుదుటిమీద చల్లటి చెయ్యిఉంచి, అంతలోనే "అమ్మో కాలిపోతోంది" అంది.

"మీ రెలా వచ్చారు?" వేణు అడిగాడు.

"ఇప్పుడే మెలకువ వచ్చింది. మీ మూలుగు వినిపించింది."

"గట్టిగా మూలిగానా?

"ముందు మీరు పడుకోండి. మీ చిరిగిన పంచలేమైనా ఉన్నాయా?" మెల్లిగాను, మృదువుగాను ప్రశ్నించింది.

"ఆ పెట్టెలో ఉంటాయి."

బెడ్ లైట్ వేసి పెట్టెదగ్గరకెళ్ళి లోపలనించి చిరిగినపంచె తీసి చింపి చెంబులోని నీళ్ళలోముంచి పిడిచి వేణునుదుట వేసింది.

"మీ కెందుకీ శ్రమ?" అని "యింకవెళ్ళండి ఫరవాలేదు." అన్నాడు వేణు.

ఆమె కదలేదు. అయిదు నిమిషాల తరవాత గుడ్డతీసి మళ్ళీ నీళ్ళలోముంచి పిడిచి నుదుటిమీద వేసింది.

"మామయ్యని లేపి డాక్టర్ దగ్గరకు పంపనా?" అంది, ఆమే మళ్ళీ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

"వద్దు. రేపటికి అదే తగ్గిపోతుంది."

మళ్ళీ నిశ్శబ్దం.

"మీరు వెళ్ళండి. మీ అత్తయ్య చూస్తే ఏమనుకుంటారు?" అన్నాడు వేణు.

"వాళ్ళంతా నిద్రపోతున్నారు. వాళ్ళమాట అటుంచి మీరేమనుకుంటున్నారు?" మెత్తగా అన్నా కత్తులలా దూసుకుపోయాయి ఆ మాటలు వేణు హృదయంలోంచి. అణిగి ఉండి మెత్తగా కనిపించిన పార్వతిలో కొత్తలోతు లేవో కనబడ్డా యతనికి.

"నిస్సహాయస్థితిలో ఉన్న రోగిమీద దయదల్చిన కరుణాస్వరూపిణి అనుకుంటున్నాను." అన్నాడు వేణు నిండుదనంతో.

"ధన్యవాదాలు." అన్న ఆమె కంఠంలో తడి కనబడింది.

"ఆమాట నే ననాలి" అన్నాడు వేణు.

"మీరు పడుకోండి నిద్ర వచ్చేదాక నే నుంటాను." అంది అతనిమా వినిపించుకోనట్టు.

"నాకు నిద్రపట్టదు. విశ్రాంతిగా ఉంది. మీ రనవసరంగా శ్రమపడకండి. వెళ్ళండి. నాకోసంచి మీరు నిందలపాలు కావడం నాకిష్టం లేదు."

"నే నెలాగూ వెళ్ళక తప్పదు. ఈలోపున నిద్ర తెచ్చుకునేందుకు ప్రయత్నించండి."

"వాంతి అయేటట్టుంది."

"అయితే జాగ్రత్తగా అరుగుమీదకు వెళ్ళ గలరా?"

"ప్రయత్నిస్తాను." అని కాంప్‌కాట్ దిగి తూలుతూ వెళ్ళి అరుగుమీద కూలబడ్డాడు.

"నేను మళ్ళా వస్తాను." అంటూ ఆమె లోపలకు వెళ్ళింది.

రెండు పెద్ద వాంతులు వచ్చాయి. పొద్దున్న తిన్న వెజిటబుల్ పులావు, మధ్యాహ్నం తిన్న దోశ, యింకా అన్నం, అన్నీ వెళ్ళిపోయాయి. గుండెల్లో మంట బయలుదేరింది కాని కడుపు కాళీకావడంతో కొంత నయమనిపించింది. వాంతులనించి తేరుకుని మళ్ళీ పడుకునే సరికి ఆమె తిరిగి వచ్చింది.

"చప్పుడుకి యింట్లోవాళ్ళు లేస్తారేమోనని భయం కొద్దీ లోపల కెళ్ళాను." అంది ఆమె.

ఏం సమాధానం చెప్పడానికీ తోచలేదు వేణుకి. అరగంటవరకు ఆరారగా తడిగుడ్డలు వేణు నుదుటిమీద వేసి అతనికి నిద్రపట్టగానే యింట్లోకి వెళ్ళిపోయింది పార్వతి.

మొన్నాడు పొద్దున్నకి జ్వరం కొంత తగ్గింది. తొమ్మిదిగంటలకు జగన్నాథంగారు ఆఫీసుకు వెళ్ళబోతూ వేణుగది యింకా తెరిచే ఉండడం చూసి లోపలకి వచ్చారు.

"అదేం అలా ఉన్నారు? జ్వరం వచ్చిందా?" అని అడిగారు పడుకుని ఉన్న వేణుని చూసి.

"అబ్బె. రాత్రి కొంచెం పులకరం తగిలింది. అంతే."

"అరె. మమ్మల్ని లేపకపోయారా? పదండి డాక్టరు దగ్గరకి వెళదాం." అన్నారు.

"అబ్బె! వద్దండి. సగం తగ్గిపోయింది," మొహమాటపడ్డాడు వేణు.

"అయితే నేనే మందు పట్టుకొస్తానులెండి." అన్నా రాయన.

డిస్పెన్సరీనించి మందు, బత్తాయిపళ్ళు, హార్లిక్స్ అన్నీ తెచ్చి, యింట్లో వేణ్ణీళ్ళు కాచించి ఫ్లాస్కునిండా పోయించి ఆనవిధి నెరవేర్చుకున్నారు జగన్నాథంగారు.

ఆనాటిరాత్రి పార్వతి మళ్ళీ వచ్చి తనయోగక్షేమం కనుక్కుంటుందని ఆశించిన వేణు ఆశ నిరాశ అయింది.

మూడోనాటికి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. జగన్నాథంగారు పథ్యం తమ యింటిలోంచి తినిపించారు.

పథ్యంతిన్న రోజునే ఎందుకు లెమ్మని ఆరోజు రాత్రిభోజనం మానేశాడు వేణు. భోజనం చెయ్యక పోవడంచేత కడుపు కాళీగా ఉండి నిద్రపట్టలేదు. పుస్తకం తీసుకుని చదువుతున్నాడు.

ఇంట్లో అలికిడి తగ్గినతరవాత పార్వతి వచ్చింది.

"జ్వరంపూర్తిగా తగ్గిందా?" అడిగింది.

"మీ దయవల్ల." అన్నాడు వేణు.

"రేపు మీ రింటికి వెళ్ళిపొండి." అంది పార్వతి.

"ఏం?"

"కాస్త ఆరోగ్యం కుదుటపడేవరకు యింటిపట్టున తిండి తినడం మంచిది." అంది.

"అలాగే మీ రెంతవరకు చదువుకున్నారు?"

"అలా అడుగుతున్నారేం?" ఆశ్చర్యపోతూ అడిగింది పార్వతి.

"చెప్పండి." అన్నాడు మళ్ళీ, ఆమె ప్రశ్నని ఉపేక్షిస్తూ.

"తెలుగురామాయణం చదవడం వచ్చు." అంది.

"అభివృద్ధిచేసుకుందుకు ప్రయత్నిస్తున్నారా?"

"తీరిక లేది?"

"మీ మామయ్యతో చెప్తాను మెట్రిక్‌కి కట్టడానికి ప్రయత్నిస్తారా?"

"ఎక్కడ కుదురుతుంది! అయినా అవన్నీ ఎందుకు చెప్పండి. ఇలాగడిచిపోతే చాలదూ?"

"ఎందుకు ఆత్మవంచన చేసుకుంటారు? జీవితం అంతా యిలాగే గడిపేస్తారా?"

"అందని మానిపండ్లకి అర్రులు చాచమంటారా?"

సంస్కారం!

"అది కాదు నేననేది ప్రయత్నిస్తే సాధ్యం కానిదేదీ ఉండదు. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకుని ఎందరినో ఉద్ధరించొచ్చు."

"తేలిపోని ఆశలు పెంచుకుంటే యీమాత్రం శాంతీ ఉండదు." అంది నిర్లిప్తంగా పార్వతి.

"నాకు తోచినది చెప్పాను. పైన మీయిష్టం. నా సహాయానికి లోటుండదు."

"ధన్యవాదాలు. కాని మీరు మాత్రం రేపెంటికి వెడతారు కదూ?"

"అల్లాగే."

పార్వతి వెళ్ళిపోయింది.

మొన్నటి సుభద్రమ్మగారి ధుమధుమలు మరింత ఎక్కువయ్యాయి. పార్వతిమీద మండిపడు తూంది.

కాలేజికివెళ్లి గంటతరవాత నీరసం అనిపించి రూంకి వచ్చేశాడు వేణు.

సుభద్రమ్మగారి ఇంట్లోంచి వెక్కి వెక్కి ఏడుపు వినిపిస్తోంది. సుభద్రమ్మగారు కంఠం సాధ్యమైనంత తగ్గించి నానామాటలు అంటోంది. మధ్య మధ్య తన పేరు వస్తోంది.

"నాకళ్లుకప్పి యిదా నువ్వాడుతున్న నాటకం? ఎన్నాళ్ళనించి సాగుతోంది యీ వ్యవహారం? మీ మామయ్యతో చెప్పి యిదేమిటో యివాళే తేల్చేస్తాను. మా పరువు మర్యాదా మంట కలిపేస్తావా? దొంగముండ రాలా! దిక్కులేక మాయింట పడుండి మాకే అప్రతిష్ఠ తెస్తావా? వాడిసంగతి నీసంగతి యివాళే తేలి పోవాలి" అంటోంది.

"నాకే పాపం తెలీదత్తయ్యా నీపాదాల సాక్షి. నన్ననుమానించకత్తయ్యా." దీనంగా ఏడుస్తూ అంది పార్వతి.

"నీకేం తెలీదు! సంగనాచీ! అర్ధరాత్రి వాడి గదిలో నీకేం పని?"

పార్వతి మాట్లాడలేదు.

వేణురక్తం ఉడుకెత్తింది. తనమూలంగా నిర్దాక్షిణ్యమైన హింసకు గురి అవుతూంది పార్వతి. అది అతను సహించలేకపోయాడు. స్త్రీ పురుష లింగభేదాని ఎప్పుడూ అనుమాన దృక్కులతోటే చూసే సమాజం అంటే అసహ్యం వేసింది. అర్ధరాత్రి తనగదిలో అడుగు పెట్టినంతమాత్రాన ఆమె చేసిన తప్పేమిటో ఎంత తిన్నుకున్నా అర్థంకాదు. సీరియస్ గా జగన్నాథం గారింట్లోకి వెళ్ళాడు.

వేణువుని చూసిన సుభద్రమ్మగారు తొట్రుపడింది.

"ఆగండి. ఆమె నవవసరంగా బాధించి అవమానించకండి. ఆమె చేసిన తప్పు ఒక్కటే. ఆది జ్వరంతో బాధపడుతున్న నన్ను కనికరించడమే. ఇప్పటికి మీ రామెను పెడుతున్న బాధలు చాలు. ఇంకా క్షోభపెట్ట కండి." అన్నాడు.

"మాయింటికి వచ్చి నువ్వవరివయ్యా మమ్మల్ని న డానికి? మాయింట్లో మాయిష్టం వచ్చినట్లనుకుంటాం. నీకెందుకు మధ్య. అయినా నువ్వుమాత్రం తక్కువ తిన్నావా? నిన్నుమాత్రం వదిలి పెడతా మనుకోకు. ఇటువంటి వాడివంటే అసలు యిల్లు యిచ్చేదే కాదు. ఇల్లా ఎంతమంది కొంపలు కూలుస్తున్నావో" అంటూ భద్రకాళిలా అరిచింది సుభద్రమ్మ.

"నోటికొచ్చినట్టు మాట్లాడకండి. అందులో ఎవరూ చేసిన తప్పూ ఏమీలేదు. మీ అనుమానం తప్ప యిక్కడ కొంపలేం మునిగిపోలేదు. మీ రెవర్నీ ఏమీ అనక్కర్లేదు. ఆమెను నేను పెళ్లి చేసుకుంటాను." అన్నాడు వేణు.

సుభద్రమ్మగారు, పార్వతికూడా కొయ్యబారి పోయారు. పార్వతి తేరుకుని అంది:

"ఉద్రేకంలో ఏదో చేసి నాకోసం మీరు బాధ పడవద్దు. నాబ్రతు కెలాగా నాశనం అయింది. నన్నిలా ఉండనివ్వండి."

"పార్వతీ నేను మనఃపూర్వకంగా చెప్తున్నాను. నన్ననుమానించి అవమానించకు."

"మీరు చెయ్యదల్చుకున్నదానికి నా అంగీకారంకూడా కావాలనేమాట మర్చిపోకండి."

"పార్వతీ!"

"మీరు తొందరపడి నాకోసం మీ జీవితాన్ని త్యాగం చెయ్యడం నేను అంగీకరించను."

"పార్వతీ! ఆత్మవంచన చేసుకోవద్దని బతిమాలు తున్నాను.

పార్వతి ఏమీ మాటాడలేదు.

వేణు ఏమీ మాట్లాడలేక బైటకు వచ్చేశాడు.

ఆవేదనతో మధు దగ్గరకెళ్లి అంతా వివరించాడు.

"వేణూ! ఆమె చెప్పినట్టు నువ్వే తొందరపడు తున్నావేమో" అన్నాడు అంతా విని మధు.

"మధూ! నీకు పుణ్యం ఉంటుంది నన్నింక చంపకు. ఇంతవరకు వచ్చింతరువాత ఆమెను అధోగతి చెయ్య లేను. నేనేమైపోయినా సరే. ఎదైనా జరిగితే యిద్దరు కలిసే అనుభవిస్తాం ఆమెగతికి ఆమెను విడిచి నా జన్మలో సుఖించలేను. నీ సహాయం కావాలి, అంటూ అతిదీనంగా మొరపెట్టుకున్నాడు.

మధు కరిగిపోయాడు.

ఇద్దరూ జగన్నాథం గారింటికి వచ్చారు.

సాయంకాలం యింటికి వచ్చి అంతా తెలుసుకున్న జగన్నాథంగారు నవ్వాలో ఏడవాలో అర్థం కాక తికమకపడ్డారు.

"మీరన్నది నిజమేనా?" అని అడిగాడు వేణుని.

"అక్షరాలా..." అన్నాడు వేణు తగ్గిన స్వరంతో.

ఆయనకు ఆనందంవల్లనో విషాదం వల్లనో గాని కళ్లనీళ్లు నిండుకొచ్చాయి.

"మా పార్వతి అదృష్టవంతురాలు నాయనా." అన్నప్పుడు మాత్రం ఆయన కంఠంలో పట్టలేక ఆనందమే ధ్వనించింది.

పార్వతిని ఒప్పించడానికి బ్రహ్మాండం తలక్రిందులైంది.

పట్టుదలవల్ల, పరిస్థితుల ఒత్తిడులవల్ల తొందరపడిన వేణుకి అడుగడుగునా సమస్యలే అయ్యాయి. ఇంతవరకు జరిగిన తరువాత పెళ్లి వాయిదా వేస్తే వెయ్యి అనుమానాలకు, లక్ష అఘాయిత్యాలకు దారితీస్తుంది. పెళ్లి అనే రెండక్షరాల పదానికి 'లీగల్ స్టేటస్' ఎంతో ఉంది.

మొట్టమొదట తండ్రికి తెలియజెయ్యడమా, మానడమా అన్నది. ఒక్కడే పుత్రుడు కావడంవల్ల ఆయన మెత్తబడే అవకాశాలున్నా అది ఊహగా మాత్రమే నిల్చిపోవచ్చుననడానికి ఎక్కువ ఆధారమే ఉంది. చదువు నడిసముద్రపు నావలా ఉంది. ఆరునెల్లలో కోర్సు అయిపోతే వచ్చే ఉద్యోగానికీ, యింతతో ఆపేస్తే వచ్చే ఉద్యోగానికీ యోజనాల వ్యత్యాసం ఉంది. తండ్రికి తెలియజేసి ఆయన నిజంగానే మొండిపట్టు పట్టి వ్యతిరేకిస్తే తన జీవితపథంలో ముళ్లమొక్కలు ప్రత్యక్షమౌతాయి. చదువు మధ్యలో ఆగిపోవడమే కాకుండా అసలు పెళ్లికే ఆటంకం వస్తే పార్వతి జీవితం బలిఅయిపోతుంది.

ఆఖరికి మిత్రబృందం అంతా ఆలోచించి ఒక పథకం తయారుచేశారు. పెళ్లి చేసుకుని తండ్రికి తెలియనివ్వకుండా, చదువు సాగిస్తూ తండ్రిపంపే సొమ్ముతోనే సంసారం సాగనియ్యడం.

పుట్టెడు బలగం ఉండి తల్లిదండ్రుల కొక్కడే మగబిడ్డఅయి, కావలసిన వాళ్లంటూ ఎవరూ లేకుండా జీవితంలో మరో అధ్యాయం ఆరంభించడం, ఎంత కష్టం తోచినా, వేణుకి తప్పలేదు.

తండ్రి ఎంత మండిపడతాడో అనిగాని. తల్లి తన్ను చేజేతులా పెళ్లికొడుకుని చెయ్యలేకపోయానే అని ఎంత విచారిస్తుందో అనిగాని, అన్న పెళ్లి తమకు తెలియకుండా అయిపోయిందే అని చెల్లెళ్లు ఎంత బాధపడతారో అనిగాని లక్ష్యపెట్టడానికి వీలులేని యిరకాటంలో పడిపోవలసివచ్చింది వేణు.

స్నేహితులే చుట్టాలుగా, రిజిష్ట్రారు ఆఫీస్ దైవసన్నిధిగా, రిజిష్ట్రారే పురోహితుడిగా అగ్నికంటే శక్తిమంతులైన సాక్షుల సమక్షాన పార్వతి వేణుల పెళ్లి ముగిసింది.

తండ్రి స్థితిపరుడు కావడంవల్లా, తను పెద్ద చదువు చదువుతుండడంవల్లా నెలకు రెండువందలు తెప్పించుకోగల తాహతుగల వేణుకు పార్వతి బరువు కాలేదు.

ఇల్లొకటి అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు. జీవితం మూడుపువ్వులు ఆరుకాయలు అనిపించింది. తనగురించికదా తల్లిదండ్రులకు వేరై అజ్ఞాతవాసం గడుపుతున్నాడు వేణు అని పార్వతి అనుకుని "నా కోసంకదా మీకిన్ని కష్టా"లని వేణుతో అనడం, "ఛా అలా అనకు" అంటూ వేణు ఆమె నోటిని తన పెదవులతో మూయడం, ఆ సంసారంలో నిత్యసంఘటనలై పోయాయి.

పరీక్షలు దగ్గరకురావడంచేత సంక్రాంతి సెలవులకు యింటికి రాలేనని వేణు తల్లిదండ్రులకు వ్రాశాడు. కాబోలుననుకుని సమాధానపడ్డారు తల్లిదండ్రులు బాధపడుతూనే. తత్కారణంగా అనుమానాలకు ఆస్కారం, ఆలుమగలకు వియోగం తప్పిపోయాయి.

మేలో పరీక్షలయిపోవడం అప్పటికే పార్వతి గర్భం ధరించడం జరిగాయి. నెల్లాళ్ళు కలకత్తాలో ట్రైనింగు ఉందని తండ్రికి రాసి మరో రెండువందల డబ్బూ, మరో నెల్లాళ్లు గడువు పొందాడు వేణు.

కాలం గడుస్తున్నా ఎటువంటి తుపానులో చిక్కుకుంటుందో యీ జీవితనౌక అని యిద్దరికీ భయంకలుగుతున్నా ఒకరికొకరు ధైర్యం చెప్పుకునేవారు.

వంశోద్ధారకుడు ఉదయించబోతున్నాడన్న వార్త గాని, అసలు పెళ్లయిందనే సంగతిగాని తల్లిదండ్రులకు తెలియజెయ్యలేకపోతున్నానే అని వేణు ఎంత మథనపడ్డా చెయ్యగలిగిందేమీ లేకపోయింది.

జూన్ ఆఖరకు ఒకసారైనా తల్లిదండ్రులకు ముఖం చూపించక తప్పని పరిస్థితి ఏర్పడింది వేణుకి. కొత్తపథకం ఏం వెయ్యాలా అని ఆలోచించి "రిసెర్చి" వంకపెట్టి ఉద్యోగం వచ్చేవరకు తండ్రి ధనంమీదనే ఆధారపడదలిచాడు వేణు. నాలుగు రోజులలో తిరిగి వస్తానని పార్వతికి మాటయిచ్చి యింటికి బయలుదేరాడు వేణు.

సంస్కారం!

సంసారం హడావిడిలో పడి చదువు సన్నగిల్లి ఫస్టు క్లాసులో వస్తాడనుకున్న వేణు సెకండు క్లాసులో మాత్రమే వచ్చాడని తలిదండ్రులు అనుమానించలేదు. ఏదో గట్టెక్కాడని సంతోషించారు.

ఇంటికి రాగానే తను పథకంలో వేసుకోని కొత్తసమస్య ఒకటి ఎదురు కావడంతో బిత్తర పోయాడు వేణు.

ఇంటికి వచ్చిన రెండోరోజున భోజనాలదగ్గర వచ్చింది ప్రస్తావన. తను, తండ్రి పక్కపక్క భోజనాలకు కూర్చుండగా — "సాయంకాలం బండికి యిద్దరూ వెళ్ళి ఆ పిల్లని చూసిరండే." అన్నాడు తండ్రి తన్నుద్దేశించి తల్లితో ఆ ఊరుపేరేదో చెప్పి.

వేణుగుండెల్లో రాయి పడింది.

"అబ్బాయి నడగండి..." అంది తల్లి.

"చూసిరావడానికి వాణ్ణడిగే దేమిటి?" అన్నాడు తండ్రి.

"ఏరా నాన్నా?" తన్నడిగింది తల్లి.

"నాకిప్పుడప్పుడే పెళ్ళి వద్దమ్మా!" అన్నాడు తండ్రి కాబోతున్న వేణు.

"ఎన్నాళ్ళని కూర్చుంటావురా? 'బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా —' అని — ఇదివరకటి దాక అంటే పోనీ చదువు అయిపోవాలన్నావు. ఇప్పుడది అయింది. ఇంకా ఎన్నాళ్ళు?" గుడ్లురిమాడు తండ్రి.

"అబ్బా! వాణ్ణలా హడలగొట్టేస్తారేమిటి? మీరించే వాడసలు సెలవులకి రావడం కూడా మానుకుంటున్నాడు — నాన్నా! ఇదివరకూ నీమాటే కానిచ్చాంగా — ఆడపిల్ల లెలాగూ అత్తారిళ్ళకెళ్ళి పోతారుగదా యింట్లో నేనొక్కత్తిని — పోనీ ఆ కోడలు పిల్లయినా వస్తే యిల్లు నిండుగా ఉంటుంది. నీకడుపున నాలుగు కాయలు కాస్తే యింట్లో చంటిపిల్లలు లేని లోటు కూడా తీరుతుంది." అంది అటు భర్తని మందలిస్తూ, యిటు కొడుకుని లాలిస్తూ.

వేణుకి అటువంటి తండ్రిని వంచించినందు కెంత ఆనందమైందో, ఇటువంటి తల్లిని మభ్యపెట్టి నందుకు అంతబాధ వేసింది. కాని ఏమీ మాట్లాడలేదు.

"ఏరా బాబూ!" అంది తల్లి మళ్ళీ.

"నువ్వలా మెత్తబడబట్టే వాడలా నెత్తికెక్కుతున్నాడు. చదువుకున్నవాడుగదా పదిసార్లు చెప్పించుకోవాలా?" తండ్రి గదమాయించాడు.

"ఇంకా రెండేళ్ళు రిసెర్చి చేయ్యాలని ఉంది." అన్నాడు వేణు.

"అదేదో పెళ్ళయ్యాక కానియ్య..." అన్నాడు తండ్రి.

ఈ నాన్నుడు వ్యవహారం చూసి తల్లికి అనుమానం వేసింది.

"వాడప్పుడే ఎవర్నైనా చూసుకున్నాడేమో?" అంది.

"అయితే ఆ ముక్క చెప్పొచ్చుగా? ఎవరు? ఏవూరు?" అడిగాడు తండ్రి.

భోజనాలై బైటకువచ్చేసిం తరువాత అన్నింటికీ తెగించి చెప్పేశాడు వేణు.

తల్లి తల్లక్రిందులైంది. సంతతధారగా కన్నీళ్ళు స్రవించింది. కాని తేరుకుంది.

తండ్రిమాత్రం అపరభార్గవుడే అయిపోయాడు.

"ఛండాలుడా! మేం చచ్చామనుకున్నావా? ఇంకా ఏ ముఖంపెట్టుకుని వచ్చావ్ యింటికి. వెధవముండని పెళ్ళాడావా? నీకింకేం గతిలేకపోయిందా. నా ఎదుటనించి పో. ఇంక జన్మలో నీముఖం చూపించకు. నాకడుపున చెడబుట్టావు. నాదంతా స్వార్జితం. నా ఆస్తిలో కానీ ముట్టకుండా చేస్తాను. నాకు నీళ్ళు వదిలే హక్కులుకూడా పోగొట్టుకున్నావు. ఫో బైటికి!" గర్జించాడు.

"అర్థంలేని ఆచారాల్ని పట్టుకు దేవులాడే అవసరం నాకు లేదు నాన్నా. నీ ఆస్తిలో కానికి కూడా నేను ఆశించటంలేదు. నన్నింతవాణ్ణి చేసినందుకు జీవితాంతం కృతజ్ఞుడిగా ఉంటాను. ఏనాడైనా నువ్వు మనస్సు మార్చుకుంటే తెలియజెయ్యి." అన్నాడు వేణు స్థిరంగా.

"బాబూ!" అంటూ ఆక్రోశించింది తల్లి యీ పరిణామాలకి తట్టుకోలేక.

"క్షమించమ్మా. నాకు మనఃపూర్వకంగా మంచిదని తోచింది గనకే చేసుకున్నాను. పెళ్ళిఅనేది నా వ్యక్తిగత సమస్య. దాన్ని పరిష్కరించుకోవడం నేనే చెయ్యాలి. మీకు తెలిస్తే విచారిస్తారనే తెలియజెయ్యలేదు." అన్నాడు వేణు.

తల్లి గొంతుక మూగపోయింది.

"వస్తానమ్మా." అంటూ పాదాభివందనం చేశాడు.

"సుఖంగా వర్ధిల్లు నాయనా." అంది కన్నీళ్ళతో.

అటు తిరిగి ఉన్న తండ్రికి అక్కడినించే నమస్కరించి బైటపడ్డాడు.

దావాలో సర్వస్వం పోగొట్టుకున్న వాడిలా ముఖంపెట్టుకువచ్చిన వేణుని చూసిన పార్వతిముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేకపోయింది.

"ఏమైంది?" ఆత్రంతో అడిగింది.

"ఏమీ కాలేదు" ఉదాసీనంగా అన్నాడు వేణు.

"చెప్పరూ!" ఆర్ద్రంగా వేణు ముఖంలోకి చూస్తూ అడిగింది.

"అమ్మ క్షమించింది పారూ."

"మరి మామయ్య ఏమన్నారు?"

"ఆయన అంగీకరించలేదు."

"అంతేనా!"

"అంతే. కాకపోతే ఆస్తిలో చిల్లిగవ్వ యివ్వనన్నారు. తనకింక ముఖం చూపించవద్దన్నారు."

"నాకుంచేగా మీకష్టాలన్నీ. అయినవాళ్ళందర్నీ, ఆస్తినీ వదులుకున్నారు—కాని ఒక్కటి మీరు ముందే తెలుసుకుని ఉండవలసింది. మునిగిపోతున్న వాణ్ణి రక్షించడానికి ప్రయత్నించిన వాడుకూడా అపాయంలో చిక్కుకుంటాడనే విషయం—నిర్భాగ్యురాల్ని. నాతోపాటు మిమ్మల్ని కూడా అగచాట్ల పాలు చేశాను." అంటూ వాపోయింది.

"ప్రపంచం ఏమైపోయినా నువ్వుంటే చాలు పారూ. నిన్ను నిందించుకుని నన్ను బాధపెట్టకు." అన్నాడు వేణు ఆమెను కౌగిలిలోకి తీసుకుంటూ.

తండ్రి పంపించే డబ్బు ఆగిపోవడంతోను, ఉద్యోగం దొరక్కపోవడంతోను గట్టునపడవేసిన చేపలా అయిపోయింది వేణుపని. తానొక్కడే రెండు వందలు తెప్పించుకుని శ్రీమంతుడిగా వెలిగిన వాడిప్పుడు చేతి చిల్లి కాని లేకుండా కనబడిన స్నేహితుడిదగ్గరల్లా అప్పుతీసుకోవలసివచ్చింది.

ఎంతో ప్రయత్నించి ఎన్నో సిఫార్సులు చేయించినమీదట నెల్లాళ్ళకి లోకల్ కాలేజీలో డిమాన్‌స్ట్రేటర్ పోస్టు దొరికింది. అమాంబాబతులు నూట నాలుగు రూపాయల జీతం.

తక్కువ అంతస్తులో బ్రతికినవాడికి ఎక్కువ వస్తే లాభం, ఆనందమూను. అదే ఎక్కువలో బ్రతికిన వాడి బ్రతుకు దిగజారిపోతే యమయాతనలకు గురి కావలసివస్తుంది. హెచ్చుస్థాయికి అలవాటుపడిన జీవితం ఒక్కసారిగా తక్కువలోకి పడలేదు. ఆదాయం ఎటువున్నా ఖర్చులు మాత్రం అవుతుంటాయి.

పదిహేనో తారీఖుకల్లా జీతం అయిపోయేది. ఆపైన దొరికినచోటల్లా అప్పుచెయ్యడం జీతం రావడంతోనే సగండబ్బు అప్పులు జమకట్టడానికి సరిపోవడం జరుగుతుండేది. వేణు సిగరెట్లు మానేసేడు. సినిమా అన్నది మర్చిపోయాడు. ఎరఖాసులు పెట్టడానికి కూడా డబ్బులేక ఉద్యోగాలకు దరఖాస్తులు వెయ్యలేక నిస్సహాయంగా ఊరుకునేవాడు. దీనికి తోడు రోజులు గడిచే కొలది పార్వతికి పురిటిరోజులు దగ్గరకు వచ్చేవి.

అక్టోబరు యిరవై రెండో తారీఖు—

పార్వతికి తొమ్మిది నెలలు నిండాయి. రేపో మాపో పురుడు వచ్చేటట్టుంది. పక్కవాటాలో ఉన్న ఆవిడ లేడీ డాక్టరుకు చూపించమని సలహా యిచ్చింది. అసలే మొదటికాన్పు. ఇద్దరికీ అనుభవం తక్కువ. వేణుకి మతిపోయింది. తోడెవ్వరూ లేరు. చేతిలో పైసా లేదు. ఏంచెయ్యడానికీ తోచలేదు. నెలాఖరు రోజులు కావడంతో ఎక్కడా అప్పు దొరకలేదు. ఏం అమ్మివేద్దామనుకున్నా ఖరీదైన వస్తువులు కనబడలేదు.

"పారూ ఎల్లావుంది?" అని అడిగాడు వేణు ఏమీ తోచక.

"ఏమో ఎందుకో భయంగా వుంది." అంది పార్వతి.

"పక్కింటి ఆవిడ లేడీ డాక్టర్‌కి చూపించమంది. తీసుకురానా?" ఎల్లా తీసుకురావాలనేది సమస్య అనే తేలీలేదు అతనికి.

"ఎక్కడినించి తీసుకువస్తారు. డాక్టరు ఊరికే వస్తుందా? డబ్బేది?" నిర్లిప్తంగా నవ్వింది పార్వతి.

అప్పుడు తెలిసివచ్చిందతనికి తనకి తెలియని ఎన్నో సమస్యలున్నాయని. తన నిస్సహాయతకి దుఃఖం పొంగింది. అది తండ్రిమీది కోపంగా మారింది. ఆయన మూర్ఖుడు కావడంవల్ల నేకదా తనకి అన్నీ వుండి దరిద్రం అనుభవించవలసి వస్తోంది?

ఆముక్క అన్నాడు పార్వతితో.

"పాపం! ఆయనేం చేస్తారు. మీరు చేజేతులా తెచ్చిపెట్టుకున్నదిది. అష్టైశ్వర్యాలతో తులతూగే యింట్లో పుట్టారు. పువ్వులా బ్రతికారు. ఎంతో చదువుకున్నారు. నాలాంటి నిర్భాగ్యురాల్ని కట్టుకోవడంచేత అన్నీ ఉండి కూడా అవస్థలు పడుతున్నారు." అన్న పార్వతికంఠం బాష్పగద్గదమైంది.

"వద్దు పారూ! అట్లా అనకు. నీవల్లే నాకీ మాత్రం సుఖమైనా ఉంది. కాని నిన్నేదో ఉద్ధరిస్తానని తీసుకువచ్చి కష్టపెడుతున్నాను. లేని ఆశల్ని నీలో కలిపి నిన్నీ గతికి తీసుకువచ్చాను."

"ఎంత పిచ్చివారండీ!—పోనీండి యింకట్లానను—మిమ్మల్ని నొప్పించను. కాని ఒక్కటి మాత్రం గ్రహించండి. ఈ క్షణంలో నా ప్రాణం పోయినా, యీ యేడాది సాహచర్యం, మీ సాన్నిహిత్యం నా జీవితానికి చాలు."

సంస్కారం!

"ఏమిటి పారూ! ఆ పాడుమాటలు — ఇంతకీ యిప్పుడు డాక్టర్ మాటేమిటి?" అన్నాడు వాస్తవ ప్రపంచంలోకి మళ్ళీ వచ్చి.

"బండి తీసుకు రండి జనరల్ హాస్పిటల్ కి వెళదాం."

"అక్కడ గంటలతరబడి నిరీక్షించాలి"

"అయితేమాత్రం తప్పుతుందా; డబ్బు లేనప్పుడు."

"పోనీ అమ్మేద్దామంటేనా ఖరీదైన వేవీ లేవు. ఒక వెండికంచమైనా — అదీ. అన్నట్టే వాచీ అమ్మేస్తే ఒక నూరురూపాయలైనా వస్తాయి. ఈ విషయం యిన్నాళ్లు గుర్తుకి రాకపోవడం నా అదృష్టం. లేకపోతే యీపాటికే అయిపోయివుండును."

"వాచీ అమ్మేస్తారా!"

"మంచిరోజులొచ్చినప్పుడు మళ్ళీ కొనుక్కుందాం పారూ."

తండ్రి తన పుట్టినరోజుకు బహుమతి యిచ్చిన వాచీ అది. అప్పుడు మూడువందలు పెట్టి కొన్నాడు. ఆ రకం వాచీధర యిప్పుడు విపరీతంగా పెరిగిపోవడం వల్ల పాతవాచీకే రెండువందల చిల్లర వచ్చింది.

ఆరోజున ఆ రెండువందలు అతనికి రెండు లక్షలలా అనిపించాయి. పెన్నిధి దొరికినట్లు ఆనందించాడు.

చేతిలో డబ్బుంటే మనిషి రాజే! అనుకున్నవన్నీ క్షణాలమీద జరిగిపోయాయి. డాక్టర్ వచ్చింది. చూసింది. రెండుమూడురోజుల్లో పురుడు వస్తుందనీ, భయం లేదనీ చెప్పింది,

ఇరవై ఆరో తారీఖున పార్వతి సుఖప్రసవమై మగబిడ్డను కన్నది. పొత్తిళ్ళల్లో బిడ్డను చూసుకుని మాతృమూర్తి అయిన పార్వతి ముఖంలో గర్వం, ఆనందం వెల్లివిరిశాయి. వేణు సంతోషానికి అవధులు లేకపోయాయి.

కష్టాలొచ్చినా, సుఖాలొచ్చినా వరసగానే వస్తాయి. పుత్రోదయంతోపాటు వేణుకు అదివరలో ఎప్పుడో అప్లైచేసి ఆశవదులుకున్న లెక్చరర్ పోస్టుకు పిలుపువచ్చింది. భార్యా పుత్రసమేతంగా బెజవాడ చేరుకున్నాడు వేణు, కొత్త ఉద్యోగంలో చేరడానికి.

వందరూపాయలలో గడుపుకుని ఎలాగో అలా కాలక్షేపంచేసిన ఆ ప్రాణాలకి రెండువందలు రావడంతో కాస్త చెయ్యితిప్పుకుందికి వీలైంది. ఎండిపోయిన జీవితం మళ్ళీ చిగిర్చింది.

ఒకరోజున వేణు చేతిలో ఒక పార్శిల్ తో యింటికి వచ్చాడు.

గుమ్మంలో బాబునెత్తుకుని చిరునవ్వుతో స్వాగతం యిచ్చిన పార్వతిబుగ్గన చిటికవేసి పార్శిల్ ఆమెచేతికిచ్చి బాబుని చేతులలోకి తీసుకున్నాడు.

"ఏమిటిది? పుస్తకాల్లా ఉన్నాయే" అంది పార్వతిపాకెట్ విప్పుతూ.

"అవును మెట్రిక్ పుస్తకాలు" అన్నాడు వేణు.

"ఎందుకు?"

"నువ్వు పరీక్షకు కట్టడానికి."

"మీకు వెర్రా ఏమిటి! పిల్లడి తల్లిని నాకిప్పుడు చదువేమి టండీ?" నవ్వుతో పాటు ఆశ్చర్యంకూడా ప్రదర్శించింది పార్వతి.

"చదువుకి వయస్సేమిటే ముసలమ్మా! ఏరా బాబూ?" తన విట్టుకి తనే నవ్వుకుని బాబుని ఎగరేసి చేతులలోకి పట్టుకున్నాడు.

"అరె! ఏమిటి వాణ్ణలా ఎత్తి కుదేస్తారు? పొరపాటున చేయిజారినా —" వాక్యం పూర్తి చెయ్యలేకపోయింది.

"నువ్వేకన్నావుటే వాణ్ణి! నా కేమీ కాడూ. ఏరా బాబూ నువ్వు మీ అమ్మకొక్కర్తికేనా కొడుకువి!" అంటూ కొడుకుని పార్వతికిచ్చి యిద్దర్నీ చేతుల్లో చుట్టేశాడు.

పార్వతి అనిర్వచనీయమైన ఆనందంతో పులకించింది. కౌగిలివిడిపించుకుని,

"ఇవాళ హఠాత్తుగా పరీక్ష గొడవ పట్టిందేం మీ మనస్సుకి?" అని అడిగింది.

"ఒక్కొక్కప్పుడు నాకు పిచ్చిగా ఆలోచనలు వస్తుంటాయి — రాత్రి ఏదో పీడకల వచ్చింది. నాకేదైనా అయితే — అని ఆలోచిస్తే గుండె ఆగిపోయింది. నిజంగానే నాకేదైనా అయితే బాబుకి నీకూ ఆధారం ఎవరు పారూ? నీకాళ్ళమీద నువ్వు నిలబడగలిగితే నాకేబాధా ఉండదు. అనుకోని అసహాయస్థితి వచ్చినా నాబాబుకి అడుక్కుతినవలసిన గతి తప్పుతుంది." అంటుంటే అతని కంఠం గాద్గదికం వహించింది.

"అటువంటిమాటలని నన్నెందుకు హింసిస్తారు చెప్పండి" ఏడ్చింది పార్వతి. క్షణంక్రితం ఉజ్జ్వలంగా వెలిగినముఖం నల్లగా అయిపోయింది.

"నిజంగా ఆలోచించి చూస్తే ఏముంది పారూ! మాటలకి అంటున్నానని అనుకోకు. ఏ క్షణానికేం వస్తుందో ఎవ్వరం చెప్పలేం. నామాట కాదనకు పారూ!" అన్నాడు వేణు.

ఇంక ప్రసంగం పెంచినకొద్దీ అశాంతి ఎక్కువ కావడం తప్ప ప్రయోజనం లేదని గ్రహించిన పార్వతి కొడుకుని గుండెల కదుముకుని,

"మీ కిప్పుడే కాఫీ పట్టుకువస్తా నుండండి." అని బాబుని వేణు కిచ్చి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

పదినిమిషాలతరువాత తడిగా ఉన్న ముఖంతో ట్రేతో కాఫీఉప్మా తీసుకువచ్చి బల్లమీద పెట్టి పక్కనే నిలబడింది పార్వతి.

"ఎల్లుండిలోగా ఎగ్జాంషన్ ఫీజు కట్టాలి. ఏమంటావు నువ్వు? నీకిష్టమైతే చెప్పు. లేకపోతే ఏమీలేదు." అన్నాడే గాని ఆమె అంగీకారం అయిపోయిన భావమే కనబడింది అతని ముఖంలో.

అది గ్రహించి "మీమాటే కానీండి" అంది పార్వతి.

"నువ్వు దొరకడం నా అదృష్టం పారూ!" అన్నాడు వేణు.

అది మొదలు పార్వతి విద్యాభ్యాసం వారి దినచర్యలో భాగమైపోయింది. ఇటు బాబుని చూసుకోవడం, అటు వంటా, మరొకపక్క చదువు ఆమెకు అధికశ్రమ కలిగించినా వేణుని నిరుత్సాహపరచడం యిష్టంలేక ఆమె చదువులో శ్రద్ధ కనబరిచింది.

వేణు ఆమెకు చదువుచెప్పే బాధ్యత స్వీకరించాడు. రోజూ ఆమెకు పాఠాలు చెప్పి ఒక్కొక్కప్పుడు విసుక్కుంటూ, మరొకప్పుడు లాలిస్తూ ఆమెను చదివించసాగాడు. సహజంగా తెలివితేటలుగలది కావడంవల్ల ఆమె కృషి వేణు పట్టుదలవల్ల ఫలించింది.

* * * *

బలహీనత అనేది మానవసహజం. అసలు బలహీనతంటూ లేనివారు లక్షకొక రుంటారో లేదో. ఇది వివిధరూపాలలో ఉంటుంది. వ్యక్తిమనస్తత్వం మీదా, పుట్టిన వాతావరణంమీదా, చుట్టుఉన్న పరిస్థితులమీద ఆధారపడుతూ వివిధపరిణామాలని పొందుతూంటుంది.

కొందరు అప్రత్యాశితంగా ఉపకారాలుచేస్తారు. వీరు ఉపకృతిపొందినవారినుండి కృతజ్ఞతకూడా ఆశించరు. ఉపకారం చెయ్యడం తమ విధి అనుకుంటారు. కొందరు స్వార్థంకోసం చేస్తారు. ఫలానా విషయంలో వాడికి సాయంచేస్తే మరోచోట నాకిలా లాభిస్తుంది అనే దృష్టిప్రధానం వారికి. మరికొందరు కేవలం కీర్తికోసం చేస్తారు. ఎదుటివారి మన్ననకు పాత్రులు కావడమే వారి లక్ష్యం. ఇటువంటివారిలో ఒక బలహీనత ఉంటుంది. తమనించి ఉపకృతిపొంది కృతజ్ఞత కనబరచని వాళ్ళని వాళ్ళు క్షమించలేరు. తమవల్ల సహాయం పొందినవారు తమపట్ల సదా భయభక్తులతో మెలగాలని ఉంటుంది వీరికి. అల్లా కాక తమ నెదిరిస్తే గతంలో తమవల్ల పొందిన ఉపకారాన్ని గుర్తుకుతెచ్చి ఎదుటివారి కృతఘ్నతనుఎత్తిచూపుతారు.

ఏ బలహీనత అయినా, అన్ని పరిస్థితులలోను విజృంభించదు. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు అణిచి ఉంచబడినా, పరిస్థితులు అనుకూలించగానే వృద్ధి పొంది పోతుంది; శరీరంలో బలం ఉన్నంతవరకు అణిగి ఉండి బలం తగ్గగానే విజృంభించే సూక్ష్మజీవులలాగే.

అయిదేళ్లు గడిచేసరికి వేణు పార్వతుల జీవితంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆమె యిప్పుడు గ్రాడ్యుయేటు. అతనికి ప్రమోషన్ వచ్చింది. కాపురంపెట్టిన కొత్తలో జీవితంలో ఏదో ఘనకార్యం చేసినవాడిలా భావించుకొనేవాడు వేణు. దారిద్ర్యాన్ని ఎదిరించడంలో, కష్టాలకి నిలదొక్కుకోవడంలో ఒకరి కొకరు సానుభూతి చూపుకుంటూండేవారు. ఆమెపట్ల అతనికి అమితమైన జాలీ, ప్రేమా ఉండేవి. ఆమెకు అతనో దైవంలా కనబడేవాడు. అదీకాక దారిద్ర్యంవల్ల యితర విషయాలు ఆలోచించడానికి తీరిక ఉండేదికాదు. రోజులుగడవడంగురించే ఆలోచించేవారిద్దరూ. అందుకే ఆకాలంలో వారిద్దరు ,ఒకరి మనస్తత్వాన్నిగురించి మరొకరు ఎప్పుడూ తర్కించుకోలేదు. కాలంగడిచే కొలదీ పరిస్థితులు చక్కబడడంతో ఆ అవకాశం లభించింది.

పార్వతి మానవాతీత కాలేదు. భర్తకు గౌరవం యిచ్చి అతన్ని మనఃపూర్వకంగా ప్రేమించగలదు. వేణు తనని ఉద్ధరించినందుకు కృతజ్ఞత చూపించగలదు కాని అది కారణంగా తీసుకుని అణిగిమణిగి పడి ఉండడంమాత్రం ఆమెకుగిట్టదు సాటి స్త్రీలందరిలాగే భర్తజీవితంలో అర్ధాంగిగాను, బాధ్యతగల సహచరిగాను ఉండాలని ఆమెవాంఛ. తను యిద్దరి మంచికీ ఉపకరిస్తుందనే విశ్వాసం కలిగితే ఒక్కొక్కవిషయంలో అతన్ని ఎదిరిస్తుంది ఎదిరించవలసివస్తే, మరుక్షణమే గౌరవిస్తుంది, పూజిస్తుంది.

ఈవిషయం సహజంగానే వేణు గ్రహించవలసింది. కాని అతను గ్రహించలేక అపోహపడేవాడు. అంచేత రోజులు గడిచేకొలది ఎంతో ఆదర్శస్త్రీ అనుకున్న పార్వతి అతనికి అతిసామాన్యవనితగా కనబడజొచ్చింది. అదీకాక తనకాళ్లమీద తను నిలబడ్డగలిగిన పరిస్థితి రావడంవల్ల పార్వతికి గర్వం బలిసిందేమోననే యింకో అనుమానం అతనికి తోడయింది. పార్వతికి స్వయం (పోషక) శక్తి లేనప్పుడైతే తన్నెదిరిం

చినా యీ అనుమానం ఉండకపోయి ఉండు నతనికి. తల్లిదండ్రుల నెదిరించి, సమాజాన్ని ధిక్కరించి, పార్వతిని పెళ్లాడి తాను బావుకున్న దేమిటీ అనే ఆలోచన వచ్చేది. అందర్నీ కాదని ఆదర్శాలకోసం ఆమెను చేపట్టిన అతని అహం దెబ్బతింది. అతని బలహీనత బలపడడానికి తోడై గృహచ్ఛిద్రాలకు దారితీసింది.

ఇంట్లో చీటికీ మాటికీ కయ్యాలు వచ్చేవి. ఒకరి నొకరు ఎదిరించుకునేవారు. మొదట్లో పార్వతి ఊరుకున్నా వేణు ఊరుకోకపోవడంవల్ల అవి ఆమెకూ అలవాటై పోయాయి. వాదనలు చరమస్థాయి అందుకున్నప్పుడల్లా ఆఖరి అస్త్రంగా గతాన్ని గుర్తుకు తెచ్చి ఆమె నోరు మూయించేవాడు వేణు.

బాబంటే యిద్దరికీ ప్రాణమే. కాని ఎప్పుడైనా విసుగువస్తే బాబును అదిలించేది పార్వతి. వేణు ఆమె మీద మండిపడేవాడు. వాణ్ణి సమర్థించి పార్వతిని దించెయ్యడంవల్ల సహజంగానే బాబుకి తల్లి-లోకువ అయ్యేది. రాను రాను ఇదే విషయం యిద్దరిమధ్యా ఎక్కువ పేచీలకి దారితీసేది. ఎవరూ తగ్గి పోయేవారు కాదు. వాదోపవాదాలు జరిగేవి ప్రతివిషయానికీ. అసలంటూ కలతలు రాక నేపోవాలిగాని వచ్చింతరువాత ఎంత మర్చిపోయినా మరో విషయం మీద పేచీలు వచ్చినప్పుడు పాతగాథలు తవ్వుకోకమానరు. తాడు తెగేదాకా లాగనే కూడదు. లాగిన తరువాత తెగితే చేసేదేమీ ఉండదు.

వేణు తన బలహీనత మీద పదేపదే ఒత్తిడి తేవడం పార్వతి సహించలేకపోయింది. సంసారంలో అతనికున్న పాటి బాధ్యత తనకూ ఉంది. అతను కష్టపడి సంపాదించి తెస్తుంటే తాను కష్టపడి యిల్లుదిద్ది అతనికి సంతోషం చేకూర్చ ప్రయత్నిస్తున్నది. ఆ బాధ్యత గుర్తెరగడంవల్లే తమ జీవితం హాయిగా నడవడానికి ఉపకరిస్తుందన్న సలహా తాను యిస్తుంది. అవసరమయితే వాటి లాభనష్టాలను గురించి వాదిస్తుంది. అతనిమాటే అక్షరాల గుడ్డిగా తానవలంబించలేదు. అది తన తత్వంలో లేదు. గతిలేక మామయ్యగారింట పడివున్న స్థితికి యిప్పటికి తేడా ఉంది. అప్పుడు తాను కేవలం ఒకరిమీద ఆధారపడివుంది. ఇప్పుడు తాను తమ జీవిత శకటానికి ఒక చక్రంలాంటిది. అంచేతే మాటిమాటికీ వేణు "నే నుద్ధరించకపోతే నీ పనేమయ్యేది!" అని తన బలహీనతమీద ఒత్తడం ఆమెకు విరక్తి కలిగించింది.

వేణు మనస్తత్వం మరోకోణంలోంచి చూస్తే స్వార్థసంచితంగా కనబడిందామెకు. కేవలం సంస్కారంమీద ఉన్న మోజుకొద్దీ తన్ను వివాహమాడాడా అని, అనుమానం వేసేది. ఒకచిన్న కోరికమీద ఉండే మమకారంకొద్దీ పెద్దవాటిని త్యాగంచేసే బలహీనులలో ఒకడుగా కనబడ్డాడు వేణు ఆమెకు. రచనల పిచ్చిలో పడి, తెలివితేటలుండీ కూడా పరీక్షలు పాసు చేసుకుని, అటు రచనలో స్థాయిని అందుకో లేక పోయినా, హాయిగా గడవవలసిన జీవితాన్ని కష్టాలపాలు చేసుకున్న వారిని గురించి తాను విన్నది. అది ఒక బలహీనతే అయితే వేణుకున్నది కూడా అటువంటిదే కావచ్చు. తానేదో ఘనకార్యంచేసి యితరులకు విరుద్ధంగా ప్రవర్తించానని అనిపించుకోవడం కోసం మాత్రమే తన్ను పెళ్లాడాడా అనే శంక కూడా ఉత్పన్నమైంది ఆమెలో. అది కారణంగా వేణుమీద ఆమెకుండే గౌరవం సన్నగిలింది.

ఒకరోజున పార్వతి పేపర్ తిరగేస్తుంటే వేణు పనిచేస్తున్న కాలేజీలోనే హిస్టరీ ట్యూటర్ పోస్టుకి వేకెన్సీ ఉన్నట్టు ప్రకటన కనబడింది. సాయంత్రం అదే విషయం వేణుతో ప్రస్తావించింది.

"మీ కాలేజీలో ట్యూటర్ వేకెన్సీ ఉందటగా?" అంది.

"అవును." అన్నాడు వేణు ముక్తసరిగా.

"చెప్పారు కాదేం?" అడిగింది.

"ఏం అప్లయి చేస్తావా?" కొంచెం ఆశ్చర్యంతో అడిగాడు.

"చెయ్యమన్నారా?"

"నీ యిష్టం" అన్నాడు వేణు ముభావంగా.

"మీ కిష్టం లేదా?" నిలబెట్టి అడిగేసింది పార్వతి.

"నా కెందుకిష్టం ఉండదు! అయినా నీకెందుకు శ్రమ. ఇటు యిల్లు దిద్దుకోవడం, అటు ఉద్యోగం నీకు డబుల్ స్ట్రెయిన్ అవదూ?" గోడమీదపిల్లి వాటంగా అన్నాడు వేణు.

"నాకు కష్టం ఏముంటుంది? ఇంట్లో కూర్చుని ఏం చెయ్యడానికి తోచకుండా ఉంది. తొమ్మిదిగంటలకి వంటఅయితే సాయంత్రందాక ఊరికే కూర్చోడమే నాయె, ఒంటిగంటకి మీరొచ్చినప్పుడు తప్ప. ఇంకో వంద రాళ్లు వస్తే చన్నీళ్ళకి వేణ్ణీళ్లు తోడుగా ఉంటుంది కూడాను."

"మరి బాబుమాట!"

"వాణ్ణి కాన్వెంటుకి పంపిద్దాం. పొద్దున్న మనతో తీసుకెళ్లి సాయంత్రం మనతో తీసుకొచ్చెయ్యొచ్చు..."

"నీకు అవస్థ అనే ఆలోచిస్తున్నాను." పునరుద్ఘాటించాడు వేణు.

"నాకేం బాధ ఉండదు."

"అయితే నా అభ్యంతరం ఏముంది! రేపు అప్లయి చెయ్యి. ప్రిన్సిపాలుకి చెప్తాను." అన్నాడు.

మొన్నాడు పార్వతి అప్లయిచేసింది. ఉద్యోగం అయింది.

ఉద్యోగం ధర్మమా అని ఆమెకు ఆలోచనలకు తీరిక కొంత తగ్గి విశ్రాంతి లభించింది. పొద్దున్నించి రాత్రివరకు ఏదో పనితోనే సరిపోతుండడంవల్ల వేణుతో వాదనలకు గాని, పోట్లాడుటకు గాని ఆమెకు తీరికా ఓపికా కూడా లేకపోయేది.

పొద్దున్నే లేవడం కాల్యకృత్యాలు తీర్చుకుని కాఫీ కాచడం, ఆపైన వంట, భోజనాలు తొమ్మిదింటికి అన్ని తెముల్చుకుని కారియర్‌లో బాబుకి మధ్యాహ్నం టిఫిన్, ఫ్లాస్కులో కాఫీ నింపి, తనకి ఫ్లాస్కునిండా కాఫీ నింపుకుని ముగ్గురూ రిక్షా ఎక్కేవారు. బాబుని కాన్వెంట్ దగ్గరవిడిచి సాయంత్రం వచ్చేటప్పుడు తిరిగి తీసుకువచ్చేవారు.

ఈ కొత్త జీవితం వేణూకి యిష్టం లేకపోయింది. కాని ఆమాట సూటిగా అనడానికి తనసంస్కారం అడ్డం వచ్చేది. అందుచేతే పరోక్షంగా పిల్లిమీద ఎలకమీద పెట్టి కయ్యాలకు కాలుదువ్వేవాడు పార్వతీమీద. పార్వతి సహనం వహించిగాని, నిర్లిప్తతగా గాని మిన్నకుండేది. ఎంతఅణుచుకున్నా యీ సంఘటనలు పార్వతి మీద తమ ప్రభావం చూపిస్తూనే ఉండేవి. తత్కారణంగా ఆమెలో విరక్తి ఎక్కువ కాసాగింది.

ఇలా సాగుతున్నవారి సంసారంలో మరొక అతిసామాన్యమైన విషయం మీదిచర్చ చినికిచినికి గాలివానై పరిస్థితుల పరాకాష్ఠకు తీసుకువెళ్ళింది.

ఆవాళ మధ్యాహ్నంనించే పార్వతికి తలనొప్పి వచ్చింది. సాయంత్రానికి బాగా ఎక్కువై బాధపెడుతున్నా వేణుకి చెప్పలేదు. ముగ్గురూ రిక్షాలో యింటికి తిరిగివచ్చారు.

ఇంటికిరాగానే తినడానికేమైనా పెట్టమని పార్వతిని వేధించాడు బాబు. పార్వతి ఊరుకోపెట్టడానికి ప్రయత్నించింది. కాని వాడు మొండికేశాడు. అసలే తలనొప్పితో ఉండడంవల్ల సహనం కోల్పోయి వాణ్ణి రెండంటించింది వీపుమీద. వాడు యిల్లెగిరిపోయేటట్లు శోకాలు ఆరంభించాడు.

హాల్లో కూర్చుని పేపరు చదువుకుంటున్న వేణుకి బాబు ఏడుపు వినగానే పార్వతిమీద పట్టరానికోపం వచ్చింది. రెండంగల్లో వచ్చివాణ్ణి ఎత్తుకుని 'బుద్ధి లేదూ! ఎన్నిసార్లు చెప్పాలి వాడిమీద చెయ్యిచేసుకోవద్దని!' అంటూ విరుచుకుపడ్డాడు.

"విపరీతంగా విసిగించేస్తే!" విసుగ్గా అంది పార్వతి.

"సముదాయించడం చాతకాకపోతే సరి! పిల్లలు కాకపోతే నువ్వూ నేనూనా అల్లరి చేసేది. ఏళ్లింతగానే సరి!" వెటకారంగా అన్నాడు.

ఆ మాటలు విన్న పార్వతికి వళ్ళు మండింది. ఇంతా చేస్తే తనంత గట్టిగా కొట్టనేలేదు. తండ్రి ఆసరా చూసుకునే వాడలా తయారయ్యాడు. అందుకే ఊరుకోలేక,

"మీకు లక్షసార్లు చెప్పాను నేనేమైనా అన్నప్పుడు వాణ్ణి వెనకేసుకు రావద్దని. మిమ్మల్ని చూసుకుని కాదూ వాడలా పేట్రేగిపోతూంట! మీరు వాడెదురుకుండానే నన్నిల్లా అంటే నేనంటే వాడికి లక్ష్యం ఎందుకుంటుంది? వాడు నాకు మాత్రంకొడుకు కాడూ? అకారణంగా నేను మాత్రం వాణ్ణి కొడతానా?" అంది.

"వాడికి ఆకలై ఉంటుంది. ఏదైనాచేసి పెడితే పోయె. అది లేదు సరిగదా వేలెడు వెధవమీద నీ ప్రతాపం చూపెడుతున్నావ్."

"నా కోపిక లేదు. అయినా వెధవకి పెంకితనానికి కాకపోతే నిజంగా ఆకలైంది!"

"అవును మరి! ఇటు యిల్లు దిద్దుకోవడం అటు ఉద్యోగం—ఎంత కష్టపడిపోతున్నావ్!—వాడిమీద పడేడవకపోతే ఆ ఉద్యోగం మానెయ్యరాదూ?" అన్నాడు అక్కసుగా.

"అదన్నమాట అసలు మంట! ఆ మాత్రందానికి చెప్పెయ్యరాదూ మానెయ్యమని. మళ్ళీ అనడానికి మొహమాటం. ఎవరైనా వింటే ఆదర్శానికి భంగం వస్తుందని అభిమానం. ఎందుకీ వంచన?" అంటుంటే కోపంతో ఉడికిపోయిన ఆమె ముఖం ఎరుపెక్కింది.

"పార్వతీ!" అరిచాడు వేణు.

"ఎందుకు మళ్లీ కోపం, ఉన్నమాటంటే ఉలుకెక్కువ అని!" అంది పార్వతి చిరసంగా.

"నోరు ముయ్!" అడుగు ముందుకు వేశాడు వేణు.

"అనవసరంగా నోరు పారేసుకోకండి! చెయ్యి చేసుకుందుకు అసలు ప్రయత్నించకండి!" కచ్చితంగాను, తీక్ష్ణంగాను అంది పార్వతి.

ఆ మాటలలోని తీవ్రతకి వేణు ధైర్యం సడలింది. కాని అభిమానంతో మొహం జేవురించింది.

సంస్కారం!

"నువ్విలా మారిపోతావని నే నేనాడో గ్రహించవలసింది!" అన్నాడు మాటలలో నే ఆమెను చిత్తు చేయ్యాలని.

ఈ మాటతో ఆమె కోపం భగ్గుమంది.

"నేనూ అమాటే అందా మనుకుంటున్నాను" అంది సమాధానంగా.

"ఎందు కనుకోవు! — నిన్నింత దాన్ని చేసి నీకోసం నా సర్వస్వం త్యాగంచేసి తలిదండ్రులకు, చుట్టాలకి దూరమైనందుకు నాకు తగిన ప్రతిఫలం యిస్తున్నావు. కృతజ్ఞత లేదు సరిగదా ఎదురు తిరుగుతున్నావు. ఈ నాడు నువ్వు నాలుగురాళ్లు తెచ్చుకోగ స్థితిలో ఉన్నావు గనక నా అవసరం నీకు లేదు. ఇంక నీయిష్టం వచ్చినట్టు, నువ్వెందుకు మాట్లాడవ్! — ఇంత చేసి చవటనయ్యాను నేను — నేను తటస్థ పడకపోతే నీబతుకేమయ్యేది? ఈపాటికి ఇంకా మీ మామయ్యగారింట్లో అడ్డమైన చాకిరీచేస్తూ ప్రతిఫలంగా చీవాట్లు చెప్పదెబ్బలూ పొందుతూ ఉండే దానివి. కూపస్థ మండూకంలా అంతమైపోవలసిన నీ బతుక్కి ఒక బాట చూపించాను. సంఘంలో నీకు ఒకస్థానం ఏర్పరిచాను. ఇన్ని విధాల నిన్నుద్ధరించినందుకు నాకు తగిన శాస్తి చేస్తున్నావు." గుండెలలో నాటేలాగ విసిరాడు వేణు.

ఆ దెబ్బతో తోక తొక్కిన పామైపోయిందామె.

"ఆపండి! నాగురించి మీ రిప్పుడైనా బాధపడక్కర్లేదు. నిశ్చింతగా నాదారికి నన్నువదిలేసి మరొకర్ని మీకు నచ్చినవాళ్ళని చేసుకోండి. కాని మాటి మాటికి నన్నిలా నీచపరచకండి — మీ రిన్ని కబుర్లు చెప్తున్నారే! మీగురించి ఒక్కసారి మీరు తెలుసుకుందుకు ప్రయత్నించారా — మీరెంత స్వార్థమూర్తులు — కేవలం సంస్కారంమీది ప్రేమకొద్దీ నన్ను చేపట్టారు. వాదాలలో వచ్చిన పట్టుదల కొద్దీ నన్ను పెళ్ళిచేసుకున్నారు. నా బ్రతుకుని ఉద్ధరించాననే భావం మీకెంతో ఆనందాన్నిస్తుంది. అదే పోషించుకుంటూ వచ్చారు మీరు. దానికి మీరు కోరే ప్రతిఫలం — నాకు మీపట్ల యావజ్జీవకృతజ్ఞత ఉండాలి, అణిగి మణిగి మీరేమన్నా ఆ ఉపకృతి తల్చుకుంటూ మీమాట జవదాటకూడదు. నేనూ ఒకవ్యక్తిననీ, నాకూ ఒక వ్యక్తిత్వం ఉందనీ మర్చిపోవాలి — మన సంసారంలో మీ కెంత బాధ్యత ఉందో నాకూ అంత ఉందని మీరు గ్రహించేందుకు సిద్ధపడరు. నేనూ ఒక మనిషిఅనీ, నాకూ స్వతంత్రంగా ఆలోచించేశక్తి ఉంటుందనీ మీరు ఒప్పుకుందుకు యిష్టపడరు. నేను కేవలం మీ చేతిలో ఒక ఆట బొమ్మలా ఉండి, కీలు ఎటు తిప్పితే అటు తిరిగి నవ్వమంటే నవ్వి, ఏడవమంటే ఏడ్చి, మీరు ఆడించినట్టల్లా ఆడితే మంచిదాన్ని, లేకపోతే కృతఘ్నురాల్ని, విశ్వాసఘాతకురాల్ని — అంతేనా ఏమంటారు? —" గుక్క తిప్పుకోవటం కోసం ఆగింది.

వేణుముఖంలో అతి త్వరితంగా రంగులు మారిపోతున్నాయి. తను చెప్పదల్చుకున్నదేదో పూర్తిగా చెప్తేగాని విడిచి పెట్టనన్నట్టు మళ్ళీ పార్వతి మొదలు పెట్టింది.

"మీరు మీవారి నందరినీ నాకోసమే వదిలేశారా? మరొక్కసారి ఆలోచించి చూడండి. ఒకవేళ నిజంగా నే మీరంత త్యాగమూర్తులైతే పదే పదే దాన్ని చాటుకుని నాబలహీనతలని ఎందుకు ఎత్తి చూపుతారు! — కాదు. మీరు త్యాగమూర్తులు కారు — మీ చర్యలన్నీ స్వార్థసంచితాలే! నన్ను చదివించడంలోకూడా మీస్వార్థమే కనుపించింది. ఒకవేళ మీ కేదైనా ఊహించరాని ఆపద ఎదురైతే మీవంశాంకురమైన పుత్రుణ్ణి అగచాట్లనించి తప్పించి పెంచి పెద్దవాణ్ణి చెయ్యడానికి కావలసినశక్తి నాకివ్వడానికి చేసిన ప్రయత్నమే నా చదువు — ఇవన్నీ నేను ముందే గ్రహించి ఉండవలసింది. మీరు నిజంగానే ఆదర్శపురుషులని భ్రమపడి మోసపోయాను — మామయ్యగారింట్లో నే మగ్గిపోతే ఏమౌను అని అడిగారు — అక్కడే ఉంటే అసలు సుఖమున్నదే తెలియక కష్టాలు నన్నెక్కువ బాధించి ఉండేవి కావు. పరుపు మీద పడుకోవటం అలవాటు పడ్డవాడికే కటిక నేల మీద పడుకోవటం బాధనిపిస్తుంది — కాని యిప్పుడేమైంది? నేను ఒక మనిషిననీ, నాకూ ఒక వ్యక్తిత్వం ఉందని గ్రహించికూడా వాటిని అవ్యక్తంగానే ఉంచేసి నోరుమూసుకుని ఉండమంటున్నారు మీరు. అదెలా సాధ్యం? అసలు, తెలియకపోతే యిబ్బంది లేదుగాని, తెలిసి ఆత్మవంచన చేసుకోగలమా? — ప్రతి చిన్న విషయానికి మీ త్యాగాన్ని గుర్తుకి తెచ్చి నా వ్యక్తిత్వాన్ని అణచప్రయత్నించారు. నా నోరు మూయించారు. కాని ఎన్నాళ్లుంటుంది సహనం? ఎప్పటికప్పుడు చెబుదామనే నిగ్రహించుకునేదాన్ని, ఇటువంటి రోజు వస్తుందని నాకెన్నడో తెలుసు. ఇన్నాళ్లు చెప్పడాన్ని వాయిదా వేస్తూ వచ్చాను — బాబుని జాగ్రత్తగా చూసుకోండి. నేనువెళ్లిపోతాను. లేదా నావెంట పంపిస్తానన్నా నాకభ్యంతరం లేదు —" నిశ్చితంగా అంది పార్వతి.

వేణుకి నోట మాట రాలేదు.

రాజ్యము: రాజ్యపాలకులు

శ్రీ కామరాజుగడ్డ రామచంద్రరావు

రాజకీయ చైతన్యమనే దొకటి మనుష్యుల్లో కలిగింతర్వాత కాని, నీతి, నియమం అనే వాటికొక ఆకారం రాలేదనవచ్చు. ఇది నీతి, అది నీతి అని తెలుసుకోకముందు జనులు తోడబడిచి మోసం చేసి, కసిరి కొట్లాడి, ఇతర్ల చేత తమ కొక్కవలసిన పని చేయించుకునేవారు. ఇలా కొన్నాళ్ళయింతర్వాత గాని, ఆ కపరడం ఫలాన ఫలానప్పుడు జరగాలనే విషయం తెలుసుకోబడలేదు. అది తెలుసుకోవటమే నీతి శాస్త్రానికి ప్రాతిపదికయింది. ఇలా మొదలయిన నీతిశాస్త్రం రాజ్యంలోని వ్యక్తుల ఫలాపేక్షల్ని సంరక్షించేందుకు చేయూతయింది. అంచేత నీతిశాస్త్రాభ్యాసానికి మున్ముందే రాజ్యమంటే, రాజ్యపాలకులంటే యేమిటో తెలుసుకోవటం అవసరం.

రాజ్యం (State) అంటే రాజకీయంగా నెలకొల్పబడ్డ సంస్థ (Political Society). దాన్ని బెంథాం ఇలా నిర్వచించాడు. "కొంత జనానీకం ఒకడికి గాని, నిర్ణీతమైన కొందరికి గాని తమపైని పాలనాధికారాన్నిచ్చి అతని లేక వారి ఆజ్ఞల్ని శిరసా వహించటాని కలవాటుపడి యున్నవారైతే, అలాంటి జనానీకమున్నూ ఆ ఒకడు లేక ఆ కొందరున్నూ మొత్తం అంతా కలిసి రాజకీయంగా నెలకొల్పబడ్డ సంస్థ అనబడుతుంది"—అని. ఆ ఒకడు, లేక ఆ నిర్ణీతమైన కొందరు పాలకులు. ఇతర్లు పాలితులు. ఈ పాలితులు పాలింపబడే అలవాటు పడటమనేది ఒక కట్టుబాటై, నియమమై, మొత్తమంతయూ సంస్థగా పరిగణింపబడటానికి సూత్రప్రాయమైంది. అనేకమంది జనంలో ఆ ఒకడు లేక ఆ కొందరూ కేంద్రస్థానంలో వుండి అధికారం చెలాయించటమనేది యిలాంటి రాజ్యసంస్థకు ముఖ్యం. ఈ సంస్థ పాలకుడి ఆజ్ఞను మాత్రమే పాలించాలి, మరొకడి లేక యితరసంస్థయొక్క ఆజ్ఞల్ని పాలించవలసిన అవసరం వుండకూడదు. అలా అయితేనే అది రాజ్యమనబడుతుంది (State). కాగా రాజ్యంలో ఒకే ఒక పాలకుడు వుంటాడు. ఉంటాడు కాదు, ఉంటారు అనాలేమో. ఒకే ఒక పరిపాలన వ్యవస్థ వుంటుందనవచ్చు. కనుక స్వతంత్రాధికారం కలిగిన పరిపాలన వ్యవస్థ ఎక్కడయితే వుంటుందో అదే రాజ్యము అనబడుతుందన్నమాట.

రాజ్యమనేదానికి కావలసిన మూల పదార్థాలు నాలుగని చెప్పవచ్చు.

కొంత జనాభా ఉండాలి. కొంత అన్నాము కదా అని యీ వూళ్ళో మొదటి ఐదువందల యిండ్లలో వున్న వాళ్ళంటే వీలులేదు. లేదా నాల్గువేల ముప్పయిరెండు మంది జనం మాత్రం అని కూడ అర్థం కాదు. జనాభా అంటే సాధారణంగా ఒక భూభాగంలో నివసించే వాళ్ళందరూనూ. కొందర్ని వదిలి వేస్తామంటే కుదరదు.

ఒక భూభాగం వుండాలి. ఉండాలంటే వుండకేం చేస్తుంది? ఎక్కడ మనుష్యులుంటే అక్కడ భూభాగం లేదా? ఉంటుంది. ఐనా ఒక కొండజాతి వాళ్ళు ఒక కొండ దగ్గర మకాం వేసి, కొన్ని నెలలు పాటు నివసించి అక్కడ ఆకు అలం అనుభవించి మరో చోటికి వెళ్ళిపోతూ వుంటారు. వాళ్ళకు ఒక ప్రత్యేకమైన భూభాగం తమదిగా వుండదు. వాళ్ళను తమను తాము రాజ్యంగా, సంస్థగా చెప్పుకొనే అవకాశం ఆ కారణంచేతనే లుప్తమయింది. వాళ్ళకొక పెద్ద వుండి అతను చెప్పినట్లు వాళ్ళు నడుచుకొంటున్నా కూడ వాళ్లు రాజ్యంగా పరిగణింపబడరు; రాజకీయ సంస్థగానే పరిగణింపబడరు. అంచేత తమది అని చెప్పుకోతగిన భూభాగం రాజ్యానికి అవసరం.

ఒక పాలనక్రమాన్ని (organisation) అనుసరించి జనానీకం పాలకుడి ఆజ్ఞలకు లోబడివుండే పద్ధతి కావాలనే విషయంకూడ 'రాజ్యము' అనేదాని నిర్వచనంలోనే మిళితమై వుంది. ఒక మూక జనం ఒకచోట జేరినంతమాత్రంచేత అది రాజ్యము అని అంటున్నామా? వాళ్లు ఒక పాలకుని ఆజ్ఞలకు లోబడాలి. పాలితులుగా ఉండాలి. ఈ పాలితులు ఒకడినో లేక కొందరినో పాలకులుగా అంగీకరించాలి. అలా అంగీకరించినట్లు తమ, లేక తమలోని అధిక సంఖ్యాకుల ముఖోద్దేశంగా ప్రకటించాలి. ఆ వుద్దేశ్యం నిలిచి అమలులో వున్నన్నాళ్ళున్నూ, అవసరమయితే కత్తి

రూపొందించి ఆ వుద్దేశ్యాన్ని అమలులో పెట్టుతూ వుంటాడు పాలకుడు. "నేను నిన్ను పాలకుడుగా మొదట్లో నే ఒప్పుకోలేద"ని యెవడన్నా అంటే వాడి భరతం పట్టేయటానికి తగినంత మిలిటరీ, ఉత్సాహం, ధైర్యం, శక్తి, స్వతంత్రం అన్నీ ఆ పాలకుడిలో మూర్తీభవించి వుంటాయి. అలా వుండటానికి కారణం యీ జనానీకానికి కలిగిన పాలనక్రమానికి కట్టుబడి వుండాలి అనే ముఖ్యోద్దేశమే. ఇదే చాల అవసరం. ఇదే, రాజ్యపాలకులను (sovereignty) గల రాజ్యాం తప్పమైన పాలకత్వానికి గుర్తు. ఈ పాలన మూడు మార్గాలద్వారా చెలాయింపబడుతుంది. (i) శాసనాలు చేయటం మూలంగా. (ii) ప్రభుత్వంద్వారా. (iii) న్యాయపరిపాలనచేయటంద్వారా. శాసనసభ శాసనాలు చేస్తుంటే, ప్రభుత్వం వాటి నమలులో పెట్టుతుంటే, అలా అమలు జరగటంలో న్యాయాన్యాయాల విమర్శను న్యాయస్థానాలు చేస్తాయి ఇలాంటి పాలన క్రమం రాజ్యానికి అవసరం.

ప్రత్యేకత (Unity): ఇదికూడ రాజ్యమనేదానికి ముఖ్యమైందే. ఇతర రాజ్యంలోని వాళ్ళెవరూ ఈ రాజ్యంలోని పాలనాధికారంలో జోక్యం కలుగ జేసుకోకూడదు. ఈ రాజ్య భూభాగం మరొక పెద్ద రాజ్య భూభాగంలో అంతర్భాగంగా వుండరాదు. ఇది రాజ్యపాలకత్వానికి బలమైన గుర్తు.—ఈ పై నాలుగూ రాజ్యమనేదానికి ముఖ్యాంగాలు.

రాజ్యము—సంఘము (state and society): రాజ్యం అనగానే మొత్తం మానవ సమాజమంతా అని అర్థం కాదు. మనిషి కనేక వ్యాపకాలుంటాయి. తన కుటుంబం, తనూ ఒక సంస్థ. తనతోటి పని వాళ్ళూ, తనూ ఒక సంస్థ. తనూ, తన మతస్థులంతా ఒక సంస్థ. ఇలాటి వన్నీ రాజ్యంలో అనేక మున్నాయి. మనిషికున్న ఈ సంబంధాలన్నీ రాజ్యసంస్థకంటె ప్రత్యేకంగా వుంటాయి. రాజ్యమనేది ఇలాటి సంస్థలన్నిటికీ విశిష్టమైన గొప్ప సంస్థ.

సంఘం అంటే ప్రస్తుతం పరిపాటిగావున్న అర్థం "జనసామాన్యంలో వున్న సామాజిక నిబంధనలు" అని. సంఘం కుళ్ళిందనీ పుచ్చిందనీ అంటే, ఆ నిబంధనలు సరిగా లేవని అర్థం.

కాని ఈ శతాబ్దంలో రాజ్యం అనే పదానికి, ఈ సంఘం అనే పదానికీ సరిసమానమైన అర్థం అంటగట్టటం జరుగుతోంది. రష్యా మొదలైన దేశాలు రాజ్యం అంటే మొత్తం సమాజమేననీ, ఆ సంఘంలో కనపడే వివిధ విశేషాలుకూడ రాజ్యంలో భాగాలే అవటంచేత రాజ్య పాలకులచేత ఈ విశేషాలన్నీ సరిదిద్దబడుతుంటాయి అని చెబుతున్నాయి. కుటుంబాలు పెద్దవి అవుతుంటే కుటుంబ నియంత్రణం, యాచన వృత్తి జాస్తి అయిందని యాచక నిషేధాలు, ప్రేమ కవిత్వాలు మనుష్యుల్ని నిర్వీర్యులుగా చేస్తున్నాయని బూర్జువా కవిత్వ ఖండనలు బయలుదేరినవి. ఇవన్నీ రాజ్య పాలకుల ముఖతా పాలింపబడుతూ కూడా వుంటయి.

వ్యక్తిగత నిర్ణయాలు రాజ్యపాలకుల నిర్ణయాల కన్నిచోట్ల బద్ధమయే వుంటాయి—కాని, పై చెప్పిన లాటి రాజ్యాల్లో రాష్ట్రపాలకులు వ్యక్తుల వ్యక్తిగత జీవితంమీదకూడ తమ అధికారాల్ని ప్రసరింప జేయటంలో మోతాదు నెక్కువచేశారు. ఎక్కువంటే మనకు ఎక్కువగా వుండవచ్చు. వారికి కాకపోవచ్చు. శ్రీ నెహ్రూ చేయాలన్న శాసనాలు, శ్రీ రాజగోపాలాచారికి వెగటుగా వుండటం గమనిస్తూనే వున్నాం గా. అసలు విషయం ఏమిటంటే, రాష్ట్రమంతా కలిపింది రాజ్యం. అందులో ప్రత్యేక వ్యక్తికి వ్యక్తిత్వం వుందా లేదా అనే గొడవ యెత్తవలసిన అవకాశం లేదు. లేదంటే లేదు. వుందంటే వుంది. ఈ లేదనీ వుందనీ అనేవాళ్లు బహుశ రాజ్యపాలకులు. అలా అనవచ్చునా అనకూడదా అనే ప్రశ్నకు సమాధానం, ఆ రాజ్య సంవిధానాన్ని (Constitution) అనుసరించి వుంటుంది.

రాజ్యము—ప్రభుత్వం (State vs Government): రాజ్య మనగానే స్థూలంగా మనసుకు తట్టేది ప్రభుత్వం. ఐతే రాజ్యసంస్థ అంతా ప్రభుత్వం మాత్రమె కాదు. రాజ్యసంస్థకు శాసనాలు చేసే అధికారం, న్యాయాన్యాయాలు తీర్చే అధికారం కూడ వున్నాయి. ప్రభుత్వానికి శాసనాల్ని ప్రజలలో అమలు జరిపే అధికారం మాత్రమే వున్నది. కాని శాసనాలు చేసే అధికారం గాని న్యాయాన్యాయాలు తీర్చే అధికారంగాని లేదు. ఒకరాజ్యంలో శాసనాలను, న్యాయస్థానాలు నిర్ణయించిన తీర్పులను ఏ యంత్రాంగం ద్వారా అమలు జరుపుతారో ఆ యంత్రాంగమె ప్రభుత్వం. రాజ్యసంస్థలో ప్రభుత్వం భాగం.

"ఫలాని భూమి నా హక్కని ప్రకటించండి బాబూ" అని ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకోరాదు.

న్యాయస్థానాలకు పెట్టుకోవాలి ఆ దరఖాస్తును. "నేను ఫలాని సంస్థకు ప్రెసిడెంట్ని" అని మీరు చెప్పవలసిందంటూ ప్రభుత్వాన్నడిగితే ఏం ప్రయోజనం. ప్రభుత్వాన్నడగటం నన్నడగటం ఒకటే. నన్నడిగితే నేనేమంటాను? 'అయ్యో రామా నాకేం తెలుసంటాను. ప్రభుత్వం ఆ మాటే గంభీరంగా అంటుంది. నీ వడిగింది, పరివ్యాప్తమైన మా శక్తుల కధీనమైనవిషయం కాదంటుంది. అది న్యాయస్థానాలు చేయవలసింది కనక అక్కడకు పొమ్మంటుంది.

రాజ్యము—జాతి (State vs Nation): రాజ్యంలో అనేకజాతు లుండవచ్చు. ఒకజాతే అనేక రాజ్యాల్లో కూడ వుండవచ్చు యూదుజాతికి ప్రత్యేక రాజ్యం లేదు. జర్మనులు ప్రస్తుతం అనేక రాజ్యాల్లో వుండటం తటస్థించింది.

భారతదేశంలో చాలా జాతు లుండవచ్చు. హిందువులు, ముస్లిములు వగైరాలు. వారు ప్రత్యేక ప్రత్యేక జాతులే అయినా వారి సంస్కృతి కలిసిపోయి అంతా భారతీయులుగా అనుకుంటే, వారు అలా ప్రవర్తిస్తే, భారతజాతి ఒకటిఅని తెలుస్తుంది. అలాగా యిళ్లు గుర్తిస్తారు. భారతదేశంలో ఆవిధంగా ఒకేభారతజాతి వుంది. వాళ్ళ సంస్కృతి ప్రత్యేకమైన ఒక సంస్కృతి. అందుచేత వాళ్ళంతా ఒక 'నేషన్.' హిందూ ముస్లిము అనేవి సబ్ నేషన్లనాలి. రాజ్యపాలనంకోసం యీ సబ్ నేషన్ల ప్రసక్తి లేనక్కర్లేదు. మొత్తం అంతా భారతీయ జాతి అనే సూత్రం మీదనే రాజ్యపాలన క్రమం జరుగుతుంది.

రాజ్యసంస్థల్లోని వైవిధ్యం

రకరకాల రాజ్యాలు యేమిటో తెలుసుకోవటం అవసరం. ఏనాడో "ఎరిస్టాటిల్" అనే మహనీయుడు రాజ్యాల్ని రకరకాలుగా విభజిస్తూ యిలా అన్నాడు. "ఒక మహారాజు తనకు లోబడివున్న రాజ్యం తన దేశమంటాడు. ఆ మహారాజు యేకచ్ఛత్రాధిపతి (mon-orch) అన్న మాట - రాజరికం (royalty) వెలిగిస్తాడు. కొంత కాలానికి అతను చెడ్డవాడుగా పరిణమించే అవకాశం వుంది. ప్రజారక్షణ, ప్రజల ఫలాపేక్షల సంరక్షణ చెయ్యటం మానేసి, ప్రజలపై సవారీ సాగిస్తే అతని ప్రభుత్వం నిరంకుశప్రభుత్వంగా అయిపోతుంది. అతడి దుర్మార్గం మితిమీరుతున్నకొద్దీ రాజ్యంలోని కొందరు ఘనులు కూడి, అతడిని గద్దె దింపిస్తారు. ఈ ఘనులు అప్పుడు తమ అధికారాన్ని వెలిగిస్తారు. అప్పుడు అరిస్టాక్రసీ (arestocracy) అనే మూడో రకపు రాజ్యం అమలులోకి వస్తుంది. ఆ ఘనులుకూడ కొన్నాళ్ళకి అధికార దుర్వినియోగం చేయవచ్చు. అప్పుడా ప్రభుత్వం అలిగార్కీ (alegarchy) అవుతుంది. కాని ప్రజానీకంలో చైతన్యం వచ్చిన వెంటనే యీదుష్ట ప్రభుత్వం పారద్రోలబడుతుంది. అప్పుడు డెమోక్రసీ వస్తుంది. డెమోక్రసీ అంటే జనబాహుళ్యం యొక్క ప్రభుత్వం అని అర్థం. జనబాహుళ్యానికి ప్రభుత్వాధికారం యిస్తే, సరిగా జరగదని ఎరిస్టాటిల్ భయం. అతడి ఉద్దేశ్యంలో ప్రజానీకంలోని అధికసంఖ్యాకులు మేధావులుకానివారు. వారికి పరిపాలనం ఒప్పజెప్పితే చేసే పనిలోని సమరత తగ్గిపోతుందని తర్కశాస్త్రం చెబుతుంది. ఒకడు యిలా చెయ్యండి, అలా చెయ్యండి అని చెప్పి చేయించలేడు. అంతా తర్జన భర్జనచేసి నిర్ణయిస్తేగాని యే పనీ జరగదు. పనులన్నీ వెనక్కు వెనక్కు జరిగిపోతాయి. సమర్థత అంతగా ఉండదు. అలా అయిన ప్రజాప్రభుత్వం నిలవలేని స్థితివచ్చినప్పుడు ప్రజానీకం ప్రజాప్రభుత్వమంటేనే విసిగిపోయినప్పుడు ఎవరో ఒకశక్తి సామర్థ్యాలు కలిగిన యతడు నేనున్నాను, మిమ్మల్ని పాలిస్తానంటూ ప్రజా ప్రభుత్వాన్ని డబాయించి కళ్లేలు బిగిస్తాడు. అతడు మళ్ళీ మహారాజవుతాడు. మళ్లీ రాజరికం (Monorchy) వస్తుంది. ఈ చక్రం మామూలుగా మళ్ళి మళ్ళి తిరిగే అవకాశం వుంది." ఇది ఎరిస్టాటిల్ చెప్పిన గణనం.

ఎరిస్టాటిల్ చెప్పిన విభజన ప్రస్తుత కాలంలో అంతగా పనికిరాదు. ప్రజాప్రభుత్వం ప్రసుత కాలంలో అనేక రకాలుగా అనేక దేశాల్లో మూర్తిభవించి వుంది. ప్రస్తుత రాజ్యాల్ని విభజించటానికి ఐదురకాల మార్గాలున్నాయి.

1. రాజ్యంలోని రాష్ట్రాలకు, కేంద్రానికీ గల సంబంధాన్నిబట్టి విభజించటం:— ఇలా విభజిస్తే, (i) సార్వభౌమాత్మకమైనరాజ్యం (Unitary State) (ii) సామ్రాజ్యాత్మక రాజ్యం (Imperial State) (iii) బహురాజ్య సంకలితమైనరాజ్యం (Confedera-tion of States) (iv) సంయుక్తాత్మకమైన రాజ్యం (Federal State) అని నాలుగు విధాలు.

సార్వభౌమాత్మకమైనరాజ్యంలో ఒకే ఒక కేంద్రాధికారి వుంటాడు. అతడికి లేక ఆ అధికారి

అనే వానికి శాసనం చేయగల అధికారం, న్యాయాన్యాయ విచక్షణ చేసే అధికారం, సాధారణమైన ప్రభుత్వాధికారం అన్నీ వుంటాయి. మొత్తం అధికారాలన్నీ ఒక్కచోటనే కేంద్రీకరింపబడి వుంటాయి. ఉదాహరణకు బ్రిటిషు దీవులలోవున్న రాజ్యం చూడండి. రాజు-కాదు రాణి (వట్టి రాణిగా అనుకోవద్దు, పార్లమెంటుతో కూడుకున్న రాణి) అన్ని అధికారాలు కలిగివున్నది. శాసనం చెయ్యవచ్చు. అమలు జరపవచ్చు. న్యాయాన్యాయ విచక్షణ చేయించవచ్చు. ఈ రాజ్యం యూనిటరీ స్టేటుకు మంచి ఉదాహరణం. గ్లాసులోని పాలల్లో కల్తీ కనపడకుండా వుంటుంది యీ సంస్థ.

సామ్రాజ్యాత్మకమైన రాజ్యమంటే వలస రాజ్యాలతో కూడిన బ్రిటిష్ సామ్రాజ్యం ఉదాహరణ చెప్పవచ్చు. ఒక్క బ్రిటిషుదీవులు మాత్రమే కాదు. ఈ రాజ్యంలో యితరరాజ్యాలు చాలా వుంటయి. అవన్నీ బ్రిటిషుపార్లమెంటుఅధికారానికి లోబడినవే. పార్లమెంటు అన్నంటే వాటికి కాదనే అధికారం లేదు. ఆ చిన్న చిన్న రాజ్యాలన్నీ పార్లమెంటుకు తాబేదార్లే అనవచ్చు. ఇలా తాబేదారులుగా వుండిపోవటమనేదే సామ్రాజ్యతత్వానికి చిహ్నం. ఆ చిన్నచిన్న రాజ్యాలవాళ్లు 'మా రాజ్యం' 'మా రాజ్యం' అని తమ రాజ్యం పేరు చెప్పుకుంటూ వుంటారుగాని మాది బ్రిటిష్‌రాజ్యం అని అనరు. అలా మాది బ్రిటిష్ రాజ్యమనంటే అనేక చిన్నరాజ్యాలీ రాజ్యంలో వుంటాయనే మాటే అబద్ధమవుతుంది. అప్పుడది ఒకే ఒక సార్వభౌమాత్మకమైన రాజ్యంగా చెప్పవలసి వస్తుంది గదా!

అందుచేత సామ్రాజ్యాత్మకమైన రాజ్యానికి చిన్న రాజ్యాల్లోని ప్రజలు తమ రాజ్యం పెద్దరాజ్యం కంటే వేఱనే అనుకొంటూ గుర్తిస్తూవుండడమే గుర్తు. నీళ్ళగ్లాసులో ఐసు తేలి ప్రత్యేకంగా కనపడ్డట్టు మొత్తం రాజ్యంలో యీ చిన్న రాజ్యాలు ఐసు ముక్కల్లా కనపడతాయన్నమాట.

బహురాజ్యసంకలితమైన రాజ్యం: కొన్ని రాజ్యాలు ఒక ప్రత్యేకమైన ఘనకార్యం చెయ్యటానికిగను ఏకమవుతాయి. ఏకమయిన కారణం, వాటి అంతర్గమయిన పాలనక్రమాన్ని గురించి కాదు మరేదో ఘనకార్యాన్ని సాధించటానికి అయివుంటుంది. అమెరికాలో 1776 లో పదమూడు చిన్న రాజ్యాలు ఆంగ్ల సామ్రాజ్యశృంఖలాలనుంచి విడిపోదామని అనుకొని అలా హఠాత్తుగా ప్రకటించేశాయి. అలా ప్రకటించితే యుద్ధం వస్తుందని తెలుసు. ఆ యుద్ధంలో గెలవగలిగిన శక్తి సంపాదనకోసం ఆ పదమూడు రాష్ట్రాలూ కలిశాయి. యుద్ధం వచ్చింది. అవే నెగ్గాయి కూడాను. కొంతకాలం జరిగింది విఫలంగా. ఇన్నాళ్ళున్నా, ఆ యుద్ధానికి సంబంధించిన వ్యవహారం యీ పదమూడు రాష్ట్రాలచేత యెన్నుకోనబడ్డ ఒక సంస్థ, "కాంగ్రెస్" నిర్వహించేది. అంతకంటె యెక్కువపని అది చేయలేదు. ఒక నిర్ణీతమైన పనికోసం యేర్పడ్డదిగనక మరే పనీ చేసే అధికారమే లేదు. ఆస్థితిలో ఆపదమూడు రాజ్యాలున్నూ కలిసి, మిగతా ప్రపంచానికి ఒక రాజ్యంగా కనపడాయి. అది బహురాజ్య సంకలితమైన రాజ్యం అయింది; Confederation of States అయింది. అందులో యే చిన్నరాజ్యమైనా యీ కలయిక వద్దనుకుంటే మానేయవచ్చు. అలా మానివేయగలగటమే యీరకమైన రాజ్యసంస్థకు ముఖ్యమైన గుర్తు. ఈ సంస్థ తిలతండులాలు కుప్పబోసినట్లుగా వుండే సంస్థ.

సంయుక్తాత్మకమైనరాజ్యం(Federal State): ఇందులో పెక్కు చిన్న రాజ్యాలు ఇమిడివుంటాయి. పైగా ఆ రాజ్యాలన్నీ కలసి తమ అంతర్గత పాలనాక్రమాన్ని నిర్ణయించి కొన్ని మూలమైన సూత్రాలకు కట్టుబడి జరుపుకుంటూ వుంటాయి. 1776 లో యుద్ధంకోసం కలిసిన అమెరికాలోని పదమూడురాష్ట్రాలున్నూ యుద్ధం అయినతర్వాత మళ్ళీ 1787 లో ప్రత్యేకంగా కలసినయి. ఈ కలయిక వెనుకటిలాగా అంతరంగిక సంబంధబాంధవ్యాలులేని కలయిక కాదు. ఏ రాష్ట్రానికా రాష్ట్రం ప్రత్యేకత వెలిగించటం మామూలేకాని, వాటి వాటి పరిపాలనక్రమంలో కొన్ని కొన్ని విషయాల్లో పూర్తిఅధికారాలు కేంద్రానికిచ్చేశాయి. -ఆ విషయాలకు సంబంధించినంతవరకు రాష్ట్రాలు అధికారాలను చెలాయించవచ్చు.

ఆ విషయాలేమిటంటే. అన్నిరాష్ట్రాలకు సమానంగా అనుభవించే సాధారణ సమస్యలు, వాటికి సంబంధించిన విషయాలున్నూ. ఆ విషయాలు అన్నిరాష్ట్రాలు కూడబలుక్కొని సరిదిద్దుకోవటం అవసరం. అందుచేత యీ రకంరాజ్యం అమలులోకి రావటానికి ముఖ్యమైన అవసరం యేమిటంటే ఈ చిన్నరాష్ట్రా

లన్నిటికీ కలిపి కొన్ని సామాన్యసమస్యలు, సాధక బాధకాలు వుండటమే.

అయితే ఒకసందేహం రావచ్చు. ఈ సమస్యలు సాధకబాధకాలు ఒకటైనప్పుడు అన్నికలిసి ఒకేరాజ్యమయితే సమస్యలు తీరవా? తీరుతయి. తీరకపోవు. అదోకమార్గం. కాని ఆ మార్గాన్ని ఆ ప్రజలు ఆమోదించరు. వారికి తమ చిన్నరాజ్యం, తమకు ప్రత్యేకంగా వుండాలని పట్టుదల. "మాకు ప్రత్యేకమైన సంస్కృతి వుంది. మా అంతర్గత జీవితంలో మరొకరెవరు కలుగజేసుకోవద్దు. మా ఆంధ్రరాష్ట్రం మా కిచ్చెయ్యండి" అన్నాం మనం. ప్రత్యేకంగా వుండటం అతిఅవసరమన్నాం. కర్నాటకులూ కావాలన్నారు. ఇది ప్రజాబాహుళ్యంలో వున్న ఏకవాక్యం. సామ్రాజ్యాత్మకమైన రాజ్యంగా చేసుకోరాదా అంటే వినే చిన్నయ్య ఎవరు?

అందుచేత ఏ చిన్నరాజ్యానికా చిన్నరాజ్యం పాలనాధికారాన్ని కలిగివుంటూ కొన్నిప్రత్యేక విషయాల్లోమాత్రం కేంద్రాధికారానికి లోబడివుండే పద్ధతికి Federal System అని మరోక పేరు పెట్టాల్సి వచ్చింది. సంయుక్తాత్మకమైన రాజ్యం యేర్పడేందన వచ్చు. ఈ రాజ్యం పంచదార కలిసిపోయిన పాలల్లే, సగ్గుబియ్యప్పరమాన్నమల్లె వుంటుంది.

సంయుక్తాత్మకమైన రాజ్యలక్షణాలు: ఒకటి: కొన్ని చిన్న చిన్న రాజ్యాలు తమ ప్రత్యేకతను పోగొట్టుకోకుండానే ఒక కేంద్రాధికారికి లోబడి వుండటానికి ఒప్పుకోవాలి. ఆ ఒప్పుకోవటానికి కేంద్రానికి యే విషయాలపై శాసనాధికారం వున్నది, తమ కే విషయాలపై వున్నది అనే సంగతి నిర్ణయింపబడి వుండాలి. ఆ నిర్ణయం వారి సంవిధానంలో వుంటుంది. సంవిధానం వ్రాతపూర్వకంగా వుండటం మామూలు. రెండు: శాసనాధికారం శాసనసభలకు, న్యాయా న్యాయనిర్ణయం న్యాయస్థానాలకూ, శాసనాలనీ కోర్టు వుత్తరువులనీ అమలులో పెట్టే అధికారం ప్రభుత్వానికి ప్రత్యేకంగా కేటాయించబడి వుంటాయి. ఆయా అధికారాలు చెలాయించటంలో ఆయాశాఖలు అత్యున్నతమైన స్థానాన్ని అలంకరిస్తయి. ఒక శాఖ మరోకశాఖ చేయవలసినపని చేయదు. ఈ విధంగా పరిపాలనాధికారం (Sovereign Power) మూడు విధాలుగా విభజింపబడటమేగాక చిన్న రాష్ట్రాలలోని పాలనాధికారం చిన్న రాష్ట్రాలే చెలాయిస్తాయి. కేంద్రం జోక్యం కలిగించుకోదు. సంవిధానంలో ఆ విభజన ప్రత్యేకంగా వ్రాసి వుంటుంది. అమెరికా సంయుక్తరాజ్యంలో కొన్ని నిర్ణీతమైన విషయాలు చెప్పబడి అవి కేంద్రానికి హస్తగతం చేయబడ్డాయి. అవిగాక మిగిలిన విషయాలపై అధికారాలు రాష్ట్రాలే చెలాయిస్తాయి. స్విట్జర్లండు, ఆస్ట్రేలియాలలోకూడ యిలాగే జరిగింది. కెనడాలోమాత్రం, నిర్ణీతమైన విషయాలు రాష్ట్రాల పరంగా చెప్పబడి, మిగిలిన విషయాలన్నీ కేంద్రానివని సంవిధానంలో వ్రాయబడటం జరిగింది.

ఇక భారతదేశ సంవిధానంలో రెండిటికి సంబంధించిన విషయాలు ప్రత్యేకంగా జాబితా చేయబడటమేకాకుండా, రెండూ (దేనికి అవసరమనితోస్తే అవి) శాసనాలు చేయించటానికి వీలయిన విషయాల జాబితాకూడ జోడించాము. వీట్లలో చెప్పని విషయాలేవైనావుంటె అవి కేంద్రం శాసనాలు చేయటానికి వీలయిన విషయాలుగా పరిగణింపబడవలెనని అన్నారు. రెండూ చేయదగిన శాసనాల విషయంలో కేంద్రం చేసినశాసనాలకు రాష్ట్రం చేసిన శాసనాలు సాధారణంగా లోబడగా వుండాలన్నారు. అలా కాకుండా వుండాలంటే, కేంద్రం ఒప్పుదల ప్రత్యేకంగా పొందాలన్నారు. మూడు: సంవిధానం తేలికగా మార్చబడరాదు. దాన్ని మార్చాలంటే ఒక ప్రత్యేకమైన పద్ధతివుంటుంది. కేంద్రం తనకుగా తను సంవిధానాన్ని మార్చి రాష్ట్రాల హక్కుల్ని మింగివేయకుండానూ, రాష్ట్రాలు తమకుగా తాము మార్చేసి కేంద్రాధికారాన్ని త్రోసివేయకుండాను ఈ లక్షణం రూపొందించబడ్డది. నాలుగు: సంవిధానంలో నివిషయాలు అమలులో పెట్టేటట్లు చూడటానికి న్యాయస్థానాలకధికారం వుంటుంది. శాసనసభలు సంవిధానానికి వ్యతిరేకంగా శాసనాలు చేసేటట్లయితె న్యాయస్థానాలు, అలాటి శాసనం శాసనంగా పరిగణించటానికి వీల్లేదని తీర్పు నిస్తాయి. న్యాయస్థానాలు సంవిధానానికి సంరక్షకాలుగా పరిగణింపబడతాయి. స్విట్జర్లండు రాజ్యాంగంలో మాత్రం యీలక్షణం కనపడదు. అలా అని సంవిధానాన్ని రాష్ట్రాలుకాని లేక కేంద్రంగాని అతిక్రమిస్తా యంటానికి వీలులేదు. దానికి ప్రత్యేకంగా అక్కడ ఒక రక్షణ వుంది. ఏమంటే,— అక్కడ తయారయిన శాసనాలు ముందు రిఫరెండం ద్వారా పౌరులకు తెలియజేయబడి, తర్జన భర్జన చేయ

బడతాయి. ఆ శాసనం తను కక్కరలేకపోతే, ఒత్తిడి తెచ్చి అది తను కక్కరలేదని అనే ఆచారం అక్కడ వుంది. శాసనం సంవిధానాన్ననుసరించి వుండక పోతే వారు వూరుకోరట. ఈ ప్రత్యేకత ఒక్క స్విస్ రాజ్యాంగంలోనే వుంది.

రాజ్యాలను సంవిధానాల నైజాన్ని బట్టి విభజించవచ్చు. అలాచేస్తే లిఖితమైన సంవిధానం కలిగిన రాజ్యాలు, లిఖితమైన సంవిధానంగల రాష్ట్రాలు, తేలికగా సవరణచేయగల సంవిధానం కలిగిన రాజ్యాలు, అలా సవరణచేయటానికి వీలులేని రాజ్యాలు అని నాలుగుగా విభజించవచ్చు.

శాసనసభల పొందికనుబట్టి రాజ్యాల్ని విభజిస్తే, ఒకే శాసనసభను కలిగివున్న రాజ్యాలు, రెండు శాసనసభలు కలిగివున్న రాజ్యాలు, మగవాళ్లకు మాత్రం యెన్నికహక్కు కలిగివున్న రాజ్యాలు, ఆడ మగ వివక్షత లేక పెద్దవాళ్ళందరికీ ఎన్నికలలో హక్కు కలిగివున్న రాజ్యాలు, ఎగువ సభలోని సభ్యులను ఎన్నుకోనటద్వారా తయారయిన సభగల రాజ్యాలు (అమెరికా, ఫ్రాన్సు, ఆస్ట్రేలియా మొ.) ఎన్నిక లేకుండా ప్రతిపాదించటం మూలంగా తయారయిన ఎగువసభగల రాజ్యాలు (ఇంగ్లండు, ఇటలీ) గా విభజించవచ్చు.

ప్రభుత్వపు పొందికనుబట్టి రాజ్యాలను విభజించితే,—శాసనసభలను, ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే అవకాశంగల రాజ్యాలు, అలా వీలులేని రాజ్యాలు అని రెండురకాలు. మొదటిదానికి యింగ్లండు, రెండవ దానికి యునైటెడ్ స్టేట్సు ఉదాహరణలు.

న్యాయస్థానాల పొందికనుబటి కూడ రాజ్యాలను విభజించవచ్చు. అలా విభజిస్తే, గవర్నమెంటు ఆఫీసర్లకు రక్షణయిస్తూ, వారికి ప్రత్యేక న్యాయస్థానాలు కలిగిన రాజ్యాలు, అలా లేనివి అని విభజన చేయవచ్చు. మొదటిరకం ఫ్రాన్సు, రెండవరకం యింగ్లండు చెప్పవచ్చు.

రాజ్యపాలకత్వం

ఈ రాజ్యపాలనాధికారం యెవరిలో మూర్తీభవించివుంది అనే విషయం ప్రతిరాజ్యానికి సంబంధించిన సంవిధానాన్ని పరికించి చెప్పాలి.

వెనకటికి ఆస్టిననే శాస్త్రవేత్త వుండేవాడు. ఆయన రోజుల్లో యిప్పటిలా శాస్త్రాన్ని శల్యపరీక్షచేసినవాళ్లరుదు. అతడుమాత్రం నీతిశాస్త్రాన్ని సమగ్రంగా శల్యపరీక్షచేసి నీతిని నిర్ణయించేశానన్నాడు. ఆయన నిర్ణయించిన నీతి తర్వాత తర్వాత మారిపోయినా నీతిశాస్త్ర పరిశోధనకు యెంతో తోడ్పడింది. రాజ్యపాలకత్వం (sovereignity) అంటే, పాలకత్వం ఎవరిలో మూర్తీభవించిందోవాడికి పాలితులంతా దాసులై వుండాలనీ—ఆ అధికారానికి అవధులనేవి లేక అంతూ పొంతూ లేనంత పెద్దదనీ, అది ఎప్పుడూ రెండుగా విభజింపబడే ద్వంద్వ ప్రభుత్వంలా సాగింపబడటానికి వీలులేదనీ, మొత్తం శాసనాలన్నీ ఆ అధికారాన్ని పురస్కరించుకొని చెయబడినవేననీ, ఆ అధికారంద్వారానే అమలు చేయబడుతున్నవని అన్నాడు. ఈతడి నిర్వచనం తర్వాత తర్వాత వచ్చిన నీతిశాస్త్రవేత్తలచే ఒప్పుకోనబడకపోయినా, అదే ప్రాతిపదికగానే ఉండిపోయింది.

రాజ్యపాలకుడు అనిగాని రాజ్యపాలనాధికారి అనిగానీ మనం ఉపయోగిస్తుంటే పాలకు డెవరు—పాలితు లెవరు అనేవిషయం జ్ఞాపకం చేసుకోవటానికి ఉపయోగిస్తున్నామని గుర్తుంచుకోవాలి. సంవిధానం ప్రకారం ఫలాని విషయంలో పార్లమెంటుకు పాలకత్వం సంక్రమించినట్లయితే మరెవరికీ—చివరకు సుప్రీంకోర్టువారికి కూడ ఆ విషయంలో జరిగినపనిని కాదనటానికి వీలులేదు.

శామ్మం డనే నీతిశాస్త్రవేత్త ఆస్టిన్ సిద్ధాంతాన్ని విమర్శించి రాజ్యపాలకత్వం రెండుగా విభజించటానికి వీల్లేదనే లక్షణంమాత్రం ఒప్పుకోలేదు. పాలనాధికారం అన్నివిషయాల్లోను ఒక్కడి చేతులోనే ఇరుక్కుపోయిందనటానికి వీల్లేదన్నాడు. ఆ విషయాలు విభజింపబడి ఇద్దరు ముగ్గురకు పంచిపెట్టబడితే ఆయా విషయాల్లో ఆ ఇద్దరు ముగ్గురూ కూడ రాజ్యపాలకులే అవుతారన్నాడు. శాసనాధికారం (Legislative Power) పార్లమెంటుకిచ్చి, న్యాయాన్యాయవిచారణం (Administration of Justice) అత్యున్నత న్యాయస్థానాలకిచ్చి, శాసనాలు అమలుచేయటం (Executive Power) ప్రభుత్వానికి ఇస్తే ఈ త్రితయమున్నూ రాజ్యపాలకులే అవుతారు. వాటి వాటి పరిధులలో అవి అత్యున్నతాధికారాలు కలిగివుండే అవకాశం వుందన్నాడు. అలాఅనకపోయే పక్షంలో, ఆస్టిన్ చెప్పిన నిర్వచనమే పట్టుకొని కూర్చున్నట్లయితే ఇప్పుడు ప్రపంచంలో ఉన్న

రాజ్యాల్లో రాజ్యపాలకు డెవరంటే చెప్పలేము. కొన్ని రాజ్యాల సంవిధానాలని పరిశీలించి చూదాం.

బ్రిటిషు రాజ్యాంగం: బ్రిటిషురాజ్యాంగంలో కామన్సుసభ, లార్డ్సుసభ అని రెండు సభ లున్నాయి. రెండూ కలిసి పార్లమెంటు అనబడతాయి. పార్లమెంటు చేసిన ప్రతి శాసనం రాజుగారు—ఇప్పుడు రాణిగారు—ఆమోదించినప్పుడే 'లా' అనేది పుటుతుంది. అది ఆ రాజ్యానికి నీతి అవుతుంది. అలాంటి నీతిని అమలులో పెట్టటం, న్యాయాన్యాయ విచారణ కోర్టులద్వారా చేయించటం అంతా రాణిగారే చేస్తున్నారని అర్థం. "రాణీ" అంటే, రాణీ పార్లమెంటు కలిసిన వ్యవస్థ అనే మాట మర్చిపోరాదు. ఈ విధంగా ఆస్టిన్ చెప్పివుంటే చిక్కు వుండేదికాదు. కాని అతడు మరోలా అన్నాడు. కామన్సుసభ అనేది బ్రిటిషు ప్రజలకు ధర్మకర్తలాంటి సంఘం. అందుచేత బ్రిటిషు ప్రజలే అసలైన అధికారం చెలాయించేది. వాళ్ళే పాలనాధికారులు అన్నాడు. అలా వాదిస్తే ఏ రాజ్యంలో అలా కాదు కనక? ప్రజలు శాసనాల్ని పాటించినంతవరకూ పాటిస్తారు. వారంతా ఏకమవటం జరిగి, అలా జరగరాదు ఇలా జరగాలని ఐక్యకంఠంతో చెప్పగలిగిననాడు విప్లవంవచ్చి రాజ్యాంగమే మారిపోవచ్చు. ఎన్నుకొనేది ప్రజలు (Electorate) కనక ఆ ప్రజలే రాజకీయమైన పాలనాధికారులు అనే అవకాశం వుంది. ఆస్టిను ఈ రాజకీయమైన పాలనాధికారినే శాస్త్రచోదిత పాలనాధికారిగా భ్రమించాడు.

శాస్త్రచోదిత పాలనాధికారిని (Legal Sovereignty) రాజ్యసంవిధానం శోధించటం మూలంగా తెలుసుకోవాలి. బ్రిటిషు రాజ్యాంగంలో ప్రజలు రాజకీయమైన పాలనాధికారులు మాత్రమే. (అందరికీవలె) శాస్త్రచోదితులైన రాజ్యపాలకు లెవరంటే, రాణీన్నీ రెండు శాసనసభలున్నూ కలిసిన వ్యవస్థ. ఈ పాలకులు యెలాంటి శాసనాలైనా చెయ్యవచ్చు. ఎలాంటి అధికారాలనైనా చెలాయించవచ్చు. ఐతే, ఎక్కడా వ్రాసిపెట్టుకోకపోయినా కొన్ని ఆచారాలు (Constitutional Conventions) వారు పాటిస్తున్నారింతవరకూ, ఇకగూడ పాటిస్తారు. అవి నిజానికి వారికి అవధులే (Limitations). సూర్యుడు యింతవరకూ తూర్పున వుదయిస్తున్నాడు. రేపు మన యింటివెనక పుట్టకూడదని చెప్పగలవారెవ్వరు? పుట్టితే ఒక వేళ? అది వేరే విషయం. కొన్ని తెలిసిన కారణాలవల్ల అలా పుటడు అనే గట్టినమ్మకం మనకు వుంది. అందుచేత సూర్యుడికి యీ అవధి వున్నదనే అంటాము. సూర్యుడు పడమట వుదయించడు అంటాము. అలాగే బ్రిటిషు రాజ్యపాలకులకు గూడ (Constitutional conventions) అనే అవధులున్నాయని అంటాడు శాల్మండు.

అమెరికా సంయుక్తరాజ్యాల సంవిధానం: ఆస్టిను సిద్ధాంతప్రకారం అమెరికా రాజ్యంలో రాజ్యపాలకుడు దొరకనేదొరకడు. ఎందుచేనంటే, న్యాయాన్యాయవివక్షణాధికారం సుప్రీంకోర్టుది; పైగా శాసనాధికారం, శాసనాలను అమలుపరచే అధికారం వికేంద్రీకరింపబడి రాష్ట్రశాసనసభలకు, రాష్ట్రప్రభుత్వానికి పంచబడిందాయెను. పదమూడురాష్ట్రాల్లోనూ పదమూడురెండ్లు ఇరవయిఆరుగురు, పైగా సెనెటు, ప్రెసిడెంటు మొత్తం దగ్గరదగ్గర ఇరవయితొమ్మిది మంది కలిసి అంతా రాజ్యపాలకు లవుతున్నారు. ఆస్టిన్ యీ విభజనం ఒప్పుకోడు. అతడేమన్నాడంటే, సంవిధానాన్ని మార్చటానికి అమెరికాలో ఒక పెద్దసంస్థ అప్పుడప్పుడూ యేర్పడుతూవుండేది. పదమూడు రాష్ట్రాలున్నూ కేంద్రమున్నూ కూడ యీ సంస్థకు తమ ప్రతినిధులను పంపివుంటారు. ఆ సంస్థకు సంవిధానాన్ని మార్చగలిగిన బలమైన అధికారంవుంది గనక ఆ సంస్థయే రాజ్యపాలనాధికారి అవుతుందన్నాడు. ఎప్పుడో ఒకనాడు వచ్చిపోయే యీ సంస్థ రాజ్యపాలనాధికారి అనటం సబబుకాదు. శాల్మండు చెప్పినట్లు 29 మందిన్నీ కలిసి రాజ్యపాలకు లవుతారనే మాట సబబు.

భారత సంవిధానంలో భేషయిన భాగారం కనపడుతుంది ఈ పాలకత్వాధికార విషయ విభజనంలో. మామూలుగా విషయాలు విభజించి కేంద్రానికి కొన్ని, రాష్ట్రాలకు కొన్ని కేటాయించారు. ఐతే వాటి వాటి అధికారాలు చెలాయించేటప్పుడు, అత్యున్నతస్థానాన్ని రాష్ట్రాధిపతులు అధిష్ఠించుతారని చెప్పటానికి వీలులేకుండా వుంది. భారతజాతి సముద్ధరణకు అవసరమనితోస్తే రాష్ట్ర శాసనసభల అధికారం కేంద్ర శాసనసభ హస్తగతం చేసుకోవచ్చు. ప్రెసిడెంటు అవసరపరిస్థితుల్లో 352 వ సూత్రం క్రింద వుత్తర్వులు జారీ చేస్తే, అప్పుడుకూడ అలాగే చేయవచ్చు. ఏ రెండు రాష్ట్రాలైనా కోరినట్లయితే కూడ అలాగే పార్లమెంటు అన్ని విషయాల్లోనూ శాసనాలు చేయవచ్చు.

రాజ్యము : రాజ్యపాలకులు

అంతర్జాతీయ విషయాలు మిళితమైవున్న యే రాష్ట్ర విషయంలో కూడ కేంద్రశాసనసభే శాసనాలు చెయ్యవచ్చు; కేంద్రప్రభుత్వం చెలాయింపులు చేయవచ్చు.

ఇవిగాక భారతాధ్యక్షునికి కూడ అధికారాలున్నాయి. ఒక రాజ్యం సంవిధానానికి విరుద్ధంగా నడుస్తోందంటే అతడు ఒక ప్రోక్లమేషనుద్వారా అన్ని అధికారాలూ తన హస్తగతం చేసుకోవచ్చు. ఆ సమయంలో కేంద్రప్రభుత్వానికి సర్వాధికారాలూ వుంటాయి. అందుచేత ఆ సమయంలో శాసనాలు, వాటి చెలాయింపుల మేర రాజ్యపాలకులు పార్లమెంటు, అధ్యక్షుడున్నూ అనే చెప్పవలసివస్తుంది.

మిగతా ప్రభుత్వాలున్నూ, శాసనసభలున్నూ అత్యున్నతాధికారాలు పొందివుండలేదు. కనక అవి రాజ్యపాలకాలు కావు. న్యాయాన్యాయ విచక్షణాధికారానికి సంబంధించినంతవరకు మాత్రం సుప్రీంకోర్టు ఉన్నతాధికారంకలది గనుక, రాజ్యపాలక మనే చెప్పాలి.

ఈ రాజ్యపాలకులకు హక్కులు, విధులు వున్నయ్యా లేవా అనేది ఒక సమస్య. ఈ విషయ విమర్శనకు రెండు దృక్పథాలున్నాయి. వ్యక్తిగతస్వత్వాలకు పూర్వకాలంనుంచీ ప్రాధాన్యం యివ్వటం మామూలు. ఐతే సంఘ సౌభాగ్యంకోసం వ్యక్తిగత స్వత్వాల్ని కూడ వదులుకొని, పేరు, ప్రతిష్ఠలు పొందినవాళ్లనేకులు చరిత్రలో వున్నారు. ప్రజాసామాన్యంతో అనేకమంది వారిపరిస్థితిని పొగిడి తామున్నూ అలా వుండాలని ఆశిస్తున్నారు. వ్యక్తిగత స్వత్వాలకు ప్రాధాన్యం యివ్వటంమాని సామాజిక సౌభాగ్యానికి, సాంఘిక స్వత్వాలకే ప్రాధాన్యం యిస్తున్నారు. ఈ విధంగా రెండురకాల సిద్ధాంతాలు యేర్పడ్డాయి.

వ్యక్తిగత స్వత్వాలకు ప్రాధాన్యం యిచ్చేవారి సిద్ధాంతంప్రకారం విశృంఖలమైన స్వతంత్రంతో సర్వతోముఖంగా అభివృద్ధి చెందటానికి ప్రతి మనుష్యుడికి అవకాశం వుండాలనీ, అతడి అకుంఠితమైన ప్రయత్నంతో, శక్తితో తను విజృంభించే వీలు తనకుండాలనీ, అలా వుండే అవకాశాలు కలగజేసేంతవరకే రాజ్యపాలకులు తమ అధికారాన్ని వినియోగించటం జరగాలనీ వాళ్ళంటారు. ఈవిధమైన మనోవికారం మొదట్లో వ్యవహారశాస్త్ర విజృంభణంలో ముఖ్యపాత్ర వహించింది. సంఘం అనేది ప్రత్యేకవ్యక్తులనేకమంది చేరటంచేత కలిగిందని, అందుచేత వారిలోని అనేక వ్యక్తుల ఫలాపేక్షలు రక్షింపబడితే అది చాలు అని అనుకొంటూ వ్యక్తిచుట్టూర గిరిగీసి ఆలోచిస్తూ ఆ విధంగానే శాసనాల్ని చేస్తుండేవారు.

రెండవదైన సామ్యవాద సిద్ధాంతంప్రకారం, ఒక రాజ్యసంస్థలో ఎక్కడనో ఒకచోట ధనం కూడగట్టబడివుండకుండా, ఒకచోటనే విలాసాలు సంతోషాలు వుండిపోకుండా, మిగతా వాళ్ళంతా విద్యలేక ధనంలేక సంతోషంలేక రోజురోజుకీ అధఃపతనాన్ని చెందే అవకాశం లేకుండా ఆ రాజ్యసంస్థలోని పాలనక్రమాన్ని సరిదిద్దాలి అంటారు. రాజ్యపాలకులే ఆపని నెఱవేర్చాలి. వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకొని ఒకే ఆసామీ ఒక వూళ్లో వ్యాపారమంతా చేసేసి, మిగతావాళ్ళకు, తనకు కూలిపని చేయటానికి మాత్రం బ్రతికేందుకు భోజనం వేస్తుంటే ఇది న్యాయం కాదుగదా! పోటీలేని యిలాంటి వ్యాపారం సామ్యవాదం సహించదు.

సామ్యవాద సిద్ధాంతం అమలులో పెట్టటానికి నాల్గురకాలమార్గాలు సూచింపబడ్డాయి. ఒకటి: ధనికుల ఆస్తి శాసనంద్వారా స్వాధీనపరచుకొని బీదలకు పంచిపెట్టటం; జాగీర్లు, జమీలు, లాగివేసినట్లుగా. రెండు: మనిషిని అతడి పనినిబట్టి లేకపోతే అతడు ఇంతచేయగలడనే అంచనానిబట్టి అందుకు తగిన వేతనంక్రింద ఆస్తిపంచి యివ్వటం. ఎక్కువ పనిచేయగలవాడికి ఎక్కువ, తక్కువపనిచేయగలవాడికి తక్కువ వస్తుంది. ఆ యిచ్చిన ఆస్తిమేర, ఆ మనిషికి స్వంత ఆస్తి వుండవచ్చు. అంతకంటె యెక్కువ వుండనీయరు. మూడు: కమ్యూనిజం. ఇందులో స్వంత ఆస్తి వుండనక్కరలేదు. ఆస్తి అంతా రాజ్యానిది. రాజ్యపాలకులు, ప్రభుత్వంద్వారా మొత్తం ఆస్తి వినియోగం చేస్తూ అందరూ అనుభవించేలా చూస్తారు. మనుష్యులందరూ పనిచేస్తూవుంటారు. వీరందరిచేత స్టేటు పని చేయించుకొంటూ వుంటుంది. ఒక్కొక్కళ్ళకెంత కావాలో అంతాగూడ ఆ స్టేటే యిస్తుంది. నాలుగు: కలెక్టివిజం (Collectivism). ఈస్థితిలో మొత్తం ఉత్పత్తి అంతా రాజ్యపాలకులద్వారానే జరుగుతుంది. ఏమనిషి కామనిషి, స్టేటుకోసరం (అనగా రాజ్యపాలనాధికారికోసరం) తను చేయకలిగిన పని తను నెఱవేరుస్తుంటాడు. తనకు-తనేం చేసుకోవాలనే పరిస్థితికంటె స్టేటుకు తనేం చెయ్యాలనే పరిస్థితి అతడిలో ఎక్కువగా వుంటుంది... ఈ స్టేటు ఏమిటి? ఎవరూ? అనే విషయం ఎవరికీ సాధారణంగా తెలీదు; భగవంతుడెవరంటే యిప్పుడు మనం చెప్పలేనట్లే స్టేటు అంటే నీతిశాస్త్రం చదువుకున్నవాళ్ళకు అర్థం అవుతుంది. కళ్ళకు కనపడదు. ఎందుకనంటే తనూ తనలాటివాళ్ళు కలిసినంతానే కదూ స్టేటు అనబడేది! నిన్ను నువ్వు

తెలుసుకో అనేమాత్రం ఉత్పన్నమౌతుంది. భారతీయ సిద్ధాంతం ప్రకారం జీవుడు పరమాత్మగ్రహణంగా కర్మ చేస్తున్నట్టే మనుష్యుడు స్టేటుకోసం పని చేస్తాడు. పుట్టించినవాడు పెట్టుతాడన్నట్టు ఆస్టేటే అందరికి వారివారి అవసరాలను గడుపుతూవుంటుంది. ఎక్కడ చూసినా శాంతి – శాంతి — శాంతే కనపడుతుంది. ఎప్పుడన్నా ఎక్కడన్నా ఎవరికన్నా ఏమైనా అవసరాలు తీరకపోతే ఈరోజుల్లో కొందరు కొందరు భగవంతుడిని తిట్టుతున్నట్టే అజ్ఞాతుడైన స్టేటుగారిని తిట్టుతూ కర్మపోరాటం చేసి మళ్ళీ మళ్ళీ చరిత్ర చక్రపునఃక్రమణానికి దోహదమిస్తారు.

ఏతావతా — వ్యక్తిగతసిద్ధాంతాలకు ప్రాధాన్యం యిచ్చేవారి ప్రకారం, రాజ్యపాలకులు కొన్ని విషయాల్లోనే జోక్యం కలుగచేసుకోవలసివుంటే — అనగా ఒక యుద్ధవిషయంలోనూ, ఒకడివల్ల యింకొకడికి అన్యాయం జరుగుతున్నప్పుడునూ, మాత్రమే జోక్యం కలిగించుకొంటూ ఏశాసనాలుపడితే ఆ శాసనాలుచేసి మనిషిచుట్టూ యినప తెఱలు వేయకుండా వుండవలసివుంటే, — సామ్యవాద సిద్ధాంతం ప్రకారం సమోన్నతస్థితిలో ఆర్థిక క్షేత్రంలో, రాజకీయ క్షేత్రంలో, వ్యాపార క్షేత్రంలో. అన్ని విషయాల్లోనూ జోక్యం కలిగించుకొంటూ మంచి పనులు చేయిస్తూ చెడ్డపనులు తుమిస్తూ భగవంతుడి మాదిరిగా యీస్టేటు, సర్వసమర్థమై, సర్వజ్ఞతతో, సర్వవ్యాపియై న్యాయాన్యాయ విచక్షణం చేస్తూ వుండాలి.

ఉదాహరణకు ఇరవయిమందికంటె యెక్కువ గలిగిన యే సంఘంకూడా రిజిష్టరు చేయిస్తేతప్ప యేర్పడరాదు అని రేపొక శాసనం వస్తున్నదనుకొందాము. అలా యే సంఘమయినా యేర్పడి రిజిష్టరు చేయించనట్లయితే శిక్షపడే అవకాశంకూడ వుండవచ్చు. రిజిష్టరు చేసినతర్వాత దానికి సంబంధించిన బాధ్యతలన్నీ చాలా అంటుకుంటాయి. అసలు రిజిష్టరు చేయించటంలో ఆలస్యమయితే అమాయకులకుకూడ శిక్షపడే ప్రమాదం కలగవచ్చునేమో! అప్పుడు బహుశః మనుష్యులు సంఘం అనేదానిలో చేరటానికే భయపడవచ్చునేమో! ఇలాంటి భయంకర పరిస్థితి ఒక చెంప వ్యక్తి అనే వాణ్ణి తరుముతుంటే—యే చిన్న సంఘమయినా రిజిష్టరయింతర్వాత సక్రమంగా లెక్కలు తయారుచేయటం, సక్రమంగా మీటింగులు జరగటం మొదలైన అభివృద్ధి సూచకమైన సౌఖ్యాలు సమష్టి (Collective)గా అనుభవిస్తుంది. మొదటి సిద్ధాంతులు యీసడించుకోవచ్చుగాని యీ యీసడింపులు యెక్కువకాలం మనవు—అంతా పరమాత్మయిన "స్టేటు" స్వరూపమేనని మన్నిస్తే అసలు యీసడింపులకు అవకాశం వుండదు.

ఏతావతా చెప్పవచ్చినదేమిటంటే — రాజ్యపాలకులకు విధులుఅంటూ లేకపోవచ్చు. వారికి హక్కులున్నాయంటంకంటె అధికారాలున్నాయనటమే సబబు. పన్నులు వసూలుచేసే అధికారం, యుద్ధాలు చేసి దేశరక్షణంచేసే అధికారం, తిరుగుబాటుదార్ల నణచివేసే అధికారం వున్నాయి. ఈఅధికారాల చెలాయింపులలో యెవరికే బాధలు కలిగినా రాజ్యపాలకులను, యెవరూ యేమీ అనలేరు. న్యాయస్థానాలుకూడ యేమీ చెయ్యలేవు. ఎందుకనంటే, రాజ్యపాలనాధికారంలో న్యాయస్థానాలు ఒకభాగం కావటంచేత న్యాయస్థానాలు రాజ్యపాలనాధికారికి లోబడే. న్యాయస్థానాలు రాజ్యపాలనాధికారిని శాసించలేవు. ఆసిన్ అనే ఆయన సిద్ధాంతం యీ విషయంలో సరియైనదనే చెప్పాలి.

రాజ్యపాలకులు సాధారణంగా తమ పనులు ప్రభుత్వం ద్వారానే చేస్తుంటారు. అందుచేత ప్రభుత్వం రాజ్యపాలకత్వాధికారాన్ని పురస్కరించుకొని యే పనిచేసినా ప్రభుత్వాన్ని న్యాయస్థానాలు అదలించలేవు.

కాని ప్రభుత్వం రాజ్యపాలకత్వాన్ని పురస్కరించుకొనకుండా యేదో ఒక శాసనంమూలంగా కొన్ని పనులు చేయవలసి, ఆ చేయటంలో యేవో అవకతవకలు చేస్తే,—ఉదాహరణకు వ్యాపార విషయంలో లేదా ప్రభుత్వానికి చెందిన ఒక యంత్రాలయంలో కొందరికి కష్టనిష్ఠురాలు కలిగిస్తే ఆ కష్టనష్టాలకు ప్రభుత్వం బాధ్యమవటం తథ్యం. నష్టపరిహారాన్ని ప్రభుత్వంచేత కోర్టులు యిప్పించటం నిజం. సమంజసం కూడాను. అందుచేత ప్రభుత్వం రాజ్యపాలనాధికారాన్ని చెలాయిస్తూవుండగా జరిగిన అవకతవకలను వేలెత్తి కోర్టులు చూపలేవుగాని మిగతా అధికారాలు (అనగా శాసనంద్వారా వారు చేయవలసిన విధులు నిర్వర్తించేటప్పుడు) చెలాయించేటప్పుడు జరిగిన కష్టనష్టాలకు ప్రభుత్వంచేత పరిహారం యిప్పిస్తాయి.

ప్రభుత్వం పై చెప్పినంతమేర న్యాయస్థానాలకు లోబడె. అట్లాగే శాసనాలుకూడ, ప్రభుత్వంచేత మన్నింపబడాలి. ప్రభుత్వమంటే రాజ్యపాలకులు కారు; గవర్నమెంటు. ప్రభుత్వం వేరు, రాజ్యపాలకులు వేరు అని మనసులో జ్ఞాపకముంచుకోవటం నీతిశాస్త్రజ్ఞునికి చాల అవసరం.

పవన సూక్తము

శ్రీమతి పి. అరుణకుమారి

చిఱు వెన్నెల విరిసి రేయి
పురి విచ్చిన సరణి తీయ
మొలికింపగ, జివురు టూయ
లల నూగుచు నెచట కోయి
పవన సఖా! వలపు రాయ
బారముతో బయనించెదు?

నీ యూరుపు సవ్వడిలో
నినదించెను నెవ్వగలే;
నీ యడుగుల కదలికలో
మ్రోయు గింకిణుల రొదలే;
ఏ విధుర స్పందిత హృదు
లో వినబడు నీలో గద!

జత వీడిన చక్రవాక
సతి తెల్పెనొ వెతలు నీకు,
పతి బాసిన పద్మప్రియ
బతిమాలెనొ, దాత్యక్రియ
మతి నెంచి నిశీథినిలో
మసలెదు వనవీథులలో.

నీ వేగెదు త్రోవల బూ
దీవెలు మధుజీవన రా
గోదయ హాసితమ్ములు సూ
నాధరముల జిమ్ముచు న
ర్తించు నిహారద్యుతి వె
ల్గించు పసిడి హారతులై.

పేదలు శ్రీమంతులు నా
భేదము నీ స్వాంతములో
లేదు; శుష్క తృణ రేఖలు
మేదుర భూరుహ శాఖలు
నీ దివ్య సుఖాశ్లేషము
లో దరళములై భాసిలు.

దళిత కుసుమ లలిత పరి
మళములు పై నలది ఝరీ
విమల నటత్కన త్తరం
గముల మున్కలెత్తి ధరి
త్రీ నభోంతరపు విహార
మూని చరింతువు సమీర!

జలదకాంత చెక్కిలి పయి
గిలిగింతలు నెక్కొలుపుచు
నిముసమేని నిల్వక వి
శ్వమున నీదు చెల్వపు యా
త్రను గొనసాగించెదు, మై
త్రిని సద్దెస గురిపించుచు.

కొంతొక మ్రోడును సుడిగొని
మండు దవాగ్నిని బాడగని,
గుండె కరగగా వర్తిలు
తాండవ రసమూర్తివై
నిండెద వావర్తిత బ్ర
హ్మాండపు సంవర్తగతిన్.

అశరీర విహార! అనల! అచలుడనై ఆగి క్షణము
కనుమ నాదు కరుణ వ్యథ వినుమ నాదు విరహగాథ
నాలో నిండిన వలపును నీలో బిండెద గలగొన;
ఆకడ దూరస్థల గతుండై నన్నెడ బాసిన పతి
చెంత అవతరించి నా హృదంతర మొలికించుమయ్యా!

చిత్రకళలో విప్లవం తెచ్చిన వాన్‌గో

శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తి

పారిసులో ఇంప్రెషనిష్టు చిత్రకారుల ప్రభావములోకి వచ్చి విశేష వ్యక్తిత్వము, మానవతా విశ్వాసము, జీవము, ఆవేగము చిత్రాల్లో నింపిన అతిలోకవ్యక్తి వినిసెంట్ వాన్‌గో. ఇతని చిత్రకళా జీవనము పది సంవత్సరములు మాత్రమే. ఇంత స్వల్పకాలములో ప్రపంచాన్ని కదలించే మహోన్నత చిత్రాలు శరపరంపరగ అన్ని చిత్రించడము కళాలోకంలో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. చిత్రకల్పన ఆయనకు ఉచ్ఛ్వాసనిశ్వాసములుగా కనిపిస్తుంది. ఏమంటె, ఆ చిత్రాలు ఇక తాను వేయలేనూ అనుకున్న వెంటనే ఆయన భౌతిక దేహము చాలించాడు.

వాన్‌గోను తలుచుకున్నప్పుడు అతని తమ్ముడు థియో స్మృతిపథాన తోస్తాడు. థియో లౌకికముగా నిర్వాహకుడైన వ్యక్తి. అంటే డబ్బు సంపాయించాడు ప్రపంచానికి ఎదురీదకుండా. విశేషమేమంటే, ఈ డబ్బు వినిసెంటు చిత్రాలు నిర్మించడానికి పెట్టుబడిపెట్టాడు. ఈ విధంగా వినిసెంటు చిత్రించిన చిత్రాలన్నీ థియో ఆస్తి అవుతాయి. ఇది వాళ్ల మధ్య యేర్పాటుచుకున్న నిర్ణయం. కాని, థియో కేవలం పెట్టుబడిదారుడు కాదు అని వినిసెంటు చనిపోయినాక తెలుస్తుంది. అన్న చనిపోయిన ఆరు నెలలకే, థియో నిస్తేజుడై మరణిస్తాడు. అన్నదమ్ముల అన్యోన్యాన్ని అర్థంచేసికొన్న థియో భార్య థియోను వినిసెంటు ప్రక్కన పంటపొలాల్లో చేర్చింది. అతిలోకమైన ఆ చిత్రాలు అపురూపమైన ఆ అన్నదమ్ముల హృదయ స్పందనాలుగా మనము స్వీకరించాలి!

చిత్రకళకోసమే జీవించిన వాంగో ప్రపంచంలో మెలగలేకపోయినాడు. ఆ పని తమ్ముడు థియో సాధించి వాన్‌గోకు ఆధారంగా నిలిచాడు. అంతే! అంతకంటె వాళ్ళ జీవితాలకు వేరే అర్థము కనిపించదు. ఈ సంవిధానము దైవనిర్ణయమనిపిస్తుంది. ఇది పాశ్చాత్య కళాలోకము అదృష్టము అనాలి.

వాన్‌గో వెర్రిబొమ్మలు వేశాడు. ఆ వెర్రి లేకపోతే అతను బొమ్మలు వెయ్యలేడు. మనకు ఆ కళా ఖండాలు ప్రాప్తము అయ్యేవే కావు. చివరకు ఆ వెర్రే అతని ప్రాణాలు తీసింది. అతని వెర్రి అర్థము చేసికొని సానుభూతితో భరించి సాయపడ్డ అతని సోదరుడు థియో అమృతమూర్తిలా తోస్తాడు.




చెవికట్టుతో వాన్‌గో. తనే రచించిన చిత్రం.

జూలై 1880 లో — ఇక పదిసంవత్సరాలకు వినిసెంటు చనిపోతాడనగా — థియోకు తను చిత్రకళలో కృషిచేస్తానని రాశాడు వినిసెంట్. అతనికప్పుడు ఇరవై ఏడు సంవత్సరాలు. అప్పటికప్పుడే నాలుగైదు వృత్తులు అవలంబించి వాటిల్లో కృతకృత్యుడు కాలేకపోయి విరమించాడు. అతను జీవనోపాధికోసము స్కూలు మేషరు చేశాడు. బొమ్మలు అమ్మే కంపెనీలో పనిచేశాడు. మతప్రచారకుడుగా కృషిచేశాడు. ఇవన్నీ హృదయపూర్వకంగా సాధించాలనే పట్టుదలతో ప్రయత్నించాడు కాని లాభం లేకపోయింది. వారి కుటుంబము శిష్టాచారాలు గలది. తండ్రి ఒక చిన్న చర్చి అధికారి. వాళ్ళంతా ఇక వినిసెంటు ఎందుకు పనికిరాని దిమ్మరిఅని నిరాశచేసికొన్నారు. నిజానికి వినిసెంటు తాను ఏదో కార్యసాధనకోసమే జన్మించానని నమ్మేవాడు అయితే, ఆ కార్యము ఏమిటో అతనికి ఆకళింపుకు రాలేదు ఇంకా.

వినిసెంటు పట్టుదలలేనివాడు కాదు. ఏపని ప్రారంభించినా అచంచలమైన విశ్వాసము, కార్యదక్షత

చిత్రకళలో విప్లవం తెచ్చిన వాన్‌గో



కన్నులపండువైన గోధుమచేను (1889)

కొదవలేదు. మనస్సాక్షిగా ఏపనైనా తాను నమ్మిన దంతా కార్యరూపంలో పెట్టడానికి చూస్తాడు. అదే అతని పతనానికి కారణమౌతూ వచ్చింది. విన్సెంట్ పూర్వపు చిత్రాలు అమ్మే కంపెనీలో పనిచేశాడు. అక్కడికొచ్చి కొనే సంపన్నులంతా ఏరుకొనే కళాఖండాలు చూస్తే అతని మతి పోయేది. ఒకసారి ఒక ధనికురాలు చాల బొమ్మలు ఏరుకుంది కొనడానికి. నిజానికి పెద్దబేరము అది. చివరకు ఆవిడ సంతృప్తితో తన నిర్ణయము ఎలా ఉన్నదని అడిగింది. భేషుగా ఉన్నదమ్మా అంటే ఎంతో సంతోషించేది ఆవిడ. మీరు కళ్ళుమూసుకొని తీసివల్లయితే ఇంతకంటె మంచి చిత్రాలు ఏరుకుని ఉండేవారని అనేశాడు వాంగో. దాంతో సరి! ఆవిడ ఉగ్రురాలై అతన్నీ వదిలి వెళ్ళిపోయింది. దానితో ఆ ఉద్యోగము పోయింది విన్సెంటుకు. బ్రూజెల్సుకు బొగ్గుగనులలో మత ప్రచారకుడుగా వెళ్ళాడు. అక్కడ బొగ్గుగనులలో పనిచేసే అభాగ్యుల జీవితాలు చూసి కరుణాపూరితమయింది అతని హృదయం. అంతే! తనూ వాళ్ళలో ఒకడై, తన భోగాలన్నీ పరిత్యజించి ఒక గుడిసెలో నివసిస్తూ, వాళ్ళ తిండే తింటూ, వాళ్ళకు సేవచేయడం ప్రారంభించాడు. అందుకు ఫలితంగా చర్చివాళ్లు అతని ఉద్యోగం తీసి వేశారు. అతని ఆరోగ్యము పాడయింది.

పతితజనాళి అంటే అతనిహృదయం నీరయ్యేది. బొగ్గుగనుల్లోనూ, లండను ఇరుకు గల్లీల్లోనూ, పాటకజనం పడే బాధలు, దుర్భరజీవనం — అతన్ని మిక్కిలిగా కదిపింది. వాళ్లకు తాను ఏమీ ఉపకారం చెయ్యలేకపోయినాడు. వాళ్లి సానుభూతి మాత్రము తనకు పుష్కలముగా లభించింది. ఈ సందర్భంలో అతనిలో ఉన్న కళాజీవనము పైకుబికి వచ్చింది. ఉద్యోగము పోయి జబ్బుపడిఉన్నప్పుడు బొగ్గుగని పనివాళ్ళు అతన్నాదరించి సేవజేశారు. వాళ్ళే ఆహారం పెట్టి సాకుతూవచ్చారు. అప్పుడు వాళ్ల రూపాలు తాను

అప్యాయంగా చిన్న చిన్న కాగితాలమీద చిత్రించడము ప్రారంభించాడు. తన బొమ్మలు తనకు ఆనందాన్నివ్వడం ప్రారంభించాయి; ఆపనివాళ్లకు ఆనందం కలుగజేస్తూవచ్చినయి. వాళ్ళు వచ్చి కూర్చుని తీరుబడివేళల్లో వినిసెంటుచేత బొమ్మలు వేయించుకునేవాళ్లు. వాళ్ళు ఇళ్ళల్లో పనిచేసుకునేప్పుడు, గనుల్లోకి వెళ్ళేప్పుడు అనేక చిత్రాలు చిత్రించాడు వినిసెంట్. తన చిత్రాలద్వారా పతితమానవజీవనాన్ని నాగరికలోకానికి అందియ్యగలనని నమ్మకము కలిగింది. చిత్రకారుడుగా తను జీవించాలని నిర్ణయించుకున్నాడు. థియోకు ఉత్తరం వ్రాశాడు.

థియో ఇదివరకు వినిసెంటు పనిచేసిన బొమ్మల కంపెనీలోనే పనిచేస్తూండేవాడు — ప్యారిస్ శాఖలో. వినిసెంటు చిత్రాలుచూచి భుజము చరిచాడు. వినిసెంటుకు అప్పటికి ఆ విద్యలో గురుకులవాసము లేదు. హేగుపట్టణములో ఒక స్టుడియో యేర్పరచి అక్కడ ఒక చిత్రకారునివద్ద ఆ కళ అభ్యసించడానికి ఏర్పాటుచేశాడు. నెలకు వంద ఫ్రాంకులు పంపుతూ ఉండేవాడు, వినిసెంటు తాను వేసిన బొమ్మలు అమ్మి తనకాళ్లమీద నిలబడటానికి ప్రయత్నంచేసి, ఎప్పటికప్పుడు విఫలుడౌతూ వచ్చాడు. అతను బీదతనాన్నే వరించాడు. అబీదతనంలో మగ్గే ప్రజానీకాన్నే అతను చిత్రించేవాడు. సౌందర్యదూరమైన వారి దుర్భరజీవనచ్ఛాయలు నాగరకలోకానికి కంటకప్రాయంగా ఉండేవి. అవి ఎవరూ కొనేవారుకాదు. అయినా తనకళాజీవనం వారి జీవితముతోనే లగించాడు వినిసెంటు. హేగ్‌లో ఉండగా "క్రిష్టినా" అనే ఒకపతితురాలితో పరిచయమైంది. ఆమె హేయమైన జీవనాన్ని అసందిగ్ధంగా నిర్మలహృదయంతో మన్నించాడు. ఆమెను భార్యగాస్వీకరించి జీవించడానికి నిర్ణయించి ఆమెనీ, ఒకచంటిపిల్లడినీ తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాడు. ఆమె వినిసెంటుజీవనంలోకొరగావున్న గార్హస్థ్యసౌభాగ్యాన్ని చేకూర్చింది. స్థిమితంగా వినిసెంటు చిత్రాలు వేయడం ప్రారంభించాడు. కాని ఈ వార్త అగ్నిజ్వాలలా వ్యాపించి, అతని మిత్రలోకంలో పెద్ద కల్లోలం కలుగజేసింది. వాళ్ళు వెలివేసినట్లు తరిమివేశారు. "క్రిష్టినా" తన ప్రాతజీవనానికితరలిపోయింది. వినిసెంటు తనయింటికివెళ్ళి కొన్నాళ్ళు ఆపల్లెప్రాంతాలు ఆప్యాయంగా చిత్రించాడు. అతని జీవితమంతా భగ్నప్రేమకలాపాలతో కలుషితమయింది. ఊళ్ళో మగ్గాలవద్ద సాలెతలనూ, పొలాల్లో పనిపాటలు చేసుకునే పాటకజనాన్ని, పరిసరప్రకృతిని ఆత్రంతో చిత్రించాడు. థియో రంగులు, కాగితాలు, డబ్బూ పంపుతూవుండేవాడు.

వినిసెంటుకు చిత్రరచనలో చేయితిరిగింది. ఆ త్తతో పొలాలు, పిట్టలు, పాటకజనాన్ని చిత్రించేవాడు. కాని అతని చిత్రాల్లో వర్ణస్వచ్ఛత కొరవడి ఉండేది. అప్పుడు ఇంప్రెషనిష్టులు కళలో తీసుకువచ్చిన వర్ణస్వచ్ఛత అతను ఎరగడు. డల్‌క్రోక్స్, డామియర్, మిల్లెట్ మొదలైన డచ్చి చిత్రకారులు అతనికి అధిదేవతలు. వారి ఆదర్శాలు వెలుగురేకలుగా ఉంచుకుని, నిత్యజీవనముతో సన్నిహిత సంబంధము పెట్టుకొని చిత్రరచన చేసేవాడు. తన పూర్వీకుడైన రెంబ్రాండ్టు సంప్రదాయంలో ఉండేవి అతని చిత్రాలు – నీడలు, వెలుగులతో.

ఈ సమయంలో థియో వచ్చి వినిసెంటును పారిస్ తీసుకెళ్లాడు. అక్కడ గాగిన్, సీరట్, సిజనె, ట్యూలెస్ లాట్రెక్ మొదలైన ఇంప్రెషనిష్టులతో పరిచయమయింది. వారి వర్ణవిన్యాసము వినిసెంటుకు కనువిప్పు అయింది. ఇన్నాళ్ళూ అంధకారంలో ఉన్నట్లు తోచింది. వినిసెంటు వారి పద్ధతులన్నీ అవగాహన చేసికొన్నాడు. పారిస్‌లో మటుకు కాలు నిలువలేదు. సూర్యరశ్మికి, ప్రకృతిసౌందర్యానికి పేరుపడ్డ పశ్చిమప్రాంసులోని ఆర్లస్ అనే ప్రాంతానికి ప్రయాణం కట్టాడు. అక్కడ ఇల్లు అద్దెకు తీసుకొని తలమాడ్చే ఎండలో పొలాల్లోకిపోయి రోజు కొక చిత్రం పూర్తి చేసుకువచ్చేవాడు. థియో పంపిన డబ్బు రంగులు, కాగితాలు–తను యంత్రమువలె చిత్రాలు తయారు చెయ్యడము! విరామమంటూ లేక, ఆరోగ్యంమాట పట్టించుకోకుండా నిరంతరకళాసాధనలో తపించిపోయేవాడు! బొమ్మలకు ఫ్రేములు చేయించడానికి డబ్బు చాల ఖర్చయేది. ఎప్పుడూ డబ్బుకుఇబ్బందిపడుతూ, థియోవద్దనుంచి మణియార్డరుకు ఎదురుచూస్తూ వుండేవాడు.

ఆర్లిస్‌లో పోస్టుమాన్ రొలిన్ అనే ఆయన్నూ, ఆయన భార్యను, కుమారుణ్ణి, తన హోటలు యజమానిని, పంటపొలాలు, కాలువ వంతెనలు చిత్రించాడు. చిత్రాలు తేజఃపుంజాలులా వెలిగిపోవడము ప్రారంభించినాయి. నిరంతర సాధనవలన సిద్ధహస్తుడైన వినిసెంటుకు చిత్రము, నిర్మాణమువిషయము ఒకప్రశ్నగా వుండేదికాదు. ఒక సన్నివేశము ఎంచుకోవడముమటుకు అతని పని. ఆ తరువాత చిత్రము తయారుకావడము అతనికి తెలియదు. అనంతా ఒక ఆవేశంలో అతిలోకమైన వాతావరణంలో జాజ్వల్యమానంగా తయారైపోయేది. ఏరంగుకారంగు అతిస్వచ్ఛంగా విన్యసించబడుతూ వచ్చింది. అతని పసుపురంగు అంత స్వచ్ఛంగా ఏ చిత్రకారుడూ ఉపయోగించలేదు. ప్రకృతిని యధాతథముగా గాక, తన తూలికా విన్యాసముద్వారా, వర్ణసంవిధానంవల్ల ఒక



'నైట్ కేఫ్' - 1888 లో రచించిన చిత్రం.

విచిత్రమైన కళాఖండముగా రూపించడము నేర్చుకున్నాడు. ఎగురుగుండా చూచివేసిన చిత్రాలే అతని కలల మిలమిలలు మెరిసిపోతూ సాక్షాత్కరించేవి. ఆర్లెస్ చాల వింత ప్రదేశం. ఎప్పుడూ సుడిగాలులు, ఇసకతుపానులు చెలరేగుతూ ఉంటాయి.

నరాలకు చాల అలజడి కలిగించే వాతావరణం అది. ఆ మండుటెండల్లో. టోపీఅన్నా లేకుండా వినిసెంటు పొలాల్లో తిరిగేవాడు. దానికి తోడు గాగిన్‌వచ్చి తనతో మకాంచేశాడు. ఇద్దరూ స్నేహితులైనా కళాభక్తి కలలో వేరు వేరు అభిప్రాయాలు కలవారు. గాగిన్ ప్రత్యేకమ్ము ఓర్వలేని మనిషి. వినిసెంటు చిత్రాలు విమర్శించి చీదరించుకొనేవాడు. అతనిమతి స్థిమితము తప్పడానికి ప్రారంభించింది. ఒకరోజున హోటలులో పనిమనిషి వినిసెంటు చెవి కావాలని వేళాకోళంగా అన్నది. ఇంటికి పోయి రేజరుతో చెవికోసి పార్సెలుచేసి ఆ యెమ్మెలాడికి పంపించాడు. గాగిన్‌తో కయ్యానికి దిగి స్మృతి తప్పిపడిపోయాడు.

థియోవచ్చి వినిసెంటును, ఒకహాస్పటల్‌లో చేర్చివెళ్లాడు. అక్కడనుంచి ఒక పిచ్చిఆస్పత్రిలో చేరాడు. మూడునెలలకు ఒకసారి తిప్పలావచ్చి పడిపోయేవాడు. స్మృతివచ్చినపిదప మళ్ళా ఎడతెగక చిత్రాలు తయారుచేసేవాడు. చెవికట్టుతో తనరూప చిత్రము మొదలైనవి ఈ కాలంలో వేసినవి.

వినిసెంటుకు అంతకంతకు తన ఆరోగ్యము క్షీణిస్తున్నట్లు స్థిరమైంది. తనకు వేయవలసిన చిత్రాలు గూడ అయిపోయినట్లు తోచింది. ఇంక తను థియోకు భారంగా ఉండదలుచుకోలేదు. అందుకని, ఒకరోజున పొలాలలోకిపోయి ఒకమనోహరమైన స్థలంలో పిస్టల్ కాల్చుకు మరణించాడు. తను ఎవరికైతే భారము కాకూడదనుకున్నాడో ఆ థియోకూడ ఆరు నెల్లలో అన్నను అనుసరించాడు. అంతే!

ఆ చిత్రాలు నేటికి కళాలోకంలో శాశ్వతంగా నవ్య స్ఫురణలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.

ఇరుగు పొరుగు

శ్రీ బాలగంగాధర తిలక్

పాత్రలు: సిద్ధాంతం-అతని భార్య - రాద్ధాంతం - నారాయణ - నరసింహం - ఎరకయ్య - ఎర్రయ్య - డి. యస్.పి., ఇతరులు.

[రాత్రి పంద్రెండుగంట లవుతుంది. సిద్ధాంతం తనయింటి మధ్యహాలులో కూర్చుని దినపత్రిక చదువుతూంటాడు. పక్కనే టేబిలుమీద విద్యుద్దీపం, అందమైన టేబిలు లైటులో అమర్చబడి మెత్తని కాంతిని అతనున్న కొంత మేరా ప్రసారిస్తూంటుంది. సీలింగ్ మీద ఒక పెద్ద తెల్లని డోమ్‌వుంది. కాని వెలిగింపబడ లేదు. ఓ పుస్తకాల షెల్ఫూ, దివాన్, కుర్చీలూ, సోఫాలూ ఉచితస్థలాలలో ఉంటాయి. గోడమీద ఒక రిద్దరు దేశనాయకుల పెద్దసైజు చిత్రపటాలూ, ఒకటి రెండు క్యాలెండర్లూ ఉంటాయి. గోడకి మధ్యగా యింటిలోపలి భాగంలోకి ఒక గుమ్మమూ, దాని పక్కగా రెండుగుమ్మాలూ—ఒకటి వీధిలోకి మరొకటి తోటలోకీ—వుంటాయి. గుమ్మాలకి పువ్వులసిల్కు తెరలుంటాయి.

సిద్ధాంతం యాభై ఏళ్ళవాడు. కొంచెం బట్టతల. గంభీరమైన విగ్రహం. కాని ముఖంలో ఎక్కడా గడుసుతనాన్ని సూచించే లక్షణం ఏమీ కనపడదు. నైట్ గౌన్ వేసుకుంటాడు. కళ్ళకి గోల్డ్ రిమ్ అద్దాలు.

తెరలేచిన ఓ నిముషంలో అతనిభార్య వస్తుంది. నలభైపైన వయస్సున్నా అయిదారేళ్ళు చిన్నదిగా కనపడుతుంది. సన్నగా పొడుగ్గా నాజూగ్గా ఉంటుంది. ఇదివరకు యింకా అందంగా చురుకుగా ఉండేదని నిస్సందేహంగా చెప్పవచ్చును.]

భార్య: ఇంకా చదువేనా అర్ధరాత్రి దాటినా. హయ్యో రామ! ఆ లైటులో చదివితే ఉన్న చత్వారం కాస్తా పెరిగి పెరిగి గుడ్డివారైపోతారు. శుభ్రమైన పెద్దలైటుండగా యిదేం ఖర్మ. (స్విచ్ నొక్కుతుంది. పెద్దడోమ్ వెలుగుతుంది.) అదీ ఇప్పుడు కలకలలాడుతోంది. (మొగుడి దగ్గరగా కుర్చీలో కూర్చుని) రోజులుచూస్తే బాగా లేవు. ఆ నగలూ డబ్బూ తీసుకెళ్ళి బ్యాంకిలో పడేసినా బాగుండును. ఏమైనా అంటే— వెధవభయాలూ, నువ్వూ, ఆమాత్రం మనుషుల మీద నమ్మకం లేకపోతే ఎలాగ అంటారు.

సిద్ధాంతం: ఓహోహో! చూడు మన ప్రభుత్వం ఏం చెపుతూందో. సహనం, విశ్వాసం, ఒకరి జీవిత విధానంపట్ల మరొకరికి గౌరవం, స్నేహం— యివన్నీ ఉన్నప్పుడే ప్రపంచంలో యుద్ధాలూ, బాధలూ ఉండవు. సరిగ్గా నా అభిప్రాయాలు, సరిగ్గా నా సిద్ధాంతాలు! ఇవన్నీ గవర్నమెంటుకి కూడా ఎలా తెలిసిపోయాయో.

భార్య: కాఫీరైటో కాపీరైటో నాదనిచెప్పి గవర్నమెంటుమీద దావా పడేస్తేండి. బేరం చప్పగా కుదురుతుంది.

సిద్ధాంతం: నా సిద్ధాంతాల్ని ప్రపంచం అనుసరిస్తుంది. గుర్తించి తీరుతుంది. (లేచి ఉపన్యాసకుడిలా) ప్రపంచచరిత్రని వెనక మనం రాతియుగం నుంచి పరిశీలిస్తే ఏం కనపడుతుంది? మనిషి మనిషిని నమ్మకపోవడం. ఒక తెగ మరొక తెగని, ఒక దేశం మరొక దేశాన్ని అనుమానించడం ద్వేషించడం—

భార్య: అయ్యో ఖర్మ! ఎప్పుడూ మీ సిద్ధాంతాలూ ఉపన్యాసాలూనూ. అమ్మాయికి ఆషాఢపట్టీ పంపించాలి. చిన్నబాబుకి యక్సురే తియ్యాలని డాక్టరుగారన్నారు. ఇంట్లో గొడవ పట్టించుకోరుగదా. మళ్ళీ చూస్తే యీ వీధివీధికంతకీ పెద్దమేడా, పెద్దహోదా, అంతా వట్టిబడాయి. నేతిబీరకాయ.

సిద్ధాంతం: (పేపరు చదువుతూ) సరిహద్దు దాటి మన భారతంలోకి ఒక నలభై మైళ్ళ లోపలికి వచ్చినంతమాత్రాన మనం కంగారుపడి యుద్ధానికి దిగకూడదు. నిదానం నిగ్రహం ఉండాలి. పరిస్థితుల్ని అవగాహన చేసుకోవాలి. వేచి ఉండాలి. చూస్తూ ఉండాలి. చర్చలద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలి. (చదవడం ఆపి) ఓహో ఉదాత్తం అద్భుతం—

ఇరుగు పొరుగు

భార్య: అబ్బబ్బ—ఎప్పుడూ పేపరూ గొడవేనా. కట్టుకున్న పెళ్ళాంతో కాస్సేపు మాట్లాడడం, మంచీ చెడ్డా ఆలోచించుకోవడం ఉందా? లేదా? (పేపరు లాగేసి దూరంగా పడేస్తుంది.)

సిద్ధాంతం: ఆగు ఆగు ఇంకొక్క కాలమ్—

భార్య: కాలమూ లేదు తాళమూ లేదు. నా మాట వింటారా లేదా.

సిద్ధాంతం: ఏమిటి చెప్పు.

భార్య: నా కేమిటో అనుమానంగా ఉందండీ.

సిద్ధాంతం: అనుమానం పనికిరాదు. అది నా మొదటి సిద్ధాంతం.

భార్య: అది కాదండి మహానుభావా. వాళ్ళండీ— మన యింటి వెనకాల యింటివాళ్ళండి—

సిద్ధాంతం: వాళ్ల సంగతెందుకే యిప్పుడూ?

భార్య: ఆర్నెల్లనుంచి వాగుతున్నాను, వాళ్ళని కనిపెట్టమని. పోలీసువాళ్ళకి ఓ రిపోర్టు యిద్దాం. వాళ్లు చూస్తే ఒఘాయిత్యపు ముండాకొడుకుల్లా ఉన్నారు.

సిద్ధాంతం: రామ రామ!

రాద్ధాంతం: (ఇంట్లోంచి వస్తూ) అవునండీ బావగారు. మీ మాటలన్నీ వింటున్నాను. వాళ్ల చర్యల్నీ వేషాల్నీ చూస్తే నాకూ అనుమానంగా ఉంది.

సిద్ధాంతం: ఇంకా నిద్రపోలేదుటోయి నువ్వూ.

రాద్ధాంతం: పొరుగిళ్ల వాళ్ల గురించి చెడ్డ చెప్పుకోవడం నాకు మహాసరదాలే బావగారూ. మంచి స్కాండల్సుంటే నాకు భోజనమే అక్కర్లేదు.

సిద్ధాంతం: మీలాంటి వాళ్ళుండబట్టే సంఘం యిలా అధోగతికి పోతూవుంది. మొదట చెడ్డవాళ్ళు వీళ్లు అన్న ప్రాతిపదికమీద మీరు ఆలోచన ప్రారంభిస్తారు.

భార్య: ఏమిటేమిటి? ఇదా మీరు గ్రహించినదీ? ఆర్నెల్లయి చూస్తున్నాంకదా, ఒక్క మనిషి పగటివేళ కనపడ్డాడా. ఆ వచ్చినవాళ్ళెవరో, స్త్రీలెంతమందో పురుషులెంతమందో...

రాద్ధాంతం: పెళ్లి కాని కన్యామణులెంతమందో—

భార్య: అబ్బ ఆగూ. పెళ్ళిగోలా నువ్వూను. తీరా వస్తే ఏ సంబంధమూ నీకివ్వమేవుండదు. ఉఁ! తాడిచెట్టులా మాత్రం ఎదిగిపోతున్నావు.

రాద్ధాంతం: పెళ్ళికోసం కాదక్కా.

భార్య: సరేలే—ఇంతకీ ఆ వచ్చినవాళ్ళ కులం ఏమిటో గోత్రమేమిటో ఏం పనో ఈ ఊళ్ళో ఒక్కరికి తెలుసునూ అంట?

సిద్ధాంతం: మనకు తెలుసుకోవల్సిన అవసరం ఏముంది. నీకెన్నేళ్ళో, నీకు ఎంతమంది పిల్లలో, నువ్వెన్నిసార్లు కాఫీ తాగుతావో వాళ్ళడిగితే నీకు ఎలావుంటుంది?

భార్య: హయ్యోర్రామ. అదీ యిదీ ఒకటేటండీ. వాళ్ళెప్పుడు చూసినా రాత్రుళ్ళు మేల్కొని ఏవో చప్పుళ్ళు చేస్తూంటారు, లైట్లన్నీ జ్వాలాతోరణం కింద వెలిగించి. పగలంతా పడుకుని నిద్రపోతారు కాబోలు రాక్షసముండాకొడుకులు!

సిద్ధాంతం: అదిగో అదే వద్దన్నాను. మనకి రాత్రి పడుకోవడం ఎలా అలవాటో, వాళ్ళకిది అలవాటేమో! ఎవరిజీవితవిధానం వారిది. ఎవరిసిద్ధాంతం వారిది. వాళ్ళు మన పొరుగువాళ్ళు వాళ్లూ మనం సఖ్యంగా ఉండాలి. ఒకర్నొకరను మానించగూడదు. సహజీవనం అంటే యిదే—

రాద్ధాంతం: పామూ కప్పా కలిసి సహజీవనం చెయ్యాలనుకుని ఒక బుట్టలో దూరాయిట. అయిదు నిముషాల్లో బుట్టమీద మూతతీస్తే—ఒక్క పామే వుందిట. ఇదేమిటండి సిద్ధాంతం బావగారూ? దీని భావమేమి తిరుమలేశ—

సిద్ధాంతం: వాళ్ళు పాములనా నీ ఉద్దేశం?

రాద్ధాంతం: మీరుమాత్రం కప్పలని...

భార్య: బో—బోగురు కప్పకూడాను. (నవ్వుతుంది)

సిద్ధాంతం: బాగుంది మీ వేళాకోళం. వెళ్ళి పడుకోండి. ఒసే, ఏది ఆ పేపరిలాగ యియ్యి.

భార్య: పోనీ ఆ పోలీసువాళ్ళకి కొస్త రిపోర్టయిస్తే పోయిం దేమిటే. వాళ్ళు కొంచెం నిఘాఅయినా చేస్తోంటారు.

సిద్ధాంతం: మీ సిద్ధాంతాలమాట దేవుడెరుగును గానీ, వీధి వీధీ అంతా హడలి చస్తున్నారు వీళ్లని గురించి. వాళ్ళపాలేరు మొన్న రాత్రి వాళ్ల ప్రహారీగోడ ఎక్కి...

భార్య: నిలువెత్తున ప్రహారీగోడ కూడాను వీళ్ళగోడలు కూలా...

రాద్ధాంతం: ప్రహారీగోడ ఎక్కి తొంగిచూశాట్ట. బలిసి నల్లగా తుమ్మ చెక్కల్లా ఉన్నారట. మొహాలమీద ముసుగులు కూడా ఉన్నాయట.

భార్య: (గట్టిగా) అమ్మ బాబో యింకేముంది! పచ్చి దొంగలై వుంటారు. నగలూ డబ్బూ బ్యాంకిలో పడేద్దాండయ్యా అంటే విన్నారా ఈయన.

పెళ్ళాంమాట ఎప్పుడైనా చెవిని పెడితేనా! ఎప్పుడూ సిద్ధాంతాలూ, రాద్ధాంతాలూనూ.

రాద్ధాంతం : నన్ను కలపకు అక్కా. నేను నీపక్షం. బావగారిలా ఊహాగానంలో తేలి నేల విడిచి సాము చెయ్యడం మనకి అలవాటు లేదు.

సిద్ధాంతం : (భార్యతో) ఆమాటకొస్తే — వాళ్ళు బ్యాంకినే దోస్తే...

రాద్ధాంతం : మనయింట్లోనే దోస్తే మనం మూరామన్న తృప్తి అయినా వుంటుంది.

సిద్ధాంతం : మనుషులమీద నమ్మకం ఉండాలి కానీ— ఇలా భయాలుపడుతూంటే దీనికి అంతెక్కడా. వాళ్ళు నిద్రట్లో మనపీకలు కోసేస్తే—ఏమిటో వెర్రిభయాలు.

(వీధివైపు గుమ్మంలోంచి నారాయణ, నరసింహం— నడివయస్సువాళ్లు చేతికర్రలతో టార్చిలైట్లతో లోపలికి వస్తారు.)

ఇద్దరూ : (ఒకేసారి) సిద్ధాంతంగారూ, కొంప మునిగింది.

భార్య : అయ్యో నాయనో!

సిద్ధాంతం : ఇంకా వినకుండా ఏమిటే నీ కంగారు! ఎవరికొంప మునిగింది? కొలవగండి పడిందా? ఏం జరిగింది?

నారాయణ : చౌడయ్యగారి మనుష్యులు కాబోలు మీ పెరటిగోడని తవ్వుతున్నారు.

నరసింహం : ఏదో పనిమీద వీధిలోకి వస్తినిగదా చీకట్లో వీళ్లు దెయ్యాల్లా కదులుతున్నారు. హడిలిపోయి మా నారాయణని - పక్కిల్లే కదండీ— లేపుకుని యిలా వచ్చాం.

భార్య : ఇంకేముందీ! ఇల్లంతా దోచుకుపోతారు. పదివేల రూపాయల జవహారీ, లక్షరూపాయల సొమ్ము వీళ్ల యెదాన పడిపోతుంది. ఒరేయి రాద్ధాంతం! ఫోన్‌తీసి పోలీసుల్ని పిలువు.

రాద్ధాంతం : బావ...(సందేహిస్తాడు.)

భార్య : ఇంకా అలా నిలబడ్డావేంరా దిష్టిబొమ్మలాగ. ఆ చౌచాగాడి మనుష్యులు—

రాద్ధాంతం : చౌచా కాదక్కా. చౌడయ్య.

భార్య: ఎవడో చెవలయ్య. నువ్వు ఫోన్ చెయ్యి ముందు.

సిద్ధాంతం : రాద్ధాంతం ఆగు! అసలు సంగతేమిటో విననియ్యి. ఏమయ్యా నరసింహం?

నరసింహం : అయ్యా!

సిద్ధాంతం : ఎంతసేపయింది నువ్వు చూసి?

నరసింహం : ఇప్పుడే కదుటండీ అయిదునిముషాలు.

సిద్ధాంతం : నీకు జనం స్పష్టంగా కనపడ్డారా?

భార్య : అమావాస్యచీకట్లో స్పష్టంగా ఎలా కనపడతారండీ నా మొహం.

నారాయణ : ఆకారాలేవో కదులుతున్నాయండీ.

సిద్ధాంతం : ఎక్కడ?

నారాయణ : మీ పెరటిగోడదగ్గర.

సిద్ధాంతం : వాళ్లుకూడా ఏ పనిమీదో వచ్చారేమో.

నరసింహం : సుత్తులచ్చుకు కొట్టుతోన్న చప్పుడు వినపడుతూంటే. అయినా వాళ్లకంత దొడ్డిఉండగా మనగోడదగ్గరికి ఎందుకు రావాలీ.

సిద్ధాంతం : సుత్తులచ్చుకని గోడనే కొట్టుతున్నారని దాఖలా ఏమిటి?

భార్య : ఒకబ్బుర ఒకరు సరదాకోసం డీడిక్కులు కొట్టుకుంటున్నారనుకున్నారా- తెలివి?

సిద్ధాంతం: టార్చిలైటు వేసిచూడకపోయారా?

నారాయణ : వాళ్లు పారిపోర్రుటండీ.

సిద్ధాంతం : మీకు ఆకారాలు స్పష్టంగా కనపడలేదు. ఒకటి. వాళ్లు చౌడయ్యగారి మనుష్యులని రూఢి లేదు. రెండూ. వాళ్లు గోడని తవ్వుతున్నారనే ఏమిటి? సాక్ష్యం ఏది? మూడూ. వాళ్ళు ఒకవేళ తవ్వుతున్నా, దురుద్దేశంతోనో కాదో అది మనకి తెలియదు. నాలుగు. ఇక్కడికి ఆర్నెల్లక్రితం వచ్చి ఆయింట్లో దిగిన రోజున చౌడయ్యగారు నన్నొక నిముషం కలుసుకొని మాట్లాడారు. ఆ సందర్భంలో వాళ్లు శాంతిగా బతకతలిచారనీ, మనందరి సహకారమూ విశ్వాసమూ చాలా అమూల్యంగా పరిగణిస్తామనీ చెప్పి వెళ్ళారు. వారి ఆమాటల్ని కాదనడానికి ఇంతవరకూ ఏఆధారమూ లేదు. అయిదూ. ఈ కారణాలవల్ల మీ భయాలు ఉత్తి అర్థరహితమైనవనీ, ఇంక మీ రందరూ వెళ్ళి పడుకోవడం ఉత్తమమనీ, నన్ను శాంతిగా వదిలేస్తే కాస్త పేపర్లో ఆ పంచశీలమీద పెద్దలిచ్చిన ఉపన్యాసం చదువుకుంటాననీ తమరందరికి (పెళ్లాంతో) నీకున్నూ-మనవి!

నారాయణ : అంత మరీ అశ్రద్ధ కూడదండీ.

నరసింహం : మీరు తల్చుకుంటే పోలీసు పటాలం ఏమిటి, మిలిటరీ అంతా వచ్చి కాపలా కాయరుటండీ. ఎందుకేనా మంచిది. ఓసారి మీ బావమరిదిని పంపి పోలీసులకు చెప్పించండి.

రాద్ధాంతం: ఎందుకేనా మంచిది. టార్చిలైటు తీసుకుని ఆ సందులోకి వెళ్లి వాళ్లేం చేస్తున్నారో, అసలు వాళ్లో కాదో చూసివద్దాం పద బావా.

సిద్ధాంతం: (కోపంతో లేచి) ఏమిటోయ్ మీ ఉద్దేశం? వుత్తివాజమ్మకింద కట్టేస్తున్నారే మీ రందరూ. ఇదిగో చెప్తున్నాను వినండి. రోజూ రాత్రుళ్లు వచ్చి మనగోడదగ్గర- పెరటిగోడదగ్గర చౌడయ్య గారి మనుష్యులు చేరుతున్నట్టూ, గోడని ఒకటి రెండుసార్లు, తవ్వబోయినట్లూ, ఇది అప్పుడే పది పదిహేనురోజుల్నుంచి జరుగుతున్నట్టూ నాకు తెలుసును. పెరట్లో పాకలో ఉంటాడు, మన ఎరకయ్య చూడు-వాడు చెప్పాడు, నాకీ సంగతి. ఇష్టం లేకపోయినా, శ్రీ చౌడయ్య మీద నాకు సంపూర్ణవిశ్వాసం ఉన్నా, ఒక చిన్న చీటీ వ్రాసి వాళ్ల గోడమీదనుంచి పడేయించాను. నాకు తక్షణం శ్రీ చౌడయ్య మహాశయులు జవాబు పంపారు. ఇదిగో ఎప్పుడూ జేబులో నే జాగ్రత్తగా దాస్తున్నాను (ఒక చీటీ పైకితీసి) వినండి. శ్రీశ్రీశ్రీ స్నేహసముద్రులైన సహజీవనసిద్ధాంతకేసరులైన శ్రీ సిద్ధాంతం గారికి మీ చీటీ అందినది. మీరుపడిన అపోహలు మీ వంటి పేరొందినవ్యక్తికి తగవు. మీరు నా విషయం బాగా తెలియకుకాని, మీ మా కుటుంబములకు కొన్ని వందలఏండ్ల నుండి అద్భుతమైన మైత్రీ భావమున్నది. మీ ముత్తాత పింతండ్రిగారున్నూ మా నాయనమ్మ మేనమామ గారున్నూ కాశిలో ఒక నాడే గంగలో మునిగి పత్తాలేకుండా కొట్టుకుపోయినట్టు చారిత్రక అధారములు గట్టివి ఉన్నవి. కాబట్టి నాటి పురాతన మైత్రీభావమును పురస్కరించుకుని, సహజీవనసిద్ధాంతములోగల అచంచలవిశ్వాసముతో మీ యెడ మా కెప్పుడూ స్నేహభావము తప్ప వేరొండు లేదనియు, మీ పెరటిగోడవద్ద మా వారు ఉండుటకు కారణము సదరుగోడ కట్టుబడి చాతుర్యమూ, దానికి వాడిన రాయియొక్క ప్రత్యేకతా ఇట్టివి తెలుసుకొనవలెననే విజ్ఞానపరమైన ఉత్సాహమే తప్ప వేరుకాదనీ తమకు మనవి చేయుచున్నాను. ఇట్లు, సీనారేకుల చౌడయ్య. (ఆయాసంతో) ఇంక పొండి, ఎంత గౌరవంగా వ్రాశాడో, ఎంత స్నేహంగా వ్రాశాడో చూడండి. ఇదంతా యీ రాద్ధాంతం గారి కుట్ర: నా సిద్ధాంతాన్ని నే బతికుండగా చంపెయ్యాలని చూస్తున్నాడు. కాని కాని...,

(ఇంక ఉద్రేకం ఆపుకోలేక మధ్యలో కూలబడతాడు.)

భార్య: ఏమి చేటిదీ - పదిహేనురోజుల్నుంచి తెలిసి కూడా మా కెవ్వరికీ చెప్పలేదన్నమాట.

రాద్ధాంతం: ఆ వుత్తరాన్ని ఈయన వేదవాక్కులా నమ్మాడన్నమాట.

నరసింహం: అసలు పగలు కదలకుండా రాత్రుళ్ళు మేలుకోవడం ఏమిటండీ? వింత. కుర్రగూబల్లాగు.

నారాయణ: ఆ నల్ల ముసుగులు కూడాను. పిల్లా పీచూ భయపడి హడలిచస్తారు.

భార్య: (నరసింహంతో, నారాయణతో) బాబూ! ఈయనకి చాదస్తం ఎక్కువై మతి సన్నగిల్లుతోంది. మొన్న భోజనం చేస్తూచేస్తూ 'ఒసేయ్ కాస్త సహజీవనం వడ్డించు' అన్నారు. చచ్చే భయంవేసింది దేముడా మతిస్థిమితం తప్పిందేమో అని. బాబూ మీకు పుణ్యం వుంటుంది. మీరేనా వెళ్ళి పోలీసులకి చెప్పిరండి. లేనిదే (ఏడుపుగొంతుకతో) పదివేల జవాహరీ లక్షరూపాయలు...

సిద్ధాంతం: ఒక ఆదర్శాన్ని స్థాపించాలంటే యింటా బయటాకూడా విరోధం వస్తుందని నాకు తెలుసును. కాని మానవులలో తరిగి మానవత్వాన్నీ, ఆనందాన్నీ నిలకొల్పాలనే నాఆశ. అందుకే జీవితం అంతా శ్రమించాను. ఈనాడు మీరు నా కృషి సంతటినీ ఒక్క త్రుటిలో కూలదోయాలని చూస్తున్నారు. నేను సహించను; నా ప్రాణమొడ్డి అయినా విద్రోహుల్ని ఎదిరిస్తాను.

రాద్ధాంతం: అవునండీ బావగారూ మీ ఆశయం యొక్క మహత్తూ, మీయొక్క కృషి, మీయొక్క ఔన్నత్యాన్నీ మేం అంగీకరిస్తున్నాం. కాని కొంచెం వాస్తవదృష్టినీ, గడుసుతనాన్నీ అలవరుచుకోకపోతే ఎలాగండీ? మనం ఉండేది వంచకులూ, స్వార్థపరులూకూడా ఉండే లోకంలో. వాళ్లదగ్గర మన ఆశయాలు పని చెయ్యవు సరిగదా, ఒక్కొక్కసారి విషమిస్తాయి కూడా.

సిద్ధాంతం: అంటే నన్ను కూడా వంచించమనీ, ద్రోహం చెయ్యమనీ నీ అభిప్రాయమా?

రాద్ధాంతం: కాదండీ బావగారు. మిమ్మల్ని మీరు కాపాడుకోమని, మీమీదకి వచ్చినప్పుడైనా గుర్తించి ఆత్మరక్షణచేసుకుని శత్రువులని పారద్రోలమనీ.

సిద్ధాంతం! (విచారంగా) నేనంటే మీకు నమ్మకం పోయింది. నా సిద్ధాంతాలమీద మీకు విశ్వాసం

పోయింది. అసలు ఏనాడూ మీరు వాటిని నమ్మలేదు.

రాద్ధాంతం : అదే నిజమైతే మా పెద్దరికాన్ని ఎప్పుడో తీసివేసేవారం. మీరు కాక యింకొకరైతే యీపాటికి...

నరసింహం : ఇంత జరుగుతూన్నా ఇప్పటికీ మీమాట కాదని వాళ్లు ఎదిరించారూ?

నారాయణ : అఖరికి టార్చిలైటు కూడా వేసి చూడలేదు.

రాద్ధాంతం : వాటటుకు నేను ఫోన్ రిసీవర్‌నైనా పైకెత్తలేదు.

భార్య : బాగుంది నాయనా బాగుంది. మీ విశ్వాసాలూ, మీ భక్తి శ్రద్ధలున్నూ. అక్కడేమో ఆ దొంగముండా వాడు కన్నం వేసేస్తున్నాడొక మూల. (లోపల్నుంచి ఎరకయ్య 'బాబోయి!' అంటూ వగరుస్తూ కంగారుగా వస్తాడు.)

ఎరకయ్య : బాబోయ్! అమ్మ నాయనోయ్!

రాద్ధాంతం : కన్నం తవ్వేశాడా?

భార్య : వోరిదేముడా, ఇంకేం చేతునురా.

నారాయణ :
నరసింహం : } (చొక్కాలు పైకెగతోసి) సెలవిప్పించండి. బాణాకర్రలు తీసి ఒక్కొక్కణ్ణి బాదిపారేస్తాం.

ఎరకయ్య : (చతికిలబడి) నాగుండె దడదడలాడి కొట్టుకుపోతూందండోయ్. అయ్య నాయనోయ్.

సిద్ధాంతం : వెధవ ఏడు పేడవక ఏం జరిగిందో చెప్పరా.

ఎరకయ్య : ఏం జరగడమేమిటండీ డేంజరీ అండోయ్. ఫస్టుక్లాసు డేంజరీ అండోయ్.

సిద్ధాంతం : ఏమిటో సరిగా చెప్పరా వెధవా.

ఎరకయ్య : గోడకి కన్నమేసి ఆ కన్నంలోంచి బలిసి దుక్కల్లాగున్నోళ్లు ఓ డజనుమంది వంటింట్లోకి వచ్చారండోయ్.

సిద్ధాంతం : వచ్చి?

భార్య : (కోపంతో) వచ్చి! వచ్చేమిటి నా మొహం. అలికి మగ్గుతున్నారు. ఈ ప్రశ్నలేమిటయ్యా మహానుభావా.

ఎరకయ్య : కంచాలు పెట్టుకుని మిగిలిన అన్నం అంతా పెట్టుకుని రెండు గేదెల పెరుగూ పోసుకుని తినేస్తున్నారు. అయ్యా తెల్లారితే నాకు సద్దికూడు లేకుండా చేశారండోయ్. (ఏడుస్తాడు)

సిద్ధాంతం : (నవ్వుతూ) అదిగదీ అలా చెప్పు. ఆ గోడ తవ్వేటప్పటికి వాళ్లకి ఆకలి వేసి ఉంటుంది. మన గేదె పెరుగు, మనబియ్యం మాంచి రుచిగా ఉంటాయని ప్రతీతిగా. పాపం తింటున్నారు. అంటే ఏపనికైనా మోటివ్ అంటే వాళ్ల మనసులో అభిప్రాయాల్నిబట్టి మంచీ చెడ్డా దోషం నిర్దోషం నిర్ణయిస్తాం. సహజీవనం అంటే అమృతం గేదె పెరుగు కూడా తినకూడదూ?

రాద్ధాంతం : చచ్చాం రా దేవుడా. (కూలబడతాడు కుర్చీలో)

భార్య : వెంకటేశ్వరా! తండ్రీ! ఈ గండం గడిస్తే నీకొండ ఎక్కుతాను నాయనా. ఈయనపిచ్చి కుదుర్చు మహానుభావా! ఆపద్బాంధవా! ఏడు కొండలవాడా!

నారాయణ: ఇంక అశ్రద్ధచేస్తే లాభంలేదు. నేనందర్నీ లేపి తీసుకొస్తాను.

నరసింహం : నేను పోలీసుస్టేషనికి పోయి చెప్తాను.

సిద్ధాంతం : ఆగండి. ఆగండి. తొందరపడకండి. భయపడడం, ఉద్రేకపడడం ఎదిగిన మనుషుల లక్షణం కాదు. నేను గట్టి తిరస్కారాన్ని తెలుపుతాను. సహించేదిలేదనీ, పోలీసుల్ని పిలవ్వాస్తుందనీ వ్రాస్తాను. చూదాం వాళ్ళేం చేస్తారో! (కోపంగా నోట్ వ్రాస్తుంటాడు.)

ఎరకయ్య : గొంతు కెండుకు పోతోంది అమ్మగోరూ. కొంచెం మజ్జిగదాహం అయినా యిప్పించండి.

భార్య : ఇంకా మజ్జిగ ఏమిట్రా నీదాహం కాలా— రెండు సత్తప్పాలాల పెరుగూ అక్కడవాళ్ళు జుర్రేస్తుంటేనూ, వాళ్ల పొట్టలు బద్దలు కానూ.

రాద్ధాంతం : ఇంకా యీ ఉత్తరాలూ, రాయబారాలూ ఏమిటి బావగారూ. మీ వైఖరి మాకు నచ్చలేదు.

నారాయణ : నరసింహం! ఇలా చూస్తూ ఊరుకోవడం బాగూలేదు. మనవాళ్లని నలుగుర్ని పిలుచుకురా, ఎందుకైనా మంచిది.

సిద్ధాంతం : ఒరేయి ఎరకయ్యా. ఈ చీటీవాళ్లకి యిచ్చిరా.

ఎరకయ్య : చిత్తం. (చీటీ పుచ్చుకుని ఒక అడుగు వేసి) ఎవరికండీ?

సిద్ధాంతం : చౌదయ్యగారికి.

ఎరకయ్య : అమ్మ బాబోయ్! (చీటి ఏదో పాము అన్నట్టు చేతిలోంచి వదలేస్తాడు.)

సిద్ధాంతం : అదేం రా పిరికి వెధవా?

ఎరకయ్య : అగ్గిలో దూకమనండి దూకేస్తాను. కాని అక్కడికి వెళ్ళలేనండి.

సిద్ధాంతం : ఏమోయ్ రాద్ధాంతం. నువ్వెళ్ళిరా.

రాద్ధాంతం : మీమాట కాదనవలసి వచ్చినందుకు విచారిస్తున్నాము. ఈరాజీ దృక్పథానికి తీవ్రనిరసన

తెలుపుతున్నాను. మీరు కత్తీ కటారీ యిచ్చి యుద్ధం చెయ్యమంటే చేస్తాను. అంతేకాని...

భార్య : (నారాయణ, నరసింహం) బాబూ త్వరగా వెళ్లి నలుగుర్నీ పిల్చుకుని రండయ్యా. మీకు ధైర్యం లేకపోతే ముందు నేను నడుస్తాను. రోకలి పుచ్చుకుని వాళ్లని పచ్చడి పచ్చడి చేసేస్తాను.

సిద్ధాంతం : ఆఁ ఆఁ! బడాయి కేంలే! నాలు గడుగులు నడిస్తే నీకు నలుగురు డాక్టర్లు కావాలి. వెర్రి వేషాలు మానండి

భార్య : నువ్వెళ్ళిరా నరసింహం.

నరసింహం: వారు వద్దన్న పని చెయ్యలేమండీ. ఏంటో అలాగ అయిపోయాము ఖర్మ!

(సిద్ధాంతం యీలోపుగా యింతకుముందు భార్య విసిరేసిన పేపరు మెల్లిగా తెచ్చుకుని తాపీగా చదువుతూంటాడు.)

భార్య : అయ్యో దేవుడా! మళ్లీ పేపరు చదువుతున్నారండీ ఈ మనిషి—నిమ్మకు నీరెత్తినట్టు. ఎలా వదల బుద్ధయిందండీ మీకు ఇంట్లో దొంగలుపడి దోచుకు పోతూంటే.

సిద్ధాంతం : వాళ్ళు యింట్లోకి రాలేదు. వంటింట్లోకి వచ్చారు. అక్కడ యిత్తడి గిన్నెలూ, గరిటె సత్తిప్పాలాలూ, స్టెయిన్‌లెస్ స్టీల్ కంచాలూ తప్ప ఏమీ లేవు. ఈమాత్రం వాటికోసం పెద్ద యుద్ధాలు ఆర్భాటాలూ అనవసరం.

ఎరకయ్య : బాబూ, ఆ చీటిలో 'మా ఎరకయ్య పొద్దున్నే వద్దికూడు తినందే ఉండలేడు. కొంత వణ్ణం ఒగ్గయ్య'మని చెప్పి రాయండి బాబూ.

నారాయ : చీటి యిచ్చే దెవరురా దరిద్రుడా. వెధవ ఆకలీ నువ్వూ. (లోపల దగ్గరగా ఏదో చప్పుడౌతుంది.)

నరసింహం : (ఉలిక్కిపడి గంతేసి) అదిగో లోపలి కొచ్చేశారు కాబోలు.

ఎరకయ్య : (భయంతో రాద్ధాంతం కాళ్లని చుట్టుకుని) బాబూ రచ్చింపండి. నేసచ్చిపోతే ఒకర్తె కొండండి; యిద్దరు పిళ్ళాలు ఏడుస్తారండి.

రాద్ధాంతం : నీ యిద్దరు పిల్లాలూ కలిస్తే జమిలిగా ఏడిస్తే, ఆమోతకి మేమందరం కూడా హడిలి పోవాలి. ఒకరితర్వాత ఒకర్ని ఏడవమను.

(లోపల్నుంచి పిల్లవాడి కేక "నాన్నా చౌడయ్యగారి మనుషులు" అని కంగారుగా.)

భార్య : అయ్యో నాయనోయి! లోపలికి కూడా వచ్చేశారండోయ్. అబ్బిగాడు లోపల ఉండిపోయాడండోయ్.

రాద్ధాంతం: ఎక్కడా వాడు? (లోపలికి వెళ్లబోతాడు.)

నారాయణ, నరసింహం:-(కర్రలు పైకెత్తి) నడవండి నడవండి

సిద్ధాంతం: ఓరి అమాయకుల్లారా! (నవ్వుతాడు.) ఇంట్లో యీవిడ (పిళ్ళాల్ని చూపిస్తూ) ఎప్పుడూ చౌడయ్య చౌడయ్య అంటూ పిల్లల్ని భయపెడుతుంది. వాడు నిద్దల్లో కూడా వెధవ కలవరింతలు! వొంట్లో నలత యీలాన్ని కలవరింతలూ, భయాలూ ఎక్కువవుతాయి. రేపు యింక యాక్స్‌రే తీయించెయ్యాలి.

(వీధివైపు గుమ్మంనుంచి ఎర్రయ్య వస్తాడు. జుట్టు మొహంమీద పడుతూంటుంది: ఎప్పుడూ పైకి చూస్తోంటాడు కాకీలాగూ, పైన నీలం చొక్కా లేక ఎర్ర చొక్కా.)

ఎర్రయ్య : (పైకిచూస్తోనే) నమస్కారం సిద్ధాంతం గారూ. ఈవీధి వీధిఅంతా ఏదో పెద్ద కలవరం రేగింది. ఏ యింట్లో చూసినా గుసగుసలు. కిటికీల్లోంచి కంగారుగా జనం చూస్తున్నారు. కొందరు గొడ్డళ్లూ, బాణాకర్రలూ. గునపాలూ అవీ జాగ్రత్త చేస్తున్నారు. ఏమిటీ అని అడిగితే—చౌడయ్యగారి జనం మీయింట్లో కన్నం వేసినట్టు చెప్పుకుంటున్నారు.

సిద్ధాంతం : లోకులు కాకులన్నారు. ఏదో చెప్పుకుంటున్నారు లెండి.

నారాయణ : ఎర్రయ్యగారా! మహానుభావా, తమరి దర్శనా ల్లేవు

నరసింహం : అసలు నల్లగానే ఉంటారుకాని ఎర్రయ్యగారని పేరు. అదేమిటో పేర్లన్నీ అలాగే విపరీతంగా ఉంటూంటాయి.

ఎర్రయ్య : రక్తం ఎరుపు. అందరి మానవులలోనూ ఒకటే రక్తం. అసలు నా పేరు నల్లయ్యే. కాని ఎర్రయ్యకింద మార్చుకున్నాను.

భార్య : ఇలా పైకి పైకి చూస్తారేమిటండీ యీయన? (మెల్లగా) ఏదేనా జబ్బా?

రాద్ధాంతం : పేరు మార్చుకున్నప్పట్నుంచీ మెడనరం పట్టిందట—లేక మెడనరం పట్టినతర్వాత పేరు మార్చుకున్నాడో.

భార్య : ఏమైతేనేం కాని బాబూ, మెడ నరానికి మావాడు ఒకడు మంచి మంత్రం వేస్తాడు. నాలుగురోజులతో మించి నేను నయం చేయిస్తా

కానీ—బాబ్బాబు ఆ చౌచౌ గాళ్లెవరో యింట్లో పడ్డారు నాయనా. బలంగా కనపడుతున్నావు. ఒక్కసారి నారాయణనీ, నరసింహాన్నీ తీసుకెళ్ళి అదలించివద్దూ.

ఎర్రయ్య : (పైకిచూస్తోనే) అమ్మో, మీ రలాగ అనకూడదు. చౌడయ్య గారెవరని! మనవాడే! మన సిద్ధాంతంగారి సిద్ధాంతానికి...

రాద్ధాంతం : అంతం!

ఎర్రయ్య: హరిహరీ! మనకి విరోధులు కాదండీ వాళ్లు. మనవంటింట్లోకి వాళ్ళు వచ్చారంటే మన మేలుకోసమే. ఆ చౌడయ్యగారు పరోపకారం అంటే పడిచస్తాడండీ. పాపం వట్టి అమాయకుడు.

సిద్ధాంతం : నేనూ అదే అంటున్నానోయ్ ఎర్రయ్యా.

ఎర్రయ్య : చిత్తం. మోన్న ఏం జరిగిందనుకున్నారూ. ఇతనికి తిప్పమ్మ అని వేలువిడిచిన మేనకోడలుంది. మొగుడూ అదీ కుంచమంత యింట్లో ఒక్కళ్లూ ఉండలేక పోతున్నారనీ నలుగురూ చూస్తే ఎబ్బెట్టుగా వుంటుందనీ, ఆ యిల్లు తన పేర రాయించేసుకుని తిప్పమ్మకి చేతినిండా పని చెప్పి ఒంటరితనం పోగొట్టేశాడు.

రాద్ధాంతం : పాపం వాళ్ళయిల్లు చక్కబెట్టాడు.

సిద్ధాంతం : ఎర్రయ్యా నేనొప్పుకోను. ఆయిల్లు తన పేర రాయించుకోవడం అన్యాయం. ఆ మాటకొస్తే మావంటింట్లోకి రావడం మరీ అన్యాయం. మంచిగా పోదామని చూస్తున్నాను కానీ...

ఎర్రయ్య : అలా అయితే ఆ వంటిల్లు వాళ్ళ వాటాలోదిట.

సిద్ధాంతం: ఏమిటి—ఎవరు చెప్పారు?

ఎర్రయ్య:ఆవంటిల్లు అసలు మీదని మీకెలా తెలుసును?

సిద్ధాంతం : ఎర్రయ్యా నీకు బుర్ర లేదయ్యా. ఫలానా సంవత్సరంలో ఫలానా నెలలో నేను స్వయంగా యిటిక కాల్పించి దగ్గరుండి యీయిల్లు కట్టిస్తో ఆ వంటయిల్లుకూడా కట్టించాను. కూలి చేసిన పనివాళ్ళు, తాపీమేస్త్రీలు, ఈ యిల్లు కడుతూంటే చూసిన యీ వీధివాళ్లు, ఈ యింటికి వంటయింటితో సహా పన్నుకట్టే మ్యునిసిపాలిటీ వాళ్ళు దీనికి సాక్ష్యం.

ఎర్రయ్య : నా కదంతా తెలియదుకాని ఈ వంటిల్లు కట్టినస్థలం పూర్వం వెనుకింటివాళ్ల దట. మీ తాతగారు కొంచెంకొంచెం వాళ్ళస్థలం ఆక్రమించి గోడ కట్టేశారట.

రాద్ధాంతం: ఇప్పటికి గండుతరాలు దాటాక వెనుకింటి వాళ్లకి హక్కు పూర్తిగా పోయింది. పోనీ వెనుకింటివాళ్ళదే యీస్థలం అనుకుందాం. అయితే యీ వెనకిల్లు చౌడయ్యది కాదుగా. అక్కడ అద్దెకు దిగినవాడేకదా చౌడయ్య.

ఎర్రయ్య : వెనుకిల్లు ఎప్పుడో తిప్పమ్మ బంధువులదట. ఇప్పుడు తిప్పమ్మ యిల్లుని పరోపకారార్థం స్వంతంచేసుకున్న శ్రీ చౌడయ్యగారికి ఒకనాడు తిప్పమ్మ బంధువులదైన వెనుకింటికి సంబంధించినదీ అని అనుకోబడుతూన్న మీ వంటయింటిస్థలంమీదకూడా హక్కుండడం భావ్యం కదా.

నారాయణ : (కోపంతో) ఏమిటయ్యా యీ 'బడుతూన్న' ఆ 'బడుతూన్న' అంటూ బడుద్ధాయి కబుర్లు చెపుతున్నావ్.

నరసింహం : వంటిల్లు మా సిద్ధాంతంగారిది. మావూళ్ళో పుట్టి పెరిగి మా నీరు తాగుతూ మాకే ఎసరెడుతున్నావేంటయ్యోయ్ ఎర్రయ్యా!

రాద్ధాంతం : (ముందుకువచ్చి ఎర్రయ్యతో) దింపండి. కొంచెం దింపండి.

ఎర్రయ్య : (పైకి చూస్తూనే) ఏమిటండీ దింపడం.

రాద్ధాంతం : తమరి తలకాయ! అడ్డదిడ్డంగా పెరుక్కుపోతూన్న తమ తలకాయనీ, తమ పై చూపులనీ కిందకి కొంచెం భూమిమ్మీదకి దింపమనీ ప్రార్థన.

ఎర్రయ్య : (పైకి చూస్తూనే) మీరు అసభ్యంగా, అగౌరవంగా మాట్లాడుతున్నారు. పైకిచూడడం మాకు జన్మహక్కు.

రాద్ధాంతం : దాన్ని దింపడం మాకు ఆజన్మకర్తవ్యం; తమరు ఏ భూమిమ్మీద ఉన్నారో, తమరికాధారమైన దేశం, సంపదా ఏమిటో తమరు గుర్తించనిపక్షంలో.

నారాయణ. మేము తమర్ని శీఘ్రంగా యిక్కడనుండి దయచెయ్యమని...

నరసింహం : తమరు ఆ చౌడయ్య పాదాలనే ఆశ్రయించమనీ...

రాద్ధాంతం : మేం కోరుతున్నాం. అయ్యా ఎర్రయ్యగారూ దయచెయ్యండి. యిటూ యిటూ... (వీధిగుమ్మం చూపిస్తాడు.)

ఎర్రయ్య : (పైకి చూస్తూనే వీధిలోకి వెళ్లుతూ) ఊర్ధ్వదృష్టి మాది. ఆకాశం మా గమ్యం. మా కాళ్లకింద నేల మాకసహ్యం. మా యిలు మాకు జైలు. మా వాళ్లు మాకు రాళ్లు. అందుకోపమే ఆకాశంవైపు ఆకాశంవైపు పోతాం పోతాం. (వెళ్లిపోతాడు.)

ఇరుగు పొరుగు

భార్య : అమ్మో అమ్మో నిక్షేపంలాంటి కుర్రాడు. వాళ్ల నాన్న చాలా పెద్దమనిషి కూడా. పాపం ఎప్పట్నుంచీ?

రాద్ధాంతం : ఏవిటి ఎప్పట్నుంచీ?

భార్య : పాపం ఆ మతి స్థిరంతప్పడం రా! పంజంటి కుర్రాడు!

సిద్ధాంతం : తెలివితక్కువ వాజమ్మ. నా యిల్లు నాది కాదంటాడా! మళ్లీ వీడిని నా గుమ్మం ఎక్కనివ్వకు.

భార్య : గుమ్మం వీడి నెక్కనివ్వరు! సరే ఆ చౌ చౌ గాడింట్లోకే వచ్చాడుగా.

(లోపల యీ సారి మరీ పెద్దచప్పుడు. బల్లలూ, కుర్చీలూ తోసేసిన చప్పుడు. అందరూ 'అమ్మో' అంటారు.)

రాద్ధాంతం : ఆగండి. నేను చూసివస్తాను. (మెల్లగా అడుగులు వేసుకుంటూ వెళతాడు.)

సిద్ధాంతం : పిల్లేమో లేక పందికొక్కో.

భార్య : అదీ కాదు దయ్యాలు. (వ్యంగ్యంగా కోపంగా అంటుంది.)

నారాయణ : రాద్ధాంతం ఒక్కడే వెళ్లాడు. నువ్వెళ్లు.

నరసింహం : (భయంతో) నువ్వెళ్ళు.

నారాయణ : వాళ్లదగ్గర తుపాకు లుంటే!

సిద్ధాంతం : (గబుక్కున లేచి) మనకి ఆత్మస్థైర్యంవుంది. ఆత్మ విశ్వాసంవుంది. తుపాకులు దేహాన్ని నాశనం చేస్తాయి; ఆత్మని నాశనం చేయలేవు. ఆత్మ అజేయం. ఆత్మ అమరం...

భార్య : హాబ్బో హబ్బో! తుపాకీ కాలిస్తే దేహమూ లేదు, ఆత్మాలేదు. మంత్రాలకి చింతకాయలు రాలవు.

సిద్ధాంతం : నీ కేంతెల్సునే మొద్దూ; కంచెకువాయనం చెల్లించడం తప్ప. ఆత్మ అంటే—

భార్య : ఆ ఎర్రయ్య ఆకాశంవైపూ, ఈయన ఆత్మ వైపూ! ఇద్దరికీ పిచ్చేరా దేవుడా!

(వీధిలోంచి ఒక నూతన వ్యక్తి వస్తాడు.)

నూ. వ్య. : అయ్యా సిద్ధాంతంగా రంటే ఎవరు?

సిద్ధాంతం : నేనే! ఏం?

నూ. వ్య. : రేపు మీ పుట్టినరోజని చౌడయ్యగారికి తెలిసి, తమరిపై వారికిగల స్నేహభావంతో ఈ కానుక పంపించారు దయచేసి స్వీకరించండి. (ఒక బర్త్ డే కేక్ అందిస్తాడు.)

సిద్ధాంతం : (ఆనందంతో) థాంక్స్. వారికి నా శుభాకాంక్షలు తెలపండి. పరస్పరమైత్రీ, సహజీవనమూ నా సిద్ధాంతాలనీ, ఎప్పటికీ వాటిని విడనాడననీ తెలపండి.

నూ. వ్య. : నమస్కారం. సెలవ్ (వెళ్ళిపోతాడు).

సిద్ధాంతం : చూశావా చూశావా. ఆ చౌడయ్యకి నేనంటే ఎంతభక్తి! ఎంతగురి!

(రాద్ధాంతం లోపల్నుంచి ఒక్కగంతులో స్టేజిమీదికి వస్తాడు.)

రాద్ధాంతం : వాళ్ళు వాళ్ళు...(వగరుస్తాడు.)

భార్య : ఏమిటూ ఏమిటి?

నారాయణ, నరసింహం : ఏం జరిగిం దేం జరిగింది?

సిద్ధాంతం : (కేక్ ని కోస్తూ) ఆఁ! పందికొక్కుని చూసి జడుసుకుని ఉంటాడు.

రాద్ధాంతం : ఇనప్పెట్టె తెరచి నోటన్నీ ఓ బస్తాలోకీ, నగలన్నీ ఒ బస్తాలోకీ ఎక్కించేశారు.

భార్య : అయ్యో! అయ్యో! ఇంకే ముందిరా దేవుడా! సర్వనాశనమై పోయాంరా. (మూర్ఛపోతుంది)

నారాయణ : (ఆమెను పట్టుకొని కుర్చీలో కూర్చోపెట్టి) నరసింహం విసురు. విసురు. గాలి గాలి!

సిద్ధాంతం : అరె! డామిట్. నే నమ్మను. ఇప్పుడేగా పుట్టినరోజు బహుమతీ పంపించాడు చౌడయ్యగారు. అంత స్నేహమూర్తి యిటువంటి విద్రోహం చేస్తాడా అని అనిపిస్తూంటుంది.

రాద్ధాంతం : ఇంకా అనుమానమా బావా!

సిద్ధాంతం : ఒక వేళ ఆ బస్తాలలో బహుమతులు పెట్టి పంపించాడేమో!

రాద్ధాంతం : (కోపంతో) బావా! (గట్టిగ అరుస్తాడు) ఈ కబుర్లూ ఈ సిద్ధాంతాలూ కట్టిపెట్టు. నీ పిచ్చికీ నీ భ్రమలకీ తల ఒగ్గడంవలన చాలా ప్రమాదం వచ్చింది. ఇనప్పెట్టె తలుపులు బార్లా తీసి నోట్లు బసాలలో కుక్కుతూంటే నేను చూశాను. కలియబడదామంటే ఒక్కొక్కడి దగ్గర ఒక్కొక్క తుపాకి ఉంది. నీ తెలివి తక్కువకి నా ప్రాణాన్ని యెందుకు బలి యివ్వాలి? అక్కడ నా అక్కగారు పాపం మూర్ఛపోయింది. నీ యిల్లు నీ సంపదా శ్వేటితో సర్వనాశనం. ఇదంతా నేను కళ్లారా చూడలేను. సెలవ !

భార్య : తమ్ముడూ! నువ్వూ వెళ్ళి నన్ను దిక్కులేనిదాన్నిగా చేస్తావా? ఆ చౌడయ్య అయన్నీ నన్నూ కూడా చంపేస్తాడురా.

సిద్ధాంతం : ఇప్పుడైనా మించిపోయిం దేమీ లేదు. మీరు చెప్పినట్టు చౌడయ్య విద్రోహానికి పూను

వుంటాడన్న నమ్మకం నాకు లేదు. కాని, ఎందు కైనా మంచిది. పోలీసులకి ఫోన్ చేస్తాను.

భార్య: దొంగలుపడ్డ ఆర్నెల్లకి కుక్కలు మొరిగాయం!

రాద్ధాంతం: ఫోన్లాగీనూ ఏం లాభం లేదు. ఈ పాటికి వైర్లన్నీ కట్ చేసేవుంటారు వాళ్ళు.

సిద్ధాంతం: చూద్దాం చూద్దాం. (ఫోన్ దగ్గిరికి వెళ్ళబోతాడు. ఇంతలో యింట్లోనుండి నలుగురు ముసుగు మనుష్యులు తుపాకులతో వస్తారు. కళ్ళకి గంతలు లాంటివి వుంటాయి ఇద్దరు రెండు బస్తాల్ని వీపులమీద మోసుకొచ్చి 'హమ్మయ్య' అంటూ కిందపడేస్తారు.)

నలుగురూ: హేండ్సప్! చేతులెత్తండి

సిద్ధాంతం: ఏమిటీ దురన్యాయం? స్నేహం నటించి యిలాగ వెనకాలనుండి కత్తిపోటు పొడిచే నీచులూ గుర్మార్గులూ అనుకోలేదు మిమ్మల్ని.

నలుగురూ: ఎత్తండి ముందు చేతులు. లేందే షూట్ ... (గురిచూస్తారు.)

భార్య: (చేతులెత్తుతూ) ఎత్తండర్రా ఎత్తండి. లేకపోతే నిష్కారణంగా చంపేస్తారు. వీళ్ళకి మనుషుల్ని చంపడం రోజూ అలవాటు కాబోలురా దేవుడా.

నారాయణ, నరసింహం: (చేతులెత్తుతూ) ఇన్నాళ్ళకి వీళ్ళకి లొంగిపోవలసి వచ్చింది.

ఎరకయ్య: (కంగారుగా) పంపకం పోతే బాబూ. బతికుంటే బలుసాకు తినొచ్చును. (చేతులెత్తుతాడు.)

రాద్ధాంతం: గోముఖ వ్యాఘ్రాలు! మోసగాళ్లు! మా మంచినీ, ఔదార్యాన్ని యిలాగ స్వార్థానికుపయోగించుకున్న చౌడయ్య మనిషేనా అంట! (చేతులెత్తుతాడు.)

నలుగురిలో ఒకడు: బంగారం, డబ్బూ కలిపి రెండు బస్తాలు నిండాయి. ఇంకా ఎక్కడేనా ఉందా బంగారం...

నలుగురిలో మరొకడు: (సిద్ధాంతం భార్య దగ్గరకు వచ్చి) మీ మెళ్ళో గొలుసూ గాజులూ యిప్పించండి.

భార్య: (కన్నీళ్లతో) తొందరపడకు నాయనా అన్నీ వొలిచి యిస్తాను. ఎవరి సొమ్ముని ఏం లాభం? కట్టుకున్న మొగుడు వెర్రాడైతే పెళ్లాంగతి యింతే కాక మరేమిటి? ఇదుగో చూడు నాయనా మీ చౌడయ్యగారికి పెద్ద పెద్ద కోరలూ, అల్చిప్పలంత గోళ్ళూ వుంటాయా?

నలుగురిలో వేరొకడు: అందరిలాగే ఆయనా ఉంటాడు.

భార్య: రాక్షసుడు కాడూ! మనిషికే యిన్ని నీచ గుణాలున్నాయా నాయనా. (నగలు యిస్తూ) తీసుకోండి. ముండా మోసిన మీ పెళ్ళాలకి వేసుకుని హాయిగా ఉండమనండి.

రాద్ధాంతం: హుం రక్తంతాగే రాక్షసులు. వీళ్ళు మనుష్యులా!

భార్య: మీ చౌడయ్యకి అంత రక్తమే కావలిసివస్తే, ఇదుగో మా ఎరకయ్యని తీసుకెళ్ళండి. మంచి బలంగా ఉన్నాడు. వీడి వొంట్లో శేర్లకొద్దీ రక్తం వుంటుంది. ఒకవేళ మీరు తాగకపోయినా మీ పెళ్ళాలిద్దరూ ఎలాగైనా వీడి రక్తం పిండి వడబోసి మరీ తాగేస్తారు.

ఎరకయ్య: బాబోయ్ నన్ను చంపించేస్తారా అమ్మగోరూ. మీ నమ్మకమైన నౌకర్ని. (వణికిపోతాడు.)

నారాయణ: సిద్ధాంతంగారూ, సెలవివ్వండి. విజయమో వీరస్వర్గమో ఇప్పుడే తేల్చేస్తాం.

నరసింహం: నేను మాత్రం చేతులెత్తి యిలాగ ఉండలేను. (దింపేస్తాడు.)

సిద్ధాంతం: (కోపంతో, బాధతో) చౌడయ్య యింత కష్టం. నాటకం ఆడతాడని అనుకోలేదు మీతో స్నేహాన్ని శాంతినీ కోరినందుకు ప్రతిఫలం యిదా? నాకు బలమూ బలగమూ లేవనుకోకండి. ఊఁ అంటే, యీవీధి వీధి అంతా నా అండకి వచ్చి నిలబడతారు. కాని అనవసరంగా రక్తపాతం జరుగుతుంది. ద్వేషం విజృంభిస్తుంది. పండంటి జీవితాలు పాడైపోతాయి. ఒక మానవుణ్ణి చంపడం సులభం. ద్వేషాన్ని, స్వార్థాన్ని రెచ్చగొట్టడం సులభం. కాని మనసుల్లో, మనుషుల్లో పోయిన స్నేహాన్ని ఆనందాన్ని సృష్టించడం కష్టం. కాని అదే నా ఆదర్శం. అందుకోసమే నేను తొందరపడి ఏచర్యా తీసుకోలేదు. మీరు నన్ను ఏంచేసినా—ఒక్కటి జ్ఞాపకముంచుకోండి. నా ప్రజలు మిమ్మల్నీ మీ చౌడయ్యనీ యిక్కడ బతకనివ్వరు. మిమ్మల్ని పాతిపెట్టి తీరుతారు. మా జన్మహక్కైన స్వాతంత్ర్యాన్ని మేం వదులుకుంటామని మీరు కలలోకూడా అనుకోకండి!

నలుగురిలో ఒకరు: (ముందుకువచ్చి) సిద్ధాంతంగారూ మాకేం తెలియదు. తమరి ఉపన్యాసాలు మాకు చెవికెక్కవు. తమర్ని బంధించి తీసుకురమ్మనమని మా చౌడయ్యగారి ఆజ్ఞ.

ఇరుగు పొరుగు

సిద్ధాంతం : నన్ను బంధించడమా! ఎందుకు?

నలుగురిలో ఒకరు : అవును. తమరిక్కడినుంచి మా అతిథులు. మాయింట్లో ఒక కటకటాలగది మీకు ప్రత్యేకంగా కేటాయించాం. కొందరు బుద్ధిలేని బూర్జువాలు దాన్ని జైలు-అంటారనుకోండి. అక్కడ మీరుఉండి మా చౌడయ్యగారితో చక్కగా సహజీవన సిద్ధాంతాన్ని గురించి చర్చించుకుంటూ ఉండవచ్చును.

భార్య : ఈ యిల్లంతా మీరు స్వంతంగా వాడుకుంటారా, మీ మొహాలు కాల్చా!

నలుగురిలో ఒకరు : (ఇనుపసంకెలుతీసి) చేతులు చాపండి. (సిద్ధాంతానికి గొలుసులు తగిలిస్తాడు)

భార్య: అయ్యో అయ్యో! మా వారి చేతులకి సంకెళ్ళా! (మూర్ఛపోతుంది)

నారాయణ. నరసింహం: (ముందుకు గుమికి) ఘోరం! అన్యాయం!

నలుగురూ: (తుపాకులు గురిపెట్టి) ఆగండి ముందుకు వచ్చారా ప్రాణాలు దక్కవు.

(వీధిలో మోటారు సైకిళ్ళ చప్పుడు, ఈలలు, బూట్ల చప్పుళ్ళు)

రాద్ధాంతం: అదిగో పోలీసులు వచ్చేశారు. డి. ఎస్. పి. పోలీసు పటాలంతో వచ్చేశాడు.

(వీధిగుమ్మంలోంచి డి. ఎస్. పి. పోలీసులూ ఒక్కుమ్మడిగా వచ్చి వెనకనుంచి నలుగురు దొంగల్నీ బంధిస్తారు)

డి. యస్. పి. : సమయానికే వచ్చాం. సిద్ధాంతంగారి చేతికే సంకెళ్ళా! అహా విధి వైపరీత్యం (సంకెళ్ళు తీసివేసి) నమస్కారం. ఇంకొస్త ముందుగా రాలేకపోయినందుకు క్షమించండి.

భార్య: (కళ్ళు తెరిచి) హమ్మయ్య (ఆనందంతో) మన పోలీసులు!

సిద్ధాంతం: మీ కెలాగ తెలిసింది డి.యస్.పి. గారూ?

డి. యస్. పి. : రాద్ధాంతంగారు నిన్న మా స్టేషన్‌కి వచ్చి ఈ చౌడయ్య చర్యల్ని గురించి చెప్పి హెచ్చరించారు. మీ యింట్లో ఏదేనా ప్రమాదం వస్తే దక్షిణపు గదికిటికీ తెరిచి ఉంచుతామనీ, సాధారణంగా అది మూసేసి ఉంటుందనీ, ఒక పోలీసును ఆ కిటికీ వైపే చూస్తూండేటట్లు నియమించమనీ, చెప్పి వెళ్ళారు.

రాద్ధాంతం: ఇందాకా యీ చౌడయ్య మనుష్యులు బస్తాలలో నోట్లు కుక్కుతూంటేగా, చాటుగా వెళ్ళి ఆ కిటికీ తెరచి గదిలో లైటు వేసివచ్చాను.

భార్య : తమ్ముడూ, ఎంత తెలివైన బుర్రరా నీది!

డి. యస్. పి: సిద్ధాంతంగారూ. ఆ చౌడయ్యనీ వాడి మనుషుల్నీ కూడా అరెస్టుచేసి తీసుకుపోతాం.

రాద్ధాంతం: జాగ్రత్త! డి. యస్. పి. గారూ, వాళ్ళు చాలామంది ఉన్నారు.

డి. యస్. పి. : ఏం భయంలేదు. మా పోలీసుపటాలం అంతావచ్చి చౌడయ్య యింటిని చుట్టేసింది. సెలవ్ సిద్ధాంతంగారూ. (వెళ్ళిపోతాడు. వెనకాలే పోలీసులు 'నలుగురి'కీ సంకెళ్ళు వేసి తీసుకుపోతారు)

నారాయణ. నరసింహం : మేం కూడా దగ్గరుండి ఆ చౌడయ్యని అరెస్టు చేయిస్తాం. సెలవ్.

రాద్ధాంతం : (సిద్ధాంతం దగ్గరకు వెళ్ళి) నీకు చెప్పకుండా ఈ పని చేసినందుకు క్షమించు. ఇందాకా నువ్వు మాట్లాడుతూంటే నీహృదయం ఎంత గొప్పదో, నీ ఆదర్శాలు ఎంత దివ్యమైనవో అర్థమయింది. నీ వేదన నీ తపన నీ తపస్సూ కూడా మానవకల్యాణానికి దారితీయాలని హృదయపూర్వకంగా వాంఛిస్తున్నాను బావా!

సిద్ధాంతం : (రాద్ధాంతం భుజంమీద చెయ్యివేసి) కాని ఈ సంఘటన నాకు గుణపాఠం నేర్పింది రాద్ధాంతం. మన ఆదర్శాలు ఎలా ఉన్నప్పటికీ మనం ఎప్పుడూ అప్రమత్తులమయి ఉండాలి. మన యింటినీ మన వొంటినీ రక్షించుకునే తగు ఏర్పాట్లలో ఉండాలి. నువ్వు చెప్పినట్లు కొస్త గడుసుదనం, మరి కొస్త వాస్తవిక దృష్టి ఉంటే యింత అనర్థం సంభవించేదికాదు. అయినా, నీ దూరదృష్టివల్ల యీ ప్రమాదం తప్పింది రాద్ధాంతం! నువ్వు కూడా నా సిద్ధాంతంలో యీనాటినుండీ ఒక భాగానివి:

రాద్ధాంతం : మహాప్రసాదం.

భార్య : బాగుంది. బాగుంది మీ బావమరదుల సల్లాపాలు. ఈ బస్తాలు లోపల పడేసి పడుకుందాం రండి. వీళ్ళ మూలాన్ని నిద్రల్లేకుండా జాగరణ చేశాం!

రాద్ధాంతం : నాలుగు దాటింది అక్కా. ఇంక పడకేమిటే కొస్త కాఫీ కషాయం పెట్టించు.

సిద్ధాంతం : రైట్ రైట్. సిద్ధాంతం అనే కషాయంలో రాద్ధాంతి అనే పంచదార కొస్త వేశావా, చూసుకో దాని రుచి!

నారాయణ : నరసింహం : (పరుగెత్తుకు వచ్చి) అయ్యో! చౌడయ్య, మనుష్యులూ పారిపోయారండి యిల్లు వదలిపెట్టి!

భార్య : పీడ వదలింది—గండి నాయనా రండి, మీరు కూడా కొస్త కాఫీ తీసుకుందురుగాని.

ఏకరయ్య : (మూలనుంచి లేచి.) అమ్మగారూ చద్దికూడు ఎలాగయినా లేదు. నాక్కూడా యీ యేళ కాఫీ ఇప్పించండి.

(అందరూ ఇంట్లోకి వెళుతారు.)

సిద్ధేంద్ర యోగి

శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు

"ఆ (సంబెట) గురవరాజు ప్రభుత్వములో ప్రజలకు అతిదారుణశిక్షలు చేయుచూవుండేవారు. ప్రజలవద్ద ద్రవ్య ఆకర్షణ చేసేయెడల త్వరగా సొమ్ము యివ్వకపోతే స్త్రీలను తీసుకవచ్చి స్తనాలకు చిరుతలు పట్టించేవారు. అలాగుండగా దినములలో వినుకొండ, బెల్లంకొండ తట్టున కూచిపూడి అనే గ్రామంనుంచి బ్రాహ్మణులు భాగవతులనే వేషధారులు కీర్తన నిమిత్తమై యీ స్థలమునకు (సిద్ధవటం సీమకు) వచ్చివుండి సంబెట గురవరాజుయొక్క దారుణప్రభుత్వం చూచి యిక్కడనుండి లేచిపోయి విద్యానగరమునకుపోయి అక్కడ వీరనరసింహరాయలు రాజ్యపరిపాలనం చేస్తూవుండగా భాగవతులు దర్శనం అయి కేళిక ఆడుటకు సెలవు యిచ్చినారు. కూచిపూడి వెళ్ళంవాండ్లు చాలా విద్యావంతులని ప్రసిద్ధిగా వినికిడి వున్నందున రాయలవారు స్త్రీలు సహా చూడవలెనని నగరువద్ద దివాణములో కీర్తనకు సెలవుయిచ్చినారు. అక్కడ కీర్తన వినికిచేసేటప్పుడు సంబెట గురవరాజు వేషం వేసికొని వొకడు యిద్దరు బంట్రోతులవేషం వేసుకొని వొకడు స్త్రీ వేషం వేసుకొని, సంబెట గురవరాజువలెనే ఆ వేషగాడు కూర్చుండి, రాయలసముఖమందు ఆ స్త్రీయొక్క స్తనాలకు చిరుతలు పట్టించి సొమ్ము యివ్వమని తహశ్శీలు చేసినట్లు వినికి చేసినారు.

"అప్పుడు రాయలవారు చూచి అదియేమని అడుగగా ముఖస్తులయినవారు భాగవతులముఖతా ఆ వర్తమానము తెలిసి...విన్నపం చేయగా చాలా తీక్షం చేసి, మరునాడు ఉదయమందు ఆ సంగతి తీరుగా జ్ఞాపకం చేయమని ముఖస్తులైనవారికి ఆజ్ఞయిచ్చినారు. ఆ రాత్రి కీర్తన సాంతమయిన వెనుక తెల్లవారినపిమ్మట రాయలవారు కాలోచితకృత్యములు తీర్చుకుని, ఆస్థానమునకువచ్చి.........."1

పై కథనము మెకంజీ సేకరణలలోని మాచుపల్లి కైఫీయత్తునందలి ఒకభాగము. దీనినిబట్టి కూచిపూడి బ్రాహ్మణభాగవతులు వీరనరసింహరాయల కాలము (క్రీ. శ. 1506-1509) నాటికే, అనగా క్రీ. శ. 1500 నాటికే విద్వాంసులుగా ప్రసిద్ధి నందినారనియు, దేశముకట్టి సంచారములు చేయుచు దూరదేశములందు కూడ ప్రదర్శనము లిచ్చుచున్నారనియు స్పష్టమగుచున్నది. ఇది విమర్శకు లందరకును తెలియును. కాని రాయలయెదుట కూచిపూడిభాగవతులు నాడు ప్రదర్శించిన కేళిక లేదా కీర్తనయొక్క స్వరూపమును గూర్చి మాత్ర మెవ్వరును బాగుగా ఆలోచించినట్లు కన్పట్టదు. కూచిపూడివారు సంబెట గురవరాజు దుష్కృత్యలనే నాటకముగా కల్పించి ఆరాత్రి ప్రదర్శించినారని విమర్శకులు అభిప్రాయపడినారు. కాని, ఈ యూహ సమంజసముగా కన్పట్టదు. ఇచ్చట కేళిక లేదా కీర్తన అనునది సుప్రసిద్ధమైన భామాకలాపమే. కూచిపూడిభాగవతులు నాడు రాయలసముఖములో భామాకలాపమునే ప్రదర్శించినారు. ప్రదర్శనమధ్యలో గురవరాజు దుష్కృత్యాలకు పరాకాష్ఠ అనదగిన ఒకదృశ్యము (స్త్రీల స్తనములకు చిరుతలను పట్టించుట) మాత్రమే ప్రదర్శించినారు. రాయలవారు విషయమును గ్రహించినపిమ్మట, కేళిక మరల యథాప్రకారము సాగినది. ఈ యీవిషయములను క్రమముగా నిరూపింతును.

సిద్ధేంద్రయోగి అనెడి మహానుభావుడు భామాకలాపమును రచించి, దానిని కూచిపూడివారికి నేర్పెననెడి ఐతిహ్యము పరంపరాగతముగా వినవచ్చుచున్నది. కాని, సిద్ధేంద్రయోగికాలమును గూర్చిన చారిత్రకాధారము లెవ్వరికిని లభించలేదు. అయినను వీరనరసింహరాయలయెదుట భామాకలాపమే ప్రద

1. చూ. (1) Studies in the History of the Third Dynasty of Vijayanagara by Dr. N. Venkataramanayya,-Appendix C. P.P. 462-63.

(2) శ్రీ దిగవల్లి వేంకటశివరావు "కథలు - గాథలు" (4 వ భాగము) 151-52 పుటలు.

(3) "నాట్యకళ" - డిసెంబరు, 1957 సంచిక - పుటలు-27-28.

ర్శింపబడెనని అంగీకరించినచో, దానికి మూలపురుషుడగు సిద్ధేంద్రుడు విధిగా క్రీ. శ. 16 వ శతాబ్దికి పూర్వుడగును. అనగా క్రీ. శ. 14 వ శతాబ్దిలో, లేదా 15 వ శతాబ్దిలో చెందినవాడగును.

కాని, సిద్ధేంద్రయోగి 17 వ శతాబ్ది ఉత్తరార్థమందున్న వాడనియు, అతడే స్వయముగా గోల్కొండనవాబగు అబుల్ హసన్ కుతుబ్ తానాషా (క్రీ. శ. 1672-1687) చేత కూచిపూడిని అగ్రహారముగా కూచిపూడివారికి ఇప్పించెననియు, క్షేత్రయ్య (విజయరాఘవ నాయకుని కాలము—క్రీ. శ. 1633-1673) పదాభినయము ననుసరించియే సిద్ధేంద్రయోగి భామాకలాపమును సృష్టించెననియు, సిద్ధేంద్రయోగికి పూర్వకాలమందు కూచిపూడివారు శతవిధ శివలీలానాట్యపద్ధతులను నృత్యము చేయుచు గ్రామగ్రామములను తిరుగుచుండిరనియు ఆచార్య శ్రీ విస్సా అప్పారావు గారు మొదలగువారు వ్రాసియున్నారు. ఈ అభిప్రాయములను పరిశీలించవలసియున్నది.

గోల్కొండనవాబు కూచిపూడిని అగ్రహారముగా నొసంగిన శాసనములో సిద్ధేంద్రయోగి ప్రసక్తియే లేదని తెలియుచున్నది. కాగా, సిద్ధేంద్రుడు 17 వ శతాబ్ది ఉత్తరార్థమందుండెనను విషయము పరాస్తమగుచున్నది.

శ్రీ అప్పారావుగారి అభిప్రాయమును అనుసరించి క్షేత్రయ్యయును, సిద్ధేంద్రయోగియును సమకాలికులు కావలసియున్నారు. అట్టియెడ శ్రీ శ్రీనివాస చక్రవర్తి గారు పేర్కొన్నట్లు2, సిద్ధేంద్రయోగి క్షేత్రయ్య పదాభినయము ననుకరించెనని చెప్పుటకంటె క్షేత్రయ్యయే సిద్ధేంద్రుని భామాకలాపములోని కీర్తనలను ఒరవడిగా పెట్టుకొని పదాలు రచించెనని ఏల చెప్పరాదు? ఇంతకును సిద్ధేంద్రయోగి క్షేత్రయ్యకంటె చాల ప్రాచీనుడనుటయే సత్యసమ్మతము. కూచిపూడియును, క్షేత్రయ్యనివాసమగు మొవ్వయును సన్నిహిత గ్రామములు. క్షేత్రయ్య చిన్నప్పటినుండియు కూచిపూడిపద్ధతిలో నృత్య సంగీతములను అభ్యసించియుండును; అంగులకుతోడు కవితాశక్తియును కలవాడు. అతడు దేశసంచారములో విజయరాఘవనాయకుని సందర్శించినప్పుడు, ఆ ఆస్థానములోని రాజనర్తకీమణులను చూచి, వారి అభినయములకొరకు పదములను రచించియుండవచ్చును. లేదా అంతకుముందునుండియు పదకర్తయే అన్నను బాధలేదు.

ఇంక సిద్ధేంద్రునకు పూర్వకాలమందు కూచిపూడివారు శతవిధ శివలీలా నాట్యపద్ధతులను ప్రదర్శించెడివారనుటకు తగిన ఆధారములు లేవు. ఇందును గూర్చి శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రి గారు కూచిపూడి భాగవతులను గూర్చిన వ్యాసములో 3సమాధాన మొసంగియున్నారు.

పాల్కురికి సోమనాథుడు బసవపురాణములో (పుట-26) నాటిన ర్తకులను కొందరిని పేర్కొనియుండెను.

"వేడుకఁగోలాట మాడెడువారుఁ
గూడలి త్రిపురాంతకుని కొల్చువారు;
గెడఁగూడి పసిఁడి గిరెట కేళికలను
గడునొప్పు సొన్నలి కప్పరంబువారు;
జేరువ నాడెడు పేరణిబిరము
సౌరాష్ట్రి నాయకు సంప్రదాయంబు
వేడుకఁ బ్రతిజోకలాడెడువారుఁ
గూడలి సంగయ్య కొలువునర్తకులు;
బాడుచు నటవిండ్లపై గజ్జెపరువు
లాడెడువారు రాయని కొల్చువారు."

ఇచ్చట కాని, బసవపురాణములో మరి యెచ్చటకాని కూచిపూడివారి ప్రశంస కన్పట్టదు. విద్వాంసులైన కూచిపూడివారే శివలీలానాట్యములందు ప్రసిద్ధులై యున్నచో వారిని కూడ సోమనాథుడు తప్పక పేర్కొనియుండును. పండితారాధ్య చరిత్రయందలి నృత్య వర్ణనలలో కూడ కూచిపూడివారి ప్రసక్తి లేదు. అందుచే సోమనాథుని నాటికి (క్రీ. శ. 13 వ శతాబ్ది) కూచిపూడివారు నాట్యములు చేయుటయే లేదని నిర్ధారింపవచ్చును. కూచిపూడివారు మొదటినుండియు వైష్ణవ భాగవతులుగానే ప్రసిద్ధి చెందిరి కాని మొదట శైవభాగవతులై పిమ్మట వైష్ణవభాగవతులైనట్లు చెప్పుటకు ఎచ్చటను ఆధారములు లేవు. కావున "కొందఱు సిద్ధేంద్రయోగి నారాయణాశ్రమి యను యతి శిష్యుడనియు, క్రీ. శ. 1100 ప్రాంతమువాడనియు నందురు. కాని, క్రీ. శ. 1160—1300 ప్రాంతము వీరశైవమత విజృంభణ కాలమగుటచేతను, కూచిపూడి భాగవత సంప్రదాయము వైష్ణవభక్తి సంప్రదాయకమగుటచేతను ఇది క్రీ. శ. 1300 తర్వాతనే ప్రచారములోనికి వచ్చియుండవచ్చును." అని శ్రీ నిడుదవోలు వేంకటరావు గారు వ్రాసినది4 సత్యసమ్మతముగా కన్పట్టుచున్నది.

---

2. "కూచిపూడి విధినాటకం" — నాట్యకళ (డిసెంబరు, 1952) పుట 26.

3. "కూచిపూడి భాగవతులు—యక్షగాననాటకములు"-'Annals of Oriental Research' of the university of Madras-Vol. XV-1958-59-P-66.

4. 4-8-1959 తేదిన వారు నాకు వ్రాసిన లేఖలో.

క్రీ. శ. 12,13 శతాబ్దములనాటికి పవిత్రమైన దేవదాసీ సంప్రదాయమును, ఉత్తమమైన రాజనర్తకీ సంప్రదాయమును పతితములైనవనియు, అసంస్కారులైన గ్రామీణుల వీథినాటక ప్రదర్శనములు హేయస్థితిలో ఉన్నవనియు, అందుచే నటనర్తకులు నింద్యులైనారనియు, అట్టిస్థితిలో నాట్యకళోద్ధరణమునకు పురుషులును బ్రాహ్మణులును అగు కూచిపూడివారు పూనుకొని వీథిభాగవతము లాడుటకు మొదలు పెట్టియుందురనియు, అటుపిమ్మట సిద్ధేంద్రుడు వారికి భామాకలాపమును నేర్పెననియు కొందరు తలంచుచున్నారు. అనగా కూచిపూడివారు సిద్ధేంద్రునకు పూర్వమే నటులై, వీథినాటకములనో లేదా యక్షగానములనో ప్రదర్శించుచుండెడివారనియు, అప్పుడు వారికి సిద్ధేంద్రుడు శాస్త్రీయమైన నృత్య—గానములను నేర్పి భామాకలాపమును బోధించెననియు వీరు తలంచుచున్నారు.

తెలుగుదేశమందు వీరశైవమత విజృంభణ కాలములో నృత్యనాటకములు సాంఘికకళగా రూపొందినవి. ఆ మతవిజృంభణము అణగుటతో ఈ కళలు అసంస్కారులైన తక్కువజాతివారి పాలబడినవని ఊహించుటకు అవకాశము కలదు. అట్టిస్థితిలో నటనర్తకులు నింద్యులగుట సహజమే. 13వ శతాబ్దిమధ్యలో. కాకతీయులకాలములో, నృత్యకళకు రాజాస్థాన ప్రవేశగౌరవమును కలిగించుటకు ప్రయత్నములు జరిగినవి. గణపతిదేవమహారాజు బావమరిది యగు జాయసేనాపతి స్వయముగా నాట్యవిద్యాధురంధరుడై క్రీ. శ. 1253-54 లో 'నృత్తరత్నావళి'ని రచించెను. అసలీ ఉద్యమమునకు బ్రాహ్మణులు పట్టుగొమ్మలైనారు. జాయసేనాపతి గురువు బ్రాహ్మణుడైన గుండామాత్యుడట. వెన్నెలకంటి అన్నయామంత్రియును, అన్న కరించిన షోడశకుమారచరిత్ర కృతిపతియును అయిన మాదామాత్యుడు సంగీతసాహిత్య ధురంధరుడే కాక 'నృత్తభరతాచార్యు'డట. ఈ రెండు ఉదాహరణములును చాలు ఆనాడు నాట్యకళను బ్రాహ్మణులు చేపట్టినారనుటకు. సిద్ధేంద్రయోగియును అట్టివాడే అయియుండును. అతడు పూర్వజన్మసంస్కారబలముననో, భగవత్కృపవలననో, గురుకృపవలననో వాగ్గేయకారుడగుటయే కాక నృత్యకళాధురంధరుడును అయి, క్రొత్తమార్గమును త్రొక్కి, జాయనలక్షణమును రచించగా తాను లక్ష్యముగా భామాకలాపమును రచించియుండును. ఈ రచనలో జయదేవుని గీతగోవిందము కూడ మార్గదర్శకమై యుండవచ్చును.

పాల్కురికి సోమనాథుని వర్ణనను బట్టి నాడు నృత్యములు వేరుగాను, నాటకములు వేరుగాను ప్రదర్శింపబడుచున్నవని స్పష్టమగుచున్నది. ఆ నాటకములు వీథినాటకము లగుట నిస్సంశయము. నాటికి 'భాగవతము'లను పేరు వానికి లేదు; మరియు కూచిపూడి వారివంటి నృత్యనాటకములవలె నాడా వీథినాటకములు శాస్త్రీయనృత్య—గాన సహితములై యుండెడివని కూడ చెప్పజాలము. ఇంక నృత్యములు వారాంగనలచే చేయబడుచుండెడివని చరిత్రలవలన విశదమగుచున్నది. ఇట్టిస్థితిలో బ్రాహ్మణులు ప్రప్రథమముగా నృత్యకళను మాత్రమే చేపట్టినట్లు పై ఉదాహరణములనుబట్టి చెప్పగలము. శాస్త్రనిష్ణాతులైన బ్రాహ్మణులు కొందరు నృత్యమేళములకు గురువులై యుందురు. ఇంక సిద్ధేంద్రయోగి మాత్రము నూత్నమార్గమును త్రొక్కెను. భామాకలాపరచనమునకు మోహకృష్టియో, లేదా మరేదియో ప్రేరకమైనను అది ఒక అపూర్వసృష్టి. కళావేత్తయే కాక తపస్సంపన్నుడగువాడే అట్టి రచనము చేయగలడు. "నానృషిః కురుతే కావ్య" మ్మనుసూక్తి ఇప్పట్ల నాటికి నూరుపాళ్ళు అన్వర్థము.5

తన నూత్నరచనమును ప్రయోగింపగలవారి కొరకు సిద్ధేంద్రుడు అన్వేషణ మొదలు పెట్టెను. ఆ ప్రయత్నములో కూచిపూడివారు ఆయన కంటబడినారు. కూచిపూడి బ్రాహ్మణులందరును వేదాధ్యయనపరులు, తపస్సంపన్నులు, యజనయాజనపరతంత్రులు, సామగానమున సాటిలేని మేటులు. కూచిపూడి బాలుర సుకుమార దేహములును, కమ్మని తీసిన కంఠస్వరములును సిద్ధేంద్రుని ఆకర్షించినవి. అతడు అతని పెద్దలను అంగీకరింపజేసి, వారి అనుమతితో భగవత్సన్నిధానములో కూచిపూడిబాలురకు నృత్యశిక్షణమును ఆరంభించెను. అదియే తెలుగువారికి గర్వకారణమగు 'కూచిపూడి నాట్యకళ'కు నాందీపూజ జరిగిన శుభముహూర్తము.

సిద్ధేంద్రయోగినిగూర్చిన ఐతిహ్యములలో పైవిషయములను వివరించెడి కథయును కలదు. అసలు భామాకలాపము తము కీవధగానే లభించెననియు, కూచిపూడి నాట్యకళా ప్రారంభమదియే అనియు కూచిపూడి వారి విశ్వాసము.6 కాని, సిద్ధేంద్రునకు పూర్వమే కూచిపూడివారు వీథినాటకములను ప్రదర్శించుచుండెడివారని చెప్పుటకు తగిన ఆధారములు లేవు. సిద్ధేంద్రుని ప్రేరణమువలననే కూచిపూడి వారు నర్తకులును భాగవతులును అయినారు కాని తాముగా కళోద్ధరణమునకు పూనుకొనలేదు. ఏ వుద్యమమునకైనను పది

---

5 శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి "ఏకవీర" లోని వర్ణనను చదువుడు పుటలు—165-166.

6. శ్రీ వేదాంతమ్ పార్వతీశమ్ గారి "భాగవతుల కూచిపూడి" అనెడి కావ్యఖండమును చూడుడు.

మందిరము కలిసి ప్రారంభించుట సాధారణము కాదు. ఎవరో ఒకరు నాయకుడైనచో తక్కినవారు అతని ప్రభావమునకులోనై అతనినే అనుసరింతురు. అట్టి నృత్యకళోద్ధరణమునకై ఉద్యమమునకు నాయకుడు సిద్ధేంద్రుడు. ఆయన ప్రభావమునకు లోనైన కూచిపూడి బ్రాహ్మణులు భామాకలాపమును నేర్చి తెలుగులో నృత్యకళకు ఎనలేని కీర్తిని చేకూర్చినారు. అట్లు నర్తకులైన వీరిని ప్రజలానాడు బహిష్కరించుట కవకాశమున్నది. కాని, అట్టి బహిష్కారము లేకుండునట్లుగా సిద్ధేంద్రుడు శ్రీ శృంగేరీపీఠాధిపతుల ఆదేశమును సంపాదించెనట. ఇట్లు సర్వసన్నాహములను పూర్తి అయినతరువాత కూచిపూడివారును తమకు అయాచితముగా లభించిన క్రొత్తకళయందు గౌరవాదరములు కలవారై సిద్ధేంద్రునియెడ కృతజ్ఞతాబద్ధులైనారు. అంతట సిద్ధేంద్రుడు, తన జీవితసర్వస్వమైన భామాకలాపము చిరకాలము వర్ధిల్లవలెనను కోరికతో కూచిపూడివారినుండి క్రిందివిధముగా వాగ్దానమును పొందెను. “ఆగడ్డమీద పుట్టిన ప్రతిబిడ్డకును (మగపిల్లవానికి) సిద్ధేంద్రునిపేరు చెప్పి ముక్కుకుట్టి కాలికి గజ్జెకట్టవలయును. స్త్రీలు వేషము వేయరాదు. ఇంక పురుషుడు మాత్రము ఏ దేశములో ఉన్నను సరే, ఒకసారి అయినను స్వామిసన్నిధిని భామవేషమును ధరించి తీరవలెను” కూచిపూడివారును ఈ నియమమును విధిగా పాటించినారు.

ఈ విధముగా క్రీ. శ. 14 వ శతాబ్దిలో భామాకలాప ప్రదర్శనము ఆరంభమైనది. కూచిపూడివారు దేశదేశములు తిరిగి ప్రదర్శనము జరుపసాగిరి. అంతకుముందు నృత్యములను నాటకములను ప్రజలు వేర్వేరుగానే ఎరుగుదురు. కాని ఇందు ఆ పద్ధతులు రెండును సమన్వయము చెంది, పండిత పామర రంజకమైన ఒక క్రొత్తపద్ధతి రూపొందినది. ఈ ప్రదర్శనమును 16 వ శతాబ్ది ప్రారంభములో వీరనరసింహరాయలు మిక్కిలి మక్కువతో చూచెను. ఈవిధముగా ఈ ప్రదర్శనములు 18 వ శతాబ్దివరకును సాగినవి. అప్పటికి ఈ ఒకే ప్రదర్శనమును పదేపదే చూచుటకు ప్రజలును, ప్రదర్శించుటకు కూచిపూడివారును కూడ విసిగియుందురు. అప్పుడు వారు నృత్యనాటకములను చేపట్టినారు. అంతియే కాని వారు మొదటనుండియు నాటకప్రదర్శనముల నెరుగరు.

ఆంధ్రుడును, కృష్ణలీలాతరంగిణీ కర్తయు అయిన శివనారాయణతీర్థులు (క్రీ. శ. 1580-1680) సిద్ధేంద్రయోగికి గురువనెడి ఐతిహ్యమొకటి ప్రచారములో నున్నది. ఈ నారాయణతీర్థులవారు గుంటూరు మండలములోని కాజగ్రామనివాసియనియు, దగ్గరలోనే ఉన్న కూచిపూడిలో కూడ కొంతకాలము నివసించెననియు విమర్శకులు అభిప్రాయపడినారు. ఈ విషయములు నిజములే అయినను ఆయన సిద్ధేంద్రుని గురువనుటకు తగిన ఆధారములు మాత్రము లేవు. ఇద్దరును సమకాలికులు కూడ కాదు. కొంతకాలము కూచిపూడిలో నివసించిన తీర్థనారాయణయతియందు క్షేత్రయ్యవలెనే నృత్యగానములయందు దిట్టయై యుండును. ఆయనపై భామాకలాపప్రభావము ... అది ప్రేరకమగుటచేతనే ఆయన సంస్కృతమున కృష్ణలీలా తరంగిణిని వ్రాసియుండునని నమ్ముచున్నాను. తీర్థులవారు తరంగములలో ‘సిద్ధనారాయణ తీర్థసేవిత శ్రీపాదం’ అనియు, ‘శివనారాయణతీర్థ సంపదాయకం’ అనియు ‘సిద్ధ’ పదమును ముద్రగా నాలుగుచోట్ల తన పేరుతో జోడించుకొనియుండెను. దీనిని పట్టి సిద్ధేంద్రుడును, తీర్థులవారును ఒకరే అని కొందరును, తీర్థులవారు ప్రియశిష్యుడగు సిద్ధేంద్రుని (సిద్ధప్ప) నామము నాదిగా స్మరించిరని మరికొందరును తలంచుచున్నారు.7 ఇట్లనుటకన్న తీర్థులవారి కృష్ణలీలాతరంగిణీరచనకు సిద్ధేంద్రుని భామాకలాపము ప్రేరకమయ్యెననియు, ఆ విధముగా సిద్ధేంద్రుడే తీర్థులవారికి పరోక్షగురువనియు, ‘సిద్ధ’ పదమును గౌరవపురస్సరముగా తీర్థులవారు స్మరించిరనియు చెప్పుట సత్యసమ్మతము కాగలదు.

తీర్థులవారును, సిద్ధేంద్రుడును ప్రత్యక్ష గురుశిష్యులు కారనుటకు తీర్థులవారుకూడ పారిజాతాపహరణకథను యక్షగానముగా రచించియుండుట కూడ బలము నొసంగుచున్నదని చెప్పవచ్చును. ఇద్దరును ఒక్కరే అయినను, లేదా ఒకరింకొకరికి ప్రత్యక్షముగా గురుశిష్యులైనను రెండు రచనలు బయలుదేరవలసిన అవసరము లేదు. తీర్థులవారు ఆంధ్రులై బహుదేశసంచారమొనర్చి, చివరకు దక్షిణదేశమున తిరుప్పందుర్తిలో (మేలట్టూరునకు సమీపమున) ... పొందినారట. తీర్థులవారికి కొంచెము ముందుగా అనగా అచ్యుతప్పనాయకుని కాలములో ఆంధ్ర కుటుంబములు కొన్ని దక్షిణదేశమునకు వలసపోయి అచ్యుతప్పనాయకుని ఆదరణముతో మేలట్టూరున స్థిరపడి అచ్చట తెలుగు యక్షగానముల ప్రదర్శనమునకు దోహదము నొసంగియున్నారు. వారికి కొంచెము తరువాత తీర్థులవారు దక్షిణదేశమునకు వెడలియుండిరి ...

---

(7) శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారి “ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము” ను (19..) చూడుడు. పుటలు 182-88, 195, 198-99.

శిఅట్లు వెళ్లి దక్షిణదేశములలో స్థిరపడిన తరువాతనే, శ్రీ రజనీకాంతరావుగారు పేర్కొన్నట్లుగా, 9 మేల ట్టూరు భాగవతులకొరకు తెలుగులో పారిజాతాప హరణ యక్షగానమును వ్రాసియుండునా. ఈ రచనలో సిద్ధేంద్రుని భామాకలాప ప్రభావము కొంతవరకు కన్పటగలదు.

సిద్ధేంద్రుని భామాకలాపమునకు కూడ పారిజాతమను పేరు కలదు. కాని నిజమున కందులో పారిజాతాపహరణమునకు సంబంధించిన కథ యేమాత్రమును లేదు. తీర్థ వారు మాత్రము దానినే ప్రధానముగా చేసి కథాసంవిధానములో కొంత నేర్పును చూపినారు. సిద్ధేంద్రుడు భామావిరహమునకును, భామాకృష్ణసమాగమమునకును ప్రాముఖ్యమిచ్చి చివరికథను త్రుంచివేసెనని చెప్పవచ్చును. లేదా, భాగవతులా భాగమును ప్రదర్శించుటలో అశ్రద్ధ చూపుటవలన మనకది అలభ్యమైపోయి ఉండవలెనని భావించుచున్నాను.

ఇంతవరకును నిరూపించిన ఆయావిషయములను పట్టి సిద్ధేంద్రుడు క్రీ. శ. 14, 15 శతాబ్దములకు చెందినవాడనియు, కూచిపూడి బ్రాహ్మణభాగవతులు వీర నరసింహరాయల సముఖమున క్రీ. 8, 15 వ శతాబ్ది ప్రారంభములో ప్రదర్శించిన కేళిక లేదా కీర్తన భామాకలాపమే అనియు స్పష్టమగుచున్నది.

---

(8) "తీర్థులవారు ఆంధ్రదేశమునుండి తరలివచ్చి, తంజావూరులో స్థిరపడిన ఆంధ్రబ్రాహ్మణ కుటుంబములో దక్షిణదేశమందే పుట్టె"నని ఆచార్య పి. సాంబమూర్తిగారి అభిప్రాయము.

(9) "ఆంధ్ర వాగ్గేయకారచరిత్రము"- పుట 195. సిద్ధేంద్రుడు తీర్థులవారి శిష్యుడనెడివాదము మీద నే శ్రీ రజనీకాంతరావుగారు మొగ్గు చూపించినారు.

కలగూరగంప

శివతత్త్వసారము

శ్రీ వఝల చినసీతారామస్వామిశాస్త్రి

శివతత్త్వసారమను గ్రంథమును ముద్రింపించిన కీ॥ శే॥ కొ. వెం. లక్ష్మణరావుగారు తాటియాకుల పుస్తకములు సాధారణముగా "తప్పుల తిప్ప"లనుట సత్యమనునట్లుగ నిట్లు వ్రాసిరి.

కావున గ్రంథ మర్థమయి యన్వయించులాగున సంగతిసందర్భముల నుబట్టి ప్రకాశకులు తమ బుద్ధివైభవము నుపయోగించి మూలమందుఁ దాము దప్పను కొనినదానిని దిద్దవలసినదే! ఇందు కొక యుదాహరణము దీసికొందము. ఒక తాటాకుప్రతిలో భారతమందలి యొకపద్య మిట్లున్నది.

కం. శ్రీమచ్చళుక వంశశా
ఖామణి మనుమార్గము రాజ కంఠీరవిధై
ర్యా మేరుధరణిధర
ణీ మండన ధర్మనిరతి నిత్యాభ్యుదయా.
(ఆదిపర్వము. ౧ ఆశ్వా, 11 పద్య.)

ఈపద్యము నీ క్రిందివిధముగ సవరించి యచ్చువేసినం గాని యెవరికి నర్థము గా నేరదు.

కం. శ్రీమచ్చళుక్య వంశశి
ఖామణి మనుమార్గ రాజకంఠీరవ ధై
ర్యామరధరణీధర ధర
ణీమండన ధర్మనిరతి నిత్యాభ్యుదయా.

ఈ గ్రంథ మచ్చువేయుటలో నే మేర్పఱుచుకొనిన నియమములు:—

1. గ్రంథపాతములను బూరించి కుండలీకరణము లందుఁ జూపితిమి. ఉదాహరణార్థము. 192 వ పద్యమునందు 'స్వేష్టాచార [లవాఙ్మనస] గోచర' యని పూరించితిమి.

2. ఛందోవ్యాకరణ నియమముల ననుసరించియు నర్థసందర్భములను బట్టియు మూలమందలి పాఠము తప్పని తోఁచినపుడు దానిని దిద్ది యచ్చొత్తించితిమి. దిద్దినచోట వెంటనే యొకయంకె గుర్తిడి పుటయడుగున మూలమందలి పాఠమును గనఁబఱిచితిమి. ఉదాహరణార్థము—196 వ పద్యమునందు "పువ్వులలోఁ బుట్టినట్టి పువ్వులు గొరయో" యని యుండఁగా "పువ్వులలోఁ బుట్టినట్టి ప్రువ్వులుగొ(ఱ)యే" యని సవరించి 'ప్రువ్వులు' అనుశబ్దముపై నంకె వేసి పుట యడుగున 'పువ్వులు' అని యిచ్చితిమి. దీని కర్థము మూలములో 'పువ్వులు' అని యుండఁగా మేము "ప్రువ్వులు" దిద్దితిమని.

3. బండిఱా లిప్పటి కోశవ్యాకరణముల ననుసరించియే వ్రాసితిమి. కాని మూలమునందు బండి 'ఱ' లేనిచోట మే మచ్చులో దాని నుంచినయెడల నా సంగతి చదువరులకుఁ దెలియుటకయి యట్టి బండి'ఱా'లను ( ) నిట్టి చిన్న కుండలీకరణము లందుఁ జూపితిమి.

4. అఱసున్నలును మూలమునందున్నవి లేమిని కుండలీకరణమువలనఁ దెలుపఁబడినవి. తాటాకు గ్రంథమునం దఱసున్నయు నిండుసున్నగనే వ్రాయఁబడియున్నను నిప్పటి లేఖనక్రమము ననుసరించి మేము నిండుసున్న వ్రాయక యఱసున్ననే యుంచితిమి. మూలమునందు నిండుసున్న యేది యఱసున్న యేది యని నిర్ణయించుటకు రెండు మార్గములు గలవు. (1) ఛందస్సును బట్టి. (2) నిండుసున్నయైన యెడల లేఖకుఁడు దాని తరువాతి యక్షరమును జడ్డగ వ్రాయును. అఱసున్నయైనయెడల దాని తరువాతి యక్షరము క్రింద నొత్తీయఁడు. 'అమరంగ'నని వ్రాయవలసినయెడల "అమరంగ్గ"నని వ్రాయును. 'అమరఁగ'నని వ్రాయవలసినయెడల 'అమరంగ'నని వ్రాయును. (కాని యీ పద్ధతి సరిగఁ బాటింపఁబడ లేదు.)

5. మూలమునందు పంక్తి చివరనుండు నకారపొల్లు (న్—ౕ) కు బదులు 'ను' అనియు, 'నూ' అనియు, లకారపొల్లు (ల్) కు బదులు 'లు' అనియు లేఖకుఁడు పెక్కుతావులలో వ్రాసెను. కాని యన్నిటిని బుటక్రింద జూపుట

యనావశ్యకమని మేము చూపలేము. అట్లే లేఖకుడు కొమ్ము వ్రాయడికి బదులు వెన్క తావులు వ్రాసి, శబ్దము లందు ఋకారమునే యుపయోగించెను. (అందు శబ్ద మందిది యనఁ జెల 'శ్రుతుఘు' అనుచో 'శృవు' అనియే కదా వ్రాయుట) అనావశ్యకముగాని తెలిసి యీ సంగతియు బుటల్ క్రింద జూపలేదు.

ఈ నియమముల నన్నిటిని దప్పకుండ ననుసరించి గ్రంథము నచ్చొత్తించుటకు యత్నించితిని. అయినను మానవులకు సహజములైన భ్రమప్రమాదముల వలనను, నీపద్ధతి నూతనమై లేఖకముద్రాపకులకు ననభ్యస్తమైనందునను గొన్ని పొరపాటు లుండిన నుండవచ్చును."
(శివతత్త్వసార పీఠిక 6-7-8 పుటలు)

వీరు పై నుదాహరించిన ట్లే "అయినను మానవులకు సహజములైన భ్రమప్రమాదముల వలన" అనుమాట నిజము కావుననె వారు తాటియాకుల మాతృకల స్థితిని విమర్శించుచు "కావున... సంగతి సందర్భముల ననుసరించి ప్రకాశకులు తమ బుద్ధివైభవము నుపయోగించి మూలమందు దాముతప్పని కొనిన దానిని దిద్దవలసినదె!... కాని దిద్దువాడెంత పండితుడైనను సర్వజ్ఞుడు కాడు. కాజాలడు. అతనికి ఛందోవ్యాకరణాది విషయములను సంబంధించిన గురభిప్రాయము లుండవచ్చును......" అని వ్రాసిరి. అట్లే యీ క్రిందివాని నెన్నిటినో వారు వ్రాయమఱచిరి.

కం॥ కొనునది భక్తునిచేతన
ధన మతనిక యిచ్చునదియు 'తస్మైదేయం'
బనియును "తస్మాద్గ్రాహ్యం
బనియును గలవనిరి వేఁభక్తవిధిజ్ఞుల్"
(శివతత్త్వ 115 పద్య).

దీని నిట్లు సవరించినంగాని కవిప్రయుక్త మనఁదగదు.

కం॥ కొనునది భక్తునిచేతన
ధనమతనిక యిచ్చునదియు 'తస్మైదేయ'
మ్మనియున్ "తస్మాద్గ్రాహ్య
మ్మనియున్ గలదనిరి భక్తియాగవిధిజ్ఞుల్."

పండితారాధ్యకవి యఖండయతిని బ్రయోగించెననరాదు. అతఁడెచ్చటను సఖండయతిని బ్రయోగింపలేదు. కాఁబట్టి యీరీతిని సవరింపక తీరదు. ప్రకాశకులీ క్రింది పద్యములందువలెనె యిందలి యతి భంగమును జూచుకొనలేదు.

కం॥ కర్తయని నిన్ను నెఱిఁగినఁ
గీర్తింపఁడు వెండితిన్నఁ గార్యాకార్యా
వర్తనలఁ గర వేసని
కర్త ప్రధానుండుగాన ఘనభక్తుఁడజా.
(శివతత్త్వ 148 పద్యము.)

దీనియందు యతిభ్రష్ట మయినదని ప్రకాశకులు చూచికొనలేదు. కాన నీ క్రిందిరీతి నీ పద్యమును సవరింపవలయును.

కం॥ కర్తయని నిన్ను నెఱిఁగినఁ
గీర్తింపఁడు వెండి తిన్నఁ గీర్తికిఁ గార్యా
వర్తనలఁ గర్తనేసని
కర్త ప్రధానుండుగాన ఘనభక్తుఁడజా.

ఇందు రెండవ చరణమున యతిపోయినదని ప్రకాశకులు చూచికొనలేదు.

కం॥ రుద్రాక్ష భూతిభూషణ
ముద్రాంకితు నెగుడుగన్న మదమున సాక్షా
ద్రుద్రుఁడని తలఁపఁడేని శి
వద్రోహుఁడు నరకగామి యగును మహేశా.
(శివతత్త్వ 158 పద్యము)

ఇందును యతిభ్రష్టమయినది. దీనిని గుర్తెటి ప్రకాశకులు టిప్పణమున "శివద్రోహుఁడు నరకగుండఁడగును మహేశా యని కవి ప్రయుక్తముగ నేమో?" అని వ్రాసిరి. కాని కవి నన్నయకాలమునకుఁ గొంత సమీపమువాఁ డగుటచేత (చూడు. నా రచించిన చింతామణి విషయ పరిశోధనము-8 ప్రకరణము) ద్రుతమునకు 'ను' స్వరూపమును బ్రయోగింపండని తలంచి నచో "శివద్రోహుఁడు నరకగామివాఁడు మహేశా" అని కవిప్రయుక్తము కానోపునని యెన్నవలయును.

కం॥ ప్రణుతింప 'న మే భక్తాః
ప్రణశ్యంతి' యనఁగఁ దగిన పలుకునకుఁదగన్
గణనాథ భక్త చింతా
మణి రక్షింపవె యపార మహిమాధారా.
(శివతత్త్వ 181 పద్యము)

ఇందు రెండవ పాదమున గణభంగమున్నదని ప్రకాశకులు చూచుకొనలేదు. ఈ పద్యము నీ రీతిని సవరింపక తప్పదు.

కం॥ ప్రణుతింప నమేభక్తాః
ప్రణశ్యతి' యనంగఁదగిన పలుకునకుఁదగన్
గణనాథ భక్తచింతా
మణి రక్షింపవె యపారమహిమాధారా.

కీ॥ శే॥ శ్రీ జయంతి రామయ్య పంతులుగారు శాసనపద్యములందును తప్పులు మెండుగఁగలవని శాసన పద్యమంజరి పీఠికలో నిట్లు వ్రాసిరి: "కవ్యుద్దిష్టములు కాని పాఠములు కొన్ని ప్రవేశించి యుండుగూడదా యన్నచో ప్రవేశించియున్నవని యొప్పుకొనక తప్పదు.

లేఖకాది ప్రమాదజనిత గుప్త ప్రయోగము లనేకము లచ్చుపడుటచే గన్పట్టుచున్నవి." (శాసనపద్యమంజరి పీఠిక 8 పుట)

"నాల్గవ శాసనములో "శ్రీశకు నేణ్ణు" అనుచో "శ్రీ శకునేణ్డులు" అనియు "ఇష్టకు" అనుచో "ఇష్టులకు" అనియు "సుడ్డకు" అనుచో "సుడ్డులకు" అనియు, నిరువది యొకటవశాసనములో చెఱువు అనుచో "చెలువు" అనియుం జరుగవలయును. (చదువనిచో ఛందోభంగము గునని తాత్పర్యము)(శాసనపద్యమంజరి పీఠిక V)

"ఋకారమునకు బదులుగా 'ఇకార సహిత రేఫమే ప్రాచీనశాసనములలో గనబడుచున్నది ఉదా: త్రిండ, త్రివిక్రము, త్రిగాంక (10 శాసన), సత్రిద్ధి—(41 6) ఒకానొకప్పుడు 'ృ' అనుదానికి బదులు "ంద్రి" అనురూపము కనబడుచున్నది. ఉదా:— సూంద్రిత (41-2) సకంద్రిపానసీపాల (41-13)" (శాసనపద్యమంజరి పీఠిక V పుట) "దుర్వ్యోణనసాయులను (7 4) కలుహారు" (శాసనపద్యమంజరి పీఠిక. VI పుట.)

"వల్లభ" యనుటకు బదులుగా 'వల్లభి' యనుట, (4-1-53) 'బాలిక' అనుటకు బదులుగా 'బాలకి' యనుట (5-5) ఉదయించె ననుటకు బదులుగా 'ఉదియించె'నని తెలుచుగా గన్పటుచున్నది

అకారాంత శబ్దములను 'డు' ప్రత్యయము పరమైనప్పుడు ప్రకృతిరూపమందలి చివరి యకారమున కుకారము రాకుండుట:—బ్రహ్మదేవండు (40-8), శరణండు (46-14), భీమనిన్ (48-2), మల్లిదేవండు (58-12-13).

డు ప్రత్యయాంతశబ్దములు కొన్ని (డు) ప్రత్యయము లేకయే కనబడుచున్నవి. ఉదా: 'చోడుడు' అనుటకు బదులు 'చోడు' (58-7), 'తిమ్మండు' అనుటకు బదులు 'తిమ్మ' (58-15-16)—అశ్వమేధంబు (అశ్వమేధంబు) (శాసనపద్యమంజరి పీఠిక)

"ప్రాచీనశాసనములలో నిండుసున్నకు బదులు వర్గాంత్యానునాసికాక్షరములు కనబడుచున్నవి" (శాసనపద్యమంజరి పీఠిక IV పుట)

ఈవిషయము నారచించిన ఆంధ్ర వైయాకరణ పారిజాతమునందలి 340 విషయము మొదలు 347 విషయము వఱకు చూడునది.

విశ్వనాథవారి విశ్వామిత్రుడు

శ్రీ వి. రామకృష్ణరావు

వాల్మీకి రామాయణంలో విశ్వామిత్రుడు ద్వారపాలకులతో "కౌశికమాఖ్యాతి మాం ప్రాప్తం కౌశికం గాధిన స్సుతమ్" అని తనరాకను చెప్పగా వాళ్ళు భయసంభ్రమాలకు లోనైనారని "తచ్ఛ్రుత్వా వచనం త్రాసాత్", "సంభ్రాంతమనస స్సర్వే" అనే వాక్యాలవల్ల తెల్లమౌతున్నది. వాళ్ళు భయసంభ్రాంతు లయినా రనడం సామాన్యమైన విషయం. ఈసామాన్యవిషయాన్నే శ్రీ విశ్వనాథవారు విశిష్టంగా సందర్భపరిచినారు. అంతర్వంశికుల వాక్యాలద్వారా వాళ్ళకు కలిగిన భయసంభ్రాంతుల వ్యక్తీకరించడం విశ్వనాథవారి ప్రత్యేకత. త్రాసాదివ్యభిచారిభావాలు వాటివాటి అనుభావాలవల్ల వ్యంగ్యం కావడంలోనే విశేషమున్నది. ఇలాంటివాక్యాలతో ఖండం ఆరంభించడం ఒక విశిష్టమైన శిల్పంగా పేర్కొనవచ్చు.

రామలక్ష్మణులు విశ్వామిత్రునికి ప్రణామం చేసిన సందర్భం మురారి అనర్ఘరాఘవ నాటకానికి అనుసరణం; అనుసరణం మక్కీకి మక్కీ కాదు. "రామలక్ష్మణు లిరువురు గాధేయుపాదాభివందన మాచరించిన

రాముడు నమస్కరించుచు
నా మునిపాదములు తాకినంతటన తనూ
రోమాంచవు లానంద
శ్రీమత్పులకాంబుభంగసృతి మునిపాంగా."

రామలక్ష్మణు లిరువురు పాదాభివందన మాచరించినారు. ఇరువురిలో రాముడు నమస్కరించినప్పుడే మునికి రోమాంచము చెప్పబడింది; "పాదాభివందనం బాచరించిన" అనడంవల్ల గోత్రప్రవరపూర్వకంగా నమస్కరించినారని గ్రహించవలసి ఉంటుంది. "భగవన్ విశ్వామిత్ర సావిత్రౌ రామలక్ష్మణా వభివాదయేతే" అని మురారి సావిత్రౌ అనడంచేత గోత్రప్రవరపూర్వకనమస్కారం గమ్యమౌతుంది. "సావిత్రౌ సూర్యవంశోద్భవౌ గోత్రప్రవరపూర్వకనమస్కారస్య కర్తృత్వేనేతి ముక్తమితి గంతవ్యమ్" అని యిష్టార్థకల్పవల్లీ వ్యాఖ్య.

"రామలక్ష్మణు లిరువురు గాధేయుపాదాభివందనం బాచరించిన—రాముడు నమస్కరించుచు" ఈవింత వాక్య నిర్మాణముకల ప్రయోజనమేమి? మురారి విశ్వామిత్రుడు "సరోమాంచం రామం చ నిర్వర్ణ్య సబహుమానమ్" అని చెప్పి యాత్మగతమున రాముని నారాయణునిగా ఎట్లు భావించెనో రెండుశ్లోకాలలో వర్ణించినాడు. రాముని నారాయణు డనుకోవడమే రోమాంచానికి హేతువు. విశ్వనాథవారి విశ్వామిత్రుడు కూడా రాముని లీలామానుషవిగ్రహుడైన నారాయణుడిగానే తలంచినాడు. రామలక్ష్మణు లిద్దరిలో రాముడు నారాయణుడనే భావము విశ్వామిత్రుడు పొందినాడు. అపొందడాన్ని విశ్వనాథవారు పైవాక

విన్యాస శిల్పంవల్ల వ్యక్తీకరించినారు. ఆ యిద్దరిలో రాముని పృథక్కరించిచూపడం ఈ విశేషం ద్యోతకం కావడానికే అని ఊహించవచ్చు. "అయ్యిద్దఱు జేర నరిగి...ప్రణామంబు లాచరించి కృష్ణుండు ప్రాంజలియై యతని కిట్లనియె" (హరివంశం) ఈ హరివంశ వాక్యంలో కృష్ణుండు పృథక్కరింపబడినాడు. (వ్యా. సం. సర్వ.)

మురారి విశ్వామిత్రుడు రాముని నారాయణుని గా ఆత్మగతమున భావించినాడు. అప్పుడతని మనస్సులో కలిగిన భావములు బహిర్గతములు కాలేదు. విశ్వనాథవారి విశ్వామిత్రుడట్టి భావములను నేత్రచాలనముచే వ్యక్తీకరించినాడు. రాముని నేత్రములవంక చూచిన చూపులలో వుండే భావాలు వేరు; వసిష్ఠుని స్తిమిత నేత్రాలవంక చూచేటప్పటి యభిప్రాయములు వేరు. ఇలాగే "రామ మేఘము మేన శంపాభ కాంతు లాలయు" నప్పటి చూపులు "వసిష్ఠ శంపాలోచనైక్య భావము" భజించేటప్పటి దృక్చలనములు భిన్నభిన్న భావ వ్యక్తీకరణ తానకములు. ఆయాభావములు బహిర్గతము లగునప్పుడు విశ్వామిత్రుని మూర్తికూడ తత్తదుచిత పరివర్తనకు లోనవుచుండెను. ఇటువంటి మార్పులు పాఠకులు గ్రహించడం కోసం విశ్వనాథవారు గాథేయ శబ్దంతో నాలుగు పెద్ద పాదాలను ప్రారంభించినారు. "దైతేయ మనవతీ ధమ్మిల్లములతో డ విరుల నెత్తావికి విడుకోలు" ఇత్యాది వాచనసోముని పద్యంలో దైతేయ దనుజ దానవ దైత్య శబ్దములు నాలుగు పాదముల ఆరంభము లోను ఉన్నవి. విలక్షణార్థ ప్రతిపాదన కోసం అనేక స్థలాలలో ఇలాంటి పునరుక్తులు మహాకవుల కావ్యలలో ఉన్నవి.

విశ్వామిత్రుడు "మనుజేశ్వరుఁ గని వసిష్ఠమౌనిం గని తక్కినవారిం గని"నాడని చెప్పబడింది. "మనుజేశ్వరుని వసిష్ఠ మౌనిని తక్కినవారిని కని" అని వ్రాయకూడదా? మూడుసార్లు 'కని' ఎందుకు? "విధాత్రుండు కేశవుని ముఖంబుఁ జూచి దేవతల ముఖంబులు గని, ఇంద్రు గాంచుచు మునితోడ నిట్లనియె" అని అనతాగ ఖండంలో కూడా వ్రాసినారు. మనుజేశ్వరుని చూచినప్పటి చూపులు వసిష్ఠుని చూచినప్పటి

చూపులు తక్కినవారిని చూచినప్పటి చూపులు భిన్న భిన్న భావస్ఫోరకములుగా వుంటాయి. విశ్వనాథవారి ఈ రచనకు తిక్కనగారి యీ పద్యమే ప్రస్తావలంబ మిచ్చె నేమో!

"సంజయుండు కృష్ణు సద్భక్తి నీక్షించి
పవనపుత్రుఁ బార్థుఁ గవలఁ ద్రుపద
తనయు సవినయమునఁ గనుగొని ప్రీతిఁ బాం
చాలు మత్స్యధరణిపాలు జూచి" (ఉద్యోగ 1-291)

అయోధ్యాకాండలో సుమిత్ర లక్ష్మణుని చూచిన చూపులో "ఒక్క యనుమతి యొక దైన్య మొక ప్రశంస, సున్నితంబుగఁదోచె"నని చెప్పినారు. ఈ మూడు భావాలే యెందుకు తోచినవో భావుకులే ఊహించుకోవలసి ఉంటుంది. బాలకాండలోనే విశ్వామిత్రుడు రామునికి అస్త్రవిద్యాప్రదానం చేయగా అతని నేత్రప్రసారంలో "ఏదో అకూతి" కనబడిందట. విశ్వామిత్రుడు వెంటనే గ్రహించి "అవునవు - వత్స, యివియెల్లను సౌమిత్రికిఁ దవిలి యొసంగుము" అన్నాడట.

యోగి యొకమహాభావమును నేత్రప్రసారం ద్వారా వ్యక్తీకరిస్తాడు. అప్పుడతని కన్నులలోని జ్యోతిస్సు మిరమిర లాడుతుంది. ఈ విషయం వేయిపడగలలో ఒక చోట అనబడింది.

"ఈమె యోగినికనులందె యెల్ల బ్రదుకు
బ్రదికెఁ గనులందె ప్రాణముల్ వదలిపెట్టె,
నా కనులదీప్తికై యేమొ యగ్ని యిట్లు
లాజ్వలజ్జిహ్వ వెంపరలాడుచుండె"

అను వరలక్ష్మీ త్రిశతిలోని పద్యంకూడా ఈ విషయాన్నే బీజప్రాయంగా తెలుపుతుంది. ఈ బీజమే రామాయణ కల్పవృక్షంలో శాఖోపశాఖా శోభాసముదంచితాభ్యుదయమై విలసిల్లింది.

విశ్వామిత్రాగమనానికి ప్రధానఫలం అస్త్రవిద్యా ప్రదానం. యజ్ఞరక్షణ ఆనుషంగిక ఫలం మాత్రమే. రామావతారమునకు ముఖ్య ప్రయోజనం రావణ సంహారము. తత్సిద్ధికి అస్త్రవిద్యా ప్రదానమే ఆధారం. కాబట్టి విశ్వామిత్రుడు వచ్చింది వశిష్ఠులు సెలవిచ్చినట్లు రాము ననుగ్రహించడానికే కాని కేవలం నిజయజ్ఞరక్షణకోసం కాదు. ఈ నిగూఢాశయాన్ని గుర్తించియే విశ్వనాథవారిట్లనిపించారు.

"ఇమ్మగు విద్య నేర్చెదము
నింకను నాకొక చిన్న మెత్తుకా
ర్యమ్మును జేసి పెట్టవలె
నాపయిఁ బూవులలోనఁ బెట్టి కై
కొమ్మని నీకుమాగఁ డిడు
గోనని నీక యొసంగువార మా
పిమ్మట నీవుగా నతని
పిడవలెఁ మరి మాకు నేటికిన్"

అను ఈ పద్యములోని 'నేర్చెదమున్' అను చోటి చార్థకం అనన్య సాధ్యమగు విద్యాప్రదాన రూపార్థ విశేషం ద్యోతకం చేస్తుంది. "మే మేపురము నీ తను మధ్య వివాహ మహోత్సవము నని పలికెన్", "వినఁడును గానఁడున్ మతియు నీకును నాకు మనల్చ వచ్చునే" ఇత్యాది నన్నయ, తిక్కన ప్రయోగములందు వలె ఇక్కడి చార్థకం అర్థ విశేష ద్యోతకం.

పాత్రల స్వరూపస్వభావాదులను అత్యల్ప సంభాషణాదుల ద్వారా వ్యక్తం చేయడం అలంతులకు శక్యంకాదు. "రాముడు నాకు స్నానమగు రాముడు నాకు జపంబు ధ్యానముల్ రాముడె యెల్ల నా బ్రతుకు రాముడు" అన్న దశరథుని సంభాషణవల్ల అతని నియమనిష్ఠాగరిష్ఠత ద్యోతక మౌతుంది. "వేదవిత్", "యజ్వా, ధర్మరతో, వశీ, మహర్షికల్పో రాజర్షిః" అని వాల్మీకి రామాయణంలో దశరథుని గూర్చి చెప్పబడి ఉన్నది. "సోహ మాజన్మశుద్ధానామ్", "యథావిధి హుతాగ్నీనామ్" అని రఘువంశంలో ఆరాజులు వర్ణితులైనారు.

ఈ దశరథుని ప్రసంగంవల్ల దశరథునినుండి రాముని విడదీయడం ఎట్లాకుదరదో స్నానజపధ్యానాదు లతనినుండి విడదీయలేమన్నది గమ్యమౌతుంది. వేరే అతని గూర్చి వర్ణింప నవసరంలేకుండా పరిపోతుంది. కాగా నాకు స్నానమగు ఇత్యాది దశరథుని ప్రసంగంలో అసామంజస్యం ఏమీ లేదు. తత్పాత్రోచితమే.

కవితాశిల్పం అనేది అనేక విధాలుగా కావ్యంలో గోచరమవుతుంది. వర్ణములలో సంబోధనలలో సమాసాలలో ఇది ఉండవచ్చు. విశ్వామిత్రుడు దశరథునితో సుబాహుమారీచులు "ఉగ్రవికట ప్రకటాకృతులై సవవేదిక పాడు" చేస్తున్నట్లు చెప్పినాడు. ఇందులోని ఓష్ఠ్యసంతో ష్ఠ్యములు రాక్షసులు సవవేదిక పాడుచేసేటప్పటి యనుభావాలను, మూర్ధన్యములు రాక్షసుల ఔద్ధత్యమును ద్యోతకం చేస్తున్నవి. దశరథుడు రాముని చూచి "ఓయి రఘుప్రవృద్ధ నయశోజ్జ్వల శీతమయూఖ" అన్నాడు. ఈ సంబోధనలో

అతడు రాముని తన నేత్రాలకే కాకుండా రఘుప్రవృద్ధుల నేత్రాలను కూడా చలువ పండించి వాసే వానిగా భావించడం గమ్యమౌతుంది. ఇంతేకాకుండా అతని ముఖంవంక చూస్తూ దశరథుడు మాటాడడం కూడా స్ఫురిస్తుంది. ముఖమును శీతమయూఖునితో పోల్చడం సుప్రసిద్ధం కదా! "పూర్ణచంద్రుపయి వెన్నెలపుల్గుల చాలు వ్రాలు. లీలల విభుమీద వ్రాలె నవలా నవలాలితదృష్టిజాలముల్" అను వసుచరిత్ర పద్యంలో పూర్ణచంద్రుపయి అని ఉండడంవల్ల గిరిక చూపులు వసురాజుముఖంమీదనే ప్రసరించినట్లు తద్విమర్శనానుబంధంలో సామ్యం చెప్పబడడం నా యీ వ్రాత కుపస్కారకముగా ఉన్నది.

"నీచులు దైత్యజంతువు లనేకులు కారు మఱిక్ సుబాహు మారీచు లంచు నిద్దఱు," "వీరిద్దఱు మారీచ సుబాహులు వానికి దగ్గర చుట్టములు" ఒకచోట సుబాహు మారీచులని, రెండవచోట మారీచ సుబాహులని అనడం ఎందుకు? మొదటిది పద్యంలో కాబట్టి ప్రాసకోసమో గణాలకోసమో అందామా! "నీచులు దైత్యజంతువు లనేకులు కారు మఱిం దలంప మారీచ సుబాహు లిద్దఱు" అనే రీతిని వ్రాయవచ్చు గదా! యజ్ఞధ్వంసం చేయడంలో మారీచునికంటె సుబాహుడే ప్రముఖపాత్ర వహిస్తున్నాడని 'సుబాహు మారీచులు' అనే సమాసంవల్ల ద్యోతకమవుతుంది. ముందు చంపబడినవాడుకూడా సుబాహుడే. రెండవ స్థలంలో రావణునకు మారీచ సుబాహులు దగ్గర చుట్టములని చెప్పబడింది. ఇద్దరిలో సన్నిహితుడు మారీచుడు కాబట్టి అతడిక్కడ ముందు ఉంచబడ్డాడు. 'సుబాహుమారీచులు' అనే సమాసం "భ్రాతుర్జ్యాయసః — యుధిష్ఠిరార్జునౌ" అని ఉండుటచే వ్యాకరణ విరుద్ధమని భ్రమింపకూడదు. "ద్వంద్వఘటితశబ్దముల పౌర్వాపర్యము విషయమున వైయాకరణులు పెక్కు నియమములను వచించిరి. కాని యవి యెల్ల ప్రాయికములు. అట్టి నియమములకు విరుద్ధములగు ప్రయోగములును గలవు... శోభిత ద్వారవధూ సమాగమా ఇతి రఘుః" (వ్యాకరణ సంహితా సర్వస్వము) "భ్రాతా జ్యాయాన్ వర్ణః క్రమేణేతి సూత్రద్వయం కుర్వంత్యన్యే. తదస్మిన్ మతే జన్య. మరణక్రమాభ్యర్హితత్వాత్ సిద్ధం ఏతత్సర్వం ప్రాయికం ధూమాగ్నీ లక్షణహేతూ" అని శ్రీరామతర్కవాగీశుడు.

విశ్వామిత్రుడు రావణునిగూర్చి చెప్తూ "వాఁడు సాక్షాద్వైశ్రవణభ్రాత" అన్నాడు. "సాక్షాద్వైశ్రవణభ్రాతా పుత్రో విశ్రవసో మునేః" అని వాల్మీకి. దశరథుడు సుప్రసిద్ధుడు అతని గూర్చి వివరాలెందుకు? దశరథుడు సమాధానం చెప్తూ "నాడా వాఁడు ఖలప్రధానక యక్షాదిక దేవయోనిపటుగ్రీవా దళనిశితప్రతేజన నిస్త్రింశుడు" అన్నాడు. ఇక్కడ యక్షాదిక దేవయోను లనడం ఎందుకు గంధర్వాది దేవయోను లనరాదా?

వాల్మీకిరామాయణంలో రావణునిగూర్చి వివరం చెప్పడానికి ఉద్దేశించినదే శ్రీ విశ్వనాథవారు విలక్షణంగా ఉపయోగించుకొన్నారు. "వాఁడు సాక్షాద్వైశ్రవణభ్రాత" అనడం రావణుని క్రౌర్యం తెలుపడానికి. రావణుడు వైశ్రవణుని నోడించి పుష్పక విమానం తీసికొన్నాడు. దశరథుని కిది అర్థం అయింది. అందుకే అప్పటి యుద్ధాన్ని జ్ఞాపకం చేస్తూ "యక్షాదిక దేవయోని పటుగ్రీవా దళ" ఇత్యాదిగా అన్నాడు. యక్షుల్ని చెప్పడం అందుకే. కుబేరుడు యక్షాధిపతి.

వాల్మీకీయంలోవలెగాక ఇక్కడ విశ్వామిత్రుని ప్రభావం వశిష్ఠుని తత్స్తోత్రంలో వర్ణించినట్లు సంఘటింపబడినది. విశ్వామిత్రుడు దశరథుడు పుత్రవంతుడైనందుకు మొదట అభినందించడం అతని లోకజ్ఞతకు నిదర్శనముగా ఉన్నది. విశ్వామిత్రుడు రాజు ననామయంబడిగినట్లు శ్రీ విశ్వనాథవారు వ్రాసిరి. కుశల క్షేమ శబ్దములు అనామయారోగ్య శబ్దములు పర్యాయములైనప్పటికి వీటికి శాస్త్ర సంప్రదాయం కూడా ఉన్నది.

ఈ విధముగా స్థలాంతరాలలోకూడా శ్రీ విశ్వనాథవారు శాస్త్రవచనాన్ని పాటించినారు.

వరూధి - అవరూధి

శ్రీ మైనంపాటి వేంకటసుబ్రహ్మణ్యం.

'ధనపతితో దరిద్రుఁడనకు
దత్తివింపకు వానితోడ మూ
ర్ఖుఁడనకు బ్రశాంతుతోడ గడు
గ్రూరుఁడనకు రణశూరుతోడ భీ
రుఁడనకు వరూధితోడ నవ
రూధికి సజ్జనుతోడ గష్ట దు
ర్జనుఁడనకు సెవ్విధంబునను
సఖ్యము పొందా నొడుగూడ నేర్చునే!'

కలగూరగంప

ఈ పద్యము నన్నయ రచితమైన మహాభారతమునందలి ఆదిపర్వములోనిది. ఇది ఈ సంవత్సరము ఎస్. ఎస్. ఎల్. సి. విద్యార్థుల తెలుగు పాఠ్యములో 'పరాభవము' అను శీర్షికతో ప్రచురింపబడిన పాఠ్య భాగమునందున్నది. ఈ పద్యమున మూడవ పాదము నందలి 'వరూధి-అవరూధి' అను పదములకు సరియగు అర్థమేదియో యోచింపవలసియున్నది. ఈ పదమునకు శబ్దరత్నాకరమున "వరూథము=సం. వి. అ. న— కవచము, గృహము, చక్రరంధ్రముల జొప్పించు నెమ్ములు, పులితోలు లోనగువానిచే నేర్పరుపబడిన రథము మీది కప్పు (అని కొందరు)" అని వ్రాయబడి యున్నది.

ద్రుపదుడు తూష్ణీంభావమున ద్రోణునితో వచించిన పలుకు లివి. ధనపతికిని దరిద్రునకును, తత్త్వజ్ఞానికిని మూర్ఖునకును, ప్రశాంతునకిని క్రూరునకును, రణశూరునకును భీరునకును, వరూధికిని అవరూధికిని, సజ్జనకును దుర్జనునకును, సఖ్యము కలుగదని భావము—వరూధిశబ్దము తప్ప తక్కిన శబ్దార్థము లన్నియు సుబోధములు. వరూధికి శబ్దరత్నాకరుని అర్థము 'కవచము' అని తీసికొన్నపుడు వరూధి = కవచమున్నవాడు — అవరూధి=కవచములేనివాడు అని అర్థము చెప్పవలసి యున్నది. కొందఱు ఆ పదములకు రథములో బోవువాడు. నడచిపోవువాడనియు, సేనయున్నవాడు, సేన లేనివాడనియు అర్థము చెప్పుచున్నారు. ఈ అర్థము లా రెండుపదములకు సరిపడనివిగా దోచుచున్నవి. యుద్ధమున కవచధారికిని కవచహీనునకును సఖ్యముకలుగదనుటయు. అంత సమంజసముగా లేదు. వారిరువురకును సఖ్యము కలుగవచ్చును గాని కలుగకుండుటకు వీలు లేదు. ధనపతికి దరిద్రునకు సఖ్యము సామాన్యముగా కుదరదు. కుదిరినచో ధనపతికి దరిద్రునకు భేదములేదు కను క నే నన్నయ పారుడు దరిద్రుడైన ద్రోణునితో రాజస ద్రుపదునకు సఖ్యమొదగూడదని వ్యతిరేకత సూచించినాడు. నన్నయ వాడిన ఉదాహరణము లన్నియు పరస్పరము వ్యతిరేకములైయున్నవి. వాని అర్థములును వ్యతిరేకములే.

వరూధిశబ్దమునకు కొందఱు సేన, దండు, అను అర్థములు చెప్పియున్నారంటిని అని వరూథినిశబ్దము కదా! వరూధిని శబ్దార్థము వరూధశబ్దమునకు చెప్పుకొనుట భావ్యమా?

నానార్థనిఘంటువున ఈ 'వరూధ' శబ్దమునకు 'వరూథో రథగుప్తౌ నా క్లీబే సుకృత వేశ్మనోః' అని యున్నది. అనగా 'వరూథః' శబ్దమునకు రథమును రక్షించుటకు రథముమీద గప్పెడు వ్యాఘ్రచర్మము మొదలైనవానికి పేరని, పుణ్యము, గృహములకును పేరనియున్నది.

ఇచ్చట వరూథము = పుణ్యము, వరూధి = పుణ్యుడు అవరూధి (నఞ్ తత్పురుష కావున) పాపుడు (పుణ్యము లేనివాడు) అను అర్థము గ్రహించినచో సమంజసమని యూహించుచున్నాను.

పుణ్యులకు పాపులకు సఖ్య మొనగూడుట కష్టము కదా! ఒక వేళ వ్యతిరేకత లేక సఖ్యమున్నచో దరిద్రుడు ధనవంతునితో చేరి తత్సమానుడు కావచ్చును. మూర్ఖుడు తత్త్వజ్ఞుడు కావచ్చును. క్రూరుడు ప్రశాంతుడు కావచ్చును. భీరుడు శూరుడు కావచ్చును. పాపి పుణ్యుడు కావచ్చును. దుర్జనుడు సజ్జనుడు కావచ్చును. సఖ్యము లేకయున్నచో పరస్పరము వ్యతిరేకమే గదా!

కవచములేనివాడు కాని, సేనలేనివాడు కాని, రథమున పయనించనివాడు కాని, వారి వారితో స్నేహము పొందినను కాని పని—అని భావింతును.

కావున 'వరూథి—అవరూథి' శబ్దములకు 'పుణ్యుడు, పాపుడు' అని అర్థము గ్రహించుట తగినదని యూహించుచున్నాను.

పండితులైన పెద్దలు నా అభిప్రాయము సమంజసమో, కాదో నిర్ణయించ గోరుచున్నాను.

కృత్రిమాహారం

శ్రీ కె. ఎన్. గోపాలరావు

డేనియల్ యల్. ఆర్నాన్ అనే శాస్త్రజ్ఞుని నాయకత్వాన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో కొందరు వృక్షశాస్త్రజ్ఞులు రసాయనశాలలో 'కృత్రిమాహారం' తయారుచేసే విషయంలో కొంత విజయ సాధించారు.

ప్రపంచంలో అతిప్రధానము, బహు సామాన్యము ఐన రసాయనపరిణామం ఒకటి బహుకాలంగా శాస్త్రజ్ఞుల కగోచరంగా నిలిచిపోయింది. మహావృక్షం నుండి చిన్న గరికపోచవరకు అన్ని మొక్కలు సూర్యరశ్మిని తమ వివిధభాగాల క్రమాభివృద్ధికి ఉపయోగించుకుంటవి. చక్కెర, పిండిపదార్థము, సెల్యులోజ్ వాటికి చాలా ముఖ్యం.

ప్రకృతిలోనుంచి గ్రహింపబడే కర్బనద్వ్యామ్లజనిదము (Corbon dioxide), నీరు కూడ

అందుకు పనికివస్తవి. ఇది ప్రకృతిజన్యమగు సహజ రసాయనికపరిణామం. మానవుడుమాత్రం దీని నింకా సాధించలేదు. కొద్దికొద్దిగా ఇప్పుడిప్పుడే మానవుడు ఈ విశేషమును పరిశోధించి సాధించగలుగుతున్నాడు. మొక్కలమీద, వ్యవసాయంమీద ఆధారపడకుండానే గాలి, జలములనుంచి ఆహారమును తయారుచేయవచ్చు ననే ఆశ, 1954 డిశంబరులో శాస్త్రజ్ఞానాభివృద్ధిని గూర్చి అమెరికన్ సైన్సు అసోసియేషన్‌వారు చేసిన ప్రకటనవల్ల కలుగుతోంది.

"ప్రతి పచ్చని ఆకు, గడ్డిపోచ ప్రతి రోజూ రసాయనికశాస్త్రజ్ఞానం లేకుండానే ఈ పని చేస్తూ ఉన్నందున ఇది చాలా సులభమైన విధానమే కావచ్చు. ఏదైనా రసాయనపరిణామాన్ని తెలుసుకోవాలంటే వేడిచేయటంతో ప్రారంభిస్తాం. కాని ఈ పని వేడిచేయకుండా జరగాలి. ఇదే ఇక్కడున్న చిక్కు. వేడిచేశామా కేవలం అనుకున్నదానికి వ్యతిరేకం జరుగుతుంది. ఉష్ణశక్తి ఇక్కడ మొక్కను, దానిలోని మూల పదార్థాలుగా విడగొట్టి, కర్బనమును, ఉదజనిని విడుదలచేస్తుంది. ఈవిధంగా విడుదలైన కర్బనము, ఉదజని గాలిలోని ఆమ్లజనితో కలిసి కర్బనద్వాయామ్లజనిగాను, నీరుగాను మారుతుంది. దీనినే దహనక్రియ అంటారు. జ్వాలవలన హెచ్చుపరిమాణంలో వివిధ శక్తులు వెలువడుతవి.

"ఈ క్రియను తలక్రిందుచేయవలెనన్న, అనగా కర్బనద్వాయామ్లజనిదము, నీరు నుండి మొక్కయొక్క వివిధభాగములు రూపొందుటకు, అంతే పరిమాణముగల దహనశక్తిని రసాయనశాలోష్ణతయందు వేడిచేయకయే ఇందు కుపయోగించవలెను. తక్కువ ఉష్ణశక్తి సూర్యరశ్మినుండి లభిస్తుందిగాని, కర్బనద్వాయామ్ల జనిదమునుగాని, నీటినిగాని ఏ ఇతరపదార్థ సహాయము లేకయే సూర్యరశ్మి రసాయన విశ్లేషణ మొనరింపజాలదు. శాస్త్రజ్ఞునకు సూర్యరశ్మి ఒక్కటే ఉపయోగపడదు. ఇందుకై మొక్కలు ఏదో ప్రత్యేక ప్రక్రియను ఉపయోగిస్తవి. ప్రస్తుత పరిశోధనకు ఈ మర్మమును ఛేదించుట ముఖ్యం.

"ముఖ్యంగా ఇందుకు మొక్కలకు.వాటికి సహజమైన ఆకుపచ్చరంగునుఇచ్చే 'క్లోరోఫియల్' అనే మూలపదార్థం అత్యవసరం అని చాలాకాలంక్రిందే గ్రహించబడ్డది. హారితవర్ణములేని కుక్కగొడుగులు వైవిధంగా సూర్యరశ్మిని స్వయంగా ఉపయోగించుకోలేవు. నీడలోనో చీకట్లోనో పెరుగుతూ ఇతరమొక్కలపైనో, వాటి భాగములమీదో అధారపడి జీవించవలసిందే. ఒక్క 'క్లోరోఫియల్' (హారితవర్ణమునిచ్చుపదార్థం) కూడా ఇందుకు ఉపయోగపడదు. సజీవవృక్షజాలమునుండి తీయబడిన ఈ స్వచ్ఛమైన 'క్లోరోఫిల్'. సూర్యరశ్మినుండి ఉష్ణశక్తిని గ్రహిస్తుందేగాని దానిని తానై ఉపయోగించజాలదు. సూర్యరశ్మినుండి ఉష్ణశక్తిని గ్రహించి, ఇంతవరకు తెలియని మరి దేని సహాయంతోనో మొక్కల పెరుగుదలకు ఉపకరించే ఇతరపదార్థములకు ఈ ఉష్ణశక్తిని అందజేయుటే ఈ క్లోరోఫియల్ పని."

పైప్రకటన వెలువడటానికి ఒక సంవత్సరం పూర్వమే సూక్ష్మదర్శినికిగాని కనపడని మొక్కలలోని కణాలుకూడా ఈరసాయన క్రియకు చాలా ప్రధానమని గుర్తింపబడింది. ఈ చిన్న కణాలలో క్లోరోప్లాస్ట్స అనబడే చిన్న చిన్న అణువులు ఉన్నాయి. మొక్కలలో ఉన్న ఈకణాలు సజీవంగా ఉన్నప్పుడే ఈ పరిశోధనంతా జరగాలి. శాస్త్రీయంగా ఏ కొద్ది జోక్యం పెట్టుకున్నా ఈకణం నాశనమై జరిగే రసాయన పరిణామం ఆగిపోతుంది. అసలున్న చిక్కంతా ఇక్కడే ఉంది.

ఆ ప్రకటనవల్ల తెలిసిన దిది: సూక్ష్మదర్శినికిగాని అందని వృక్షములలోని ఈ కణాలనుండి క్లోరోప్లాస్ట్స అనబడే అణువులను వాటిలోని క్లోరోఫియల్‌తో సహా విడగొట్టి, వాటి సహాయంతో రసాయనశాలలోని పాత్రలలో నీరు, కర్బనద్వాయామ్ల జనిదముల నుండి వృక్షశాస్త్రజ్ఞులు చక్కెర తయారు చేయగలిగారు. పచ్చని ఆకులతోగాని, మొక్కలోని మరే యితర భాగములతోగాని అవసరంలేకనే జరిగిన రసాయనిక సంయోగ మిది. ఇది ఇంతవరకు సజీవపదార్థాలు ఏపని చేసేవో, అదేపనిని నిర్జీవపదార్థాలద్వారా సాధించబడ్డ విశేషం.

ఈ క్రియకు మరొక రసాయనికపదార్థంకూడా ఉపయోగపడుతుందని కనుగొన్న ఆ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకబృందానిదే నిజంగా ఈ విజయం.అదే'అడినోసైన్-ట్రై-ఫాస్ఫేట్'.-క్లుప్తంగా దీన్నే ఎ టి పి అని అంటారు. ఇదొక రసాయన సమ్మిశ్రణమైనపదార్థం. చాలాకాలంనుంచి సజీవ కణాలకు పోషకపదార్థంగా ఉపయోగపడుతున్న భాస్వరముతో కలిసిన మిశ్రమ మిది అని తెలిసినవిష

యం. ఇది ప్రతి అణువునందు ఉంటుంది. ఇందుకో ఉదాహరణం. కండరం పనిచేయటానికి శక్తికావాలి. రక్తప్రసరణలో ప్రాణవాయువుతో చక్కెర కలియుటవలన కండరమునకు కావలసిన ఈ శక్తి ఉద్భవిస్తోంది. వివిధములైన విటమినులతో కలిసిన ఎ టి పి చక్కెరనుండి ఈ శక్తిని గ్రహించి కండరముయొక్క అణువులోని వివిధభాగములకు సరఫరాచేసి, కండరము ముడుచుకుని పనిచేయుటకు సహాయపడి అనుఘటకముగా (ఏజంటుగా) పనిచేస్తుంది. కనుక ఎ టి పి శక్తిని కొనిపోవు వాహకము. కనుకనే చక్కెర, పిండి పదార్థములు, క్రొవ్వువంటి పోషకపదార్థములతో పాటు భాస్వరితములు, విటమినులు మానవులకు, పశువులకు ఆహారంలో సమానంగా అవసర మవుతున్నాయి. పచ్చనికూరలు, పండ్లు, కాయలు తినుటవలన అవి మనకు లభ్యమవుతున్నవి.

ఇప్పటి పరిశోధనవలన ఎ టి పి రిబోఫ్లావిన్, ఆస్కార్బిక్ ఆసిడ్ వంటి విటమినులుగూడా వృక్షజీవనములో ప్రధానపాత్ర వహిస్తాయని తేలింది. సూర్యరశ్మిని . వృక్షములు ఉపయోగించుకొనటం నాలుగు అంచెలలో జరుగుతున్నది.

మొక్కలలో జరిగే ఈ పరిణామముయొక్క వివరణవల్ల మొక్కలకు ఫాస్ఫేటులు ఎరువులుగా ఎంత అవసరమో తెలుస్తున్నది. ఫాస్ఫేటులు లేక మొక్కలు ఎ టి పి ని తయారుచేసుకొనజాలవు. కనుక మొక్కలు పెరగజాలవు. ఇందువలన మానవుని పోషణకు పచ్చని కూరగాయ లెందు కవసరమోకూడ తెలుస్తున్నది. వాటివాటి అవసరాలకు మొక్కలు, పశువులు విటమిన్లను, ఎ టి పి ని కలిగియున్నట్లుగానే మానవశరీరము వృద్ధిజెందుటకు కూడ అవి అవసరం.

సూర్యరశ్మి మొక్కల పెరుగుదల కెట్లుపకరిస్తున్నదనునది ఇప్పటికి సాధింపబడినది. ఇంత కాలంగా రహస్యంగా ఉన్న ఈవిషయం ఇక అందరికీ తెలిసిన విషయమయింది. అన్నిటికంటే ముఖ్యంగా తెలిసినవిషయం - ఇది రసాయనికపరిణామ క్రమవికాసమేకాని ఏ జీవపదార్థముయొక్క అవసరం ఇందు కవసరంలేదని; దీనిని రసాయనశాలలోనే సాధించవచ్చుని.

ఇదేవిషయాన్ని డాక్టర్ ఆర్నాన్ మాటల్లో చెప్పటం మంచిది: "ఈ పరిణామమే సాధ్యమయితే మానవుడు తనకువలసిన ఆహారానికి, శక్తిజనక పదార్థాలకు వృక్షజాతులపై ఆధారపడనక్కరలేదు. స్వతంత్రించి నేరుగా సూర్యరశ్మిలోని శక్తినుండి కొల్లలుగా ఆహార పదార్థాలు తయారుచేసి ప్రస్తుతపు ఆహారకొరతకు స్వస్తిచెప్పి నూతన శకారంభానికి నాంది పలకగలడు."

ప్రస్తుతం ప్రపంచజనాభా సుమారు 250 కోట్లు. ఇది ఈ శతాబ్దాంతానికి 400 కోట్లు కావచ్చు. అప్పటికి ఈ ఆహారసమస్య గడ్డుగా తయారయి ఉన్న పరిశ్రమలు నాటికి చాలకపోవటంకూడా సంభవమే. 2000 వ సంవత్సరానికి ప్రపంచ ఆహార ఉత్పత్తి ఇప్పటికంటె రెట్టింపు కావలసి ఉంటుంది. వ్యవసాయంద్వారా ఆహారోత్పత్తిని అధికంచేసి మరి కొంత ఆహారమును మొక్కలనుండి జలచరములనుండి పొందవచ్చుగాని, ఆహారోత్పత్తి రెట్టింపుచేయడానికి విప్లవాత్మక విధానం కనుగొని వృద్ధిచేయవలసి ఉంటుంది. ఇప్పుడది చూపుమేరలోకి వచ్చింది.

('అర్గసై జరు' పత్రిక ఆధారంగా)

హొయసళ రాజుల దక్షిణాది రాజధాని

మద్రాసు-తిరుచిరాపల్లి రోడ్డులో తిరుచిరాపల్లికి ఉత్తరంగ ఎనిమిది మైళ్ళలో పెరునాళీవైక్కాల్ అనే కావేరి కాలువగట్టున పచ్చని పంటచేల మధ్య నేనున్న సమయపురం అనే కుగ్రామం ఒకప్పుడు హొయసళరాజుల దక్షిణాదిరాజధాని. దక్షిణభాగాన్ని ఒకప్పుడు నిరాఘాటంగా పాలించిన హొయసళుల రాజ్యం 1310 లో మల్లిక్ కాఫూర్ దండయాత్రతో అంతమైంది. ఈ సమయపురాన్ని 10, 11, 12 శతాబ్దాలలో కణ్ణనూగ కుప్పం అనేవారు. దీనినే విక్రమపురమనికూడా అనేవారు. హొయసళ చక్రవర్తి సోమేశ్వరుడు (1238-67) దక్షిణాదిపై దాడివెడలి ఈ విక్రమపురాన్ని తన నివాసంగా చేసుకొన్నాడు; ఒకశివాలయం నిర్మించి, పొయ్సళేశ్వరాలయం అని నామకరణంచేసి, పటణానికి సోమేశ్వరం అని పేరుపెట్టాడు. ఈ సోమేశ్వరపురమే క్రమంగా సమయపురంగా వ్యవహరించబడుతూ వచ్చింది. సోమేశ్వరచక్రవర్తి మరణించేముందు తన రాజ్యం రెండుగా విభజించి తనకుమారు లిద్దరికి-తృతీయ నరసింహదేవునికి (1254-92), వీరరామనాథదేవునికి (1254-95)-పంచియిచ్చాడు. మొదటి కుమా

రుడు తృతీయ నరసింహదేవుడు తన పూర్వుల రాజధాని అయిన ద్వారసముద్రం (హళేబీడు) నుంచే రాజ్యం చేసేవాడు. రెండవ వాడైన రామనాథదేవుడు సోమేశ్వరాన్ని రాజధానిగా చేసుకొని తనపాలికివచ్చిన దక్షిణాదిప్రాంతాన్ని పాలించేవాడు. మూడవ నరసింహుని కుమారుడు మూడవ బల్లాళుని (1291-1342) కాలంలో హొయసళ రాజ్యం విచ్ఛిన్నమయింది; 1346 లో రాజ్యం నశించిపోయింది. హొయసళుల పతనంతో రాజధాని అయిన సోమేశ్వరనగరం నిర్మానుష్యమై, పొయ్సళేశ్వరాలయం శిథిలమైంది.

ఈ విక్రమపురం ఒకప్పుడు హొయసళుల రాజధానిగా ఉన్నట్లు వీరసోమేశ్వరుడు (1253 మార్చి 1 వ తేదీన) ఒక సూర్యగ్రహణంనాడు వేయించిన దానశాసనాలు మున్నగు ప్రమాణాలూ ఉన్నాయి.

ప్రస్తుతం ఈ శిథిల రాజధాని కోటగోడల, దేవాలయప్రాకారాల రాళ్లు, దేవాలయం ముంగున్న పుష్కరిణి సోపానాలు, మండపాల స్తంభాలు మొదలయినవి కావేరి, కొల్లడముపై వంతెనలను కటడానికి ఉపయోగించబడ్డాయని అంటారు. ఈ వంతెనలను 1925 లో ఇనుపదూలాలు వేసి పునర్నిర్మాణం చేశారు. ఇప్పుడా రాజధాని శిథిలావశేషాలు ఒక కాలువ, ఒక పెద్ద కట్ట మాత్రమే. వీటిని ఇప్పుడు గజనమేడు అంటారు.

దేవాలయం మాత్రం నిశ్శేషం కాలేదు. దీని నిప్పుడు భోజేశ్వరాలయం అంటున్నారు. ఈ దేవాలయం హొయసళ వాస్తుప్రకారం నిర్మితమైనప్పటికీ, బేలూరు, హళేబీడులలో కనిపించే వాస్తుశిల్ప సౌందర్యం కనిపించదు. ఈ దేవాలయం సౌందర్యానికి ముగ్ధులైన మధుర నాయకరాజు విజయరంగచొక్కనాథనాయకుడు, ఆయన దేవేరి మీనాక్షి అమ్మణ్ణి (18 వ శతాబ్ది) దీనిని జీర్ణోద్ధారంచేసి, చుట్టు ఎత్తైన ప్రాకారాలు కట్టించి, పెక్కు మాన్యాలు సమర్పించారట.

విజయరంగచొక్కనాథుడు ఆ పరిసరాలలోనే మారెమ్మకు కూడా ఒక దేవాలయం కట్టించాడు. ఈ మారెమ్మ విగ్రహాన్ని హొయసళులు స్థాపించారట. వారి అనంతరం విజయనగర చక్రవర్తులు పూజించారట. విజయనగర రాజ్యపతనానంతరం ఆ విగ్రహాన్ని పల్లకిలో ఇక్కడికి తీసుకొనివచ్చారట.

ఈ మారెమ్మ రేణుకాదేవి, శీతలాగౌరి, మహామాయ అని వ్యవహరించబడుతున్నట్లు జానపదగాథలు చెబుతున్నాయి. ప్రతిసంవత్సరం వైశాఖమాసంలో ఇక్కడ పంచప్రాకారోత్సవమనే గొప్ప ఉత్సవం జరుగుతుంది.

1792 లో క్లైవ్ కు కర్ణాటక నవాబులకు జరిగిన యుద్ధంలో క్లైవు ఈ రెండు దేవాలయాలలోను తలదాచుకొన్నాడట. క్లైవు మారెమ్మగుడిలోను, అతని సైనికులు భోజేశ్వర దేవాలయంలోను దాక్కున్నారట. ఒక సందర్భంలో ఫ్రెంచి సైనికదళం ఒక నాటి రాత్రి అకస్మాత్తుగా ఈ దేవాలయాలపై దాడిచేసింది. ఒక ఫ్రెంచిసైనికుడు క్లైవుపై తుపాకి పేల్చాడు. క్లైవు అదృష్టవశాత్తు గండం తప్పించుకొన్నాడు. ఈపోరులో దేవాలయాలు రెండూ చాలా దెబ్బతిన్నాయి.

తర్వాత మారెమ్మదేవాలయం పునరుద్ధరించబడింది; నేటికీ సుప్రసిద్ధంగా ఉంది. భోజేశ్వర దేవాలయం మాత్రం ఉపేక్షించబడింది. నేటికీ ఫ్రెంచివారి ఫిరంగులకు గురిఅయి పడిపోయిన ఈ దేవాలయం ప్రాకారకుడ్యాలు చూడవచ్చు.

('హిందూ'లోని శ్రీ ఎన్. కృష్ణన్ గారి వ్యాసం నుంచి.)

గ్రంథవిమర్శనము

మహాసేనోదయము

[కర్త: కొడవలూరు రామచంద్రరాజకవి. ప్రకాశకులు: కొడవలూరు పెద్ద రామరాజు. దొరుకుచోటు: కొడవలూరు పెద్దరామరాజుగారు, శ్రీ ముక్తి రామేశ్వరము, ప్రొద్దుటూరు, కడపజిల్లా. 358 పుటలు. వెల. 5 రూ.]

శైవము చాల ప్రాచీనమైనది. అనాదిగా ఉత్తరమున అటు కాశ్మీర దేశములోను, ఇటు దక్షిణభారతములోను శైవము విలసిల్లినది. ఇంక నీ శైవముతో బాటు తమిళ కేరళ దేశములలో వినాయక, కుమారపూజలు సమాజముగా నెక్కువ. తెలుగు దేశమున సాధారణముగా వినాయక చతుర్థినాడే వినాయకుని పూజించుట! కుమారస్వామిపూజ మరియు తక్కువ. 'తిరుత్తని' మొదలు ప్రక్కలవారికి మాత్రము సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించుట మామూలు మరి శాస్త్రసూటమున మెరుగగునే యోగము. తమిళ కేరళరాష్ట్రములలో వినాయకసుబ్రహ్మణ్యులను పూజించినంతగా శాస్తనుగూడ పూజింతురు. ఈశాస్త హరిహరపుత్రుడు. ఇతడే అయ్యప్ప. తమిళ కేరళ దేశములందు శివునకో కుమారునకో అయ్యప్పకో సంబంధించిన పుణ్యక్షేత్రము లనేకములు. గిరియుపర్వత ప్రాంతము కేరళమున ప్రతి చెట్టును గుట్టయు మహిమాలంబములుగ నెంచబడునని చెప్పుదురు. ప్రతియింటి ప్రాకారాంతరభాగమున కృత్తికా ప్రదీపంటి యొక చిన్న కొండ, చెట్లు, నాగప్రతిష్ఠ కేరళమున సాధారణముగా నుండునని తెలియుచున్నది. ఇంక తమిళదేశమున కుమారస్వామిభార్యయగు వల్లీదేవి పేరుమీద నెన్నియో వల్లికొండలున్నవి. పళనిక్షేత్రము నందలి సుబ్రహ్మణ్యస్వామి మహిమ అనుభవప్రమాణముగా ననేకులు చెప్పుదురు.

ఈకృతికర్త కొడవలూరు రామచంద్రరాజు ఇప్పటికి 14 సంవత్సరముల నాడు కీర్తిశేషులైనారు. ఎట్లో కష్టపడి వారి కుమారులు శ్రీ కొడవలూరు పెదరామరాజుగారీ యుద్గ్రంథమును నేటికి ప్రకాశింపజేసి తండ్రికోర్కె నెరవేర్చినారు. రామచంద్రరాజుగారు బహుగ్రంథకర్తలు. ఈ మహాసేనోదయముకాక చాటు రాస్యదీక్షాప్రబంధము, ఆంధ్రపంచీకరణమను సాంఖ్యసూత్రగ్రంథము, శ్రీ ముక్తిరామేశ్వర క్షేత్రమాహాత్మ్య ద్విపదకావ్యము, 'ధీధీ' మనః ప్రబోధ, రామచంద్రప్రభు శతకత్రయము, శ్రీ ముక్తిరామేశ్వర రుక్మాంగద వీధినాటకము, రామదేశికులవారి చరిత్ర—ముద్రితములైనవి అమ్ముకాని యింకను 51 గ్రంథములున్నవని తెలియుచున్నది! వీనిలో శ్రీమత్పాండురంగ క్షేత్ర మాహాత్మ్యమను రెండాశ్వాసముల కావ్యము, లక్ష్మణమూర్ఛ, ప్రసంగ రామాయణము వంటి 'బొమ్మలాట'లు అంబరీష, శ్రీకృష్ణ రాయబారము, మార్కండేయ చరిత్ర మున్నగు హరికథలు, ఇంకను కీర్తనలు, సంకీర్తనలు, చూర్ణికలు, దండకములు, కందార్థములు, సూత్రగణిత పద్యములు, మేలుకొలుపుపాటలు, స్త్రీలపాటలు, షడ్వింశతి స్పందములు అనునవి కొన్ని మాత్రమే. మాదిగా కవితా రచనలో నీయన త్రొక్కని ప్రక్రియా మార్గమే లేదనిపించును. రామచంద్ర రాజుగారు భట్టరాజ కులోద్భవులు. వీధి బడులలో నెందరకో అక్షరభిక్ష పెట్టిన భట్టరాజుల బహుముఖప్రజ్ఞ రామచంద్రరాజుగారి రచనా వైవిధ్యమున గానవచ్చును.

గ్రంథకర్త స్కాందపురాణాంతర్గతమగు శంకరసంహితలోని శివరహస్యఖండమున కార్తికేయ జననమాదిగా శ్రీవల్లీకల్యాణము వరకు గల కథను 'సందర్శిని' కావ్యముగా వ్రాయబూనుకొన్నారు. తన కావ్యమునకు శ్రీ ముదిగొండ మల్లనారాధ్య పుత్రుడగు బ్రహ్మయలింగ కవి వ్రాసిన 'శివరహస్య ఖండ తత్త్వ ప్రకాశిని' అను సంస్కృత గద్య కావ్యమును మాతృకగా గొని ఈ మహాసేనోదయమును వ్రాసినారు. 'శివరహస్య ఖండతత్త్వప్రకాశిని' లో సంభవ కాండము, అసుర కాండము, వీరమాహేంద్రకాండము, యుద్ధకాండము, దేవకాండము అని ఐదు భాగములు. ఈకవి సంభవకాండమునందలి గౌరీశంకరుల వివాహగాథ వరకు గల దానిని వదలి, 'తదంతిక గాథనుండి ప్రారంభించి దేవకాండాంతము వరకు సంపూర్ణముగ' వ్రాసినారు. గద్యము వ్రాయుచోట సంస్కృత మాతృకనే యనుసరించితినని చెప్పుకొన్నారు.

మహాసేనోదయమున కుమారజననము, మాయా మోహితుడైన ఇంద్రుడు కుమారునితో పోరాటు, కుమారుడు ఇంద్రుని బ్రతికించి పిదప దేవసేనాధిపత్యము గొనుట, శివుని పంపున క్రౌంచ తారకులను, తరువాత శూరపద్మ, సింహవక్త్రులను సంహరించుట, పిదప కుమారస్వామి దేవసేనను, శ్రీవల్లిని వివాహమగుట — ప్రధాన కథలు. అవాంతరకథలలో అగస్త్యుడు క్రౌంచుని పర్వతముగనుండ శపించిన కథ, మాయ వలన రాక్షస వంశోత్పత్తి, తారకశూరపద్మ సింహవక్త్రుల యు అజముఖియు పుట్టుక, అజముఖి బలవద్గమనము చేసి దుర్వాసునివలన వాతాపీల్వలుల గనుట, ఇంద్రుడు వను సోమస్కంద శివ విగ్రహము లభించుట అనునవి ముఖ్యములు.

ఇందు పురాణకథ లున్నవి; తీర్పు ప్రబంధము వంటిది. అందుచే నీ కావ్యము పురాణప్రబంధమనుట లెస్స. రచనలోగూడ పురాణకవితలోని పారశ్యమే ముఖ్యముగా సాధింపబడి కృత్రిమత పీడిత ప్రబంధలక్షణము సంతరింపబడి యుండుట ఇట్లనుటకు ప్రధాన కారణము.

శైవకథ లెల్లప్పుడును వీరాద్భుత భీభత్సభయానకములకు తావలములు. ఈ కావ్యమున కవి కుమారస్వామి వల్లీ ప్రణయఘట్టమున శృంగారమునకు పాదుచేసినాడు. ఇంద్రాదుల పాట్లను జెప్పినపుడు కరుణ కాస్కారము కల్గించినాడు. అజముఖి శృంగారమున రసాభాసమున్నది! ఎనిమిదాశ్వాసముల ఈ కావ్యమున కవి అష్టాదశవర్ణనలు సహజముగా నుచితమైన చోటుల వ్రాసి సలక్షణముగ తీర్చుట విశేషము. ఎచటగూడ వర్ణనలు కథ కడ్డుదగులవు అన్నిటికంటె నెక్కువగా జెప్పవలసినది కవి యౌచిత్య పరిజ్ఞానము, దానిఫలమైన పరిమితి. కావ్యము జదివిన గాని ఇది తెలియదు.

ఈకవి 'గట్టి' పండితుడు. బహుశః రామరాజ భూషణు డీతనికి లక్ష్యము. అట్లని యాతని ననుకరింపబోయినవాడునుగాడు. ఎందరు కవులు పిల్లవసుచరిత్రలు వ్రాయబోయి పిల్లి మొగ్గలు వేయలేదు? ఈ కావ్యమున తెలుగున మహాకవు లనిపించుకొన్నవారి జాడలన్నియు కవి వశమై స్వతంత్ర స్ఫూర్తితో భాసించినవి. భూషణుని మార్గముకంటె తిక్కనవలె వ్రాయుట ఈతని కిష్టముగా గాన్పించును. జటిలముగా వ్రాసినచోట చిట్టరాలు గుమ్మరించుటకు గూడ నీతడు సమర్థుడే. ఈ చిన్న పద్యము చూడుడు:

" ఉడ్వీడ్వనరుడుప్పజ్ర్రగ
రాడ్వాక్షు ఎప్రహాధు జ్ఞరు ఘురద్వీరసన స
ప్రాడ్వీయదుర్వీరఢిమ
వశ్వక్త్రి సుగుస్సద్భుగ్యశః పూర్ణసకుర్"

ఈ పద్యము — అర్థము మాట యటుంచి — చదువుటకూడ సామాన్య పాఠకునకు కష్టమే. కాని గ్రంథమంతయు యుద్ధముల మయముగా నున్న ఈ కావ్యమున నీతడు తిక్కనవలె నెంత 'నిగ్రహము'తో వ్రాయునో చిత్తగింపుడు:

" అరదము డిగ్గి కోపమున
నగ్గజదండయుగంబు వ్రేసి దు
ర్ధరబల మొప్ప మిన్నునకుఁ
దాఁకఁగ నేసినఁ దొల్లి శూలిచే
గరివదనాసురుం డగుఁడు
కైవడిఁ గూలినఁ జూచి దండముల్
సరభస వృత్తి వైవఁగ వె
సన్ మరియించెను దాని వీరుఁ డున్."

సరిగా నదే నిగ్రహము, అదేకూర్పు, ఉపమానపు నేర్పు, పద్యమున నుత్కటముగా పాత్రచేష్టలనింపుట! భానుకోపుడు చనిపోగా శూరపద్ముని భార్య దుఃఖించిన ఈపద్యము నవధరింపుడు:

" రొమ్మునఁ జిమ్మి కొనుచు ముకుర్
దుమ్ముంతయు విడిన నెఱులతో గలయంగా
నిమ్మహిఁ బడి పొరలాడుచు
ముమ్మరముగ వగచి లేచి—మును గన్న సుతున్."

ఇట్టి భావమార్గము ఎఱ్ఱన తిక్కనల్లోను క్వాచిత్కముగ నాచన సోమునిలోను గాన్పించునది గదా! కుమారస్వామి వల్లీ దేవిని ప్రేమించి యామె యనురాగము సంపాదింపబోయిన ఘట్టమును కవి నాటకీయముగా దీర్చినాడు. మొదట నాతడు బోయవేషమున వల్లితో సంభాషించును. ఇంతలో నామె తండ్రి పుళిందుడు, వేటవశమున నచటికిరాగా వట వృక్షమై నిలచెను. పిదప వృద్ధ బ్రాహ్మణుడై మరల గాన్పించెను. ఆమె యతని యభిలాష దీర్చ నంగీకరింపలేదు. మీరు గొప్పవారు. నేను నీచకుల సంజాతను. పొమ్మన్నది — ఇంతలో వ్యాధబలములు మరల వచ్చినవి. కుమారుడు

వృద్ధ విప్రుడైనాడు. పులిందుడు 'నిజ కాంతార భూముల జూచి' పోయెను. వృద్ధ బ్రాహ్మణుడు సాభిప్రాయముగా దప్పిక పోయింపుమన్నాడు. ఆమె సమీపమున నున్న సరస్సు చూపి త్రాగి రమ్మన్నది. కుమారుని యప్పటి చర్యను కవి యిట్లు వర్ణించుచున్నాడు.

"త్రోవ యెఱుంగ నచ్చటికి
  తోయరుహానన నాకుఁ దోడుగా
నీవును రాక తక్కితివ
  యేని నిజంబుగఁ బోవజాల నే
నే విధి చూప. నైతు నన
  నింతి కృపన్ గపటాగ్రజన్ముతోఁ
బోవుచు కొల్కు జేరి దగ
  బోఁ జల మాతడు గ్రోలి వేడుకన్."

పద్యమంతయు సాభిప్రాయముగా వ్రాయుటయే గాక వ్యర్థపదములవలె భాసించు 'తగబో' నన్నచోట చమత్కార నిక్షేపము చేసినాడు కవి.

ఈకవి శక్తి ఇంతమాత్రమే కాదు. గర్భబంధ కవిత్వముల కీతడు నిధి. సాధారణముగా గర్భకవిత్వము బంధకవిత్వము వ్రాయువారు కూర్పునకు మనసు పుచ్చి యాలోచింతురే కాని సారళ్యమును సాగనీయరు. అది యా మార్గమందలి కష్టమన్నను తప్పులేదు. ఈయన రచనమున కూర్పులోని నేర్పుమాత్రమే గాక చాలవరకు సారళ్యముగూడ నున్నది.

"శ్రీ గోపాలన, భవహర,
భోగా పావని నుతపద, మునిగణ భయవా
ర్యా, గోపాలన తాంఘ్రియు
గా, గోపాలవజ దృశయుగళ, శుభప్రతిభా."

ఈ పద్యమున గో, పా, ల—లతో నారంభించినను మరి మూడు కందపద్యము లేర్పడును! ఇదేమి, మరి యొకటి చూడుడు:

"శరముఖ శరధిం సరసిజ
చరణం సరసను చరితం సరమప శరణం
శరదహ సరధం శరజ భృ
శరణం శరవిశరిపుం చతుభుగజ రసం"

ఇది "పంచవిశాంధ్రపద్యగర్భితాష్ట సమాస కల్పిత కల్పవల్లీ ప్రహరణ కలిత వృత్తము"! ఇందు సప్తాక్షరైక పాదగర్భ (ప్రథమ మదనవిలసిత వృత్తము, ద్వితీయ మదనవిలసిత వృత్తము మొదలుగా) ప్రహరణ కలిత వృత్తము, మణిగణనికరము, అష్టమాత్రా వృత్తములు రెండు, మధురగతి రగడ, ద్విపదము హరిణగతి రగడ (అన్నియు పాదగర్భములు), ఎనిమిది గర్భకందములు నున్నవి! స్తుతి ప్రసక్తి వచ్చినచోట బంధకవిత్వము వాడి దాని యౌచిత్యమును నిలిపినాడీకవి. విష్ణు బ్రహ్మేంద్రాదులు శివుని ప్రార్థించినచోట చక్రబంధము, రత్నపుత్రికా పుత్రులగు వీరనవకము శివుని ప్రార్థించినచోట ఖడ్గబంధము, ఒకచో నాశ్వాసాంతమున గోమూత్రికాబంధము, శూరపద్మాదులకు శివుడు ప్రత్యక్షమైనపుడు గిరిబంధమును, ఇట్లే మాలికాబంధము, నాగబంధము వ్రాసినాడు. ఇంక వృత్త విన్యాసము. ఈ కావ్యములో కవి విశేషవృత్తములలో సాధారణముగా గాన్పించు స్రగ్ధర, మహాస్రగ్ధర, తరల, మాలిన్యాదులే గాక అక్కరలు మందాక్రాంతల నెక్కువగానే వాడినాడు; నానావిధ సీసకందములు నర్కుటాది వృత్తములు నున్నవి. ఇంతయేటికి, కవి తన భాషాఛందః పాండిత్యమంతయు నిందు గ్రుమ్మరించినాడు. అలంకారములకును గొదువలేదు.

ఇది పెద్దన రామరాజభూషణుల కవితవలె సెబాసనిపించు రచన గాదుగాని శిల్పము చెలువముగల రచన అనుటలో సందేహము లేదు. కవిత్వము ప్రాణుల ప్రవృత్తివీధుల నభివర్ణించును. మానవుల లౌకిక చేష్టాదికమంతయు ప్రవృత్తియేగాని ఈ కావ్యమునందలి కథలు సృష్టిలోని రాజసతామసశక్తుల విజృంభణమును, సత్వమెట్లు వానిని యణచునదియు చూపునవి. శూరపద్మ సింహవక్త్ర తారకాసురుల కథలట్టివి. కాగా మనకు గావలసిన పదార్థమేదయో అది వస్తుగతమైయున్నది గనుక కవియొద్ద మన మాశింపవలసినది దాని సమగ్ర ప్రదర్శనము మాత్రమె. ఆ పని కవి చక్కగా నిర్వహించినాడు.

ఈ కావ్యమున అచ్చటచ్చట గానుపించెడి స్థలనామములు సరిగా గుర్తించుట కొంత కష్టమే. వీనిలో శ్రీశైలము, నందిమండలము ప్రసిద్ధములే. తిరుత్తని గూడ నట్టిదే. కంచిసమీపమునగల శ్రీపూర్ణాఖ్యపుర మేదో? ఇట్లే శ్రీకాళహపురము నేటి శివకాశి యనవచ్చునేమో? కుత్తాలపురములు రెండున్నవి. జలపాతమున్న కుర్తాలమొకటి. అదికూడ శైవక్షేత్రమే. అచటి శివునకు కురుంబలా ఈశ్వరర్ అనియు, కుట్రాలనాథర్ అనియు పేర్లు. (పనసచెట్టుక్రింద వెలసిన శివుడు.) పార్వతికి 'కుళల్ వాయ్ మొళి యమ్మై' (వేణునాదమువంటి మధురస్వరము గలది) అని పేరు. వేరొక కుత్తాలపురము కావేరియొడ్డుననున్న చిన్న శైవక్షేత్రము. ఈ గ్రంథమున పేర్కొనబడినదీ రెండవదే గావచ్చును.

ఇంత పెద్దకావ్యమున దోషము లుండకపోవు. 'అధిరోహిస్తు'ఖంటేకూడా సక్రమముగా గానవచ్చుట, 'మనంబునం దలచెదన్ గాదేమి' అన్నచోట వ్యతిరేకార్థక క్రియను ప్రకృతికముగా వాడుట మొదలగునవి—అంత పెద్ద తప్పు లనుకొనదగినవి కావు; కావ్య గౌరవమును కప్పిపెట్టునవి గావు.

ఇది మేలురకపు కావ్యము. ఇట్టికావ్యము దాదాపుగా నీపదిపదునైదు సంవత్సరముల కీవల రాలేదన్నను ననవచ్చును. అందరూ ఆదరించి చదివి యానందింపదగిన దిది. ఇట్టికావ్యముల నాదరింపవలసిన యావసరముగూడ నున్నది. ఏమనగా నేటి విద్యాప్రమాణ మెంతగా జారియున్నదియు నందరకు దెలిసిన సంగతియే. సద్యఃపరనిర్వృతిమాత్రమే గాక విశ్రేయము గూర్చు కావ్యమును మహాకావ్యమని పొగడుదుము. మహాసేనోదయము మహాకావ్యమని అనలేను గాని అట్టివానికి దారితీయువానిలో నొకటని యనుకొనుటలో తప్పేమియు కానరాదు. దేశకాలపాత్రలనుబట్టి ప్రవాహినియగుభాష ఉపయోగపడబడి శబ్దశక్తులకు భావవ్యక్తిపాటవము పండి మహాకావ్యము పుట్టును. ప్రయోజనదృష్టితో మనము మహాకావ్యము కావలె ననుకొన్నప్పుడు ఆ భాషా పాండిత్యమును పోషింపక తీరదు. 'సైన్సు'లో 'టెక్నాలజీ'కి ఉపయోగించవలెనని 'థియరిటికల్ సైన్సు' నెట్లు చదువుదుమో గణితశాస్త్రమువంటి 'బేసిక్ సైన్సు' నెట్లాదరింతుమో అట్లే మహాకావ్యములు రావలెనన్నచో భాషాపాండిత్యమును ఛందోవ్యాకరణాలంకారములను ఆదరింపవలెను. ఈ యన్నిటికని మహాసేనోదయము మన్నికైన తావు గల్పించినది గనుక నే నిది మంచి కావ్యమంటిని. అక్కర ఎఱిగిన ఆంధ్రులీ కావ్యము నాదరించి చదివి యానందింపగలరని విశ్వసించుచున్నాను.

ఎస్. కె.

కావ్యజగత్తు

[మూలకర్త: రవీంద్రనాథ టాగూరు. అనువాదము: పేరు లేదు. ప్రకాశకులు: విశ్వసాహిత్యమాల, రాజమండ్రి. ప్రతులకు మహీధర జగన్మోహనరావు, సంపాదకుడు, విశ్వసాహిత్యమాల, రాజమండ్రి. 189 పేజీలు. వెల: రు. 2-25.]

ఈ సంపుటిలో రవీంద్రుడు వ్రాసిన 'రామాయణము', మేఘదూతం, కుమారసంభవము, శాకుంతలము, కాదంబరీ చిత్రము, ధమ్మపదము, కావ్య ప్రపంచమున నుపేక్షితలు అను నేడు వ్యాసాలున్నవి. సహృదయుడుగా ఆయన యధికారమెట్టిదో ఇప్పుడు చెప్పవలసిన యగత్యము లేదు. మనీషావంతుడనిన జాలును. మనీష అనిన మనస్సులో స్వాతంత్ర్యము. రామాయణమునుగూర్చి వ్రాసినచోట మాత్రమే కాక తక్కినచోట్లగూడ ఆయన విమర్శ భారతవర్షీయ చిరంతనేతిహాసాలు మనసులో మెదలుచునే నడచును. ఆయా వ్యాస విషయాలు దిఙ్మాత్రముగా స్పృశింతును.

ఆర్యుల సామాజిక వ్యవస్థలో అఖండ ధూర్వహమైనది గృహస్థధర్మము. దానిలో వారి కెంతయో శ్రద్ధ. అథర్వ వేదమున నొక మంత్ర మిట్లున్నది:

"సహృదయం సాంమనస్యం అవిద్వేషం కృణోమి వః
అన్యో అన్యం అభిహర్షత వత్సం జాతం ఇవాఘ్న్యా
అనువ్రతః పితుః పుత్రో మాత్రా భవతు సంమనాః
జాయా పత్యే మధుమతీం వాచం వదతు శంతివాం
మా భ్రాతా భ్రాతరం ద్విక్షన్ మా స్వసారం ఉత స్వసా
సమ్యంచః సవ్రతా భూత్వా వాచం వదత భద్రయా"
(3—30)

(ఒక హృదయము ఒక మనస్సుగలిగి ద్వేష రహితమై తన బిడ్డను ప్రేమించు గోవువలె పరస్పరము ప్రేమతో మీరు మెలగునట్లు నేను మిమ్ముల జేయుదును. పుత్రుడు పితృభక్తి గలిగియుండును గాక! తల్లితో నేకమనస్కుడై యుండును గాక! భర్తతో భార్య శాంత మధురోక్తులాడును గాక! అన్నదమ్ము లక్కచెల్లెండ్రు పరస్పరము ద్వేషింపకుందురు గాక! ఐక్యముగా నొకే బుద్ధితో సహృదయముగా ప్రసంగించుకొందురు గాక! యని దీని భావము.)

ఇట్టి గార్హస్థ్య సిద్ధిలోని ప్రథిమ నే రామాయణ మహాకావ్యము ప్రపంచించినదని టాగూరు 'రామాయణ' వ్యాసమున చెప్పినాడు.

'ప్రతి మానవునిలోను అతలస్పర్శియైన విరహమున్నది. మన మెవరితో మిళితము కాగోరుదుమో యామె తన మానస సరోవరముయొక్క యగమ్య తీరమున నివసించుచున్నది. అచ్చటికి కేవలము కల్పన నే పంపజాలుదుము.' (25 పు.) మేఘదూత కావ్యమునందు రవీంద్రుడు సాధించిన విశ్వజనీనత యిట్టిది.

'కుమార సంభవము—శకుంతల' అను వ్యాసమున నా రెండింటియందలి ప్రణయమును గూర్చి

గ్రంథ విమర్శనము

ఆయన చర్చించినాడు. 'ప్రజార్థంహి మహాభాగాః పూజార్హా గృహదీప్తయః' అను మనువాక్యము నాదరించి తన అభిప్రాయము నిట్లు చెప్పినాడు.

'కవి ప్రకృతియొక్క సౌందర్య స్థానమునందు ధ్రువనిష్ఠా సంబంధమైన యేకాగ్రతను, సౌందర్య మోహ స్థానమునందు కల్యాణకమనీయనుగ్రహతిని, వసంత నిర్హ్యాలవనభూమియందు ఆనందనిమగ్న విశ్వమును నిలిపెను.'

'శాకుంతలము' అను వ్యాసము షేక్స్పియర్ వ్రాసిన 'టెంపెస్ట్' అను నాటకమును కాళిదాసు శాకుంతలముతో బోల్చి చూపుచు చేసిన తులనాత్మక విమర్శ. కాళిదాసీయ వివక్షితార్థ సంనిధాన ప్రతిభ నీయన గ్రహించి యుజ్ఝిత మొనర్చినాడు.

'సంఖ్యాక ప్రదీప'మను పత్రికలో మిత్రుడగు యామినీ ప్రకాశ గంగోపాధ్యాయుడు గీచిన చిత్రమునకు భూమిక వ్రాయుచు రవీంద్రుడు సంస్కృతి భాషలో కథాగతి మందముగ నుండుటకు కారణము లారసి, బాణుని 'వర్ణ సౌందర్యాకుమత నేయితర కవియు చూపజాలకపోయె'నని చూపిన వ్యాసమిది.

మన దేశమున మనకు తత్త్వమునందే ప్రాధాన్యము; కర్మచేయుటలో, చేయవలెననుటలో సందర క్త్యైక్యమే. దీనిని ప్రాతిపదికగా బెట్టికొని రవీంద్రుడు ఇతిహాస రచనము మొదలుగా ననేక విషయములపై భారత—పాశ్చాత్య పరిణామభేదము లెత్తిచూపిన వ్యాసము 'ధమ్మపదము.'

'కావ్య ప్రపంచమున నుపేక్షిత'లనునది కడపటి వ్యాసము. రామాయణమునందలి ఊర్మిళ, శాకుంతలమున ప్రియంవదానసూయలు, కాదంబరిలోని పత్రలేఖలను గూర్చి కవిగా ఆయన చేసిన ఈ పరామర్శ అజ్ఞాతగా నప్రత్యక్షముగా బ్రతుకుచున్న ఆ పాత్రల నఖండముగా ప్రతిభాసింప జేయునట్టిది.

ఈ సంపుటికి శ్రీ మల్లంపల్లి శరభయ్యగారు వ్రాసిన 'ప్రవేశిక' సార్థకమై సహృదయతా ప్రహర్షోద్గానముగానుండి గ్రంథము నలంకరించినది. వంగభాషనుండి తెలుగున కనువాదము స్వతంత్రతా ముద్రతో సరళముగ నడచినది; శుచియు రుచియు గలది. విశ్వసాహిత్యమాలవారు 'సాహిత్య రంగంలో కేవల లాభాపేక్షయేగాక లోక కల్యాణము చేయాల్సిన నుద్దేశ్యముకూడ నుండియే తీరాలి' అని నమ్మి రవీంద్రుని ఈ రెండు వ్యాస సంపుటముల ప్రచురించుట ముదావహము 'పరిచిన్ నుర్ద్రవిణం మనుస్యాత్, ఋతస్య పథా నుసా వివాసేత్' (ఋగ్వే. 10-31-2) (సంపదను బాగుగ విచారించి ధర్మభక్తి మార్గముల దాని నార్జింపవలెను).

సాహిత్య జగత్తు

[మూలకర్త: రవీంద్రనాథ టాగూర్. అనువాదము: పేరు తెలియదు. ప్రకాశకులు: విశ్వసాహిత్యమాల, రాజమండ్రి. 172 పేజీలు వె: 2-50.

కలాదిపరిజ్ఞానము విజ్ఞానము. సర్వశరీరవ్యాప్తిగల అంతఃకరణ వృత్తిచే తెలియుట సంజ్ఞానము. అంతఃకరణమునందు ప్రతిబింబించిన ఆత్మయొక్క చేతన భావమే సంజ్ఞప్తి. మిగత అంతఃకరణ వృత్తు లన్నిటికంటె నిది మేలైనది.

'నాయమాత్మా ప్రవచనేన లభ్యో,
న మేధయా న బహునా శ్రుతేన।
యమేవైష వృణుతే తేన లభ్య
స్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వాం॥'

అని ఉపనిషత్తు. అయినను వేదములు ఉపనిషత్తులు వృద్ధోపసేవనము ఉపాదేయములే. సాహిత్యము విషయమునగూడ నిట్లే. తత్కాలమందైన ప్రతిభవలన కంటె, మేధామతి మనీషాదులవలన సాధింపబడు ఛందోవ్యాకరణాలంకార శాస్త్రపరిజ్ఞానమువలన కంటె తత్త్వరూపమగు నాత్మోపలబ్ధి సంజ్ఞానము గలవారి బోధచే నెక్కుడుగ తాత్త్వికమగు జ్ఞానము కలుగును. తెలుగుసాహిత్యమున, నాకు జూడగా, నిట్టి సంజ్ఞానము పెద్దనయొక్కని రచనలో మాత్రము వెల్లువికి కానవచ్చును. ఆధునికులలో రవీంద్రనాథ టాగూరట్టివాడు. సాహిత్యమును గురించి యాయన వ్రాసిన వ్యాసము లనూదితములై ఈ గ్రంథమున సంకలితములైనవి.

శాస్త్రము సత్యప్రతిష్ఠాపనమునకు. రవీంద్రుడు ప్రతిష్ఠిత సత్యములనే యుపన్యసించినాడు. అందుచే నిచట శాస్త్రమార్గ మవశ్యముకాదు. హృదయానువృత్తి రసముతో బహిర్జగత్తును జీర్ణ మొనర్చుకొని విశేషరూప

మును దానిని స్వకీయమొనర్చుకొనుట సాహిత్యము. 'సాహిత్య'మను మొదటివ్యాసమున ఈ తాత్త్వికాంశములు పరామృష్టములైనవి. మనుష్య సాధారణమగు భావమును విశేష మూర్తిమత్వముతో సర్వజనీనముగ విశేషానందకర సామగ్రిగ నొనర్చుటయే రచన. ఇది 'సాహిత్యసామగ్రి' యను రెండవ వ్యాసమున నుపన్యస్తము. 'సాహిత్య విచారము' డను దానిలో శాశ్వతము చిరంతన కాలమున సత్యము ప్రతిష్ఠింపబడు ననియు, ప్రాకృత, సాహిత్యక సత్యములకు గల భేదమును తెలుగన లేననియు చెప్పబడినది. ఆనందోపలబ్ధకముగు సౌందర్యము నారాధించువాడు తగుపలబ్ధికై తాను శుచితా సంయమితా శోభనతా సంశోభితుడు గావలె ననియు దానికి బ్రహ్మచర్యాదికము యావశ్యమనియు 'సౌందర్యబోధ'మను వ్యాసమున నుద్ఘాటింపబడినది. విశ్వసాహిత్యము, సౌందర్యము — సాహిత్యము, సాహిత్యసృష్టి, సాహిత్య తత్త్వము నను మిగత వ్యాసములు ఇట్టి ప్రధానభావముల ప్రపంచించునవే. సాహిత్యోపాసకు లందరు సమాహిత చిత్తముతో జదువదగిన గ్రంథమిది. వంగభాషనుండి అనూదితములైన ఈ వ్యాసములు చక్కనైన తాదూషితమైన తెలుగు సాహిత్య రంగపార్శ్వమునకు కల్యాణకారకములు కాగలవని ఆశించుచున్నాను మంజులోదాత్తమగు ననువాదము.

రాగవాసిష్ఠం

[పౌరాణిక-సాంఘిక నాటకం. కర్త: శ్రీ బోయి భీమన్న. ప్రచురణ: సంస్కృతి సంవర్ధక సమితి. ప్రతులకు: సంస్కృతి సంవర్ధక సమితి. 115/2 R.T., విజయనగర కాలని, (మల్లేపల్లి), హైదరాబాదు. 32+117 పుటలు వెల: 2.25.]

యమునానదీతీరాన వేదవనంలో నిష్ఠగా తపస్సు చేసుకొనే యువతపస్వి వశిష్ఠుడు, సంధ్యవార్చుటకు నదీతీరానికివచ్చి సంధ్యాశోభకు చైతన్యము బొంది నదిలో కాలుజారిపడగా అరుంధతి రక్షిస్తుంది. తరువాత వారిద్దరూ పరస్పర అనురక్తు లౌతారు. ఒకనాడు అరుంధతీ వశిష్ఠులు నదీతీరాన ఉండగా వసిష్ఠుని సంరక్షకుడూ ఆశ్రమాధిపతీ ఐన ప్రాచీనుడు తటస్థపడుతాడు. అరుంధతి మాతంగకన్య అని వశిష్ఠుని కప్పుడు తెలుస్తుంది. ప్రాచీను డాతనికి ప్రేమలోని పరమార్థాన్ని సూచించేవరికి వశిష్ఠు డామెను వదలివస్తాడు. తరువాత అరుంధతి వశిష్ఠుని గెలుచుకోవడానికి తపశ్చర్య బూనుతుంది. వశిష్ఠుడు తనుకోతాను పతిమతి హైపోయి ప్రాచీనుడిని ధిక్కరించి వెళితే అరుంధతి తపస్సువల్ల లోకం కాటకంతో తల్లడిల్లుతుంది. తనమాట సాగదని తెలిసిన ప్రాచీనుడు పిడికెడు ఇసుక చేతబట్టి ఇసుక అన్నంగా వండిపెట్టే స్త్రీ నీకు భార్య అవుతుందని అంక్షపెట్టి వెళ్ళుతాడు. కాటకంతో ఋషులు త్రిమూర్తులవద్దకు రాయబారం పోతారు. చివరకు అరుంధతితో బాటు తానూ యోగాగ్ని దగ్ధుడనౌతానని పూనిన వశిష్ఠుడు పరమేశ్వర సాన్నిధ్యంలో అరుంధతిని పత్నిగా స్వీకరిస్తాడు. ఆమె పాతివ్రత్యంవల్ల కాటకం తీరేటట్లు కొండరాళ్ళు పిండివంటలవుతవి. పరమేశ్వరు డామెకు వ్యోమమండలంలో భర్తృసన్నిధానంలో స్థానమిచ్చి ప్రశంసిస్తాడు. ఇది ఇంతేకథ. వశిష్ఠుడు "ఆర్య-అనార్య భేదభావాన్ని తునాతునకలుచేసి ప్రాచీనుడి నోరు మూయించి ఈ పారతంత్ర్య వాతావరణం నుంచి బయటికి దూకివచ్చేస్తా"డనడం ఈ నాటకంలోని పరమార్థం.

రసదృష్టితోకంటే సంఘ ప్రయోజనదృష్టితో వ్రాసిన పౌరాణిక సాంఘిక నాటకమిది. భీమన్న గారు పద్దెనిమిదేండ్లనాడు వ్రాసిన ఈ నాటకం ఆయన అప్పటి పరిణతి ననుసరించి బాగానే ఉంది. నాటకంలో 'కుటిగిరి' విదూషకప్రాయుడు. దీనిలోని 'గోష్పాదం' 'కుంభోదరం'వంటి పేర్లు కొందరికి కష్టం కలిగింపవచ్చు. గ్రంథాదిలో వ్యాస వాల్మీకు లాదిగా అనేకులు మాతంగులని రుజువుచేసిన 32 పుటల దీర్ఘ వ్యాసంలోని పౌరాణికాంశాలు ఎవరూ కాదనలేరు. కాని దానికిపుడు ప్రయోజనం కనబడదు. వ్యష్టి స్వశక్తితో సమష్టిని సమర్థించుకొనడమనేది ప్రతియుగంలోనూ ఉంది. ఇంతకూ వర్ణవ్యవస్థ అనాదిదెలాగూ కాదుగదా! చదువదగిన నాటకం.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambbu Prasad.